# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక మార్చి, 2012 ₹ 20



నవ దంపతులు : నల దమయంతులు

# మిసిమి

మాసపత్రిక

**“All that we are is the product of what we have thought”**

*- Dammapada.*

**సంపుటి 23** **మార్చి 2012** **సంచిక 3**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........................................ 3

తెలుగులో...ఆధునిక సాహిత్య ధోరణులు .................... 5

– *డాక్టరు ఎస్. కల్పన*

ఆకాశవాణి బాణి ........................................ 10

– *డాక్టరు వోలేటి పార్వతీశం*

భామనే సత్యభామనే ........................................ 13

– *వేదాంతం సత్యనారాయణ శర్మ*

కళాపాలకుడు బెజవాడ గోపాల రెడ్డి ........................ 16

– *ఎన్నార్కె*

అడవిలో...శకుంతల – షేక్స్‌పియర్ ........................ 18

– *ఎ.కె., ము.పా.సా*

అభ్యుదయ సూత్రాలు–గూడవల్లి రామబ్రహ్మం చిత్రాలు .... 25

– *మిసిమి*

చలనచిత్రం కళా?..కాదు వ్యాపారం ........................ 30

– చిత్తూరు వి. నాగయ్య

డాక్టరు గారు ........................................ 32

– *వల్లభనేని అశ్వినీకుమార్*

కుప్పడు ........................................ 38

– *సీకల వేణుగోపాల రెడ్డి*

చరిత్ర గర్భంలోకి ........................................ 40

– *నండూరి పార్థసారథి*

రెడ్డి రాజుల పాలనలో వసంతోత్సవము .................... 45

– *డాక్టరు వేదుల రాజేశ్వరీదేవి*

తొలితరం రంగస్థల నటులు ................................ 49

– *పురాణం సూరిశాస్త్రి*

స్వాతంత్ర్య వీరుడు – రామప్రసాద్ ‘బిస్మిల్’ .................. 57

– *అనువాదం: డాక్టరు జె.లక్ష్మిరెడ్డి*

రావిచెట్టు రంగారావు ........................................ 63

– *కుర్రా జితేంద్రబాబు*

తెలుగులో స్త్రీ వాద రచనలు ................................ 70

– డాక్టరు వి. త్రివేణి

చదవండి (పుస్తక పరిచయం) ................................ 76

నవ్వులు ........................................ 78


*ముఖచిత్రం* : నల రాయబారం

*రెండవ అట్ట* : నవ దంపతులు: నల దమయంతులు

*మూడవ అట్ట* : దమయంతి దుఃఖం

*నాల్గవ అట్ట* : అశ్వహృదయం–అక్షహృదయం

నల–దమయంతి కథ: రష్యన్ అనువాదం – వి.ఏ. జెకోస్కాజి

చిత్రాలు: పెన్‌బర్గ్


(*వివరాలు :* 39 వ పుటలో....)

**భా**మనే...సత్యభామనే.. అంటూ కూచిపూడి నృత్యరీతులను సత్యభామ వాలుజడ తాకిడితో నేల నాలుగు చెరగులా తీసుకు వెళ్ళిన కళాకారులు వేదాంతం సత్యనారాయణ శర్మ – సత్యభామకు ఏ విధంగా అంచెలంచెలుగా మెరుగులు దిద్దారో ఆయన వివరణ చదవండి...

శ్రీకాకుళంలో ఎగళ్ళ రామకృష్ణ అని సాహిత్య కళాభిమాని వున్నారు. ప్రతిసంవత్సరం సాహిత్య సభలు రంగరంగ వైభవంగా జరిపి అన్ని రంగాల ప్రతినిధులకు పూలదండలు వేస్తారు, పురస్కారాలు ఇస్తారు. ఆ సందర్భంగా 'ఆధునిక సాహిత్య ధోరణుల' పై సదస్సు నిర్వహించి వ్యాసాలను ఆహ్వానించారు. అందులో కొన్నింటిని వారి సౌజన్యంతో **మిసిమి** పాఠకులకు అందిస్తున్నాము.

మనకు రంగుల పండగ దసరానే. కాని ఒకప్పుడు రెడ్డిరాజులకాలంలో 'వసంతోత్సవం' – ఇప్పటి హోలీ లాంటిదే – నిర్వహించేవారని వేదుల రాజేశ్వరి తెలియజేస్తున్నారు.

రేడియోతో పెరిగాము ఒకతరం. అప్పటి కవులు, సాహిత్యకారులు, ఆకాశవాణిని ఎంతో పరిపుష్టం చేశారు. ఆకాశవాణి బాణిని, చరిత్రను వోలేటి పార్వతీశం అ, ఆల దగ్గర్నుంచి వివరిస్తున్నారు.

కుప్పుడు ఎలా అక్షరభిక్ష పెట్టాడో ఈ నెల 'సామాన్యుని సాహిత్యం'లో తెలుసుకుంటే మనసు ఆర్ద్రమై పోతుంది.

మనకు స్వాతంత్ర్య భిక్ష పెట్టిన వారిలో ఎందరో మనకు తెలియనే తెలియదు. ఉరితాడుని పూలదండలా వేసుకుని దేశంకోసం నవ్వుతూ ప్రాణాలర్పించిన 'బిస్మిల్' ఉత్తరాన్ని చదివితే మన బాధ్యత కొంతవరకైనా తెలుస్తుందేమో.

నాలుగు 'అట్టమీది' బొమ్మలు నల–దమయంతి కథకు సంబంధించినవి – రష్యన్ చిత్రకారుడు పెన్‌బర్గ్ ఆవిష్కరణ.

అమ్మ సత్యమని, నాన్న నమ్మకమని వింటుంటాము. తన ఆశయం కోసం, తల్లిలేని కొడుకును పెంచి ప్రపంచానికివ్వటానికి, తన వయసును పేదలసేవలో ఆవిరి చేసుకున్న తండ్రి విశ్వాసమే సత్యమనిపిస్తుంది – 'డాక్టరు గారు' చదవండి.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. **ఎంతో ఆసక్తితో**
**మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు
మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'**
పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "...***మిసిమి***ని నేను 20 ఏళ్ళుగా చదువుతున్నాను. ఇప్పుడు ***మిసిమి*** సరికొత్త రూపాన్ని సంతరించుకొంది. ఇందులోని వ్యాసాలు, ముఖచిత్రాలు పాఠకులైన మమ్మల్ని ప్రతినెలా అలరిస్తున్నాయి. సంపాదకవర్గానికి అభినందనలు..."

**– కోడూరు పుల్లారెడ్డి**, హైదరాబాదు.

✶ "...ఒకటవ తారీఖుకే చేతికి ***మిసిమి*** పత్రిక అందినది. కలంకారిలో కాళహస్తి కోణం ఇంతవరకూ నాకు తెలియదు. కలంకారి అంటే అద్దకం అనే ఉద్దేశ్యంలోనే ఉన్నాను. మీ వ్యాసం చదివిన తరువాతే కాళహస్తి కలంకారి ప్రత్యేకతని తెలుసుకున్నాను... రాబందుల సందడి చదివాను. ఈ ఆలోచన సరికొత్తగా వుంది. చెప్పిన విధానం ఆసక్తిని కలిగిస్తుంది. ధన్యవాదాలు..."

**– బాల,** విజయవాడ.

✶ "...90వ పడిలో పడుతున్న పడుచాయన పడుచామెతో మధుర భాషణలే కదా చేయకలిగింది అనుకోకండి అన్నారు పురాణం వారు. ఎన్నో నిజాలు సిగ్గువీడి నిగ్గుతో వెలువడ్డాయి. నాకు వేశ్య అన్న పదము, వారిని హీనంగా చూడటం అన్యాయము. మానవుడి ద్వంద్వ ప్రమాణాలకు మచ్చు అనిపించేది. జీతము, గోతం నిండా అలవెన్సులిచ్చి పనిచేయరా అంటే బల్ల కింద చేయిపెట్టి నల్ల మూటలు కట్టే ఆఫీసర్లు, మంత్రులకు మహా గౌరవమ్, మనసు వద్దంటున్నా మంచమ్మీద వళ్ళప్పగించాల్సివచ్చిన వారికి ఛీత్కారమా? ఎవరు వశమయ్యే వేశ్య? నేను మొదట కన్యాశుల్కము చదవలేదు, సినిమాయే చూసాను. మధురవాణి అంటే నాకు సావిత్రే. ఆవిడను చూశాక నాకు వేశ్యలంటే గౌరవం ఇంకా పెరిగింది. మధురవాణి చతురభాషిణిగా "రవి ఇందురులు (సూర్య చంద్రులు)" మలచటం పురాణ ప్రతిభ. మధురవాణి ***మిసిమి*** విషయంలో బొంకులదిబ్బలో అడుగేసింది. "అందుకే మీ ***మిసిమి***కి స్త్రీలు పాఠకులు కాలేరు." మా ఆవిడ ***మిసిమి*** రాగానే కమ్మతెమ్మెరలతో సహా రెండన్నా వ్యాసాలు చదివి మరీ మిగతా విషయాలలోకొస్తుంది. ఆమె స్త్రీ యే కదా. కానీ బౌద్ధాన్ని ఎవరూ తరిమివేయలేదు (రు). ఇందులో కొన్ని వాక్యాల వలన కొన్ని వ్యాసాలకు స్ఫూర్తి లభించింది నాకు. అవి త్వరలోనే ***మిసిమి*** కందజేస్తాను. మీరు చింతామణిమీద వ్యాసం వేసినపుడు పాలువాయి భానుమతి బొమ్మ వేసి, మధురవాణి సందర్భంలో సావిత్రి చిత్రం లేక పోవడమన్యాయము...

... 1935 లోననుకుంటా, నేను ఐ.ఐ.టి బొంబాయి లో ఉన్నప్పుడు జ్యోతి మాస పత్రికలో సాహిత్యహింసావలోకమని ధారావాహికమొచ్చెడిది. అప్పటికే నేను నండూరి విసనకర్రను. ఆ సాహిత్య హింసావలోకనమెంతిష్టమైందంటే, అది ముగియకముందే నా పిహెచ్.డి. అయి, ఇటలీ వెళ్లిపోతే నా స్నేహితుడు, పిల్లలమర్రి శివరామకృష్ణ నాకు సాహిత్యహింసావలోకనము అచ్చుపేజీలన్ని కలిపి కుట్టి పోస్టులో పంపాడు. తర్వాత 1980లో అనుకుంటా ఎమెస్కో వాళ్ళ పుస్తకం కొన్నా. నేను ఇప్పటికీ నండూరి విసుర్లు భరిస్తూనే ఉన్నాను. (మా ఆవిడ పుట్టింటి పేరు నండూరిలెండి). అట్లాంటి నండూరి పార్థసారథి గారి వీణాభ్యుదయము ప్రచురించినందుకు ***మిసిమి***కి ధన్యవాదాలు. నెల్లూరులో చెంచు రామయ్య గారని వీణ విద్వాంసులుండే వారు. ఆయన దగ్గర నాకు చనువు. ఆయన సాధన చేస్తూ ఉంటే నేను దగ్గరుండే వాణ్ణి. ఆవిధంగా నాకు కొన్ని వీణల పేర్లు తెలుసు. ఇన్ని వీణలున్నాయని తంత్రీ వాద్యాలన్నీ వీణ జాతివేనని

నండూరి చెప్పటం కొత్తే. ఒక్క మాట. పూరణ, పూర్తి అనగా ఊదటము. సన్నాయి ఇత్యాదులు పూరణ వాద్యాలు. నోటిలో వేలు పెట్టి, (పెట్టకుండా) ఈల వేయటము కూడ పూరణ వాద్యమే. భౌతిక శాస్త్రపరంగా ప్రిన్సిపుల్ ఏమిటంటే, గాలిని ప్రకోపింప చేసి తద్వారా శబ్ద తరంగాలు సృష్టించడము పూరణ వాద్యాల పని. ఆ ప్రకోపన నోటి ద్వారానే జరుగుతుందని, సన్నాయి వంటి వాటికే పూరణ వాద్యాలని వాడుక ఆదిలో. గాలి కదలికను తీగలద్వారా కలిగించ వచ్చుని గమనించాక, తీగపూరణ వాద్యాలు వచ్చాయి. తీగను తంత్రీ అంటారు కనుక, "తంత్రీ పూర(ణ)" లేక "తంత్రపూర". క్రమేపీ ఇది తంపూర, తాంబుర, తంబుర అయ్యింది. ఇప్పటికీ తెలుగులో బూర అంటే పూరణ వాద్యమే కదా..."

**– ఆచార్య సముద్రాల,** విశాఖపట్నం

✶ "...క్రిందటి వారం కొన్ని తెలుగు పుస్తకాలు కొనాలనే ఉదేశ్యంతో Bangalore Book Fair చూడటానికి వెళ్ళా. ఇరవై అయిదుకు పైగా మంచి మంచి రచయితల పుస్తకాలు కొనే అవకాశం కలిగింది. అక్కడ ఒక స్టాల్‌లో ***మిసిమి*** నవంబరు సంచిక చూసే అవకాశం లభించినది. అందులో వున్న శీర్షికలు చూచిన మీదట చాలా సంతోషం కలిగింది. మీ సంపాదకీయం కూడా చదివా. సంపాదక సంస్థాపకులైన రవీంద్రనాథ్ గారు ఎలా పత్రికను ప్రారంభించి యింత మంచి సాహిత్య పత్రికగా ముందుకు తీసుకు వచ్చారో తెలిసి సంతోషమైనది. చాలా కాలం క్రితం చదువుతున్న 'తెలుగు స్వతంత్ర', 'కృష్ణా పత్రిక', 'భారతి' లాంటి పత్రికలు జ్ఞాపకానికి వస్తాయి. చాల సంతోషం...

...కాలేజి చదువులకై మైసూరు వచ్చిన నేను, ఉద్యోగ నిమిత్తం బొంబాయి, ఢిల్లీ, తిరువనంతపురం, బెంగళూరు లాంటి వూర్లన్నీ చూసి పదేళ్ళుగా మైసూరులో స్థిరపడిపోయాను. పాపులర్ మాగజైన్సు తప్ప మంచి సాహిత్య పత్రికలు యిక్కడ లభించవు. మీరు సంపాదకీయంలో తెలుగు ప్రస్తుత పరిస్థితిలో స్తబ్దతగా వుండడం గూర్చి విషాదం వెలిబుచ్చారు. అది చాలా సమంజసమే. ఈ పరిస్థితి ఎలా మార్చడం?..."

**వి.కృష్ణమూర్తి,** మైసూరు.

✶ "...మీరు రాసిన ఉత్తరం నాలో హర్షాతిరేకం కలిగించింది. నాకు, బాబూరావు పటేల్‌కు మీరు అభిమానులని తెలిసి సంతోషించాను. మీరు పేర్కొన్న నా చిత్రం వేసినది ఎస్.ఎమ్. పండిట్. ఈ చిత్రం భారతదేశంలో అనేక చోట్ల ప్రదర్శనలు చేయబడి అనేకమంది అభిమానాన్ని చూరగొనటమే కాదు, చిత్రకారునికి బహుమతులు తెచ్చిపెట్టింది. కె.సుబ్రహ్మణ్యం అధీనంలో జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ నడపబడుతున్నపుడు ఈ చిత్రం కొన్ని సంవత్సరాలుగా అక్కడ ప్రదర్శితమయింది. ఆ చిత్రం యొక్క నకలు నాకు కావాలి అని నేను కోరుకుంటున్నాను. ***మిసిమి*** ముద్రించిన దేవికారాణి బొమ్మ నాలో ఎన్నో జ్ఞాపకాలను రేపింది–

...హైదరాబాద్‌లో ప్రభుత్వ కల్చరల్ డిపార్ట్‌మెంట్ నన్ను ఆహ్వానించి గౌరవించిన సంగతి మీకు తెలియక పోవటం నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈనాడు మొదలుగా అనేక దినపత్రికలు ఈ వార్తను నాఛాయా చిత్రాలతో ప్రచురించింది... ఇప్పటికి 70 సంవత్సరాలు ఒక హిందుస్థానీ క్లాసికల్, సెమీక్లాసికల్ గాయనిగా నాకు మంచి గుర్తింపు ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో నేను చాలా బహుమతులు అందుకున్నాను. నేను సంగీతంలో చేస్తున్న కార్యక్రమాల గురించిన వార్తల నకళ్ళను మీకు దీనితో పంపుతున్నాను...

...మీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞురాలిని. ఇదంతా భగవంతుని కృపని నమ్ముతున్నాను. మీరు ఉపసంపాదకులుగా మిసిమి పత్రికను నాకు తప్పకుండా పంపండి. నా గురించి మీరు కొన్ని ప్రశ్నలను సంధిస్తూ ఈ మెయిల్ పంపండి. నేను నా సమాధానాలను మీ ప్రచురణ నిమిత్తం పంపగలను...

...న్యూస్వతంత్ర టైమ్స్ ఎడిటర్‌గా పనిచేస్తున్న శ్రీ వామనరావు పేరుగాంచిన జర్నలిస్టు. నేను క్రిందటి సంవత్సరము అతన్ని కలిసాను. నేను చేసిన ప్రసంగాలు ఆయన శ్రద్ధగా వినేవారు. మీరు ముంబాయి వస్తే మా ఇంటికి రావలసినదిగా నా ఆహ్వానం. నాకు అత్యంత ఆప్తుడైన మిత్రుడు కె. బిలోక్ నాకు పుత్రసమానుడు. అతను మిమ్ములను త్వరలోనే కలుస్తాడు..."



సుశీలా రాణి

**– సుశీలా రాణీ పటేల్,** గిర్నార్ బంగళా, పాలీహిల్, నర్గీస్ దత్ రోడ్డు, బాంద్రా, ముంబాయి.

# తెలుగులో...
# ఆధునిక సాహిత్య ధోరణులు

- ఎన్. కల్పన

ధనంజయుని అద్దంకి శాసనంతో తరువోజ చందస్సుతో ఆకారం దాల్చిన తెలుగు భాష నన్నయ మహాభారత ఆంధ్రీకరణ ద్వారా, నన్నె చోడుని రచనల ద్వారా కావ్యభాషయింది. భాషను వర్ణనాత్మకంగా కావ్యభాషగా మలచిన వాడు నన్నయ అయితే దానిలో జాను తెనుగును జొప్పించి నాటకీయతను తెచ్చి అలరించినవాడు తిక్కన. ఇద్దరి మధ్యా సమతౌల్యం పాటించిన ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరు డనిపించుకున్నాడు. ఆయన ప్రబంధశైలిని ప్రవేశపెట్టినా ప్రబంధ రచనా లక్షణాలను కావ్యంలోకి అంకురార్పణ చేసినవాడు శ్రీనాథుడయితే మొదటి ప్రబంధాన్ని వ్రాసిన వాడు పెద్దన. ధూర్జటి, రామరాజ భూషణుడు, నంది తిమ్మన, తెనాలి రామలింగడు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి మరెందరో ఆ దారిలో నడిచారు. అయితే వారి రచనలన్నిటికీ సంస్కృత, పురాణ, ఇతిహాస మూలాలున్నాయి. తెలుగులో స్వతంత్ర కల్పనా కథను రచించి, తనది అనితరసాధ్యమైన రచనాశైలని నిరూపించాడు పింగళి సూరన. తన కళాప్రపూర్ణోదయ రచన ద్వారా నిరూపించాడు. ఆ తరువాత కాలంలో వచ్చిన నాయక రాజుల యుగంలో యక్షగానాలు గూర్చి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అప్పటి వరకూ కవులు పద్యానికే పట్టంగట్టారు. పద్యానికది స్వర్ణయుగం. మరొక పక్క కన్నడ సాహిత్యంలో వెయ్యి సంవత్సరాల క్రితమే వచనం వచ్చి స్థిరపడిపోయింది. తెలుగు భాషలోనికి వచనం వచ్చి చేరింది కేవలం పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్లనే. తెలుగులో ఆది నుంచీ 16వ శతాబ్దం వరకూ పద్యరచనలు విరివిగా రావడానికి సంస్కృత సాహిత్య ప్రభావమే కారణం. తెలుగు సాహిత్యం సంస్కృతంతో ప్రభావితమైనట్లు ఇతర సోదర భాషలయిన తమిళం, కన్నడాలతో ప్రభావితం కాలేకపోయింది.

తెలుగు సాహిత్యానికి మొదటి ఉత్ప్రేరకం సంస్కృత మయితే ఆధునిక సాహిత్యంలో ఆ స్థానాన్ని ఆంగ్ల భాష ఆక్రమించింది. సాహిత్యమంటే పద్యరచన ఒకటేకాదు, వ్యాసరచన, గేయరచన, జీవితచరిత్రలు, నవలలు, నాటకాలు, సాహిత్య విమర్శలు ఇలా శాఖోపశాఖలుగా విస్తరించిన అన్ని విభాగాలకు వర్తిస్తుందంటూ ఆంగ్ల భాష తన ప్రభావాన్ని తెలుగుపై చూపింది. తెలుగు భాషపై ఆంగ్లభాష ప్రభావం చాలా వుంది. ఆధునిక యుగం ఇంచుమించు 1875 ప్రాంతానికి అటు, ఇటుగా ప్రారంభమయిందని చెప్పుకోవాలి. ఎన్నో కొత్త ప్రక్రియలను కందుకూరి వీరేశలింగం ప్రవేశ పెట్టారు. మొదట్లో గ్రాంథికం వ్రాసినా, కాలం గడిచేకొద్దీ శైలీకాఠిన్యం పోయి. కవిత్వరీతి కనుమరుగై, చెప్పే విషయం సూటిగా చెప్పాలనే ధోరణితో వ్యావహారిక భాషలో రచన సాగించారు. గురజాడ కన్యాశుల్కం వ్యావహారిక భాషకు విశేష ప్రాచుర్యం కల్పించింది. గిడుగు వారి వ్యావహారిక భాషా పిడివాదం క్రమేపీ బలపడి తెలుగు వచన రచనలకు మార్గం సుగమం చేసింది.

ఆధునిక సాహిత్యం అంటే ఏమిటి? ఆధునిక సాహిత్యమన్నా, వర్తమాన సాహిత్యమన్నా ఒకటేనా? అవి ఒక దానికి మరొకటి ప్రత్యామ్నాయమా? కాదు. ఆధునికమన్నది అధునాతనమైన, కొత్తదైన ఆలోచనా విధానం. ఇది భావావేశాలకు చెందినది. వర్తమానమన్నది కాలానికి సంబంధించినది. ఇప్పటి వర్తమాన సాహిత్యం అనేక శాఖలుగా విస్తరించింది, ప్రాచీన పురాణ పద్య సంప్రదాయా లలో రచనగావిస్తున్న విశ్వనాథవారి నుంచి, నిర్మూలనమే తప్ప నిర్మాణ కాంక్షలేని డాడాయిజమ్, అరాచక వాదం నుంచి జపనీయ మినీ కవిత్వమైన హైకూల నుండి నానీల వరకు వర్తమానకాలంలో అన్ని రచనలు వస్తున్నాయి. ఇందులో దేని అభిమానులు దానికి ఉన్నారు. మనం ఆధునిక కవి అని భావిస్తున్న శ్రీశ్రీ లాంటి వారెందరో మొదట సంస్కృత ప్రబంధ కావ్యాలు చదివి ప్రభావితులై, యతిప్రాస యుక్తమయిన

డాక్టరు ఎన్. కల్పన

రచనలు చేసి ఆ తరువాతనే ఆధునిక ధోరణికి తమను తాము మలుచుకున్నారన్న సంగతి మనం మరచి పోకూడదు. ఇప్పుడు మనం వాడుతున్న ఆధునిక ధోరణి లేదా పోష్టుమోడర్నిజమ్‌ల గురించి పరిశీలిస్తే వాటిలో ప్రపంచంలోని అనేక భాషలలో వచ్చిన సాహిత్య ప్రభావం తెలుగుభాషలో కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

ఆధునిక సాహిత్యంలో ఎక్కువ పాఠకాదరణకు నోచుకున్న ప్రక్రియలు నవలలు, కథలు, కవితలు. నాటకం, వ్యాసం లాంటివి లేకపోలేదు కానీ వాటి కంటే పై మూడింటికీ పాఠకులు ఎక్కువ. వీటికి పాఠకాదరణ కల్పించటంలో ముఖ్యపాత్ర వహించినవి అప్పటి సచిత్ర వార పత్రికలు. ప్రస్తుతం స్వాతి వారపత్రిక తప్ప మిగిలినవి కొన ఊపిరితో మనుగడ సాగిస్తున్నాయి. ఒకప్పటి పత్రికలలో వాస్తవికత, ఆదర్శం, అభ్యుదయం అనే ఆశయాలతో రచనలు వస్తే ఇప్పుడు వాటి స్థానంలో ప్రేమ, శృంగారం, పచ్చి శృంగారం అనే మూడు ప్రక్రియలతోనే పత్రికలు ముడుచుకు పోయాయి.

ఆధునిక నవల గురించి మాట్లాడుకోవలసి వస్తే అది ఒకప్పటి ప్రభావాన్ని చాలామటుకు పోగొట్టుకుంది అని చెప్పవచ్చు. పాఠకులను ఆకర్షించడానికి 25 సం॥ క్రితం తెలుగు దినపత్రికలు డైలీ సీరియల్స్ మొదలు పెట్టాయి. ఇందులో కథ, కాకరకాయ అంటూ ఏమీ ఉండదు. కేవలం రచనా శిల్పం, ఉత్కంఠత ప్రాధాన్యం వహిస్తాయి. ప్రతిరోజూ కథ ఒక ఉత్కంఠ సన్నివేశం దగ్గర ఆపివేసి, పేపరు ఎప్పుడు వస్తుందా? ఆ తరువాత ఏమయింది లాంటి భావాలను సామాన్య పాఠకునిలో రేకెత్తించి కేవలం సర్కులేషన్‌ను దృష్టిలో పెట్టుకునే విధంగా ఆ రచనలు కొనసాగాయి. ఇవి తరువాత కాలంలో ఆగిపోయినా ప్రస్తుత వారపత్రికలలో వస్తున్న సీరియల్ రచనలలో ఆ ధోరణి ఇప్పటికీ కొనసాగుతుంది. దీనివల్ల చెప్పుకోదగ్గ రచనంటూ పెద్ద సంఖ్యలో ఈ మధ్య కాలంలో రాలేదు.

వారపత్రికలో సీరియల్స్‌గా కాకుండా ప్రత్యేకంగా వచ్చే నవలలు దాదాపు లేవనే చెప్పవచ్చు. వర్తమాన జీవనం, సైంటిఫిక్ నవలలు, కథావస్తువులుగా వస్తున్నాయి. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారి పౌరాణిక కల్పనా కథావస్తువు వివాదాస్పదం కావటంతో ఆ ధోరణిలో వచ్చే సాహిత్యానికి గండిపడిందని చెప్పవచ్చు.

ఒకప్పుడు అనువాద సాహిత్యంగా బెంగాలీ నుంచి వచ్చిన శరత్‌బాబు నవలలు, అపరాధ పరిశోధక నవలలకు ఇప్పుడు మారిన జీవనశైలి రీత్యా కాలం చెల్లిందని చెప్పవచ్చు. ఇప్పుడు వస్తున్న ధోరణిలో ఒకప్పటి అనువాదశైలికి తెరపడిందని చెప్పవచ్చు. పూర్వంలా అనువాద రచనంటే నిఘంటువుని దగ్గర పెట్టుకుని చేసే చూసి కాపీ కాదని పాఠకుడు భావిస్తున్నాడు. యథాతథ మక్కీకి మక్కి అనువాదాలకంటే, అనుసృజన, అనుశీలనకు పాఠకుడు పెద్ద పీఠ మేవేస్తున్నాడు. అనువాదం ఒక స్వతంత్ర రచనలా చదివించాలని కోరుకుంటున్నాడు. ఈ మధ్యకాలంలో వచ్చిన వల్లభనేని అశ్వినీకుమార్ వ్రాసిన సిద్ధార్థ, పొనుగంటి కృష్ణారెడ్డి వ్రాసిన విరాళ్‌ల అనువాదం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అనువాదమంటే రెండు భాషలు తెలిసుండటం కాదు. అందులో ఒక శాస్త్రం, ఒక శిల్పం ముడిపడి వున్నాయన్న సంగతి అవగతం చేసుకోవాలి. అలా తెలిసిన అనువాదకులు మనకు స్వల్పం.

కథలు కవితలలో చాలా మార్పులు వచ్చాయి. ఈ రెండిటిలోనూ ఎన్నో ధోరణులు వచ్చాయి. వస్తువు విస్తృత మయింది. శైలీవిన్యాసంలో, విషయాన్ని చమత్కరించటంలో కొత్త పుంతలు తొక్కాయి. ఇందులో ఎన్నో వాదాలు, ప్రతివాదాలు వచ్చాయి.

ఇప్పుడు రాజకీయాలు రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కులాభిమానాలు, కులాల, మైనారిటీల, జండర్‌ల అస్తిత్వ పోరాటాలు, ఎక్కువైనాయి. ఎవరి కవిత్వం వారే రాసుకోవాలి వాటిపై ఇతరులకు అధికారం లేదనే ధోరణి ప్రబలింది.

1990లో త్రిపురనేని శ్రీనివాస్ సంపుటీకరించిన గురిచూసి పాడేపాట మొట్టమొదటి స్త్రీవాద కవితా సంకలనం. దీనికి ఓల్గా, సావిత్రి, జయప్రభ, రజిత, కుప్పిలి పద్మ ముఖ్యులు. ఇందులో ప్రకటించబడిన భావాలు వేరు రూపాలలో కథలుగా కూడా వచ్చాయి. క్రమేపీ ఇందులో ఉన్న తీవ్రవాదం అరాచక వాదంతో కలసిపోయింది. ప్రస్తుతం చెప్పవలసినదంతా చెప్పాం, ఇంకేమీ లేదన్నట్లుగా ఈ కవితాప్రక్రియలు నెమ్మదించాయి. అయితే ఈ భావవాదం కథల రూపంలో కొనసాగుతూ ఆధునిక మహిళలను చైతన్యం చేస్తున్నాయి.

1990 నుంచీ ఈ వాదం ప్రబలంగా వినిపిస్తోంది. మొదట్లో దళిత వాదంలో బి.సి.వాదం. మైనార్టీవాదం కలసి ఉండేది. దళితవాదం దళితులకు మాత్రమే సొంతం అంటూ ఒక అభిప్రాయం వచ్చింది. దీనితో ఇది దళితులని పిలువబడే వారు చేసే రచనలకే పరిమితం అయింది. 'ఖాజా' ఒక ముస్లింగా తన్నుతాను కాదనుకుని దళిత కవిత్వం వ్రాసినా అంతగా గుర్తింపు తెచ్చుకోలేక పోయాడు.

ఇందులో యండ్లూరి పంచమ వేదం ప్రముఖమయినది. ఇప్పుడీ వర్గీకరణ సంవాదంలో మాదిగ ఉపకులం ఒక ప్రత్యేక వాదంగా వేరు పడింది. ఇందులో కవితలతో పాటు కథలు కూడా ఉన్నాయి.

దళిత వాదం నుంచి బయటపడి ఈ శతాబ్దపు మొదట్లో వెనుకబడిన వర్గాల వాదం అంటూ అమ్మంగి వేణుగోపాల్, జూలూరి గౌరీ శంకర్‌లు మొదలుపెట్టారు. ఇది వారి ఒడిలో పెరిగి రూపు దిద్దుకుంది. ఇందులో ఉపకులాల వాదన లేదు. ప్రజాబాహుళ్యంలో అత్యధిక జనాభా కలిగి వుండి కూడా రాజ్యాధికారానికి దూరంగా ఉండటమేమిటనే ప్రశ్న ఈ వాదనలో వినిపిస్తుంది. ఇందులో అస్తిత్వ ధోరణికంటే రాజకీయ ధోరణి ఎక్కువ. ఈ ధోరణిలో వ్రాసే రచయితలు ఎక్కువమంది లేకపోవటంతో ఇది పై రెండు వాదాలలా ఉద్యమరూపం దాల్చలేక పోయింది. ఇది కవితలకు మాత్రమే పరిమితమయింది. కథగా, నవలలుగా చొచ్చుకు పోలేక పోయింది.

**నాటకం:**

తెలుగు నాటకాలపై సంస్కృత ప్రభావం లేదు. అది ఆంగ్లేయ సంప్రదాయ శైలి నుంచి వచ్చింది. పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర నాటకాలు (ముఖ్యంగా అందులోని పద్యాలు) ఇప్పటికీ ప్రదర్శించబడి ప్రజాదరణ పొందుతూనే ఉన్నాయి.

అయినా తిరుపతి వెంకటకవులు, జాషువ పద్యాలులా ప్రజల నాలుకపై నిలచిన పద్యనాటకాలు ఆ తరువాత రాలేదనే చెప్పవచ్చు.

యండమూరి వీరేంద్రనాథ్, కుక్క నాటకంతో ప్రయోగం చేస్తే, చాట్ల శ్రీరాములు, ఎన్.ఆర్.నంది నాటకం మరో మహెంజోదార్‌తో ఫ్రీజ్ టెక్నిక్‌ను ప్రవేశ పెట్టి వైతాళికుడని పించుకున్నాడు. పాటిబండ్ల ఆనందరావు వ్రాసిన పడమటిగాలి ఈ మధ్య వచ్చిన నాటకాలలో ఎక్కువ మందిని ఆకర్షించి సినిమాలు, టి.విలు. వచ్చినా నాటకానికి కాలం చెల్లలేదని నిరూపించింది.

**లేఖాసాహిత్యం:**

ఒకప్పటి ఏనుగుల వీరాస్వామి వ్రాసిన లేఖల ఆధారంగానే కాశీయాత్ర రచన రూపుదిద్దుకుంది. తర్వాత బ్రౌన్, కందుకూరి వీరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి దువ్వూరి రామలింగారెడ్డిలు వ్రాసిన ఉత్తరాలు సాహిత్య విలువలు, విషయపరిజ్ఞానమున్న లేఖాసాహిత్యంగా ఆకర్షించింది. ఆ తరువాతి కాలంలో చలం ప్రేమలేఖలు, కొడ్రపాటి గంగాధరం వ్రాసిన లేఖలు ప్రచురించబడ్డాయి. ఈ సాహిత్య విభాగానికి బహుళ ప్రజాదరణ కల్పించిన వాడు సంజీవదేవ్. ఇప్పటి రోజులలో టెలిఫోన్‌లు, సెల్‌ఫోన్‌లలో ఎస్.ఎమ్.ఎస్‌లు రావటంతో బహుశ ఈ తరహా సాహిత్యం ఇక ముగిసినట్లేనని భావించ వచ్చు.

**పత్రిక సంపాదకీయాలు:**

ఇవి ప్రధానంగా జర్నలిజానికి చెందినవి. Journalist Editorials are literature in a hurry అని అంటారు. ఇందులో వర్తమాన రాజకీయ విషయాలకు ప్రాధాన్యత ఎక్కువ ఉన్నా, సామాజిక, సాహిత్య, కళాంశాలు కూడా ఉంటాయి. ఇవి చరిత్రకు రికార్డులుగా మాత్రమేకాక సామాజిక ఊర్ధ్వప్రయాణానికి తోడ్పతాయి. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు' అన్నాడు నార్ల. నార్ల తరువాత విశేషంగా అచ్చయినవి ఎ.బి.కె. సంపాదకీయాలు. భద్రిరాజు, దీక్షితులు, నండూరి, ముట్నూరి, ఇలా ప్రసిద్ధిగాంచిన దినపత్రికలకు సంపాదకులుగా పనిచేసిన అందరి సంపాదకీయాలు పుస్తకం రూపంలో వచ్చాయి. 1988 నుంచి ఈ తరహా సంకలనాలు వస్తున్నాయి.

**బాల సాహిత్యం:**

బాల, చందమామ, బాలమిత్ర లాంటి మాస పత్రికలు ప్రత్యేకించి పిల్లల్లో ఊహాశక్తి, క్రమశిక్షణ, నైతికత పెంపొందేలా రచనలు సాగించబడి బాలలకే కాక ఆబాలగోపాలాన్నీ అలరించాయి.

ఇప్పుడు బాలల చదువులలో ఎన్నో మార్పులు వచ్చాయి. కంప్యూటర్ గేమ్స్ లాంటి హింసాత్మక ఆటలు భవిష్యత్‌లో దుష్ప్రభావాన్ని కలిగించేలా ఉన్నా ఎవరూ దీనిపై దృష్టి సారించడంలేదు.

ముళ్ళపూడి వారి బుడుగు తరువాత పిల్లలకు చేరు వయిన సాహిత్యం కనబడటం లేదు.

**పరిశోధనా వ్యాసాలు:**

తాపీ ధర్మారావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, తిరుమల రామచంద్రరావు, ఆరుద్రలు సాహిత్య పరిశోధనా వ్యాసాలలో ఉద్దండులు. ఇప్పుడు ప్రాచీన శిల్పశాస్త్రాలపై ఆర్కియాలజీ దృష్టితో వ్రాసే వ్యాసాలలో ఈమని శివనాగిరెడ్డి, జితేంద్రబాబు, సూర్యకుమారులు ప్రముఖులుగా కనిపిస్తున్నారు. నృత్యం, నాటకం, శిల్పం, చిత్రకళపై చెదురుమదురు వ్యాసాలు తప్ప విస్తృతంగా రావటం లేదు. వీటిపై మరింత లోతైన పరిశోధనలతో కూడిన వ్యాసాలు రావాల్సిన అవసరముంది.

**లాక్షణిక సాహిత్యం:**

ఆధునిక తెలుగు భాష ఉద్ధృతితో వ్యాకరణ, అలంకార శాస్త్ర రచనలు మృగ్యమైనాయి.

**ప్రజా చైతన్య జానపదగేయ వాఙ్మయం:**

గద్దర్, వంగపండు, గూడా అంజయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్నల ప్రజాచైతన్య గీతాలతో పాడే పాటలు ప్రాంతీయమైనా ప్రజాదరణలో ఒక సమాంతర సాహిత్య ప్రక్రియగా వెలుగుతున్నాయి.

**కవిత్వం:**

కవిత్వానికి పాఠకుల సంఖ్య – ఒక అంచనా ప్రకారం 0.04 మాత్రమేనని టైమ్స్ ఆఫ్ ఇండియా జనవరి 2011 నాటి లెఖ్క. మరీ అందులో 95 శాతం వచన కవిత్వమే. వచన కవిత్వంలో వ్యాకరణ నిబంధనలు తక్కువ కావటంతో వాటిలో వ్రాసే సులువు ఎక్కువ. పద వైరుధ్యాలలో వాక్యనిర్మాణం చేసే మాయాజాలం వల్ల ఓ విస్తృత భావనా ప్రపంచం ప్రదర్శితమయ్యే అవకాశం ఏ సాహిత్య ప్రక్రియలోనూ లేదు, కవిత్వంలో తప్ప!

సినిమా గీత రచయితగా అత్యంత ప్రజారణ పొందిన కవిగా పేరుగాంచిన సి.నా.రె వచన కవిత్వ రచనలో తాను శిల్పాన్ని యువకవులనుండీ నేర్చుకుంటూనే ఉన్నానన్న సహృదయత వెలిబుచ్చటం మెచ్చదగిందే. "తొణకటంలో ఒక అందముంది. అది మధుపాత్రయినా, మనసైనా అని హృద్యంగా చెప్పగలిగిన సి.నా.రె. రచన శైలి కర్పూర వసంతరాయలు స్థాయిని దాటి ప్రయోగాత్మక, అచ్చమైన పోస్ట్‌మాడ్రన్ ధోరణిలో ప్రయాణం చేయలేదు. అదే అతని కవిత బలమూ, బలహీనత– ఆధునిక కవిత గురించి చెప్పవలసి వచ్చినపుడు నవనవోన్మిషిత ఆధునికతను తన కవితలలో నింపుకున్న శివారెడ్డి మోహనా–మోహనా రచన ద్వారా ఇప్పటికీ తన స్థానాన్ని పదిలపరుచుకుంటూనే నవ్యులలో నవ్యుడుగా నిలబడి వున్నారు.

కవిత్వంలో యాంత్రిక మార్మికతనూ, తాంత్రిక లైంగికతనూ విశృంఖలంగా వాడిన కవి దెంచనాల శ్రీనివాస్. ఇతను తన అధివాస్తవిక వాక్యనిర్మాణంలో ఒక కఫ్కా, ఒక డాలీ, ఒక ఎల్యాను గుర్తుకు తెస్తాడు అంటాడు మో.

ప్రసేన్ వ్రాసిన కులం కవీ, సీతారాం రెజ్యూమ్ బయోడేటా కవితా ఒక ఆద్యంతం అద్భుత వాక్య నిర్మాణంతో సాగింది. పై మూడూ, నవ్య కవితా ధోరణిని అంతకు ముందు లేని శైలిని నూతనంగా తీసుకొని వచ్చింది.

ఎండ్లూరి సుధాకర్ తన నల్ల ద్రాక్షపందిరిలో poetry, piety, pity, protest లను కలిపి చూపగల్గాడు. రమణ జీవి, పాపినేని, శిఖామణి, తమదైన వినూత్న శైలిలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. కాశీభట్ల వేణుగోపాల్ 'ఒక బహుముఖం' అన్న కవితలలో సంస్కృత, ఫ్రెంచి, కర్నాటక సంగీతం, వ్యాసుడు, వాల్మీకి, బసవన్న, బాదలీర్ ఇలా పాదపాదాన అనేకానేక నిఘంటుకవుల్ని చూస్తేగాని అర్థం చేసుకోలేని రచనలు సాగించారు.

నవ్యత ఎప్పుడు వచ్చినా అది ముందుగా కవిత్వంలోకి చొరబడందే ఎరిగిన ప్రక్రియలకు వెళ్లదు. చదివే వారి సంఖ్య తక్కువయినా, విశ్లేషణ, విమర్శలతో కవిత్వం గురించి ఇంత విపుల చర్చ చేయటం త్రిపుర కాఫ్కా కవితలో ఎక్కడ ఆగిపోయాడో, అక్కడ నుంచి మొదలయింది మన పోస్ట్ మాడ్రన్ పొయిట్రి.

**ముస్లింకవిత:**

ఇది అయోధ్యలోని బాబ్రీమశీదు కూల్చివేతతో మొదలయిందని చెప్పవచ్చు. ఇందులో మతపరమైన అంశాలకంటే సామాజిక పరంగా వారిని వేరు చేసి చూడటం. పుట్టి పెరిగిన దేశంలో పరాయిలుగా భయపడుతూ బ్రతుకీడుస్తున్న సామాన్య ముస్లిం యువత అంతరంగ దర్పణమీ రచనలు. ఇందులో చాలా తీవ్ర స్వరంతో తమను రెండవ రకపు పౌరులుగా సంధించటం పట్ల వెళ్ళబుచ్చిన

ఆవేదన ఉంది. ఇందులో ధారాళంగా ఉర్దూ మాటలను వాడుతున్నా, అవి తెలుగు వాక్యంలో కలసి పోయేటంతగా దానిని పేర్చటంలొ గొప్ప శిల్పాన్ని సృష్టిస్తున్నారు. ఈ కవిత్వంలో ఆవేదనే తప్ప ఆవేశము కానరాదు. ప్రస్తుత సాహిత్యాన్ని స్థూలంగా పరిశీలిస్తే ఒకప్పుడు ఉన్న ఆంగ్లభాషా ప్రభావం అంతగా కనిపించటంలేదు. లాటిన్ అమెరికా సాహిత్యం, ఆఫ్రికా సాహిత్యాల ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది. నేలవిడిచి సాముచేసే కల్పనాత్మక ధనిక యువకులు కథానాయకులుగా ఉన్న రచనలకు కాలం చెల్లింది.

ఇప్పటి రచనలలో విషయ విశ్లేషణలు, మట్టి పరిమళాలను ఆస్వాదించటం ప్రముఖంగా కనిపిస్తుంది. ఇందులో ముఖ్యంగా చెప్పదగింది జి.కల్యాణరావు వ్రాసిన అంటరాని వసంతం. వార్తా పత్రికలలో, టి.వి. ఛానల్స్‌లలో వచ్చే వార్తల ఆధారంగా అల్లే కథలను పాఠకులను పెద్దగా ఆకర్షించినట్టుగా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పదిహేను సంవత్సరాలకి నెహ్రూ కన్న కలలు కల్లగా మిగిలిపోవటం అందరికీ అర్థమవుతున్న దశలో పెరిగిన స్త్రీ విద్యతో ఆరడుగుల అందగాడు, సకల గుణాభిరాముడైన హీరో, పొడవైన కారులు, ద్రాక్షతోటలు, ప్రేమలు, అపార్థాలు, ట్రయాంగిల్స్, త్యాగాలతో నవలలు ఆంధ్రలోకాన్ని పిచ్చెక్కిస్తున్న రోజులలో, భూత ప్రేత మంత్రాలతో యండమూరి తులసీదళం రాసి పాతరికార్డులను బద్దలుకొట్టాడు.

ఆ తరువాత కాలంలో యండమూరితో కలిసి మల్లాది లాంటి వారు ఇన్‌వెస్ట్‌గేటివ్ జర్నలిజం తరహాలో రచనలు చేసి ప్రజలను మెప్పించారు. పాఠకులు అంతగా పట్టించుకోని అనేక విషయాల గురించి చారిత్రక నేపథ్యం, చెబుతూ విషయ నిర్దేశం చేస్తూ కల్పనతో వాస్తవ దృక్పథాలను కలిపి రచన సాగించారు. ఎన్ని విధాలుగా నవలలు, కాల్పనిక సాహిత్యం వచ్చినా ఏదీ ఒక నిర్దుష్ట ఉద్యమంగా ఒక దశాబ్దకాలం నిలువలేదు. 'మేజిక్ రియలిజం' అనే శైలిలో వచ్చిన నవలలో డా॥కేశవరెడ్డి వ్రాసిన అతడు అడవిని జయించాడు. రామచంద్రమూర్తి వ్రాసిన కాలమేఘం చిరకాలం నిలచే నవలలు. పరాయి మనిషిపై ద్వేషం పరాకాష్టకు తెచ్చిన sick poetry కొంత రాక పోలేదు గాని పెద్దగా గుర్తింపు పొందలేదు. భావకవిత్వం, అభ్యుదయకవిత్వం, విప్లవ కవిత్వంల వెల్లువ ముగిసిన తరువాత ఈ శతాబ్దపు ప్రారంభంలో మో తనదైన ఒక వినూత్న శైలితో కవిత చెప్పాడు. ఇందులో భాష సరళంగా ఉంటుంది. భావం అస్పష్టంగా ఉంటూ చదువరిని తికమక పెడుతుంది. రచయితగా మోలో ఒక ఆర్తి ఉంది. ఒక కమ్మని కల ఉంది. ఈ రెంటినీ ముందుగా ఛిద్రం చేసి తరువాత తిరిగి చేర్చి రచన చేయటంతో పాఠకునిడు కవిహృదయం తెలుసు కుంటాడు కాని అర్థం చేసుకోలేడు. ఈ మధ్య వచ్చిన వాటిలో మో శైలి నిత్యనూతనమైంది. ఒక unconventional రచనా విధానమిది. తెలుగులో హాస్యనవలలు చాలా తక్కువగా వచ్చాయి. భానుమతి అత్తగారి కథలు, ముళ్ళపూడి వారి బుడుగు మినహా ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే సంపూర్ణ హాస్య నవలలూ, బారిష్టరు పార్వతీశంలా మరొకటింతవరకు రాకపోవటం బాధాకరం. *హాసం* పేరుతో వచ్చిన పత్రిక మంచి హాస్య కథలను ప్రచురించినా ఆ పత్రిక అర్థాంతరంగా మూత పడటంతో ఆ తరహా రచనలు ఎక్కువగా రావటంలేదు.

పూర్వంకంటే ఇప్పుడు కవయిత్రులు పెరిగారు. స్త్రీవాదం కాక మిగతా విషయాలతో కవిత్వం చెప్పిన వారిలో శ్రీ రంగారావు, నాయని కృష్ణకుమారిలను ప్రముఖులుగా చెప్పుకోవాలి. తెలుగులో వచ్చిన జీవిత చరిత్రలు చాలా తక్కువ. స్వీయ జీవనచిత్రణలు మరీ తక్కువ. ఇందులో ప్రముఖంగా చెప్పదగినవి కందుకూరి, చిలకమర్తి వారలవి. ఆ తరువాత వచ్చిన వాటిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, తిరుమల రామచంద్ర, కాళోజీ, ఆచంట జానకీరాం, సంజీవదేవ్‌లతో పాటు మరికొందరి రచనలు వచ్చాయి. ఇందులో జీవిత విశేషాలతో పాటు అనేక సాహిత్య, కళాత్మక విషయాలపై అభిప్రాయాలు కూడా ప్రచురించబడ్డాయి.

ఈ మధ్య వచ్చిన వాటిలో రాణీ శివశంకర శర్మ వ్రాసిన *లాస్ట్ బ్రాహ్మిన్* బ్రాహ్మణ అస్తిత్వ మూలాలు దానిలోని లోటుపాట్లను తులనాత్మకంగా సమీక్షించింది. సామాన్యంగా స్వీయ జీవిత చరిత్రలో రచయిత తన సుఖదుఃఖాలను వరుసగా చెప్పుకుపోతూ గతకాలమే మేలు వచ్చు కాలముకంటే అనే ధోరణి సాగుతాయి. పైన చెప్పిన జీవిత గాథలు ఈ మూస శైలికి మినహాయింపని చెప్పాలి. చివరగా చెప్పాలంటే సాహిత్యంలో పెద్ద మార్పులు గత పదేళ్ళుగా రాలేదు. తెలుగు సాహిత్యం ఈ రోజు గతకాలపు పూర్వ వైభవ చిహ్నాంలాగానే మిగిలింది.

*ఇది ఒక విహంగ వీక్షణం మాత్రమే.* మి

# ఆకాశవాణి బాణి

- వోలేటి పార్వతీశం

"రేయ్! పొద్దుట్నుంచీ, అలా టీవీ ముందు వ్రేళ్ళాడకపోతే కాసేపు కట్టేసి చదువుకోకూడదూ?" అంటూ ప్రతి ఇంట్లో అమ్మా, నాన్న అనడం మనం రోజూ వినేదే. కానీ, " ఆ రేడియో కట్టేసి చదువకోకూడదూ?" అని అమ్మా, నాన్నా ఏ ఇంట్లోనూ కసురుకోవడం గత నలభై ఏళ్ళుగా నేను ఎప్పుడూ వినలేదు. మీరూ వినివుండరు కదా! బహుశా అమ్మా, నాన్నలందరికీ రేడియో, చదువులు చెడగొట్టదనే అభిప్రాయం వుండి వుండవచ్చు. రేడియో మంచి విషయాలు చెబుతుంది. మన మాటకి ప్రామాణికతను ఇస్తుంది. ఆకాశవాణిలో మన గొంతు వినబడటం అంటే మామూలు విషయం కాదు. అది చాలా గొప్ప గౌరవం అనుకునే రోజులు నా కింకా గుర్తున్నాయి. ఇప్పటి పరిస్థితి కాస్త భిన్నంగా వుండి వుండవచ్చు. గతంలో గొప్పగొప్ప రచయితలకు, పండితులకు, కళాకారులకు, సంగీతజ్ఞులకు మాత్రమే ఈ గౌరవం ఎక్కువగా లభిస్తూ వుండేది. ఇలా అవకాశం పొందిన కళాకారులు, రచయితలు అందరూ తమతమ రంగాల్లో నిష్ణాతులే, వాళ్ళ ప్రత్యేకతలకు ఆకాశవాణి ఎంతో ప్రాచుర్యాన్ని కలిగించింది. అందుకే ఆకాశవాణి అంటే నాకు అపురూప వాణిగానే స్ఫురిస్తుంది.

ఒక విషయం నాకు చాలా కాలం ఆశ్చర్యంగానే తోచేది. కళాకారులందరికీ, ఆకాశవాణి సమాన అవకాశాలు ఇచ్చినా, కొందరే ఎక్కువ ప్రాచుర్యాన్ని సముపార్జించుకున్నారు. ఎందుకలా జరిగింది? అవకాశాలు అందరికీ వచ్చినా వాళ్ళందరికీ సమాన ప్రాచుర్యం ఎందుకు లభ్యంకాలేదు. నా ఆశ్చర్యం ఆలోచనగా మారింది. మరింతగా సాగింది. అప్పుడు నాకు కొద్ది కొద్దిగా అర్థమైంది. ఆకాశవాణి అంటే ఒక ప్రత్యేక మాధ్యమమని, ముఖ్యంగా శ్రావ్యప్రధాన మాధ్యమమని. ఈ శ్రావ్య మాధ్యమ కళకు కొన్ని ప్రత్యేకత లుంటాయని. వాటిని అవగాహన చేసుకున్నవారే ఆకాశవాణిలో రాణించగలరని నాకు అర్థమైంది. ఆకాశవాణిలో అనేకమైన విభాగాలుంటాయి. అందులో ఒకానొక విభాగం 'స్పోకెన్ వర్డ్'. బహుశా ఇటువంటి పదప్రయోగం ఆకాశవాణి వల్లనే ప్రాచుర్యంలోకి వచ్చిందనుకుంటాను. అసలు మాట్లాడబడటమే కదా! మాటకు మొదటి పరమావధి. మనలోని భావనను, మనసులోని ఆలోచనను ప్రక్కవాళ్ళకు తెలియజేయడం కోసం మనం ఉపయోగించే మొదటి సాధనం మాట.

ఈ మాట అనేది రెండు రకాలుగా వుంటుంది. ఒకటి మాట్లాడేమాట. రెండవది వ్రాయబడే మాట. మాట్లాడే మాటకి, వ్రాయబడే మాటకి తేడా వుంటుందని నా కనిపిస్తుంది. వ్రాసే మాటలు, వాక్యాలుగా కూర్చేటప్పుడు, మనకి తెలియకుండానే మనం వ్యాకరణంలో పడిపోతాం. వాక్యాలను సరిచూసుకుంటూ వుంటాం. ఆ వ్యాకులత లేనిది మాట్లాడేమాట, మన భావాన్ని ప్రకటించే ఉపకరణమే తప్ప, మరే వ్యాకరణమూ పాటించని మాటే మాట్లాడే మాట. అటువంటి పలుకుల కోసమే తన గొంతు తలుపులు తెరిచివుంచుతుంది ఆకాశవాణి. మాట్లాడటం మనిషికి ఒక సహజమైన కళ అనుకుంటే, ఈ సహజకళకు అద్భుతమైన ప్రదర్శనా వేదిక ఆకాశవాణి.

'స్పోకెన్ వర్డ్' అనే విభాగం ఆకాశవాణిలో ఉండేదని అనుకొన్నాం కదా! వేటూరి సహజానంద వంటి గొప్ప కార్యక్రమ నిర్వహణాధ్యక్షులు. ఈ కార్యక్రమ రూపకల్పనను పర్యవేక్షించేవారు. ఇక ప్రసంగ వ్యాసం రచనా విధానానికి వస్తే, రేడియో ప్రసంగానికి అంశం లేదా వస్తువు ముఖ్యం కనుక, ఆశు ప్రసంగం సరియైన పద్ధతి కాదు. ప్రసంగ పాఠం వుండాలి. రేడియో ప్రసంగం ఐదు, పదినిముషాల వ్యవధి ఉంటుంది కనుక, దాన్ని దృష్టిలో వుంచుకోవాలి. సమయ పాలన చాలాముఖ్యం. అందుచేత ఆత్మాశ్రయ కవిత్వాన్ని

డాక్టరు వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

గురించి, ఏకాంత సేవ గురించి, మనకు తెలిసినదంతా ఏకరువు పెట్టడం కన్నా, పరిమితుల మేరకు తెలియచెప్పడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. లిఖిత ప్రతిగానో, అచ్చు ప్రతిగానో మనకి దొరికే వ్యాసాన్ని మనకి అర్థంకాని చోట్ల, ఒకటి రెండు సార్లు సావకాశంగా చదువుకుని అర్థ చేసుకునే అవకాశం వుంది. అలాగే వేదికపైన సాగే ప్రసంగం అయితే, ప్రసంగకర్త, శ్రోతలు ముఖాముఖీ ప్రత్యక్ష సంబంధం కలిగి వుంటారు కనుక, సందేహ నివృత్తికి అవకాశం వుంది.

కానీ రేడియో ప్రసంగం అలాంటిది కాదు. ఇది శ్రవ్య ప్రధానమైనది. శ్రోత దృష్టి కేంద్రీకరించి, విని తెలుసు కోవలసింది. ఒక వాక్యం ముందుకి వెళ్ళిపోతే, మళ్ళీ వినే అవకాశం వుండదు. అంచేత ఒక్కసారి వినగానే అర్థమయ్యే రీతిలో వుండాలి. అంటే, సందేహాలకు తావుండని రీతిలో ప్రసంగం సాగాలి.

వ్యాకరణ సూత్రాల కన్నా, శబ్దసౌందర్యం కన్నా, సులభంగా అర్థమయ్యే రీతిలో పదాల ఎంపిక, వాక్య నిర్మాణం వుండాలి. వ్రాసే మాటలా కాకుండా, మాట్లాడే మాటలా తోచాలి. వాక్యం ఎంత చిన్నదిగా వుంటే శ్రోతలకు అంత సులభంగా అర్థ మౌతుంది.



**తొలినాటి రేడియో**

సుదీర్ఘమైన సంకీర్ణ వాక్యాలు, దీర్ఘ సమాసాలు, జటిలంగా వుంటాయి కనుక, శ్రోతలు అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. విషయాన్ని సూటిగా చెప్పడానికి ప్రయత్నించాలి. వేదికలపై చేసే ప్రసంగాలు శ్రోతలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి వుంటాయి కనుక, ప్రసంగకర్త ప్రదర్శించే హావభావాలు కూడా, ప్రసంగాన్ని అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తాయి. కానీ రేడియో ప్రసంగంలో అలాంటి అవకాశం లేదు.

మైకు ముందు ప్రసంగకర్త ప్రకటించే హావభావాలు, రేడియో శ్రోతలకు కనిపించవు. అంచేత హావభావ ప్రకటన అంతా కంఠస్వరం ద్వారానే చేయగలగాలి. ఈ పని ఎంత ప్రతిభావంతంగా చేయగలిగితే, మనం శ్రోతలకు అంత దగ్గరౌతాం. రేడియో ప్రసంగం, సమర్థవంతంగా నిర్వహించా లంటే కొన్ని మౌలికమైన అంశాలు మనం గుర్తుంచుకోవాలి. వాక్యాలు చిన్నవిగా వుండాలి. సంకీర్ణ వాక్యాలు, దీర్ఘ సమాసాలు లేకుండా వుంటే మంచిది. మాటలు తేలికగా అర్థమయ్యేలా వుండాలి. రేడియోకి అనుకూలమైన మార్పులు చేసు కోవాలి.

ఉదా: పైన వివరించినట్లుగా అనడానికి బదులు, ఇంతకు మునుపు చెప్పినట్లుగా అని వ్రాసుకోవాలి.

ఉచ్ఛారణా సంకేతాల్ని పాటించాలి. అంటే మనం పంక్చ్యుయేషన్ అంటూ వుంటాంకదా. దానిని సరిగ్గా పాటించాలి. మనం ప్రసంగ పాఠం చదువుతుంటే కామాలు ఫుల్‌స్టాప్‌లు ఎక్కడ వున్నాయో శ్రోతలకి అర్థం కావాలి. రికార్డింగ్ కన్నా ముందు ప్రసంగ పాఠాన్ని ఒకటి, రెండు సార్లు చదువుకొని సాధన చెయ్యాలి. కంఠస్వరాన్ని అనువుగా తీర్చి దిద్దాలి. ఈ విషయాలన్ని దృష్టిలో వుంచుకుంటే మనం రేడియో ప్రసంగాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లే.

అక్షరాభ్యాసం జరిగిన కొత్తలో అక్షరాలు దిద్దడం చాలా ఆనందంగా ఉంటుంది. అక్షరాలు నేర్చుకోగానే మాటలు వాక్యాలు వ్రాయడం మరింత ఆనందంగా వుంటుంది. మొత్తం మీద వ్రాయడం వచ్చిన కొత్తలో ఏమి వ్రాసినా ఆనందంగానే వుంటుంది. వయసు పెరిగే కొద్దీ, వ్రాసే విషయం పైన విచక్షణ పెరిగే కొద్దీ మనకి అర్థమౌతుంది వ్రాయడమంటే తేలికకాదు అని, అదొక గొప్ప ప్రసవవేదన అని. అందుకే అంతటి వేదన అనుభవించిన తర్వాత, ప్రభవించిన రచన చూసుకుంటే, రచయితకు ఒక గొప్ప ఆనందం కలుగుతుంది.

మనకి రకరకాల రచనలున్నాయి. ప్రచురణకోసం చేసే రచనలు, ప్రసారం కోసం చేసేరచనలు, ప్రచారం కోసం చేసే రచనలు. ఇలా అనేక రకాలుగా వుంటాయి రచనలు. ఈ విభజన వినగానే మీకు అర్థమైవుంటుంది, ఇవి మాధ్యమ సంబంధమైన విభాగాలని మీరు గ్రహించి వుంటారు. పత్రికల కోసం, సినిమాలకోసం, రేడియోకోసం, చేసే రచనల గురించి మనం చర్చించ బోతున్నామని మీకు అవగతమయ్యే వుంటుంది. ఆదరణలో అగ్రభాగంలో వున్నాయి కనుక, ముందు సినిమారచనల గురించి గమనిద్దాం. ఈ రచనలకు ప్రయోజనాలు వుండే సందర్భాలు చాలా తక్కువ. ఈ మాధ్యమం, ముఖ్యంగా ప్రేక్షకుల్ని ఆహ్లాదపరచడానికి చేసే

వ్యాపార ప్రయత్నం. అందుకే దానికి తగ్గట్టుగానే వుంటుందీ రచన. ప్రధానంగా సినిమా రచన అంతా పాత్రల పరంగా సాగుతుంది. సామాన్యజనాన్ని ఆకట్టుకోవడమే, రచయితకు ఏకైకలక్ష్యం. అందుకే చాల సందర్భల్లో భావంతో సంబంధం లేకుండా భాషాడంబరమే కనబడుతుంది. అదంతా మాటల్లో చేసే కసరత్తులా వుంటుంది. గ్రామర్‌కి దూరంగా, గ్లామర్‌కి చేరువగా వుంటుందీ రచన. దుష్టసమాసాలు, అర్థం పర్థం లేని పదబంధాలు కోకొల్లలు. అవసరంతో నిమిత్తం లేకుండా మాండలీకం వీరవిహారం చేస్తుంది. "పదునైన సంభాషణలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి'' అని సినిమా సమీక్షల్లో చదువుతుంటాం. ఆ పదును, ఆకర్షణ వరకే. అటువంటి ఆకర్షణ సినిమాలకు అవసరం. సరే అదలా వుంచుదాం. కొంచెంసేపు, పత్రికా రచనల సంగతి పరికిద్దాం. దీనికి ఒక ప్రత్యేకత వుంది. 'పత్రికా రచనా విధానం అంటే ఇది' అనే ధోరణి ఒకటి ఇప్పటికే బాగా స్థిరపడిపోయింది. పాతకాలం పత్రికల ధోరణి ఎలావున్నా, నేటి పరిస్థితి మాత్రం వేరు.


రేడియో

ఆకర్షణీయమైన శీర్షిక పెట్టడం, యథేచ్ఛగా తెలుగును హిందీ, ఇంగ్లీషు వంటి ఇతర భాషలతో కలగలిపి ప్రయోగించడం, చాలా సాధారణ విషయంగా మారిపోయింది పత్రికా సమావేశాల్లో నాయకులు అవేళ స్వంతంగా, ప్రకటించే అభిప్రాయాల్ని, అంతే ఆవేశంగా మనకి పత్రికాముఖంగా అందించే ప్రయత్నంలో భాష సభ్యత కోల్పోతోంది. ఉదాహరణకి, "దమ్ముంటే జెపిసి వెయ్యండి" అనే శీర్షిక చదివితే, అందులో ఏమాత్రం సభ్యత వున్నదో మనకి అర్థమౌతుంది. ఇక పత్రికారచనలో మాత్రమే కనిపించే పదాలు కొన్ని వుంటాయి. గమనించండి, 'ఫలానా పార్టీ ఈ అంశంలో తటస్థ వైఖరిని అవలంభిస్తోంది.' అనే వాక్యంలో మనకి కనబడే 'వైఖరి' 'అనేమాట, మరో మాధ్యమ రచనలో కనబడదు. మాటల్ని యథేచ్ఛగా వాడుకొనే సౌకర్యం వలన, రెండు మాటలకలయిక వుండవలసిన ఔచిత్యాన్ని విస్మరించడం జరుగుతూ వుంటుంది. ఈ ఉదాహరణ గమనించండి, 'దక్షిణాఫ్రికా జట్టు ఇప్పటికి 1-0 ఆధిక్యాన్ని అందుకుంది." ఈ వాక్యంలో ఆధిక్యాన్ని అందుకుంది అనే పదబంధం వుంది. ఇక్కడ భావం మనకి అర్థమౌతుంది కనుక, పదబంధంలోని ఔచిత్యరాహిత్యాన్ని మనం పట్టించుకోవడంలేదు. నిజానికి 'ఆధిక్యమనేది అందుకొనేది కాదు, సాధించుకొనేది.' ఈ ప్రాథమిక విషయాన్ని విస్మరించడం జరుగుతోంది.

ఇక కొంచెంసేపు రేడియో విషయాల్ని గమనిద్దాం. ఏ ఇతర మాధ్యమానికన్నా, భాషను ఎక్కువగా గౌరవించింది రేడియో అని చెప్పక తప్పదు. మొదటినుంచీ, ఈ మాధ్యమాన్ని ప్రభుత్వమే నిర్వహించింది కనుక, ఏ మాటైనా ఆచితూచి వాడటం జరిగేది. ఇది ఒక కారణం. మరో కారణమూ వుంది. రేడియో ప్రారంభమైన తొలినాళ్ళ నుంచీ, మూడు, నాలుగు దశాబ్దాలపాటు సాహిత్యంలోను, రంగస్థలంపైనా, సంగీతంలోనూ, ఏదో ఒక కళారంగానికి చెందిన నిష్ణాతులు ఎక్కువమంది, ఈ మాధ్యమంలో పనిచేయడం, గుర్తుంచు కోవలసిన నిజం. ఈ రంగంలో కూడా, వ్యాపారధోరణులు ఊపందుకున్న కారణంగా, ఎఫ్.యం ప్రసారాలలో భాషకు కాస్తంత గౌరవం తగ్గిందనేది కూడ నిజం. అయితే వ్యాపార సంస్థల ప్రసారాలను కాస్త ప్రక్కన పెడితే, ఆకాశవాణి మాత్రం పూర్వ సంప్ర దాయాలను ఈనాటికీ పాటిస్తూనే వుంది. సులభంగా అర్థమయ్యే గుణంతోపాటు, రేడియో రచనకు, శబ్దసౌందర్యం కూడా చాలా ముఖ్యం. దీర్ఘాలు, హ్రస్వాలు, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు, ఒక పూనికతో పలికితే కలిగే శబ్దసౌందర్యం కేవలం అనుభవైక వేద్యం.

**"ఆపెదవి మెదిపితే ఆణిముత్తెపుజల్లు**
**ఆ కలము కదిపితే అందాల హరివిల్లు**
**అతని తీయని వాణి అది నిత్య కల్యాణి**
**అతడు నిల్చిన క్షోణి, అమృతలహరీ త్రివేణి"**


వోలేటి పార్వతీశం

ఇక్కడ పెదవి మెదపడం, కలం కదపడం, వంటి ప్రయోగాల్లోని ఔచిత్యం, ముత్తెపుజల్లుని, హరివిల్లుని అంత్యప్రాసలో బంధించడం, వాణి, కల్యాణి, క్షోణి, త్రివేణి వంటి మాటలు నిర్ణీత కాల వ్యవధిలో పలికేలా ప్రయోగించడం, ఇవన్నీ శ్రవ్యరచనా మాధుర్యాన్ని ద్విగుణీకృతం చేస్తాయి.



# భామనే.. సత్యభామనే...

– *వేదాంతం సత్యనారాయణ శర్మ*

ఈ కూచిపూడి నాట్యకళ మా, పై నాలుగు తరాలుగా వస్తున్నది. మా ముత్తాత వేదాంతం చలమయ్య వారి బృందంతో కాలినడకన అనంతశయనం వెళ్ళి అనంతశయనం మహారాజుగారి ఆదరణపొంది, వారిచే సింహతలాటం తొడిగించుకున్న సంగతి మా తల్లిదండ్రులు చెబుతుండేవారు. చలమయ్య కుమారులు సాంబయ్య. వీరు సూత్రధారిగాను, నారదాది భక్తి ప్రధానమైన పాత్ర పోషణచేస్తూ అనేకమంది శిష్యులను తీర్చిదిద్దారు. వీరికి ఏడుగురు మగపిల్లలు. వారిలో జ్యేష్ఠులు మా తండ్రిగారు.

మా తండ్రిగారు సంగీత, సాహిత్య, నృత్యాలలో బహు ప్రతిభావంతులని మా చిన్నాన్నలు చెప్పేవారు. ఎందు వల్లననగా నా చిన్నతనంలోనే మా తండ్రిగారు గతించారు. మేము ముగ్గురు మగ పిల్లలం, ఇద్దరు ఆడపిల్లలు. మాలో పెద్దవారు శ్రీ వేదాంతం ప్రహ్లాద శర్మగారు. వారు స్త్రీ పాత్రలలో గొప్పపేరుగాంచిన వ్యక్తి. వీరు స్త్రీపాత్రలైన చంద్రమతి, లీలావతి, సీత ఇత్యాది పాత్రలు పోషించెడివారు. ఇక రెండవ వారు శ్రీ వేదాంతం వీరరాఘవయ్యగారు. వీరు సూత్రధారిగానూ, చిత్రరేఖాది స్త్రీ పాత్రలను పోషించెడివారు. అంతేగాక శ్రీకృష్ణుడు, సత్యభామ పాత్రలలో సర్వసమర్థులుగా కీర్తిగడించారు. ఇక మూడవ వాడిని నేను. నాకు ఎనిమదవ ఏటనే మా పెద్దన్నగారు శ్రీ ప్రహ్లాదశర్మగారు మా ఇలవేలుపు శ్రీ బాలాత్రిపుర సుందరీ అమ్మవారి సమక్షంలో నాట్య విద్యాభ్యాసం గావించారు. వీరి వద్ద నేను గురుకుల పద్ధతిలో నాట్యశిక్షణ పొందడమేకాక, *ఉషాపరిణయం* యక్షగానంలో వారు ఉషగా నటించినప్పుడు ప్రక్కన చెలికత్తెగా చేసేవాడిని. అప్పుడు నాకు స్త్రీ వేషం వేసి నా చేత “సఖీ! పందిరి ఇల్లగునా, పరదేశి మగడగునా?” వంటి వచనములు పల్కించెడివారు. అప్పటిరోజులలోనే ఈ అమ్మాయి చాలా ముద్దుగా ఉన్నది. మంచి వృద్ధిలోకి రాగలదని జనసందోహం ముచ్చటించు కొనేవారు. అప్పటికి కూచిపూడిలో చింతా వేంకటరామయ్య వారి మేళం, వేదాంతం వారి మేళం, పసుమర్తి వారి మేళం అలా కొన్ని మేళాలు (బృందాలు) ఉండేవి.

యక్షగాన పితామహుడైన చింతా వేంకటరామయ్య గారి తనయుడు చింతా కృష్ణమూర్తిగారు నన్ను చేరదీసి ఉషా పరిణయం నేర్చుకుంటావా? అని అడిగినప్పుడు మా మామగారైన పసుమర్తి కొండలరాయుడుగారి ప్రోత్సాహంతో కృష్ణమూర్తిగారి వద్ద విద్యాభ్యాసం చేశాను. నా తొలిప్రదర్శన కూచిపూడి సమీపంలో నున్న 'పెదముక్తేవి' గ్రామంలో జరిగింది. మొదటి ప్రదర్శన ముగిసిన అనంతరం ఆ గ్రామంలో నాకు జరిగిన సన్మానం, బహుమతులు, అగణితం, ఐతే నాకు ఏమీ తెలియని వయస్సులోనే ఆ అనుభవాలు. పొంది వీరందరూ నన్ను అభిమానించి ఆశీర్వదిస్తున్నారు అని గ్రహించాను. అంతేగాక మా ఉషా పరిణయం ప్రారంభించిన కొన్నాళ్ళలోనే మా పెద్దలు చేసే భక్త ప్రహ్లాద, రామనాటకం, సత్యహరిశ్చంద్ర ఇత్యాది నాటకాల ప్రభ సన్నగిల్లి మా ‘ఉషా పరిణయం’ బహుళ ప్రాశస్త్యం పొందింది.

అప్పటినుండి యావత్ భారతదేశం లోనూ *ఉషా పరిణయం* ప్రదర్శనల పరంపర విస్తరించింది. తద్వారా మంచి పేరుప్రఖ్యాతులు గడించాం. ఆ సమయంలో నేను చేసిన కొద్ది మార్పులు ఏమిటంటే ఉష పాత్రధారి ‘స్వామి రారా దావెర తిమ్మేంద్ర కుమారా’ అను శబ్దాన్ని అభినయించేటపుడు ఆ పాదానికి బదులుగా అనిరుద్ధుడు శ్రీ కృష్ణుని మనుమడు గాన ‘యదువంశ సుధాంబుది చంద్ర’ అన్న పాదాన్ని చేర్చి ప్రదర్శించేవాడిని, అంతేగాక పూర్వులు ప్రదర్శించే పద్ధతిలో కొంచెం మార్పులు చేసి, అనగా ‘ఉషా’ ముగ్ధ నాయిక గనుక ముందున్న ప్రౌఢనాయికా పద్ధతులను త్యజించి, ఎక్కువ నవ్వులు, ఇత్యాదులు తగ్గించి పాత్రకు తగిన రీతిలో నటనను మలచి, ముగ్ధనాయికలోను జ్ఞాతయౌవనం, అజ్ఞాతయౌవనం, అనేవిషయాలను దృష్టిలో ఉంచుకొని పరిమితమైన అభినయాన్ని చేసేవాడిని “అనంగుడున్ ఘనంబటంచు ఆగ్రహించెనే చెలి” అను దరువు యందు

పూర్వులు నృత్తము ఎక్కువగా వాడేవారు. కానీ నేను అభినయానికి పెద్దపీటవేస్తూ, మన్మథుని పంచబాణ ప్రయోగాలు, అవస్థలు చూపుతూ, ఐదవ బాణం మాత్రం చూపించేవాడిని కాదు, కారణం నాయిక మూర్ఛపోతుంది అని! తరువాత ఉష పార్వతీపరమేశ్వరులను ఆరాధించే సమయంలో పెద్దలు జనరంజకం కోసం రంగస్థల నాటకాల యందలి పాటలను చేర్చి 'భవానీ భక్తపోషిణీ ముక్తి దాయినీ శక్తిరూపిణి' వంటివి ప్రదర్శించేవారు. ఐతే నేను రెండుచింతల చిదంబర కవి యొక్క రచనలను యథాతథంగా ఉంచాలి, సాహిత్యంలో మార్పులు చేర్పులు చేయరాదని 'అంబ బ్రోవవమ్మా' అనే దరువునే వాడేవాడిని.

ఇంకొక సందర్భంలో స్వప్నంలో కనిపించిన అనిరుద్ధుని చిత్రరేఖ తన మాయా విశేషమున తీసుకురాగా, అతనిని నిదురలేపే తరుణంలో ఉన్న ఆ స్థితిగతులు అనగా, ఆయనను నిదురలేపాలని, ఆయనతో ముచ్చటించాలని, మరలలేస్తే ఏమౌతుందోనని భయం, ఆందోళన వంటి హావభావాలు దాదాపు 40 నిముషాల పాటు ప్రదర్శించేవాడిని.

ఆ సందర్భానుసారంగా పూర్వులు పాడే దరువు స్థానంలో 'లేరా ప్రియలేరా' అనే పాటను స్వయంగా రచించి, సంగీతంచేసి, పాడి చేసేవాడిని, ఆ రసవత్తర సన్నివేశాన్ని చూసి జనులు మురిసిపోయేవారు. అలా *ఉషాపరిణయం* యక్షగానాన్ని దేశమంతటా కొన్ని వందల ప్రదర్శనలు చేశాం. కొంతకాలనికి నాలో వయసు పెరిగి ముగ్ధత్వం తగ్గి ప్రౌఢత్వం ఆరంభిస్తోంది. ఆ తరుణంలో మా చింతా కృష్ణమూర్తి నాకు భామాకలాపాన్ని నేర్పించగా, బందా కనకలింగేశ్వరరావు మాకు పెద్ద గురువుగా ఉంటూ, ఎంతో సహకారం ఇవ్వడమే గాక, భారతావని మొత్తం ఉషాపరిణయంతో పాటు భామాకలాపాన్ని కూడా ప్రదర్శింపజేయడమే కాకుండా తద్వారా కూచి పూడి నాట్యానికి యావద్దేశమంతటా విస్తృత ప్రచారాన్ని కల్పించడం జరిగింది. మా ముందుతరంలో భామాకలాపాన్ని ప్రదర్శించే వారిలో వెంపటి వెంకట నారాయణ ముఖ్యులు. వీరికి అపర సత్యభామ అని బిరుదు. ఐతే అప్పటి ప్రదర్శనలలో "జగదభ్యుదయ పరంపరాభి వృద్ధిగా నేడు మాచే ప్రదర్శింపం బూనిన భామాకలా పంబునందు సత్యభామ ప్రవేశించు విధం బెట్టిదనిన" అని సంధివచనం కాగానే ఒక తెరవెనుక నిల్చుని తన జడను ఆ తెర ముందుకు వేసి, 'భామనే సత్యభామనే' అను దరువును తెరవెనుకనే చేయడం, ఆపై సూత్రధారి ముందునుంచి నీవెవరమ్మా? నీవివరమేమని ప్రశ్నించగా, తన భర్త పేరు చెప్పుటకు సిగ్గుపడి సిగ్గాయెనోయమ్మా దరువును, వారి గురించి శంఖము ధరించినవాడని, చక్రము ధరించినవాడని వివరాలు తెల్పుచూ? 'మదనా-మదనా- మదనా-యనుచును వదలలేక వాని వలలో చిక్కితినని ఆ దరువును తెర వెనుకనే నిల్చుని అభినయించేవారు. నేను భామాకలాపం చేసే రోజులలో పై పద్ధతులను కాలాను గుణంగా కొన్ని మార్పులు చేసి, సంధి వచనం కాగానే సంప్రదాయబద్ధంగా తెరతో ప్రవేశించి తదుపరి తెరను పంపించివేసి, అక్కడ ఒక జతితో ప్రారంభించి అన్ని చరణాలకు ముందు జతులను చేర్చి, ఆ పైన వచనములన్నీ, *సిగ్గాయెనోయమ్మా, మదనా* మున్నగు దరువులన్నీ తెరముందు అభినయించేవాడిని ఇక *రంగుగా నామెడ మంగళసూత్రము పొంగుచుగట్టిన సంగతి మరచెనో* అనే దరువును పూర్వం ఎక్కువ సంగతులను చొప్పించి, *లలనా, చెలియా* అనుచోట్ల విరుపులుగా తోడిరాగంలో పాడేవారు, ఐతే పాండిత్య ప్రతిభకు ఇటువంటి దరువు కాకుండా మరో సందర్భాన్ని వాడుకుంటే మంచిది.

ఇక్కడ సాహిత్యభావం తగినరీతిలో సాగాలని హిందోళరాగంలో భావస్ఫోరకమైన మార్పులు చేసి అభినయించేవాడిని, తరువాత మాధవిని శ్రీకృష్ణుని తోడ్కొని రమ్మని పంపే సందర్భంలో వ్రాసే లేఖను పూర్వులు మామూలుగా కూర్చుని వ్రాసినట్లు అభినయించేవారు. ఇటీవలి కాలంలో కొంతమంది రంగస్థలమంతా కలయతిరుగుతూ అభినయిస్తున్నారు.

ఐతే నాకీ రెండు పద్ధతులు నచ్చక, వీటికి మధ్యస్థంగా లేఖ వ్రాసేటపుడు ఏవిధంగా ఐతే మనం కూర్చుని వ్రాస్తామో అలా కూర్చుని ఆలోచించి వ్రాస్తున్నట్లుగా, వ్రాసినది సరిజూచు కొనుచూ సాహిత్యార్థాన్ని ముద్రలతో అభినయించే వాడిని. ఆ తరువాత, మన కూచిపూడి యక్షగానాలలో ఏది చేసినా ప్రార్థనగా 'అంబా పరాకు దేవీ పరాకు మమ్మేలు మా శారదాంబ పరాకు' అని పాడటం సంప్రదాయం. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమిటంటే సంగీతం, సాహిత్యం,



వేదాంతం సత్యభామ

గతిభేధం వంటి విషయాలలో అవగాహన అవసరం. ప్రార్థనకు ముందుగా చెప్పే జతి మిశ్రచాపులో ప్రారంభించి కిటతక॥ దొద్దాదీందాం॥ దొదొదొ దీందాం॥ తధింతకుతాం॥ ధీనుతకిటతక తాహత కిటతక ధిత్తళాంగు ధిత్తళాంగుతోం॥ దీనిని చతురస్రగతిలో పాడేవారు. మరల దొద్దిదీందాం అని మిశ్ర చాపులో ప్రారంభించేవారు. కానీ ఏ రాగమాలిక, తాళమాలికల లోనయినా ముందు ఒక స్వరూపం చూపించి తరువాత దానిలోనికి వెళ్ళడం పద్ధతి కనుక మధ్యలో వచ్చే చతురస్రగతిని మిశ్రగతిలోనే పాడి పాట ఆరంభించే విధంగా నేను మార్పుచేశాను. అంతే గాక అంబా పరాకు అని పాడేటపుడు విరుపులు సరిగాలేకపోతే విపరీతార్థాలు వచ్చే ప్రమాదమున్న కారణాన ఎక్కడికి ఏ అక్షరం ముగించాలి అనేటటువంటి విషయాలు, ఇంకా మూడు మూర్తులకు మూలమైన అనుపాదంలో తార సంచారాలలో గమగరీ అనే ప్రయోగం మోహనరాగంలో నిషిద్ధం కనుక గగరిసరీ అని సరిదిద్ది మోహన రూపంతోనే పాడేవాడిని.



కానీ ఇటీవలి కాలంలో కొంత సంగీత గ్రంథ పరిశీలనో, పరిశోధనో మొత్తానికి “సరిగపదస, సదపగరిస” మూర్ఛనతో ఉండి, గమగరీ అను ప్రయోగం ఉన్న ‘‘పూర్ణకాంభోజి’’ అనే హరికాంభోజి రాగ జన్యరాగంగా గుర్తించి ఇది ఈ రకమైన కొత్తవిషయాలు ఎన్నో మనం తెలుసు కోవలసినవి మనకు ఈ కూచిపూడి నాట్యంలో కనిపిస్తాయి, వయోభారంతో కొంత తగ్గినా నాలో ఉత్సాహం మాత్రం అలాగే ఉండడం చేత నా చేతనైన పని చేస్తూనే ఉన్నాను. ఇంకా సంస్కరించవలసినవి, లోపాలు దిద్దు కోవలసినవి ఉన్నాయి. అవన్నీ ఒక్కొక్కటిగా చేసుకుంటూ ఈ నాట్యాన్ని మరింత వృద్ధిలోకి తీసుకొని రావాలి. ఇక సంప్రదాయ యక్షగానాలు, కలాపాలు తర్వాత నాకుగా నేను చేసిన నృత్యరూపకాలు ‘విప్రనారాయణ’ నృత్యరూపకాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిచే వ్రాయించడం జరిగింది. దీనికి బాలాంత్రపు రజనీకాంతరావు సంగీతదర్శకులు. రజనీ మన సంప్రదాయ ప్రార్థనను పోలియుండే విధంగా ‘అంబా హెచ్చరిక జగదంబ హెచ్చరిక సాంబశివుని ప్రేమధాని హెచ్చరిక అనే గీతాన్ని వారే వ్రాసి బాణీ కూర్చారు. అప్పటికి బాగా ప్రాచుర్యం పొందిన భరణీ వారి విప్రనారాయణ (భానుమతి) చిత్రం, స్థానం నరసింహారావుగారి రంగస్థల నాటకం చూచిన పిమ్మట నా సొంత పద్ధతిలో నేను ఈ పాత్రలో నర్తించి, సమర్థ వంతంగా పోషించగా, అంతక్రితం నేను చేసిన ఉష, సత్యభామ పాత్రలను మించి గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందగలిగాను, కారణం స్త్రీ పాత్ర పోషణ చేసేటపుడు నన్నునేను మరచిపోయేవాడిని, ప్రదర్శనానంతరం ఆ హావభావాలు, నడక, నడత ఆ పాత్రను వీడని తరుణంలో ప్రజలు శర్మగారూ మీరీ వేషం తీసివేసినా అలాగే నడుస్తున్నారే అని చెప్పిన తర్వాతకాని, ఈ లోకంలోకి వచ్చేవాడిని కాదు. అంతగా మైమరచి, స్త్రీలు సహజంగా ఎలా ఉంటారో అదే ఎల్లప్పుడూ గమనిస్తూ విప్రనారాయణ ఆశ్రమంలో పూలవనంలో నీళ్ళు పోస్తూ అనేక చర్యలు, ప్రక్రియలు సహజత్వం ఉట్టి పడేట్టు కొన్ని మార్పులు చేసుకుంటూ వచ్చాను. ఈ నృత్యరూపకాన్ని మరికొంత మార్పులు, నాకు కావలసి వచ్చిన రీతితో నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులతో వ్రాయించి, బాణీలు చేయించి ప్రదర్శించాను.

ఈ నృత్యరూపకంలో ‘వెడలేరా వయ్యారులు’ అను కేదారగౌడ రాగ దరువులో పల్లవి ఎత్తుగడ రజనీ కాంతరావుగారు మంద్రంలో కూర్చడం చేత అది అంత రక్తి కట్టదేమోనని దానిని పై సంచారములతో నేను మార్పు చేసి అదేరాగంలో పాడటం జరిగింది. అంతేగాక “సారీసనిద పనిదపమగరిగ/ సా, సా, నిసరిమగ సరిమపని/ అనే స్వరాలనుకూడా కూర్చుకొని కొంత నృత్తాన్ని కూడా దానికి జోడించేవాడిని. ప్రవేశ దరువు కనుక దాని అందం వాటితో ద్విగుణీకృత మయ్యేది. ఇంకా *వరూధినీ విలాసము* అనే నాటకాన్ని కూడా చేశాను. ఎందువల్లనో అది రక్తికట్టలేదు. ఆ తరువాత *శ్రీకృష్ణతులాభారం* అనే యక్షగానం ముద్రితమై ఉన్నదానిని తీసుకొని దానికి సంగీత రచన నేనే చేసి, కొన్ని రంగస్థల పద్యాలనూ అందులో చేర్చి ప్రదర్శించాము. ఐతే పూర్వము చేసిన నాటకాలంత ప్రాచుర్యాన్ని యివి పొందలేదు. ఇక ఇటీవల మా పిల్లలందరినీ సమకూర్చి డా॥వేదాంత రామలింగశాస్త్రి రచించిన ‘గోదా కల్యాణం’ అనే నృత్యరూపకాన్ని నేనే సంగీతం చేసి నృత్యీకరించి పలు ప్రదర్శనలనిప్పించి యున్నాను. ఇంకా ఎంతో చేయాలని ఉత్సాహం ఉన్నా వయసు పెరిగి శక్తి సన్నగిల్లింది. కనుక యికనుంచి భావి యువకళాకారులందరూ దీనిని పరిరక్షించి, పురోగమనంలో సాగాలని, కూచిపూడి కీర్తిని విశేషంగా పెంచాలని నాయొక్క కోరిక!!!



## కళాపాలకుడు
# బెజవాడ గోపాలరెడ్డి

❀

– ఎన్నార్కె

**"నా కాళ్ళు ఆంధ్రదేశపు మట్టిమీదే**
**కళ్ళు భరతగిరి శిఖరాలమీదే**
**మనసు విశ్వవిశాల వీధులమీదే"**

–అని పలికి స్థానికతను, జాతీయతను, అంతర్జాతీయతను నరనరాల్లో జీర్ణించుకున్న విశ్వమానవుడు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం గ్రామంలో 1907 ఆగష్టు 5వ తేదిన సీతమ్మ, పట్టాభి రామిరెడ్డి దంపతులకు బెజవాడ గోపాలరెడ్డి జన్మించారు. వీరి అన్నగారు చంద్రశేఖర్ రెడ్డి. వారి జాతీయ స్ఫూర్తితో ఈయన ప్రభావితులైనారు.

అకళంకుడైన ఈ అసామాన్య కాంగ్రెస్‌వాది జీవన యానం పరిశీలిస్తే, ఈ వైశిష్ట్యానికి మూలం వీరి వ్యక్తిత్వం అన్నది సుస్పష్టం. చిన్నపిల్లాడిలా నిర్మలమైన మనస్సుతో, కపటమెరుగని నవ్వుతో, ప్రతి విషయాన్ని ఉద్వేగంతో, ఉద్రేకంతో కాక, సంయమనంతో బేరీజు వేసుకొని మంచిని ఎన్నుకొని కేవలం దాన్నే ఆచరించగల 'సత్తా' వీరి సొత్తు.

మచిలీపట్నంలో కొంతకాలం విద్యాభ్యాసం చేసిన తరువాత రవీంద్ర కవీంద్రుని సన్నిధిలో సాహిత్య కళల పట్ల అభిరుచి పెంచుకున్నారు. గోపాలరెడ్డిగారు నెల్లూరులో కాపురమున్న ఇంటికి శాంతినికేతన్ అని పేరు పెట్టుకున్నారు. తన చిన్న కుమారునికి రవీంద్రానంద రెడ్డి అని పేరుపెట్టి గురుభక్తిని ప్రదర్శించారు. ముట్నూరు కృష్ణారావు గారి దగ్గర అభిజ్ఞాన శాకుంతలం, నాగానందం నాటకాలను చదువుకున్నారు. రాజాజీ దగ్గర సంస్కృతం నేర్చుకున్నారు. పట్టాభి సీతారామయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య, తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి, వంటి మహనీయులతో మైత్రిని పెంపొందించుకొని గోపాలరెడ్డిగారు తనలోని రాజకీయ సాహిత్య భావాలకు మరింత పదును పెట్టుకున్నారు.

గాంధీమార్గం ఆయన్ని ఎంతగానో ఆకర్షించింది. బ్రిటీష్ ప్రభుత్వ శాసనాలను ఉల్లంఘిస్తూ ఉప్పుసత్యాగ్రహంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆరు సార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ప్రకాశం పంతులు, మాగంటి బాపినీడు లాంటి ప్రముఖులు గోపాలరెడ్డిగారికి జైలుజీవితంలో సహచరులుగా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జైళ్ళు ఉత్తమ అధ్యయన కేంద్రాలుగా వుండేవి. గోపాలరెడ్డిగారు జైల్లోనే సంస్కృతం, తమిళం, పర్షియన్, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ వంటి భాషలతో పరిచయాలు పెంచుకున్నారు. గోపాలరెడ్డిగారు పలువురికి బెంగాలీ నేర్పారు. **గోపాలరెడ్డిగారు తన విద్యాభ్యాసాన్ని గూర్చి ఏ విశ్వవిద్యాలయంలోనూ కాక జైలులోనే నేనెక్కువ చదువుకున్నానేమో ననిపిస్తుంది అని చెప్పటం గమనించదగ్గ అంశం.**

ఆయన వివాహం 1938వ సంవత్సరంలో గురుదేవులు రవీంద్రుని జన్మదినమైన మే 8వ తేదీన తన బావగారైన తిక్కవరపు రామిరెడ్డి గారి కుమార్తె లక్ష్మీకాంతమ్మతో బ్రహ్మసమాజపద్ధతిలో నిరాడంబరంగా జరిగింది. అప్పటికి ఆయన రాజాజీ మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. ఒక మంత్రి వివాహం అంత నిరాడంబరంగా జరగటం ఆనాటి

వర్ధంతి - మార్చి 9, 1997 (1907-1997)

కొక సంచలనం. ఈ వివాహం మద్రాసు పచ్చాయప్పా కాలేజీలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, మాగంటి బాపినీడుల ఆధ్వర్యంలో జరిగింది. వివాహమైన తరువాతి రోజు ఉదయం కవితా గోష్ఠి జరిగింది. ఈ గోష్ఠిలో విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, మల్లవరపు విశ్వేశ్వరరావు మొదలైన వారు తమ కవితలతో నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కవితలు *కల్యాణ కింకిణి* పేరుతో గ్రంథరూపంలో వెలుగులోకి వచ్చాయి.

1937లో రాజాజీ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో బెజవాడ గోపాలరెడ్డికి రాష్ట్ర ఆర్థికమంత్రిగా స్థానం కల్పించారు. తన జీవితంలో అదే తనకు రాజకీయంగా తొలిమెట్టని ప్రజలను శాసించడానికి కాక సేవించడానికి అందిన పెద్ద అవకాశమని ఆయన చెప్పేవారు.

గోపాలరెడ్డిగారు జాతీయస్థాయిలో నెహ్రూ మంత్రి వర్గంలో ఆర్థికమంత్రిగా, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో సమాచార ప్రసారశాఖామాత్యులుగా బాధ్యతలు నిర్వర్తించి తన దక్షతను చాటుకున్నారు. ఉత్తరప్రదేశ్ గవర్నరుగా అందరిమన్ననలను అందుకున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కొంతకాలం సేవలందించారు. ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కొద్దికాలమే పనిచేసినా ఆయన ఉన్నప్పుడే నాగార్జున సాగర్ నిర్మాణానికి పునాది వేసి ప్రజారంజక పాలకునిగా గుర్తింపు పొందారు.

సాహిత్య ప్రపంచంతో సంబంధం ఉన్న ఆయన తన 70వ ఏట స్వీయరచనలు చేయటానికి శ్రీకారం చుట్టారు.

''నేను కవితాసభలోకి ఆలస్యంగా వచ్చాను/ కూర్చోవటానికి చోటు దొరికింది" అంటూ వినమ్రతతో సాహిత్యవేత్తగా కొత్తజీవితాన్ని ప్రారంభించారు. అలా ప్రారంభించిన తమ సాహితీయాత్రను "నేను కోరేది రసికజన ఆర్ద్రతను/కొద్దిమంది సహృదయుల ఆసక్తులను" అంటూ చివరిదాకా "స్వప్నాల చిత్తరువులు" గీస్తూ ఆనందంగా సాగించారు.

ఏ ప్రాంతలో ఏ సాహిత్య సభ జరిగినా, కవితాగోష్ఠులు జరిగినా రెక్కలుగట్టుకుని వాలిన సాహిత్య ప్రియుడు గోపాలరెడ్డి. స్వంత సీమ నెల్లూరులో కవిత్రయ జయంతులు లాంటి అనేక సాహిత్య సభలు రెడ్డిగారి ఆధ్వర్యంలో జరిగాయి. ఎంతో మంది కవి పండితులు ఈయన చేతుల మీదుగా పురస్కారాలందుకున్నారు. ఆయన ఇల్లే ఒక సాహిత్యశాల. నెల్లూరు ప్రాంతానికి ఏ కవి వస్తున్నా ఈయన ఆతిథ్యం తప్పకుండా లభించేది. అలాగే దేశంలోని ఏ ప్రాంతానికి వీరు వెళ్ళినా అక్కడ ఒక సాహిత్య సభ సాక్షాత్కరించేది.

తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధికి, పరిరక్షణకు కంకణం కట్టుకున్న సాహిత్య సైనికుడు గోపాలరెడ్డి. తెలుగు భాష ఆయన ఊపిరి. అది ఆయన ప్రాణం.

అందుకే ఎకాడమీ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో తెలుగులోని ఎన్నో ప్రాచీన గ్రంథాలను వెలుగులోనికి తెచ్చి అతితక్కువ వెలకు పాఠకులకు అందించారు.

తెలుగు విజ్ఞాన సర్వస్వం సంపుటాల్ని ప్రచురించడానికి కారణభూతులయ్యారు. ఇటీవల కేంద్ర సాహిత్య పురస్కారం పొందిన ఎస్. సదాశివ ఆచార్యుల సాహితీ సేవలను ప్రోత్సహించిన వారిలో గోపాలరెడ్డి ముఖ్యులు.

**కోరివచ్చిన పదవుల్ని ఎంత నిర్మోహంగా స్వీకరించారో, వద్దనుకున్నప్పుడు అంతే నిర్లిప్తతతో త్యజించారు.**

ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఐదు సంవత్సరాలు పదవీకాలం పూర్తయిన పిమ్మట అరవైఅయిదేళ్ళ వయసులో రాజకీయ పదవీవిరమణ గావించి ఆదర్శంగా నిలబడ్డారు.

ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం, 'గోపాలరెడ్డి హృదయం భారతీయం, ఆయన చూపు విశ్వభారతీయం, నాలుక తెలుగుజాతీయం, బాట గాంధీయం అన్న మాటలు ప్రత్యక్షర సత్యాలు.

**"వేలాది మంది వీర సైనికులలో నేను ఒకడిని**
**ప్రేక్షకుడిగా గాక సిపాయిగా పాల్గొన్నాను.**
**నాకు తగిన త్యాగం చేశాను.**
**వట్టిమాటలతో కాక పనిచేసేవారి దండులో చేరాను**
**అదే నా సర్వోత్కృష్ట ఆనంద కారణం**
**నా జీవితానికి మకుటాయమానమైన సాహసాధ్యాయం**
**ఆ వీర సింధువులో నేనూ ఒక బిందువుగా ఎదిగాను"**

అని సవినయంగా చాటుకున్న మహనీయుడు స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డిగారు.

మి

# అడవిలో...
# శకుంతల – షేక్స్‌పియర్



– ఎ.కె.

అమెరికా నుంచి తిరిగి వస్తూ స్ట్రాట్ ఫోర్డు ఆన్ ఏ ఒన్ వెళ్ళాను, షేక్స్ పియర్‌ను అక్కడ వేసే నాటకా లను చూడాలని. లండన్ నుంచి కృష్ణ మూర్తి నాతో వచ్చారు. ఆ సందర్భంలో స్ట్రాట్ ఫోర్డులోని ఒక పెద్దాయన "మీకు షేక్స్‌పియర్ అర్థం కాదు–" అన్నాడు. ఆయన రచయితో, కవో మరి. నాక్కొంచం బాధ కలిగింది. కాలేజి నుంచి ఆయన నాటకాలు చదువుతూనే వున్నాం. విమర్శలు వింటూనే వున్నాం. "ప్రపంచంలో మనుషుల బుద్ధి, ప్రవర్తన స్థూలంగా ఒకే రకంగా వుంటుంది. ఎటొచ్చీ మీ సంప్రదాయాలు, ఆచారాలు వేరు" అని అన్నాను. అంతకంటే ఈ సంభాషణ ముందుకు సాగలేదు.

నేను తిరిగి వచ్చేటప్పుడు కృష్ణమూర్తి చిన్న హామ్లెట్ పుస్తకం ఇచ్చాడు. మరి ఆయన మనసులో ఏముందో?

చాలా కాలంగా గంగాధరంతో కలిసి గిరిజనుల భాషలకు నిఘంటువు తయారు చేసే పనిలో వున్నాను. విశాఖ, మన్యం తిరుగుతూ ఎక్కువగా అడవులలోనే చిన్న చిన్న గూడాలలో గడిపాం.

ఇప్పుడు మేము వెళ్ళిన గూడెంలో కేవలం నూటయాభై మంది ఉన్నారు. అంతా ఒక తానులో గుడ్డలే– ఒక గుడ్డలో దారాలే. వీరంతా పట్టణ నాగరకతకు చాలా దూరంలో ఉన్నారు. ఎంత దూరం అంటే ఈ నూటయాభై మందిని నాలుగు లారీలలో హైదరాబాదు తీసుకు వచ్చి వదిలితే ఊపిరాడక చచ్చిపోతారు కూడా.

అలా అని వారికి కట్టుబాట్లు, కట్టూ–బొట్టూ లేవని కాదు. చక్కగా వేసిన చుట్టుగుడిసెలో ఇద్దరో, ముగ్గురో ఉంటారు. కేవలం పూసలే వాళ్ళ దుస్తులు. వర్షానికి నేల పండిస్తారు. ఒక చెట్టూ కూలగొట్టరు. దొంగతనాలు, హత్యలకు వీళ్ళ భాషలో మాటలే లేవు. వర్షంలో తడుస్తూ పాటలు పాడుతారు. చలిమంట వేసి తెల్లవార్లూ కథలు చెప్తారు. జంతువులు రాకుండా కేకలు పెడుతుంటారు.

కథ చెప్పటం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వినే వాళ్ళు ఊ కొడుతూ ఊరుకోరు. అనుమానాలుంటే వెంటనే అడిగేస్తారు, కడిగేస్తారు కూడా. విల్లులూ, బాణాలు ఎంత కళాత్మకంగా వుంటాయో, అంత ప్రమాదం కూడా. వయసొచ్చిన ఆడా, మగ పిల్లలను గూడెం బయట పెద్ద రెల్లు పాకలో నాలుగు రోజులు కలిపి ఉంచుతారు. ఐదవ రోజున ఒకటో రెండో జంటలు బయటికొస్తాయి. అంటే అప్పుడు వాళ్ళకు పెళ్ళి చేస్తారన్న మాట. ఆడదానికి చాలా విలువ వుంటుంది.

గింజలు దంచుతారు. విప్పసారా కాయటంలో నిష్ణాతులు. జీకు (జీడికల్లు) వీళ్ళ దినచర్యలో భాగం. మేము గత రెండు సంవత్సరాలుగా వస్తున్నాము కదా, మమ్మల్ని మర్యాదగానే చూస్తున్నారు. వీళ్ళ భాష గురించి తెలుసు కోవాలంటే వీళ్ళ కథలు వినాలి. అందరూ చక్కగా కథ చెప్పగలరు. మాకు చాలా కథలు చెప్పారు. మేము చాలా వ్రాసుకున్నాం. అప్పుడే రెండు నెలలయింది. గూడెం పెద్దలు పనిలేనప్పుడు పండగలు, పబ్బాలు జరిపిస్తుంటారు. ప్రస్తుతం పనులన్నీ అయిపోయాయి కాబట్టి అందరూ ఒక పెద్ద రెల్లుపాకలో కూర్చుని జీకు సేవిస్తున్నారు.

పెద్దాయన మాకు కబురు చేశాడు. మేము వచ్చి ఆయన పక్కనే కూర్చున్నాము. రెండు సొరబూరలు సారా ఇచ్చి తాగమన్నాడు. అది మర్యాద. మేము బూరలు ఖాళీచేశాం. "ఎప్పుడూ ఏదో రాస్తూ కూర్చుంటారు. మీకు చాలా కథలు

చెప్పాం కదా, ఇవాళ మీరు కూడా చెప్పండి" అని ఓ బూర ఖాళీచేశాడు. ఆ గుడిసెలో చాలా కుండలు సారాతోనో, జీకుతోనో ఉన్నాయి. అందరూ తలా కాస్త సేవిస్తూనే ఉన్నారు. మాకు కొద్దిగా భయం వేసింది. వీళ్ళు మాట్లాడటం ఆపేస్తే మా నిఘంటువు గతి ఏమిటి – అబ్బే అదేమీ లేదు అంటూ నసిగాం.

అంతలో కాస్త నిషా ఎక్కిన పెద్దామె "మీ కథలు చెప్పాలి. లేకపోతే మేం చెప్పం" అంది.

నేను గంగాధరం వంక చూసి, సారాతో కొంత తిమ్మిరెక్కింది, బెరుకూ పోయింది, చెప్పవయ్యా అన్నాను. ఆయన అర్థంతరంగా మొదలు పెట్టాడు.

దుష్యంతుడని ఓ రాజున్నాడు. రాజుకు రాజ్యం ఉంటుంది. అందులో ప్రజలుంటారు, కోట ఉంటుంది. పెద్ద పెద్ద మేడలుంటాయి. సైన్యం ఉంటుంది...

కథ చెప్పవయ్యా, సోది కాదు... అన్నారెవరో.

ఆ దుష్యంతుడు అడవికి వేటకు వెళ్ళాడు. అడవిలో కాక ఎక్కడుంటాడు? అన్నాడు ఓ కుర్రాడు.

చెప్పనీరా! అని పెద్దాయన అనటంతో ఆ ప్రమాదం తప్పింది. అలా అడవికి వచ్చి జంతువులను బాణాలతో వేటాడుతూ గుఱ్ఱం మీద వెళుతున్నాడు. ఆయనతో ఇంకా కొంత మంది సైనికులున్నారు.

ఏమిటి? ఆయనొక్కడికే భయమా? అంది ఒక కుర్రది.

రాజుకు ఎప్పుడూ సైనికులుంటారు. అని మళ్ళీ అవకాశమివ్వకుండా, గుఱ్ఱం బాగా దౌడు తీసింది. సైనికులకు దూరంగా వెళ్ళిపోయాడు.

అంతలో అతనికి ఒక గూడెం కనబడింది. (గంగాధరం వాళ్ళ భాషలో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు.) అక్కడ పూలచెట్లూ, పళ్ళ చెట్లూ, నెమళ్ళు, లేళ్ళు అన్నీ ఉన్నాయి.

అడవిలో అవేకదా ఉండేవి అని అడ్డం పడింది ఒకామె. పెద్దాయన ఇంకో బూర ఇచ్చి నువ్వు చెప్పవయ్యా అన్నాడు.

ఆ గూడెంలో ఒక చిన్నది పాట పాడుకుంటూ తిరుగుతోంది. రాజు ఆమెను చూసి, ఇష్టపడి పెళ్ళి చేసుకుంటానన్నాడు.

అదేమిటీ, ఆ అమ్మాయి పేరేం చెప్పావు? ఆ శకుంతల. అదే శకుంతలకు ఇష్టం ఉండదా అంది ఒకామె.

ఉంటుంది, ఉంటుంది, కాని రాజుకదా అడగవచ్చు అని గంగాధరం కంగారు పడ్డాడు. శకుంతలకు అమ్మానాన్న లేరా? అన్నాడు ఇంకో పెద్దాయన. మా వాడి గొంతులో ఎలక్కాయ పడింది. నాన్న ఉన్నాడు. ఇంకో గూడెం వెళ్ళాడు, అని ఆగి, అమ్మ అంటూ నసిగాడు. సరే నువ్వు కథ చెప్పవయ్యా అన్నాడు పెద్దాయన. మేనక విషయం ఎలాగ అని ఆలోచిస్తున్న గంగాధరానికి ఇది పెద్ద ఊరట.

అప్పుడు శకుంతల మా నాన్న రావాలి మీరు రాజులాగా ఉన్నారు. మీ మాట కాదనలేను. కాని ఆయన రావటం చాలా ఆలస్యం అవుతుంది అంది.

అప్పటి వరకు నేను ఆగలేను మనం పెళ్ళి చేసుకుందాం అని ఆమెను ఒప్పించి గాంధర్వవివాహం చేసుకున్నాడు.

అంటే ఓలి ఇవ్వడా? అంది ఒకామె.

కథ చెప్పనీ, అన్నాడు పెద్దాయన.

ఆరోజు, ఆరాత్రి ఆమెతో కాపురం చేసి, మర్నాడు, నేను రాజును, నాకు చాలా పనులుంటాయి. అందరూ నాకోసం చూస్తుంటారు. నేను వెళ్ళాలి అని గుఱ్ఱం మీద బయలు దేరి నీకు రథం పంపుతాను అన్నాడు.

అదేమిటి ఆమెను కూడా గుఱ్ఱం మీద ఎక్కించుకుని తీసుకెళ్ళవచ్చు కదా అంది ఒక పడుచు. అవును తీసుకెవెళ్ళచ్చు. కాని ఆచారాలుంటాయి కదా. వాళ్ళ నాన్నవచ్చి ఆమెకు చీరా, సారె పెట్టి చెలికత్తెలనిచ్చి పంపాలి. ఓహో! అయితే తరువాత రాజు ఓలి కూడా పంపాలికదా! అన్నాడు పెద్దాయన. నువు కథ బాగానే చెప్తున్నావులే అని ప్రోత్సహిస్తూ ఇంకో బూర ఇచ్చాడు.

గంగాధరానికి ధైర్యం వచ్చింది. బూర ఖాళీ చేసి ఏముంది, శకుంతల నాన్న వచ్చాడు. జరిగిందంతా చెప్పింది. ఆయన రాజు పేరు వినే ఉన్నాడు. అంతా ఒకే రాజ్యం కదా. అమ్మా! నువ్వు చాలా అదృష్టవంతురాలివి అన్నాడు.

అవునులే, రాజుకదా ఎక్కువ ఓలి ఇస్తాడని– అన్నాడు ఇంకో పెద్దాయన. వీళ్ళకి ఓలి ఆచారంలో ఉంది మరి. ఆడదంటే అంత విలువ కూడా.

'తరువాత', అన్నారు. అప్పటికే పాకంతా పొగతో నిండి పోతోంది. గంగాధరం 'రాజు రథం పంపలేదు. శకుంతలకు కొడుకు పుట్టాడు'–

అంటే పంటల కాలం అయిపోయిందన్న మాట. ఒక వేళ దుష్యంతుడు పొలం పనుల్లో ఉన్నాడేమో, అని సందేహం వెలిబుచ్చాడు ఓ కుర్రాడు.

రాజులు పొలం పనులు చెయ్యరు అని గంగాధరం నాలుక కరుచు కున్నాడు.

'అయితే ఏం చేస్తారు, అడవిలో తిరుగుతూ ఓలి ఇవ్వకుండా కడుపు చేసి వెళ్ళి పోతారా?' అని ఈసడించింది ఓ పెద్దామె.

అదేం కాదు రాజుకు ఎన్నో పనులు. సభ నడపాలి, న్యాయం చెప్పాలి, యుద్ధం చేయాలి...

'ఎవరితో' అన్నాడు ఓ కుర్రాడు. అరె చెప్పనియ్యరా అంటూ మందలించాడు పెద్దాయన.

ఇక్కడ శకుంతల కొడుకుతో, నాన్నతో అడవిలో ఉండిపోయింది. రెండు పంటకాలాలు గడిచి పోయినాయి. ఒకరోజున శకుంతల నాన్న అమ్మా నువ్వు నీ పెనిమిటి దగ్గరికి వెళ్ళాలి అని, కూతురుని, మనవడిని సాగనంపాడు.

'అయితే రాజు రథం పంపలేదన్నమాట.'

'ఓలి ఎగ్గొట్టినట్టే.'

'అయితే రాజు మంచి వాడేనా?' అన్ని పక్కలనుంచి ప్రశ్నలొచ్చాయి. గంగాధరానికి ఊపిరాడలేదు. పెద్దాయన ఇంతకీ ఆయన్ని చెప్పనిస్తారా? అని కసురుకున్నాడు.

ఆ విధంగా శకుంతల కొడుకుతో రాజు పట్టణానికి వచ్చింది. దుష్యంతుడు సభ తీర్చి ఉన్నాడు. అక్కడికి శకుంతల వచ్చి, రాజా! ఇదుగో నీ కొడుకు అంది.

'నువ్వెవరు' అడిగాడు రాజు.

అంతే పాకలో కలకలం రేగింది. అనుకుంటూనే ఉన్నాం. వాడు మంచివాడు కాదు.

ఓలి ఎగ్గొట్టటానికి తెలీనట్టు అడిగాడు. లేకపోతే కాపురం చేసినదాన్ని తెలీదంటాడా? అని తలా ఒక రకంగా తిడుతున్నారు. గంగాధరం మత్తులో ఆపలేదు.

శకుంతల 'రాజా! నువ్వు అడవిలో నన్ను పెళ్ళి చేసుకున్నావు. మన బిడ్డ ఇదుగో' అని గట్టిగానే అంది.

రాజు 'చూడమ్మా! నీకు అన్యాయం జరిగితే చెప్పు నిన్ను మోసం చేసిన వాణ్ణి దండిస్తాను. సభలో ఈ విధంగా నాతో మాట్లాడకూడదు' అన్నాడు.

అమ్మ రాజు, ఇంత తెగించాడా? అయినా నాకు తెలీకడుగుతాను శకుంతలను ఎందుకు కాదంటున్నాడు రాజు, అని నెమ్మదిగా అడిగాడు పెద్దాయన.

రాజుకి శాపం ఉంది. అన్నాడు గంగాధరం.

శాపం అంటే కట్టుకున్న దాన్ని మర్చిపోమ్మనా అని ఖస్సుమంది ఒక పెద్దామె.

కాదమ్మా! రాజుకి ఒక ముని శాపం పెట్టాడు....

ఆ మునికి పిచ్చా? ఇట్లాంటి శాపం పెట్టవచ్చా?

ఇక తరువాత ఇదిగో గంగా నువ్వు కథ బాగానే చెప్తున్నావు గాని, నువ్వు ఊరెళ్లినప్పుడు ఆ రాజుకు చెప్పు శకుంతలని ఏలుకోమని. లేదా ఇక్కడికి లాక్కొచ్చి...

అసలు న్యాయం, నీతి అడవిలో ఉన్నట్లు చెప్పాడు. ఇదిగో ఈ బూర తీసుకో అన్నాడు.

ఇంక కథ ముందుకు సాగలేదు.

గంగాధరం వెళ్ళి గుడిసెలో పడుకున్నాడు!

* * *

ఇక నేను మిగాలాను. "నువ్వు కథ చెప్పవయ్యా! నువ్వు కథ చెబుతున్నప్పుడు ఎవరూ అడ్డుతగలరులే", అంటూ వృద్ధుడు నాకు హామీ ఇచ్చాడు.

"అయితే అర్థం కాని విషయాలు మాత్రం అడగక తప్పదు గద. మేం చెబుతున్నప్పుడు నువ్వు కూడా అడుగుతావా లేదా, అలాగ."

కాస్త మత్తెక్కితే భయం తగ్గి, ధైర్యం వస్తుంది. మరింత సారా తాగాను. వాళ్ళంతా మట్టి పైపులతో పొగ పీలుస్తూ కళ్ళు మూసుకున్నారు.

ఇక్కడకు వచ్చిన దగ్గర్నుంచి 'హామ్లెట్' చదువుతున్నాను. అడవిలో ఆ నాటకం చదవటం కొత్త అనుభవం. ఎలాగూ తప్పదని కథ మొదలు పెట్టాను.

"ఇది నిన్న మొన్న జరిగిన కథ కాదు. చాలా కాలం క్రితం, ఒక తెగనాయకుడి (రాజు) యింటి బయట అర్థరాత్రి ముగ్గురు కాపలా వాళ్ళు గస్తీ తిరుగుతున్నప్పుడు, మాజీ రాజు వాళ్ళకనిపించాడు."

"అతను మాజీ ఎందుకయ్యాడు?"

"చచ్చిపోయాడు అందువల్లే అతణ్ణి చూసి వాళ్ళు భయపడ్డారు."



షేక్స్‌పియర్

"అతడు రాజు కాదులే. చచ్చిన వాళ్ళు తమ గురించిన శకునాలు, సంకేతాలు పంపుతారు. సర్లే చెప్పు."

"ఆ ముగ్గుర్లో, ఒకడికి అనేక విషయాలు తెలుసు."

పండితుడంటే వీళ్లకు అర్థం కాదుమరి.

"ఎందుకిలా తిరుగుతున్నావు? నువ్వు ప్రశాంతంగా సమాధిలో విశ్రాంతి తీసుకోవాలంటే మేమేం చెయ్యాలి?" అని అడిగాడొకడు.

"ఆ రాజు మాట్లాడకుండా అంతర్థానమయ్యాడు. అనేక విషయాలు తెలిసిన మనిషని చెప్పానే, అతడి పేరు హెూరేషియో, మరణించిన రాజుకో కొడుకున్నాడు. అతడి పేరు హేమ్లెట్" శ్రోతలు విస్మయంగా చూశారు.

"మరణించిన రాజుకు అన్నదమ్ములున్నారా? రాజు కొడుకు రాజయ్యాడా లేదా?" ఇవీ వాళ్ళ సందేహాలు.

"రాజుకో తమ్ముడున్నాడు. అన్న మరణం తర్వాత అతడే రాజయ్యాడు"

వృద్ధులు పెదవి విరిచారు. కొన్ని శకునాలు రాజులకు మాత్రమే కనిపిస్తాయి. పిల్లలు వీటి గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించగూడదు.

హెూరేషియాకు అన్నీ తెలుసునని చెప్పటం నా మూర్ఖత్వం. వాళ్ళ ప్రకారం అతడు అజ్ఞాని.

"రాజు తమ్ముడు నెల తిరక్కుండానే తన వదిన (రాజు భార్య) ను పెళ్ళి కూడా చేసుకున్నాడు."

"సరైనపనే" అన్నట్టుగా అందరూ తలలూపారు.

"నేను చెప్పలేదూ వాళ్లకూ మనకూ చాలా పోలికలు వున్నాయి. మన తెగల్లో కూడా అన్న మరణిస్తే తమ్ముడు వదినను పెళ్ళాడతాడు. ఇంతకూ రాజూ, రాజు తమ్ముడూ ఒకే తల్లి పిల్లలా కాదా?" అంటూ ప్రశ్నించాడో వృద్ధుడు.

నాకు బుర్ర తిరిగిపోయింది. నేను చెప్పదలచుకున్న కథేమిటి? వాళ్ళు చర్చిస్తున్నదేమిటి? హేమ్లెట్ గురించి మాట్లాడవలసిన విషయాలివా? "బహుశా యిద్దరి తల్లీ ఒక్కతే కావచ్చు" అన్నాను. షేక్స్‌పియర్ ఆ సంగతి రాయలేదు మరి.

వృద్ధుడు చిర్రుబుర్రు లాడాడు. "ఇది చాలా ముఖ్య మయిన విషయం'' అన్నాడు. 'మనిషి చరిత్ర' అంటే వారసత్వమే. "బహుశా" అటే సరిపోదు నిర్ధారించుకుని తనకే సంగతి తెలియచెప్పమన్నాడు.

"తల్లి మరిదిని చేసుకున్నందుకు హేమ్లెట్ చాలా విచారంగా వున్నాడు. భర్త మరణిస్తే రెండేళ్ళ దాకా ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదు. ఇది, అక్కడి ఆచారం." అన్నాను.

"రెండేళ్ళదాకా ఎవరాగుతారు?" అంటూ అడ్డుపడింది ఒక స్త్రీ "భర్త పొలం దున్నుతాడు గదా. పొలం పనులకు అతడి స్థానంలో మరో మనిషి కావద్దూ?"

"హేమ్లెట్ పెద్దవాడే. అతడు పొలం దున్నగలడు. తను తప్పేమీ చెయ్యలేదని తల్లి హేమ్లెట్‌కు నచ్చజెప్పటానికి ప్రయత్నించింది. పైగా యిప్పుడున్న రాజు వారసుడు అతడే. హేమ్లెట్ కూడా ఆ సూచనకు అంగీకరించాడు."

నాటకంలో ప్రధాన ఆకర్షణ హేమ్లెట్ స్వగతం. స్వగతం అనేది వుంటుందని వాళ్ళు అంగీకరిస్తారా?

"రాజుకున్న యితర భార్యల్ని ఎవరు పెళ్ళి చేసుకున్నారు?" అంటూ అడిగాడొకడు.

"అతడికొక్కతే భార్య".

"లేదు రాజుకు చాలా మంది భార్యలుంటారు. వాళ్ళకు వచ్చేపోయేవాళ్లెక్కువ గదా, అనేకమంది భార్యలు లేకపోతే వచ్చిన వాళ్ళందరికీ వండిపెట్టడం, సారా తయారు చెయ్యటం ఎట్లా."

"ఆ దేశంలో రాజుకు ఒకే భార్య ఉంటుంది. ఇంటి పనులు చెయ్యటానికి సేవకులుంటారు. రాజు తను సేకరించిన పన్నుల్లో నుండే సేవకులకు జీతాలిస్తాడు." అన్నాను కాస్త విసుగ్గా.

'భార్యల్ని నమ్మవచ్చు. సేవకుల్ని నమ్మలేం. వంటా, వార్పూ సరే. పొలం పనులు కూడా సేవకులు చేస్తారా? పైగా ప్రజల మీద పన్నులు వేసే రాజుకన్న, ఎక్కువ మంది భార్యల్ని చేసుకున్న రాజు మంచివాడు' అన్నారు.

పన్నులను నేను మాత్రమెలా సమర్థించగలను? కథ ముందుకు నడవాలి.

"స్వగతం" వీళ్లకు అర్థం కాదు. రాజు, హామ్లెట్‌కు విషప్రయోగ ప్రయత్నం చెప్పాలిగదా, తరువాత కొడుకు, తండ్రిని చంపటం వీళ్లు అంగీకరిస్తారా?

"ఆ రాత్రి హామ్లెట్ ఒంటరిగా వున్నప్పుడు తండ్రి శకునం వచ్చి అతడితో మాట్లాడింది."

"శకునాలు మాట్లాడవు" అంటూ తీర్మానించాడో వృద్ధుడు.

"హామ్లెట్ తండ్రి శకునం కాదు. చచ్చిన వాళ్ళను మేం ప్రేతాలంటాం. అది అతడి తండ్రి ప్రేతం."

వాళ్ళకస్సలు అర్థం కాలేదు. మరణం తర్వాత మనుషులు ప్రేతాలుగా మారతారని వాళ్ళు నమ్మరు.

"ప్రేతం అంటే ఏమిటి?"

"మరణించిన వ్యక్తి! వాళ్ళు మాట్లాడతారు. నడుస్తారు. కాని మనం వాళ్లను ముట్టుకోలేం."

వాళ్ళ తెగలో మంత్రగాళ్ళు శవాలకు జీవం పోస్తారు. వాటిని జోంబి అంటారు. ఇప్పుడు ఎక్కువగా టి.వి. చూసేవాళ్లను జోంబి అంటున్నాం.

"కాని జోంబిని ముట్టుకోవచ్చు గదా!"

"హామ్లెట్ తండ్రి జోంబి కాదు. అతడు మరణించాడు"

"మరణించిన వాళ్ళు నడవలేరు."

"సరే అది ప్రేతం కాదు. మనిషి నీడ అనుకోండి" సర్దుకు పోవాలి మరి.

కాని వాళ్ళు వదలరే.

"శవాలకు నీడలు కూడా వుండవు."

నన్నో తెలివితక్కువ దద్దమ్మ కింద జమకట్టారందరూ. వాళ్ళకు తెలిసిన చిన్న విషయాలు కూడా నాకు తెలియవు మరి. అతిథిని అవమానించకూడదని, "ఆ దేశంలో శవాలు కూడా నడుస్తాయోమోలే కథ చెప్పు" అన్నారు మర్యాద పూర్వకంగా.

"తన తమ్ముడే తనకు విషమిచ్చి చంపాడని చెప్పాడు హామ్లెట్ తండ్రి. కొడుకును అందుకు ప్రతీకారం తీర్చుకోమన్నాడు. ఆ యింట్లో మరణించిన రాజుగారి నమ్మిన బంటు ఒకడున్నాడు. అతడి పేరు పోలోనియస్. హామ్లెట్ అతగాడి కూతుర్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. అయితే ఆమె ఒంటరిగా పొలంలో వున్నప్పుడు (వాళ్ళ భాషలో కథ చెప్పటానికి ప్రయత్నించాను.) కలవటానికి ప్రయత్నించ వద్దని పోలోనియస్, అతడి కొడుకూ హామ్లెట్‌ను హెచ్చరించారు. ఎందుకంటే తెగనాయకుడు, ఇంటి సేవకురాల్ని వివాహమాడకూడదు."

"అదేం పద్ధతి?" అంటూ అడ్డుపడిందో స్త్రీ. నిజమే వాళ్ళకది నిషిద్ధం కాదు. బంధువుల మధ్య వివాహాలు సర్వసాధారణం.

"పోలోనియస్ మరో తెగకు చెందిన మనిషి. హామ్లెట్ బంధువు కాదు."

"మరి హామ్లెట్ ఆమెనెలా పెళ్ళి చేసికొంటానన్నాడు?"

"చేసుకునే వాడేమో. హామ్లెట్ తెగనాయకుడి కొడుకు గనక మరో నాయకుడి కూతుర్నే చేసుకోవాలని పోలోనియస్ అభిప్రాయం కావచ్చు, లేదా హామ్లెట్ ఆమెను ప్రేమించి, మరో స్త్రీని చేసుకుంటే ఆమెకు ఓలి తగ్గుతుంది."

"అవును గదూ! కాని అలాంటి పరిస్థితి వస్తే, హామ్లెట్ తన (మాజీ) ప్రేమికురాలికి ఘనంగా కట్న కానుకలు యిస్తాడుగదా. ఏమోలే మీ వన్నీ వింత పద్ధతులు. పోలోనియస్ వట్టి మూర్ఖుడిలా వున్నాడు."

తర్వాత హామ్లెట్ ఉన్మాద స్థితిలో వుంటాడు. అతడెందుకలా మారిపోయాడో ఎవరికీ అంతుపట్టదు. తన కూతుర్ని చూడకూడదన్నందుకే పిచ్చెక్కిందనుకుంటాడు పోలోనియస్. ఈ విషయం రాజు నమ్మడు."

"అతని మీద ఎవరో చేతబడి చేసుంటారు."

"ఎందుకా అనుమానం వచ్చింది?" అన్నాను.

"అవును చేతబడి వల్ల మాత్రమే ఎవరికైనా పిచ్చెక్కుతుంది. లేదా అతడు అడవి దయ్యాలను చూసి వుండాలి."

కథ చెప్పటం ఆపాను. వాళ్ళ ప్రకారం పిచ్చికి కారణాలు రెండు. నాకూ, హామ్లెట్‌లో కొత్త కోణం కనిపిస్తున్నది.

కథ మళ్ళీ కొనసాగించాను.

"హామ్లెట్ మిత్రులు ఒక కథ చెప్పే వాణ్ణి తీసుకొచ్చారు. తమ్ముడి విషప్రయోగంతో మరణించిన అన్న గురించిన కథ అల్లమని అతణ్ణి అడుగుతాడు హామ్లెట్. ఒక వేళ విషప్రయోగం నిజమైతే ఈ కథ విన్న రాజు ముఖ కవళికలు మారిపోతాయి. అందువలన అతడికి తండ్రి (ప్రేతం) చెప్పింది నిజమో కాదో తెలుస్తుంది."

వృద్ధుడు మరో ప్రశ్న వేశాడు.

"తండ్రి కొడుకుతో అబద్ధమెందుకు చెబుతాడసలు?"

"కనిపించింది తండ్రో కాదో హామ్లెట్‌కు తెలియదు కదా?" అన్నాను.

వాళ్ళను నమ్మించేటట్టు కథ చెప్పటం అసాధ్యమని నాకు అర్థమయింది.

"అవునవును. శకునం అన్నావు గదూ. చచ్చిన వాళ్ళు కొన్నిసార్లు తప్పుడు శకునాలు కూడా పంపిస్తారు. శకునాలను చదవగలిగిన మంత్రగాడి దగ్గర హామ్లెట్ ఈ విషయం తేల్చుకొంటే సమస్య తీరిపోయేది. ఒక వేళ తమ్ముడు విషమిచ్చి వుంటే తెగపెద్దలు అతణ్ణి దండించే వాళ్ళు. ఇంతకూ శకునం నిజమా, కాదా?"

"నిజమే. కథచెప్పేవాడు ఈ విషయం ప్రస్తావించి నప్పుడు రాజుకు కోపం వచ్చింది. భయపడ్డాడు కూడాను. హామ్లెట్‌కు రహస్యం తెలిసిపోయిందని అతడు గ్రహించాడు."

ఆ తరువాత కథ చెప్పటం కష్టమే. అయినా ప్రయత్నించాను.

"హామ్లెట్ ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో తెలుసుకొమ్మని రాజు తన భార్యను ఆదేశించాడు. అయితే తల్లికి, భర్త కన్నా, కొడుకు ముఖ్యం. ఆ విషయం తెలిసిన రాజు పోలోనియస్‌ను ఒక పరదా వెనక దాగి తల్లీకొడుకుల సంభాషణ వినమన్నాడు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నందుకు తల్లిని నానామాటలూ తిట్టాడు హామ్లెట్.

ఇది అసంభవమన్నట్టు చూశారు శ్రోతలు. **కొడుకు, తల్లిని తిట్టడమా? అని ఆశ్చర్యపోయారు.**

"తిట్లు భరించలేక తల్లి అరిచింది. తెర వెనుక పోలోనియస్ కదిలాడు. 'ఎలుక, ఎలుక', అంటూ హామ్లెట్ కత్తితో అక్కడ పొడుస్తాడు. పోలోనియస్ మరణిస్తాడు.

ఎలుకను కత్తితో పొడుస్తారా? వాళ్ళకిదేమీ నమ్మశక్యంగా కనిపించలేదు.

"ఆ పోలోనియస్ వట్టి మూర్ఖుడిలా వున్నాడు. దాక్కోవటమెందుకూ? పైగా ఇక్కడ దాగింది నేనే అని పోలోనియస్ అరిస్తే పోతుందిగా."

అయితే, పోలోనియస్ పరువు కాపాడాల్సిన బాధ్యత నా మీదుంది. "పోలోనియస్ అరిచాడులే. హామ్లెట్‌కు అది రాజుగారి గొంతులా విన్పించింది. ఎట్లాగూ ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు కాదా. అందుకని పొడిచాడు."

"తల్లిని చేసుకున్నవాడే అతడి తండ్రి. తండ్రిని చంపటం మహానేరం." అన్నారు.

"తండ్రిని చంపిన వాణ్ణే హామ్లెట్ చంపాలనుకున్నాడు" అని హామ్లెట్‌ను సమర్థించబోయాను.

వృద్ధుడికి నేనంటే ఏవగింపు కలిగింది. నన్ను పట్టించుకోకుండా ఎదురుగా కూర్చున్న కుర్రవాళ్లను సంబోధిస్తూ "మీ తండ్రిని అతడి సోదరుడు చంపితే, తెగలోని పెద్దలకు ఫిర్యాదు చెయ్యాలి. వాళ్ళే అతడికి తగిన శిక్ష విధిస్తారు. అంతే గాని, బలముందిగదాని పెద్దలమీద పిల్లలు తమ పరాక్రమం చూపకూడదు" అంటూ హితబోధ చేశాడు. మొత్తం మీద హామ్లెట్ కథ వాళ్ళకు నచ్చినట్టే వుంది. కాని నేను చెప్పిందొకటి. వాళ్ళు అర్థం చేసుకున్నదొకటి.

"పోలోనియస్‌ను చంపినందుకు రాజుకు హామ్లెట్ మీద కోపం రాలేదు. అతడికి పిచ్చి ముదిరిందని నిరూపించటానికి మంచి కారణం దొరికింది. ఈ మిష మీద అతణ్ణి మరో దేశం పంపి, అక్కడే హత్య చెయ్యాలని ప్రయత్నిస్తాడు."

చంపుకోవటాన్ని గురించి నాగరీకులు యిన్ని ఎత్తులు, పై ఎత్తులు వేస్తారని వాళ్ళ వూహకు కూడ తట్టలేదు. విసుగ్గా చూశారు.

ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాడు లార్టెస్. తన ప్రేమికుడు హామ్లెట్టే తన తండ్రి హంతకుడని తెలిసి, ఆఫేలియా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది."

"బుద్ధుందా?" అంటూ చిరాకుపడ్డారు శ్రోతలు. "హామ్లెట్‌కు పిచ్చెక్కిందని చెప్పావుగా. పిచ్చివాడి మీద ఎవరన్నా ప్రతీకారం తీర్చుకుంటారా? ఇది చాలా అసహజంగా వుంది. ఇక ఆ పిల్ల నీళ్ళలో మునిగి మరణించిందన్నావు. నీళ్ళు

ఎవరికీ అపకారం చెయ్యవు. మనం తాగటానికీ, స్నానం చెయ్యటానికే వున్నాయవి. బహుశా ఆమెకు దయ్యం పట్టి అలా చేయించి వుంటుంది."

నాకూ కోపం వచ్చింది.

"మీకు కథ నచ్చక పోతే మానేస్తాను" అన్నాను. నన్ను శాంతింప చెయ్యటానికి వృద్ధుడు మరి కాస్త సారా అందించాడు.

''నువ్వు బాగానే చెబుతున్నావులే. కాని కథ అంతరార్థమేమిటో మీ పెద్దలు నీకు చెప్పినట్లు లేదు. మీ ఆచారాలు, ఆయుధాలు మా వాటి లాగ లేవంటే అర్థముంది. **కాని మనుషుల్లో తేడా వుండదయ్యా బాబూ. అందరూ ఒక్కటే! వాళ్ళ ఇష్టాలు, ఏడుపులు ఒకరకంగానే ఉంటాయి.**

రాజు స్వయంగా హామ్లెట్‌ను చంపాలనుకున్నాడని మాకు తెలుసు. ఆఫేలియా బంధువు లెవరన్నావు?"

"ఆమె తండ్రి, అన్నయ్య."

"ఇంకా వుండే వుంటారు. అక్కడికి వెళ్ళాక అడిగి తెలుసుకో. నువ్వు చెప్పిందాన్ని బట్టి మాకేం తెలిసిందంటే పోలోనియస్ మరణించాడు కనుక, ఆఫేలియాను హామ్లెట్




చేసుకోవటం ఇష్టం లేక ఆమెను లార్టెస్ చంపుంటాడని."

సారా కుండ ఖాళీ అయింది అందరికీ మత్తెక్కినట్టుంది.

కథలో వ్యక్తుల ప్రవర్తనకు కారణాలు వెదికారు వృద్ధులు.

"నా వుద్దేశంలో" అంటూ ప్రారంభించాడొకడు.

"పోలోనియస్ కొడుకు ఆ దేశం వెళ్ళినపుడు జూదంలో బాగా డబ్బు పోగొట్టుకుని వుంటాడు. చెల్లెలి శరీరాన్ని దయ్యాలకమ్మితే ఎంతో కొంత డబ్బు రాకపోదని తెలిసి చూసి వుంటాడు." అని తీర్మానించారు.

చివరి ప్రయత్నంగా మరోసారి అడ్డు తగిలాను.

"సమాధిలో ఆమె శరీరం దొరికింది. లార్టెస్ ఏడుస్తూ అందులోకి దూకుతాడు. హామ్లెట్ కూడా సమాధిలోకి దూకుతాడు."

"నేను చెప్పిందీ ఆదే. ఆ పిల్ల శరీరం అమ్ముకుంటే లార్టెస్‌కు డబ్బు వస్తుంది. అతడు డబ్బు సంపాదించకుండా అడ్డుపడటానికే హామ్లెట్ ఆ పని చేశాడు."

"ఇద్దరి మధ్యా కత్తి యుద్ధం కూడా జరుగుతుంది. లార్టెస్ గాయాలతోనే మరణిస్తాడు.

హామ్లెట్‌ని చంపేందుకు పానీయంలో విషం కలుపుతాడు రాజు. రాణి ఆ పానీయం తాగుతుంది. ఒక వేళ యుద్ధంలో హామ్లెట్ గెలిస్తే అతణ్ణి యిలాగైనా చంపాలని రాజు వ్యూహం. తల్లి మరణం తర్వాత, ఆ కోపంలో హామ్లెట్ తన ఖడ్గంతో రాజును చంపుతాడు."

వృద్ధుడు నవ్వి, "చెప్పలేదూ! సరిగ్గా మేము అనుకున్నట్టే జరిగింది. అక్కడక్కడా తప్పు చెప్పావు గానీ, కథ బాగానే వుందిలే, యుద్ధంలో హామ్లెట్ గెలిస్తే విషమివ్వాలనుకున్నాడు రాజు. ఒకవేళ లార్టెస్ గెలిస్తే రాజు అతడికీ విషమిచ్చేవాడే. అలా చేస్తే హామ్లెట్‌ను చంపటానికి అతడు వేసిన వ్యూహం ఎవరికీ తెలియదు. అవునా శభాష్. నీలో కథ చెప్పే నేర్పుంది.

"మీరు కథలు తెలుసుకోండి. మేం వాటి లోతుపాతులు విడమర్చి చెబుతాం. తిరిగి వెళ్ళి ఈ విషయాలన్నీ మీ వాళ్ళకు చెప్పు.

అడవుల్లో మాత్రమే నిజమైన జ్ఞానం సంపాదించ వచ్చునని అందరికీ తెలుస్తుంది." అంటూ ఖాళీ కుండ వైపు చూశాడు పెద్దాయన!!

**(ఎ.కె., ము.పా.సా)**



# అభ్యుదయ సూత్రాలు

# గూడవల్లి రామబ్రహ్మం చిత్రాలు

**1931**లో మద్రాసు వచ్చి *సమదర్శిని* పత్రికలో సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా చేశారు. ఆ సమయంలోనే వేల్ పిక్చర్స్ నిర్మించిన *సీతా కల్యాణం, కృష్ణ లీలలు, శశిరేఖా పరిణయం* మొదలైన చిత్రాలకు పబ్లిసిటీలో సలహాలు ఇవ్వడంతో గూడవల్లికి సినిమా రంగంతో సాన్నిహిత్యం ఏర్పడింది. సినిమా రంగంతో సాన్నిహిత్యం ఏర్పడింది.

జాతిని మేల్కొలిపే చిత్రాలు తీయాలనే కాంక్ష అప్పుడే ఆయనకు కలిగింది. అందుకే *ఆంధ్ర స్టూడియోస్ ఫిల్ము కంపెనీ* సంస్థను ఏర్పాటు చేశారు. అయితే సరస్వతీ టాకీస్ వారి అభ్యర్థన మేరకు గూడవల్లి రామబ్రహ్మానికి ఆ సంస్థ నిర్వహణ బాధ్యతను స్వీకరించాల్సి వచ్చింది. సరస్వతీ టాకీస్ వారు కొల్హాపూర్‌లో నిర్మించిన *ద్రౌపదీ వస్త్రాపహరణము* చిత్రానికి ప్రొడక్షన్ కంట్రోలర్‌గా వ్యవహరించారు. తర్వాత *కనకతార* చిత్రానికి పనిచేశారు.

1937 డిసెంబరులో తన మిత్ర బృందంతో కలిసి *సారథి ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్* ఏర్పాటు చేసి సొంతంగా చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. ఈ సంస్థకు ఛైర్మన్ చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామ కృష్ణప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గూడవల్లి రామబ్రహ్మం కాగా, తుమ్మల సీతారామ బ్రహ్మం, లింగం, సత్యనారాయణ తదితరులు ఇతర డైరెక్టర్లు. మద్రాసులోని రాయపేటలో ప్రజామిత్ర కార్యాలయానికి దగ్గరగా ఒక భవంతిని తీసుకుని (ప్రస్తుతం అన్నా డి.ఎం.కె. పార్టీ కార్యాలయం ఉన్న చోటు) సారథీ ఆఫీసు ఏర్పాటు చేశారు. చాలా కథలు పరిశీలించారు. ప్రతీది ఒకరికి నచ్చితే మరొకరికి నచ్చేది కాదు. చివరకు గుడిపాటి వెంకటాచలం రాసిన అముద్రిత నవల *మాలపిల్ల* ఆధారంగా సినిమా చేయాలని ఏకగ్రీవంగా నిశ్చయించారు. పాత్రికేయ వృత్తిలో తనకు గురువైన తాపీ ధర్మారావు నాయుడితో స్క్రిప్టుకు బాగా మెరుగులు దిద్దించారు. నవలలో చలం రాసిన కొన్ని సంభాషణలను యథాతథంగా వాడుకున్నారు. సంగీత దర్శకునిగా భీమవరపు నరసింహారావును తీసుకున్నారు. 17 పాటలు, 5 పద్యాలు సిద్ధం చేశారు. అప్పటికే ప్రాచుర్యం పొందిన బసవరాజు అప్పారావు విరచిత *కొల్లాయి గట్టితేనేమి..., నల్లవాడే గొల్లపిల్లవాడే..., ఆ మబ్బు ఈ మబ్బు...* గీతాలు తీసుకున్నారు. జయదేవుని అష్టపది *సావిరహే తవదీనా...* ను కూడా ఉపయోగించుకున్నారు. మిగతా పాటలను, పద్యాలను తాపీ ధర్మారావు రాశారు. అప్పట్లో ఏ సినిమాకైనా పాటలూ, మాటలూ, పద్యాలూ అన్నింటికీ ఒక్కరే రచయిత. *మాలపిల్ల* తోనే ఇద్దరు, ముగ్గురు రచయితలు పనిచేయడం ఆరంభమైందని చెబుతారు.

అప్పట్లో సినిమా పాటలు స్టేజి నాటకాల ధోరణిలోనే ఉండేవి. భీమవరపు నరసింహారావు లలిత సంగీత ఫక్కీలో బాణీలు చేశారు. అలాగే అంతవరకూ రాగమయంగానూ, లలిత సంగీతంతోనూ, శాస్త్రీయ సంగీతంతోనూ ఉండే సినిమా పాటల్లో జానపదరీతుల్ని ప్రవేశపెట్టి తెలుగు సినిమా సంగీతాన్ని ఓ మలుపు తిప్పారాయన.

భీమరవరపు నరసింహారావు ఈ చిత్రానికి సంగీత దర్శకుని బాధ్యతలతో పాటు ప్రొడక్షన్ వ్యవహారాలు కూడా చూశారు. కథలో కీలకమైన సుందరరామశాస్త్రి పాత్రకు తెనాలిలో డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూ రంగస్థలం మీద పేర్గాంచిన డాక్టర్ గోవింద రాజుల సుబ్బారావును ఎంపిక చేశారు. మీసాలు తీసేసి గుండుచే యించు కోమన్నారని ఆ పాత్ర వేయడానికి ఒప్పుకోలేదాయన. రామబ్రహ్మం,

గూడవల్లి రామబ్రహ్మం (1898-1946) తెలుగు ప్రజల సంస్కృతీ వికాసానికి, అభ్యుదయ మార్గానికి తోడ్పడిన మహనీయుల్లో ముఖ్యులు.



కాంచనమాల

మరికొంతమంది పెద్దలు ఈ పాత్ర గురించి చెప్పి బలవంతంగా ఒప్పిస్తే తన తల్లి దగ్గర అనుమతి తీసుకుని, కేశఖండనానికి ఒప్పుకున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు గాలి పెంచల నరసింహారావు తమ్ముడైన వెంకటేశ్వర రావును నాగరాజు పాత్రకు తీసు కున్నారు. నాయిక శంపాలతగా కాంచన మాలను తీసుకున్నారు. అంతకు ముందు ఆమె *శ్రీకృష్ణ తులాభారం* (1935), *వీరాభిమన్యు* (1936). *విప్రనారాయణ* (1937) *గృహలక్ష్మి* (1938) చిత్రాలు చేశారు. గ్లామర్ పాత్రలు వేస్తున్న కాంచనమాలను *మాలపిల్ల*గా ప్రేక్షకులు అంగీకరిస్తారో లేదోనన్న సందేహంతో ఒక దశలో పుష్పవల్లి పేరుని పరిశీలించారు. చివరకు కాంచనమాలతో పాత్ర చేయించారు.

వేల్ పిక్చర్స్, సరస్వతీ టాకీస్ వారికి రామబ్రహ్మం ప్రొడక్షన్ వ్యవహారాలు చూసే రోజుల్లో ఒకసారి వేషం కోసం కాంచనమాల ఆయన దగ్గరకు వెళితే తీసుకోలేదు. ఆ విషయమే *మాలపిల్ల* మొదటి రోజు షూటింగ్‌లో గుర్తుచేస్తే "ఏదో పొరపాటున అని ఉంటానులే. అప్పుడేమో చిన్నదానివి. ఇప్పుడు అందంగా తయారయ్యావు కదా" అంటూ నవ్వేశారు. అనేక చిత్రాల్లో నటించిన పువ్వుల సూరిబాబును చౌదరి పాత్రకు ఎంపిక చేశారు. కళాకారులందరికీ సారథి ఆఫీసులోనే బస ఏర్పాటు చేశారు. 1938 మే 1న మద్రాసులోని మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ కంబైన్స్ స్టూడియోలో 'మాలపిల్ల' షూటింగ్ మొదలైంది. జూన్ 15 నాటికి చిత్రీకరణ పూర్తయింది. 40 కాల్షీట్లతో చిత్ర నిర్మాణం పూర్తయింది. జూలైలో బొంబాయిలో రీ-రికార్డింగ్ చేశారు. ఆగస్టులో ఫస్ట్ కాపీ వచ్చింది. అప్పట్లో చిత్ర నిర్మాణానికి లక్ష రూపాయలు ఖర్చయ్యేది. కానీ రామబ్రహ్మం క్వాలిటీ విషయంలో ఏమాత్రం రాజీపడలేక పోవడంతో ఓ పది వేలు అదనంగా ఖర్చయింది.

సినిమా విడుదలకు చాలా ముందుగానే సెప్టెంబరు 15న మద్రాసు లోని మినర్వా థియేటర్‌లో 'ప్రెస్ షో' వేశారు. రామబ్రహ్మం ధైర్యానికి అందరూ విస్తుపోయారు. ఈ చిత్రాన్ని దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుకు అంకితమిచ్చారు. పంతులుగారంటే రామబ్రహ్మానికి ఎనలేని గౌరవం, అందుకే ఆయన మరణించాక అంతిమ యాత్రను 'కడపటి యాత్ర' పేరుతో చిత్రీకరించి, 'మాలపిల్ల' చిత్రంతో కలిపి విడుదల చేశారు. *మాలపిల్ల* చిత్రం ఒకేసారి 12 కేంద్రాలలో విజయదశమి కానుకగా 25 సెప్టెంబరు 1938న విడుదలైంది. ఇన్ని కేంద్రాలలో ఒక సినిమా విడుదల కావడం కూడా అప్పట్లో రికార్డ్.

*మాలపిల్ల* ఒక్క తెలుగు జిల్లాలోనే గాక, దక్షిణాదినున్న అన్ని భాషా ప్రాంతాల్లోనూ ఘనవిజయం సాధించింది. అలాగే ఇతర నిర్మాతల దృష్టిని సాంఘిక చిత్రాలవైపు మళ్ళించింది. తెలుగులో తొలి సాంఘిక చిత్రమైన *ప్రేమ విజయం*, తరువాత వచ్చిన సాంఘికం ఇది. ఇందులో అంటరానితనం, హరిజనులకి దేవాలయ ప్రవేశం లేకపోవడం మీద కథ అల్లినా, ఇంకోవైపు గాంధేయ సిద్ధాంతాల్నీ జాతీయవాదాన్నీ స్పృశించారు. 1931లో *భక్తప్రహ్లాద* తో ప్రారంభమైన తెలుగు సినిమారంగంలో *మాలపిల్ల* 50వ చిత్రం కావడం గమనార్హం. ఈ చిత్రాన్ని నిషేధించాలని చాలా మంది సనాతనులు విపరీతంగా ప్రయత్నించినా, జాతీయ వాదులు కూడదని పట్టు బట్టారు. బెజవాడలోని సనాతన వాదులంతా *మాలపిల్ల* చిత్రాన్ని చూడకూడదని సభ ఏర్పాటు చేసి తీర్మానం చేశారు. ఇది తెలిసి "శ్రోత్రీయ బ్రాహ్మణులందరికీ *మాలపిల్ల* సినిమా చూడటానికి ఉచిత పాసులు ఇవ్వబడును" అని కరపత్రాలు వేయించి పంచారు రామబ్రహ్మం. కొందరు ఛాందస బ్రాహ్మణులైతే సినిమా చూసిన తర్వాత ఇళ్ళకు వెళ్ళి ప్రాయశ్చిత్తంగా స్నానాలు చేసేవారని ప్రచారం జరిగింది.



భారతదేశంలో ప్రప్రథమంగా హరిజనులకు తమ సంస్థానంలో ఉన్న దేవాలయ ద్వారాలను తెరచిన తిరువాన్కూరు మహారాజాను రామబ్రహ్మం ఈ చిత్రంలో అభినందించారు.

*మాలపిల్ల* చిత్రకథలో **భూసంస్కరణ, సామాజిక సమానత్వం, భూస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటు మాత్రమేగాక, అంటరానితనం నిర్మూలన గురించి కూడా వివరంగా ఉంది.** ఆనాటి ప్రేక్షకులు ఈ చిత్రాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానించి, నూతన శకానికి నాంది పలికారు. అస్పృశ్యత మీదా, సనాతన ఛాందసాల మీదా, వర్ణవిభేదాల మీదా *మాలపిల్ల* లో విరుచుకు పడ్డారాయన. మాలలు మాత్రము మనుషులు కారా? అంటూ ప్రబోధించి, హరిజనోద్ధరణ, హరిజనులకు దేవాలయ ప్రవేశాలు సాగించాలని ఉద్బోధించారు.

**అప్పటిదాకా గ్రాంథికభాషలో సాగిన సినిమా రచన *మాలపిల్ల* తో వ్యావహారిక భాషతో కొనసాగి కొత్త మలుపునకు దారి తీసింది.**

అప్పటి తెలుగు సినిమాల్లో బ్రాహ్మణ పాత్రలు రుషిపుంగవులుగానో, విదూషకులుగానో ఉండేవి. కానీ ఇందులో 'సుందరరామశాస్త్రి' పాత్ర సనాతనవాదిగా, సాంఘిక పురోగమనానికి అడ్డంకిగా నిలబడే ఛాందసుడిలాగా వుంటుంది. ఈ పాత్రలో నూటికి నూరు మార్కులు సంపాదించుకున్నారు గోవిందరాజుల సుబ్బారావు.

అలాగే *మాలపిల్ల*గా కాంచనమాల సహజమైన అభినయాన్ని కనబరచారు. తెలుగు తెరపై తొలి గ్లామర్ తారగా కాంచనమాలనే చెప్పుకోవాలి. ఇందులో ఆమె మొదట పల్లెటూరి పిల్లలా ఉన్నా, తర్వాత ఒక బ్రహ్మాణ యువకుణ్ణి వివాహం చేసుకుని కలకత్తా పారిపోయి మోడరన్‌గా తయారౌతుంది. స్లీవ్‌లెస్ జాకెట్టు, భుజం మీద వాలుజడ, చెవులకి రింగులు, పెద్ద కళ్ళతో, నవ్వుతున్న పెదవులతో మనోహరంగా కనిపిస్తుంది కాంచనమాల. *మాలపిల్ల* విడుదల తర్వాత ఈ స్టిల్‌తో రాష్ట్రమంతా అనేకమంది ఇళ్లల్లో క్యాలెండర్‌లు వెలిశాయి. *మాలపిల్ల* తో కాంచనమాల అందరి అభిమాన కథానాయిక అయిపోయారు. బాల్యంలో తెనాలిలో సంగీతం నేర్చుకున్న అనుభవంతో ఈ చిత్రంలో ఆమె కొన్ని పాటలు కూడా పాడుకున్నారు.

*మాలపిల్ల* తరువాత *పల్నాటియుద్ధం* సినిమా తీయాలనుకున్నారు గూడవల్లి రామబ్రహ్మం. కానీ *మాలపిల్ల* ఘనవిజయం సాధించడంతో మళ్ళీ సాంఘిక సమస్య నేపథ్యంలోనే సినిమా చేయాలని నిశ్చయించుకున్నారు. *దున్నేవాడిదే భూమి, జమీందారీ విధానాలు పోవాలి లాంటి* అంశాలను ప్రాతిపదికగా చేసుకుని *రైతుబిడ్డ* కథ సిద్ధం చేశారు రామబ్రహ్మం. *మాలపిల్ల*కు పనిచేసిన సాంకేతిక బృందాన్నే *రైతుబిడ్డ*కు కొనసాగించారు. *మాలపిల్ల* కు స్క్రీన్‌ప్లే సమకూర్చడమే కాక, కొన్ని పాటలు కూడా రాసిన తాపీ ధర్మారావు నాయుడు *రైతుబిడ్డ*కు త్రిపురనేని గోపీచంద్‌తో కలిసి మాటలు రాశారు. *మాలపిల్ల* తరహాలోనే మల్లాది విశ్వనాథ కవిరాజు దీనికి హాస్య సంభాషణలు సమకూర్చారు.

అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసి ఉన్నారు కొసరాజు రాఘవయ్య చౌదరి. ఆయనను మద్రాసు రమ్మని టెలిగ్రామ్ ఇచ్చారు రామబ్రహ్మం. 'నిద్ర మేల్కొనరా తమ్ముడా... గాఢ నిద్ర మేల్కొనరా తమ్ముడా...' అనేది కొసరాజు వ్రాసిన సినిమా పాట. 'రైతు పైన అభిమానం చూపని రాజులుండనేల?', 'సై సై చిన్నపరెడ్డి', అనే మరో రెండు పాటలను కూడా వ్రాశారు కొసరాజు.

రామబ్రహ్మం ఆయనను అంతటితో వదిలిపెట్టలేదు. పట్టుపట్టి రైతు ప్రతినిధి రామిరెడ్డి పాత్రకు ఎంపిక చేశారు. ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, నెల్లూరు *జమీన్‌రైతు* వారపత్రిక స్థాపకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు






గేయాలను, గాంధీ మహాత్ముని ఆస్థానకవిగా పేరొందిన తుమ్మల సీతారామమూర్తి పద్యాలను కూడా ఈ చిత్రంలో రామబ్రహ్మం వాడుకున్నారు. మరికొన్ని పాటలను తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్య వ్రాశారు. కథానాయకుడైన రైతు పెద్ద నరిసిరెడ్డి పాత్రకు రంగస్థలం మీద తిరుగులేని తారగా పేరు తెచ్చుకున్న బళ్ళారి రాఘవను తీసుకున్నారు. బళ్ళారి రాఘవ తొలి చిత్రం *ద్రౌపదీ మాన సంరక్షణం* (1936). అందులో దుర్యోధనుడి పాత్ర పోషించిన రాఘవ ఆ తరువాత *రైతుబిడ్డ* చేయడానికి అంగీకరించారు.

ఆయన భార్య పాత్రకు ప్రముఖ రంగస్థల నటి కొమ్మూరి పద్మావతి దేవి ఎంపికయ్యారు. స్త్రీ పాత్రను స్త్రీలే ధరించాలన్న రాఘవ ఆశయాలతో ప్రభావితమై కొమ్మూరి పద్మావతి రంగస్థలం పైకి ధైర్యంగా అడుగు పెట్టి సంచలనం సృష్టించారు. ఈ పద్మావతిదేవి తనయుడే ప్రముఖ నవలా రచయిత కొమ్మూరి సాంబశివరావు.

టంగుటూరి ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె అయిన టంగుటూరి సూర్యకుమారిని ఇందులో రైతు కుమార్తె పాత్రకు తీసుకున్నారు. అప్పుడామె వయసు 14 ఏళ్ళు. అప్పటికే ఆమె *విప్రనారాయణ* (1937), *అంబికాపతి* (1938) *అదృష్టం* (1938) తదితర తమిళ చిత్రాల్లో నటించారు. టంగుటూరి సూర్యకుమారికి తొలి తెలుగు సినిమా అవకాశం ఇదే.

ఆనాటి జమీందారీ గ్రామాలలో సన్నకారు రైతులు అనుభవిస్తున్న కడగండ్లను, జమీందారుల ఆకృత్యాలను, ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టుగా వాస్తవిక దృక్పథంతో చిత్రీకరించాలని, ఈ విషయంలో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని నిలబడాలని రామబ్రహ్మం ముందుగానే నిశ్చయించుకున్నారు. మద్రాసులోని మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ కంబైన్ స్టూడియోలో *రైతుబిడ్డ* షూటింగ్ మొదలైంది. సినిమా అంతా అక్కడే పూర్తయింది. ఇందులో పాత్రధారుల పారితోషికాలకి మొత్తం పాతికవేలు ఖర్చయ్యింది.

ఈ సినిమాను షూటింగ్ దశలోనే జమీందార్లు నిషేధింపజేస్తారేమోనని రామబ్రహ్మం భయపడినా ఎలాంటి అవాంతరం రాలేదు.

మొత్తానికి 1939 ఆగస్టు 27న *రైతుబిడ్డ* ఆంధ్ర దేశంలో విడుదలైంది. అంతకు ముందే ఆ చిత్ర ప్రదర్శనను ఆపించాలని కొంతమంది జమీందార్లు న్యాయస్థానం ద్వారా 'స్టే ఆర్డర్' జారీ చేయించారు. అయితే అప్పటికే సెన్సార్ బోర్డు వారు ఆ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడంతో సినిమా విడుదలకు ఇబ్బంది కలగలేదు. వెంకటగిరి జమీందార్లు *రైతుబిడ్డ* చిత్రం ప్రింట్లు కొన్నింటిని తగలబెట్టించి ప్రదర్శనలను ఆపుచేయించడానికి ప్రయత్నించడంతో అల్లర్లు చెలరేగాయి. **జమీందారీ వ్యవస్థలను రద్దు చేయాలని ప్రభుత్వం బిల్లు పెట్టిన కొన్నేళ్ళకు ముందే రామబ్రహ్మం *రైతుబిడ్డ*ను తీసి దర్శకుడిగా తానెంత ముందుచూపు గలవాడో నిరూపించుకున్నారు.**

సినిమా ప్రజల మీద ఎలా ప్రభావం చూపుతుందో చెప్పడానికి ఈ సినిమా ఒక నిదర్శనం. తెలుగు సినిమా చరిత్రలో ప్రభుత్వం ఆంక్షలకు, నిషేధానికి గురైన మొదటి చిత్రం *రైతుబిడ్డ*. ఇందులో జమీందార్ల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు గూడవల్లి. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేని జమీందారులు మండిపడి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి చివరికి నిషేధింపచేశారు.

బ్రిటిష్ ప్రభుత్వం ఆ చిత్రాన్ని కొన్ని జమీందారి ప్రాంతాల్లో నిషేధించింది. వీటివల్ల ఈ సినిమాకి ఆర్థిక నష్టం జరిగినా, రైతాంగంలో మాత్రం చైతన్యం తీసుకువచ్చింది. మదరాసు అసెంబ్లీలో టంగుటూరి ప్రకాశంగారు బిల్లు ప్రవేశపెట్టడానికి *రైతుబిడ్డ* సినిమా ఎంతగానో తోడ్పడిందని అప్పట్లో చెప్పుకునేవారు. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజా ఈ సినిమా నిర్మాత మీద పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు కూడా. చల్లపల్లి రాజా స్వంత జిల్లా అయిన

కృష్ణా జిల్లాలో కూడా ఈ సినిమా నిషేధానికి గురైంది. మొత్తం మీద జనం అంతా ఆ సినిమాను చూసేందుకు అప్పట్లో మాత్రం వీలుకాలేదు. ఆ తరువాత చాలా కాలానికి *రైతుబిడ్డ* మళ్ళీ వెలుగు చూసింది. ఈ సినిమా తర్వాత తెలుగులో నిర్మాతలు ఎవరూ చాలా రోజులపాటు మళ్ళీ అభ్యుదయ చిత్రాలు తీసేందుకు సాహసించలేదు. చిత్రమేమంటే సారథీ సంస్థ చల్లపల్లి జమీందార్ యాజమాన్యంలో వుంది. అయినా కూడా గూడవల్లి జమీందారీ వ్యవస్థకూ, విధానాలకూ వ్యతిరేకంగా ఈ చిత్రం చేయడం ఒకరకంగా పెద్ద సాహసమే. సారథీ ఫిలింస్ డైరెక్టర్ల బోర్డు ఛైర్మన్ చల్లపల్లి రాజా ఈ సినిమాకి అభ్యంతరం చెప్పకపోగా ప్రోత్సహించారు.

*మాలపిల్ల* సినిమాతో తెలుగు సినిమా సంగీతాన్ని ఒక మలుపు తిప్పిన భీమవరపు నరసింహారావు *రైతుబిడ్డ*తో మరోసారి తన సత్తా చాటుకున్నారు. అలాగే జమీందారు అనుచరుడిగా రైతులను పీడించే ఖాసా సుబ్బన్న పాత్రలో ఆయన నటించారు. ఇక కొసరాజు పాటలు పెద్ద హిట్టయ్యాయి. నటుడుగా కూడా ఆయనకు మంచి పేరు వచ్చింది. సినిమాలో తన పాత్రకు సంబంధించిన పాటలను తానే పాడుకున్నారు కొసరాజు. అయితే ఈ సినిమా తర్వాత ఆయన తన స్వస్థలం వెళ్లి పోయారు.



చల్లపల్లి రాజా

ఆ తర్వాత మళ్లీ పదమూడేళ్ళకు *పెద్దమనుషులు* కోసం తిరిగి చిత్రసీమకు వచ్చారు. ఇందులో టంగుటూరి సూర్యకుమారి పాడిన 'రాబోకు రాబోకురా చందురుడా...' అప్పట్లో పెద్ద హిట్. బళ్లారి రాఘవ కీర్తిని మరింత పెంచింది ఈ సినిమా. అయితే ఎందుకనో ఆయన సినిమా రంగం మీద మక్కువ పెంచుకోలేదు. ఈ సినిమా తర్వాత *చండిక* అనే సినిమాలో మాత్రమే నటించి చిత్రసీమకు వీడ్కోలు చెప్పేశారు. ప్రసిద్ధ నృత్య దర్శకుడు వేదాంతం రాఘవయ్య ఈచిత్రానికి నృత్య సారథ్యం వహించడమేకాక, దశావతార నృత్య సన్నివేశంలో నటించారు కూడా. ఓటర్లను ఆకట్టుకోవడానికి ఒక రాజకీయ పక్షం వారు దశావతార ప్రదర్శనను ఏర్పాటు చేస్తారు. ఈ సన్నివేశంలో వేదాంతం రాఘవయ్య కూచిపూడి నాట్య కళాప్రతిభను చక్కగా వినియోగించుకున్నారు గూడవల్లి. గూడవల్లి రామబ్రహ్మం కూడా ఈ చిత్రంలో నటించారు. పత్రికా సంపాదకునిగా ఒక దృశ్యంలో కనబడతారాయన. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ మాగోఖలే ఈ సినిమా ద్వారానే ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు. భీమవరపు నరసింహారావు రికమండేషన్‌తో ఈ అవకాశం సంపాదించారు.

ఆనాటి మద్రాసు ప్రావిన్స్ ప్రధానమంత్రి బొల్లిని మునిస్వామి నాయుడికి ఈ చిత్రాన్ని అంకితమిచ్చారు. ఆయన రైతు పరిరక్షణకు తనవంతు సహాయ సహకారాలందజేశారు. తెలుగు చలనచిత్రాల్లోని కథాగమనానికి కొత్త స్ఫూర్తినిచ్చిన ఈ చిత్రం నెగెటివ్‌ని పూనాలోని ఫిలిం ఆర్కీవ్స్‌లో భద్రపరిచారు.

* * *

*మాలపిల్ల*, *రైతుబిడ్డ* తర్వాత గూడవల్లి రామబ్రహ్మం *అపవాదు*, *ఇల్లాలు*, *పత్ని*, *పంతులమ్మ*, *మాయాలోకం* మొదలైన చిత్రాలు రూపొందించారు. తన 44వ ఏట తానెంతో ఇష్టపడ్డ *పల్నాటి యుద్ధం* చిత్రం పూర్తి చేయకుండానే కేన్సర్ వ్యాధికి గురై కన్నుమూశారు.

గూడవల్లి రామబ్రహ్మం చనిపోయాక జైహింద్ (స్టిల్స్) సత్యం మద్రాసులో సంస్మరణ దినం జరిపి, *మాలపిల్ల* ప్రదర్శించారు. ఈ సందర్భంలో హీరో వెంకటేశ్వరరావు, హీరోయిన్ కాంచనమాలలను సత్కరించారు.

విషాదకరమైన విషయమేమిటంటే – అప్పటికి కాంచనమాల మతి చలించిన దుస్థితిలో ఉన్నారు. ముద్దులొలికే రూపంతో *మాలపిల్ల* చిత్రంలో కనిపించిన కాంచనమాల – నిస్తేజంగా ఆ సన్మానాన్ని అందుకోవడం విధి ఆడిన నాటకం!

దాదాపు ఏడు దశాబ్దాల క్రితం గూడవల్లి రామబ్రహ్మంలో కనిపించిన సామాజిక చైతన్యం ప్రస్తుతకాలంలోని దర్శక నిర్మాతల్లో ఎవరికైనా ఉందా?

*అయిపోయింది.* మి



# చలనచిత్రం కళా?

## ..కాదు వ్యాపారం

– చిత్తూరు వి. నాగయ్య

**1931**లో ప్రారంభమైన ఆంధ్ర చలనచిత్ర పరిశ్రమ నానాటికీ విస్తరిస్తోంది. ఆ సంవత్సరములో ఆంధ్రప్రేక్షకులకు రెండేరెండు చిత్రాల్ని అందించిన మన పరిశ్రమ ఈనాడు సగటున సాలుకు ఇరవైచిత్రాల్ని అందిస్తోంది. నిర్మాణదృష్ట్యా అభివృద్ధి తృప్తికరంగానే కనిపిస్తోంది. కానీ–

సుప్రసిద్ధరచయిత వెండెల్ విల్కీ రచించిన *ఒకే ప్రపంచం* అన్న గ్రంథంలో "ఒక మనిషిని గూర్చి మరో మనిషి తెలుసుకున్న రోజున, ఒకే ప్రపంచస్థాపనకు మంగళ గీతాలాలపింపగల''వన్నాడు. ఈ విశిష్ట పరిణామం రావాలంటే ఒక ఉత్తమ సౌహార్ధసాధనం అవసరం. "చిత్రకళ" ఇందుకు సరియైన సాధనమని విశ్వమంతా అంగీకరించింది. "ఏ ప్రచారానికైనా చలన చిత్రాలు ఉత్తమమైన ఆయుధ" మన్నాడు లెనిన్.

మానవ ప్రపంచంమీద ఒక ప్రబలంగా పనిజేసే ఈ చలనచిత్రాలమీద రెండు రకాల వాదాలున్నాయి. మొదటిది చలన చిత్ర పరిశ్రమ 'కళ' అని, రెండోది 'వ్యాపార'మనీ. 'కళ' అని వాదించే ప్రతివారూ గమనించాల్సింది 'కళ'కు కూడా 'వ్యాపారం' అవసరమేనని. విదేశాలమాట అటుంచి, మన దేశంలో– అందులో ఆంధ్రదేశంలో చిత్రపరిశ్రమ నూటికినూరుపాళ్లు వ్యాపారదృష్ట్యానే సాగుతున్నదని చెప్పటం ఏమాత్రం సాహసం కాదు. బ్రిటిష్ ఫిల్ము ఎకాడమి డైరెక్టర్ రోజర్‌మాన్వెల్ అన్నట్లు "చలనచిత్రాల వల్ల మనకు ఆదాయం రావటానికని ఆధునిక వ్యాపారలక్షణాలను అనుసరిస్తాము".

సాధారణంగా ఏ చిత్రాన్ని తీసుకున్నా డజను పాటలు, నాలుగు డాన్సులు, రెండు స్వప్నదృశ్యాలు, ఆరు హిందీ పాటల కనుకరణలు కనిపిస్తూవుంటై. ఖర్మంజాలక ఒక జానపద చిత్రం నాలుగు డబ్బులు కళ్ళజూస్తే మిగతా నిర్మాతలంతా గూడా జానపదాలమీదకే ఎగబట్టం; ఒక నర్తకికి ఒక చిత్రంలో పేరొస్తే ఆ నర్తకినే పదిమంది నిర్మాతలూ తమ చిత్రాల్లోకి తీసుకోవటం; ఒక చిత్రంలో డప్పులాట ప్రచారంలోకొస్తే మిగతా నిర్మాతలంతా గూడా తమతమ చిత్రాల్లో డప్పుపాటల్ని ప్రవేశపెట్టడం మనం సర్వసాధారణంగా చూస్తున్నదే. నడివయస్సులో వున్న నాయకుడు, నాయకి లేనికథే కనిపించటంలేదు. ఇలా కొన్ని బాక్సాఫీసు సూత్రాల్ని మనసులో ఉంచుకుని ఈనాటి నిర్మాతలు చిత్రనిర్మాణాన్ని సాగిస్తున్నారు. అందువల్ల ప్రస్తుత చలనచిత్రనిర్మాణంలో వ్యాపారదృష్టే ఉంది గాని, కళాదృష్టి లేదు. కళకు, వ్యాపారానికీ చాలా దూరంవుంది. కళ ఒక సృజనాత్మకమైన శక్తి. దాన్ని వ్యాపారంతో రంగరించటం వల్ల మేలిమి బంగారానికి రాగి కలిపినట్లవుతుంది. ఇది తప్పని నావాదం కాదు. ఎందుచేతనంటే వ్యాపారదృష్టి లేకపోతే అసలు చిత్రనిర్మాణమే జరగదు. కాని –

"సినిమా ఉత్తమమైన కళాస్వరూపం'' అన్నాడు కాన్‌స్టెంట్ లాంబర్టు. చలన చిత్రాల్లో వివిధ లలితకళల సమ్మిళితాన్ని చవిచూపించవచ్చు. అనేకమంది కళాకారుల అహోరాత్రుల కృషిని, సృజనాత్మకశక్తిని చలన చిత్రాల్లో చూస్తున్నాం. ఈ కళా ప్రవంతిని నిర్మాతలు వ్యాపారమైదానం వైపు మళ్ళించవలసి వచ్చినప్పుడు అందులో మాలిన్యం కొంత మిళితం కాకతప్పదు. దానివల్ల 'కళ'లోని పరిశుద్ధత కొంతవరకైనా విరిగిపోకాతప్పదు. అలా పోకుండా చూడాలంటే ఆర్థిక రీత్యా దెబ్బతినవలసివస్తోంది. లక్షలు వెచ్చించే ఏ నిర్మాతా నష్టపడటానికి ఇష్టపడదు. పోనీ నష్టపడ్డ నిర్మాతకు కనీసం సానుభూతిచూపే వాడైనా లేదు. ప్రభుత్వం వారు వారి పన్నుల వసూళ్ళకు మాత్రమే ముందంజ వేస్తారు గాని, పడిపోతున్న ప్రొడ్యూసర్ని పైకి తేవటానికిగాని,

చిత్తూరు వుప్పలదడియం నాగయ్య (జయంతి: 28-3-1904)

సహాయపట్టానికిగాని రారు. ఇప్పుడిప్పుడు ఉత్తమ చిత్రాలని నిర్ణయింపబడిన వాటికి పథకాలంటూ పత్రాలంటూ ఇస్తున్నారు. ఈ పథకాలవల్ల, పత్రాలవల్ల నిర్మాతలకు ఆర్థికంగా వచ్చేలాభం ఏమీలేదు.

కళాపోషకులు లేనప్పుడు కళారాధకులు రాణించలేరన్న నగ్నసత్యాన్ని నేను వివరంగా చెప్పనక్కర్లేదనుకుంటా. కళాసృష్టికి ప్రభుత్వసహాయం లేకపోతే రాణింపుకు రావటం కష్టమన్న విషయంగూడా విజ్ఞులెరిగినదే! ప్రజాబాహుళ్యం ఎప్పుడూగూడా వారి వారి అభిరుచుల్ని బట్టి, కళలను, కళారాధకులను, కళాకారులను, తమశక్తి కొలదీ ప్రోత్సహిస్తుంది.

ప్రజాబాహుళ్యంమీద తమ పొట్ట నింపుకోవాల్సిన కళాకారులు ప్రజానీకపు అభిరుచుల్ని గమనించి, వారిని తృప్తిపరచేందుకే కృషి చెయ్యవలసి వుంటుంది. అలాచేసినప్పుడే వారు నిలబడగలుగుతారు. ప్రజాభిరుచుల్ని గాక తమ అభిరుచుల ప్రకారం నడిస్తే తమపొట్ట నింపుకోవటమే కష్టం కావచ్చు. కళాకారుల అభిరుచుల ప్రకారమే వారి వారి కళావాహినిని మళ్ళించాలంటే పోషకులవసరం. పోషకులు లేనివారు వారి కళాసృష్టికి చౌకబారు విధానాలను అనుసరించక తప్పదు. అదే వ్యాపార దృష్టి. ఈనాటి మన చిత్రపరిశ్రమ నడుస్తోంది ఈ దారిలోనే!

ఇప్పుడు "ఆంధ్రప్రదేశ్" అవతరించింది. ముక్కోటి ఆంధ్రులు ఏళ్ళతరబడి చేసినకృషికి, చూపిన త్యాగసాహసాలకు ఫలితం దక్కింది. మనం కూడగట్టు కుంటున్న క్రొత్త సంసారం మిగతావారికి మార్గదర్శి కావాలి – ఆదర్శ ప్రాయంగా వుండాలి! ప్రపంచశాంతిని ఆశించే మనం, విశ్వకల్యాణానికి భావగీతికల్ని ఆలాపించే మనం, మన సంస్కృతిని, మన కళలను, మన విజ్ఞానాన్ని ప్రతిబింబించే చిత్రాల్ని మనం నిర్మించాలి! ఆంధ్రజాతీయతను విజాతీయులకు మన చిత్రాల ద్వారా తెలియజెయ్యాలి!

ఆంధ్ర సంస్కృతికి, విజ్ఞానానికి మూలపురుషులైన మహామహుల జీవిత చిత్రాల్ని తెరమీద కెక్కించి ఆంధ్రుల పూర్వౌన్నత్యాన్ని జ్ఞప్తికి తేవాలి! ఆనాడే చలనచిత్రాల్ని మనం సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. ఆనాడే ఆంధ్రమాతకు చలనచిత్ర కళాజ్యోతుల్ని వెలిగించినట్లవుతుంది. ఆ శుభ దినమెన్నటికో!

## నాదబ్రహ్మ ఆవాహన :

పూర్ణాపిక్చర్స్ అధిపతి కీ.శే. మంగరాజుగారు *పోతన* చిత్రం చూసిన తర్వాత, నన్ను *త్యాగయ్య* పాత్రలో కూడా చూడాలని వుందనేవారు. వారి ప్రోత్సాహబలంతో– మహనీయుడు, ప్రముఖ వాగ్గేయకారుడూ ఐన త్యాగరాజు జీవితాన్ని చిత్రంగా తీయాలన్న ఉత్సాహం నాలో కలిగింది. ఆ ఉత్సాహంతోనే నేను త్యాగరాజు జీవిత చరిత్రలూ అవీ చదివాను. కాని వాటిల్లో చిత్రానికి కావలసిన కథ లేదు. కథారూపం లేకుండా చిత్రం తీస్తే 'డాక్యుమెంటరీ'లా వుంటుంది. పాత్రలు విశిష్టంగా కనిపించవు. చిత్రంలో ఉత్సాహం ఉండదు. ఏం చెయ్యాలి? తంజావూరు లైబ్రరీలో త్యాగరాజు జీవితానికి సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని తెలిసి, అక్కడికి వెళ్ళి ఆ పుస్తకాలు, గ్రంథాలూ పరిశోధించాను. ఎక్కడైనా రసవత్తరమైన ఘట్టాలు కనిపిస్తాయోమోనని, అక్కడా కనిపించలేదు. ఐనా వాటికి ప్రాణం పోసి, కథను అల్లాలనే ఉత్సాహంతో *త్యాగయ్య* చిత్ర నిర్మాణానికి ఉద్యమించి, కథాకల్పన ఆరంభించాను.

త్యాగరాజు నివశించిన తిరువయ్యూర్ వెళ్ళి అక్కడే కూర్చుని కథ రాయాలనిపించింది. అలాగే వెళ్ళి, త్యాగయ్య సమాధి దగ్గర కూర్చుని కథ రాయడం మొదలుపెట్టాను. ప్రాతఃకాలమే లేచి, కావేరీ నదిలో స్నానం చేసి శుచిగా సమాధి దగ్గర కూర్చుని, ఉపవాసాలు కూడా చేస్తూ కథ రాయసాగాను. కొన్నాళ్ళకు కథకు ఒక రూపం కనిపించింది. నాకూ కొంత ధైర్యం వచ్చింది. ఆ కథా రూపాన్ని తీసుకుని పెద్ద పెద్ద విద్వాంసులకూ, త్యాగరాజు జీవితం గురించి బాగా విన్నవారికి చూపించాను. అందరూ సంతృప్తి చెందారు. మద్రాసు వస్తూనే సముద్రాల రాఘవాచార్యులుకి వినిపించాను. 'చాలా బావుంది రసవత్తరంగా వుంది' అని అభినందించారు. అక్కణ్ణుంచి నేను, సముద్రాల, లింగమూర్తి కలిసి తర్జన భర్జనలు చేస్తూ 'స్క్రీన్‌ప్లే' తయారుచేశాము. అప్పుడప్పుడూ బి.యన్.రెడ్డిగారిని, కె.వి. రెడ్డిగారిని ఆహ్వానిస్తూ ఐనంతవరకూ వారికి వినిపిస్తూ వారి సలహాలు తీసుకుంటూ వుండేవాడిని. కథ సిద్ధమయింది. నేను త్యాగరాజు పాత్ర ధరించాలి. త్యాగయ్యలా పాడాలి. కీర్తనలు పాడటంలో ఎక్కడా తేడా రాకూడదు. ఔచిత్యానికి భంగం వాటిల్లకూడదు. మహామహా సంగీత విద్వాంసులు చిత్రం చూస్తారు. ఎక్కడ ఏ లోపం వచ్చినా క్షమించరు. అది దృష్టిలో

**మిగతా 44వ పుటలో...**

# డాక్టరు గారు

- వల్లభనేని అశ్వినీకుమార్

ఇది కథ కాదు. బాల్యంలోకి తొంగిచూసే చిన్న ప్రయత్నం. అది పేదల పల్లెటూరు. చుట్టుపక్కల రోగుల సేవలో తన జీవితాన్ని సార్థకం చేసుకుంటూ తల్లిలేని కొడుకుని పెంచుతూ కాలం గడుపుతున్న డాక్టరుగారి కథ. చివరిక్షణం వరకు ఆ పల్లెటూర్లలోని పేదరోగులకు వైద్యంచేస్తూ తన ఆశయానికి అనుగుణంగా జీవితాన్ని నిరాడంబరంగా గడిపిన తండ్రి కథ. ఇది కథ కాదు.

ఎనిమిదేళ్ళ వాని వేలు పట్టుకుని-ఆ చిన్న వూరి రెల్లుగడ్డి ఇళ్ళ మధ్య నుంచి నడిపిస్తూ-ఇది నీ వూరు ఇది మనం కట్టవలసిన ఇల్లు- అంటూ నడిపించిన నాన్న.

తర్వాత ప్రతిరోజూ మట్టిని గేదె దూడతో కలిసి తొక్కి రోజుకు మూడు అడుగులు కట్టుకుంటూ పోయిన మట్టిగోడలు అలా మూడిళ్ళు కట్టి-రెల్లుగడ్డి నేయించి-మిగిలిన రెల్లుతో చాపలు నేయించి-మేమిద్దరమే కాపురం పెట్టాం-

ఒకటి ఆయన వైద్య వృత్తికి అనువుగా వుండే ఇల్లు. రెండోది మేమిద్దరం నివసించటానికి. మూడోది వండుకు తినడానికి. ఆవెనక గేదె దూడ గడ్డి, దొడ్డి, కోళ్లు, అదీ మా కాపురం. అప్పటికి కరెంటు లేదు నేను ఊరు వదిలేవరకూ కరెంటు దీపం రాలేదు. ఆ చీకటి వెలుగులోనే ఆయన హాయిగా వున్నారు. బుడ్డి దీపాలు-లాంతర్లు-కిరసనాయిలు-ముగ్గుతో దీపాల గ్లాసును తుడిచి వెలిగించటం.

నాన్నకు ఉదయం నుంచే రోగులు మూగుతుండే వారు. చుట్టూ పాతిక వూళ్ళకు ఈయనే డాక్టరు గారు. ఈయన హస్తవాసి తొందరగానే ప్రచారం పొందింది. ఏ అపరాత్రి అయినా- ఏ కాన్పు అయినా ఇక్కడికే. ఎన్నోసార్లు నేను కలలో కెవ్వున కేకలు విన్నాను. ఒళ్ళు కాలి అరటి ఆకులో చుట్టి తెచ్చిన రోగిని అర్ధరాత్రి ఆదుకున్న నాన్నను చూశాను.

అప్పటికి నా వయసు పది దాటినాయేమో- మొదటి రెండేళ్ళు ఊళ్ళో బడే-తర్వాత అక్కడికి నాలుగు మైళ్ళు రోజూ నడిచి ఆడుతూ పాడుతూ వెళ్ళి రావటం. ఉదయాన్నే వండి టిఫిన్ కట్టేవారు నాన్న-నాన్న బెజవాడ లాంటి పట్టణాన్ని వదిలి ఇక్కడకు ఎందుకు వచ్చారు? ఇక్కడ డబ్బు లేదు. వసతులు లేవు. భవిష్యత్తు అసలు లేదు- మరి?

ఆయనే తర్వాత నాకు చెప్పారు. చూడు వీళ్లకి చదువు లేదు. రైతులు, గొడ్లు అన్నీ ఒకటి గానే వున్నాయి. రోగాలు వచ్చినా ఎక్కడికీ వెళ్లలేరు. చుట్టూ యాభై మైళ్ళ వరకూ ఒక్క పట్టణం లేదు. వైద్యం తెలియని నాటు వైద్యులు వీళ్ళను దోచుకుంటున్నారు. చంపుతున్నారు. ఎక్కడయినా ప్రభుత్వం కనపడుతోందా?

అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను. మీ అమ్మ పోయిన తర్వాత నా విద్యను ఈ అమాయకులకే సద్వినియోగ పరచాలని- దీనికి ప్రేరణ ఒక రకంగా గాంధీయే- ప్రత్యక్షంగా నేను పోరాటంలో పాల్గొనలేకపోయాను.

అయిదు సంవత్సరాలు మద్రాసు మెడికల్ కాలేజీలో వుండటం. మీ బాబాయి బెనారస్ వెళ్ళి కమ్యూనిస్టుగా మారి వచ్చి మొన్నటివరకూ పరారీలో వుండి కాలవల్లో-బోదుల్లో రాత్రుళ్ళు గడిపాడు. వాడిని వ్యవసాయంలో పెట్టింది వున్న భూమిని కాపాడాలనే. వాడికి అన్నీలోటే చదువు అంతంత మాత్రం. సంతానం లేదు. ఒక్కటి, అన్న మాటంటే విలువ ఇస్తాడు.

మీకు నేను ఆస్తులు ఇవ్వలేను. డిగ్రీ వరకూ చదివిస్తాను. ఈ వైద్యంలో అంతకంటే నాకు అవకాశం వుండదు. కానీ వీళ్ల సేవలో నేను ఎంతో ప్రశాంతంగా జీవితం గడపగలను.

ఇంత స్పష్టంగా తన జీవితాశయాన్ని పెట్టుకున్న వ్యక్తిని ఏమనాలి? ఒకసారి గాంధీ బెజవాడ మీదుగా వెళ్తుంటే -ఈయన వెళ్లి రైలు దగ్గర ఆయన్ని ముట్టుకుని వచ్చారు. తన ఆశయం రక్తమాంసాలతోనే వుందని నమ్మకానికేమో?

నాకు పన్నెండు ఏళ్ళు వచ్చేసరికి-గుడ్ ఎర్త్ ఇంగ్లీషు పుస్తకం తెప్పించి రోజూ స్కూలు నుంచి వచ్చిన తర్వాత తాను

చదివి అర్థం చెప్పి-నాతో చదివించారు. రవీంద్రుని కథలు (కాబూలీ వాల) నుంచి గీతాంజలి వరకు బాగాచదువు కున్నాము ఇద్దరం కలిసి.

మనకు పన్నెండు సంవత్సరాల వయసు వరకూ బాల్యం వదలదు. పద్దెనిమిదేళ్ల వరకూ యౌవన ప్రాంగణంలోని గందరగోళం. సినిమాలు చూపే మిథ్యాలోకపు అయో మయంలో కొట్టుమిట్టాడుతాం. పాతికేళ్లకు గాని ఒక దారి, ఒక బ్రతుకు ఏర్పడవు. అప్పటికైనా ఒక ధ్యేయం. ఒక గమ్యం ఎందరికుంటుంది.

తల్లిదండ్రుల తీరని కోర్కెలకు 'బలి' అవుతున్న ఈ నాటి యువతకు తమ తమ సృజనాత్మక శక్తిని వెలికి తెచ్చే అవకాశాలు మృగ్యమవుతున్నాయి. జీవన ప్రవాహంలో కొట్టుకుపోవడం తప్ప చేయగలిగింది లేదు.

కాని ఎప్పుడో-ఎక్కడో మీ మనస్సులో ఏదో బలీయమైన కోరిక అంకురించి, అది ఒక ధ్యేయంగా మారి, ఒక గమ్యాన్ని చూపితే ఆశ్చర్యం లేదు. అది గుర్తించి, అటుగా పయనించే తీరిక, అందుకవసరమైన వనరులు దొరికితే అదృష్ట వంతులమే.

ఈ నేపథ్యంలో పన్నెండేళ్ళ వయసులో పరిచయమైన కొద్దిపాటి ఆంగ్ల సాహిత్యం ప్రభావమో, మా ఊరు రెండు రోజులకు టపాలో చేరే "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" దినపత్రికలో "మాండ్రేక్" బ్రింగింగ్ అప్ ఫాదర్" బొమ్మల ప్రభావమో తెలియదు; నాన్నగారు రోజూ చదివించి, వివరించి చెప్పిన పెరల్‌బక్ "గుడ్ఎర్త్" లో చైనా పొలాల వెంట మట్టివాసనలో, పీసోతో కలిసి నడిచాను-అతను దారిలో దేవతకు వెలిగించిన అగరొత్తుల సువాసన పీల్చాను. భారతంలో భీమునితోపాటు తిన్నాను, రామాయణంలో హనుమంతునితో ఎగిరాను.

పక్క వూరు నీళ్ళమధ్యలో వుండేది. చుట్టూ చీలమండ లోతు నీళ్ళు, మధ్యలో వూరు. అక్కడికీ వెళ్ళాం వైద్యానికి. అక్కడి నుంచి తిన్నగా వెళ్ళితే సముద్రం 15 మైళ్లే.

మా వూర్లో ఒకే బజారు. పట్టుమని పది ఇళ్లు లేవు. ఊరిమధ్య నుంచి రహదారి, అదే బస్సులు వెళ్ళే రహదారి కంకర రోడ్డు. రోడ్డు కవతల మరొక పది ఇళ్లు. ఉదయం ఒక బస్సు. సాయంత్రం ఒక బస్సు.

ఈ ఊరికి మైలుదూరంలో చుట్టూ వూళ్లున్నాయి. అలా అన్ని వర్తులాకారంలో పొలాలు. పాతిక దాదాపు యాభై ఊళ్ళకి ఈయనే 'డాక్టరు గారు'.

ఇక్కడి పొలాలు చవిటి నేల- ఎకరానికి పది బస్తాలు కూడా పండేవి కావు. రెండో పంట చాలా సంవత్సరాల వరకూ లేదు.

వాళ్ళకి ఆదాయం అసలు వుండేది కాదు. కాని అవసరాలు తక్కువే. (మొదటి పంచవర్ష ప్రణాళిక రోజులు) వారానికి ఒకసారి సంత జరిగేది మైలు దూరంలో వున్న వూళ్ళో. కూరగాయలు, నాటుకోళ్ళు, పరదపిట్టలు, చేపలు దొరికేవి. అక్కడే అపుడపుడు నాటకాలు వేసేవారు. బుర్రకథలు చెప్పేవారు. ఒకసారి కమ్యూనిస్టుల బుర్రకథ విన్నాను. కాంగ్రెసు వాళ్ళు పెట్టిన హింసలు హృదయ విదారకంగా అభినయంతో చెప్పారు.

పాండవోద్యోగవిజయాలు రాత్రి తెల్లవార్లూ నడిచేవి. అక్కడ చూసి చూసి నిద్రపోయేవాళ్ళం. చెవుల్లో "చెల్లియో-చెల్లకో" అని వినవస్తూ వుండేది. ఈ డాక్టరు గారు అన్ని వృత్తుల వారికి డాక్టరు గారే. ఎవరి దగ్గరా డబ్బుండేది కాదు. (1950) పంటలూ అంతంత మాత్రమే! మాకు డబ్బుతో అవసరమే లేదు. నాస్కూలు జీతం ఒకటో రెండో రూపాయిలు.

వైద్యం చేయించుకున్న వాళ్ళు-తర్వాత ఎంతో సంతోషంగా వారి దగ్గర వున్నదే-అన్ని రకాల దినుసులు, పళ్ళు, ఫలాలూ, పప్పులూ ఇలా వచ్చి పడుతుండేవి. పగలంతా స్కూలులో వుండేవాడిని. రాత్రికి ఇద్దరం కలిసి వంట చేసేవాళ్ళం. పప్పుచారు. కోడి గుడ్డు అట్లు-ఏది తేలిక అయితే అదే. అన్నిపండగలకూ, అన్ని రకాల పిండివంటలూ వచ్చేవి. కొన్ని బాబాయి తెచ్చేవాడు. చాలా ఊళ్ళో కాపరాల వాళ్ళు గిన్నెలలో తెచ్చి ఇచ్చేవాళ్ళు. దేనికీ లోటు వుండేది కాదు.

ఆయనకు ఒక ర్యాలీ సైకిల్ వుండేది. చదువుకున్నప్పటి పాంట్లు అన్నీ మూటకట్టి-పంచెకట్టారు.

పంచకు క్లిప్ పెట్టి సైకిల్‌మీద రోగులను చూడటానికి వెళ్ళే వారు. ఆయనే ఫిజిషియన్, ఆయనే సర్జన్. నాకు తెలిసి చాలా ఆపరేషన్‌లు 7'o క్లాక్ బ్లేడుతో చేశారు. వారానికి ఒకసారి ఊళ్ళల్లో ఫస్ట్ ఎయిడ్ క్లాసులు చెప్పేవారు. కాలు విరిగితే ఎలా కట్టాలి. చేయి కాలితే ఏం చెయ్యాలి. నీళ్ళలో మునిగితే-నీళ్ళు కక్కించి, పురిటినొప్పులు వస్తే ఏ రకంగా తీసుకు రావాలి. అన్నీ నల్లబల్ల మీద వేసి చూపేవారు. అన్నింటికీ నేను రావాల్సిందే-సైకిల్ మీద ముందు కూర్చుని అన్ని వూళ్ళు తిరిగాను. రాత్రిళ్లు ఊళ్ళో రైతులకు చదువు చెప్పేవాళ్ళం. ఆయనకు లభించే స్వాగతం-ఎంత ఆత్మీయంగా

వుండేదో-'డాక్టరుగారు' ఒకటే మాట-బహుశా ఈయన పేరు చాలామందికి తెలియదు. మరినేను డాక్టరు గారబ్బాయి అంతే! మరో ఐడెంటిటీ లేదు.

ఎండలో, వానలో, చలిలో వసంతంలో ఇవన్నీ ప్రస్ఫుటంగా వుండేవి. అన్ని ఋతుఫలాలు రుచి చూసేవాళ్ళం. ఎండాకాలం- ఎండలు ఎట్లావున్నా మామిడి పళ్ళు మాత్రం బుట్టలనిండా వచ్చేవి. అన్ని రకాల రోగులను చూసేవాడిని. మానసిక రోగులూ వుండేవారు మా వైద్య శాలలో ఇన్‌పేషెంట్లు ఉండేవారు, ఒకరో ఇద్దరో.

పెన్సిలిన్ అప్పుడే వచ్చిన గుర్తు. మరి మందులు? సంవత్సరానికి ఒక్కసారి గుడివాడకు తెప్పించి-అక్కడ నుంచి గూడు బండిలో చెక్కపెట్టెలు వచ్చేవి. అవన్నీ తెరిచి అన్ని మందులూ ఊరికే పంచేవారు. అవసరమైన వాటిని కొన్ని తప్పనిసరి మందులు రాసి తెచ్చుకోమనేవారు. తెగిన గాయాలకు అయోడిన్ రాసి దూది పెట్టి గాజుగుడ్డ కట్టి పంపేవారు. కాలిన గాయాలకు చల్లని క్రీములు- ఎపుడు ఏ రోగినీ పల్లెత్తు మాట అనటం వినలేదు. ఈయనకు ఇంత ఓర్పు ఎక్కడిది?

అదే, తనకు నచ్చిన పనిలో అలుపు వుండదు. తన ఆశయం నెరవేరినపుడు ప్రతిఫలంపై ఆశ వుండదు. రైతులు, కూలీలు పాము కరిచినా-తేలుకుట్టినా మంత్రాలు వేస్తే కోప్పడి యాంటివెనమ్ వాక్సిన్ ఎప్పుడు సిద్ధంగా వుంచేవారు.

పిచ్చికుక్కలు, మామూలు కుక్కలు కరిచినా, కుక్కను వారం రోజులు జాగ్రత్తగా చూడమని ఇంజక్షన్‌లు ఇచ్చేవారు. కక్షలతో తలలు పగిలి వచ్చేవారు. తెల్లని కట్లతో మంచి మాటలతో వెళ్ళేవాళ్లు.

రెండో వర్గం వారు-దెబ్బలతో గాయాలతో వచ్చేవారు. వారికీ వైద్యం చేసి-ఎందుకీ ఆవేశాలని కోప్పడేవారు.

చిరుతిళ్ళు, సీమతుమ్మకాయలు తిని పైత్యం తెచ్చుకుంటే ఉప్పునీళ్ళు తాగించి కక్కించారు. ఇలాగే చిరాకు పెట్టిన మరొకసారి కర్ర పుచ్చుకుని వెంటబడ్డారు. కొంతదూరం పరుగెత్తి ఎదురుతిరిగాను. 'ఏమిటీ కొడతారా? నేను అమ్మదగ్గరికి వెళ్ళిపోతాను'. అంటే ఆయన బావురుమన్నాడు. నేనే ఓదార్చాను. మరోసారి అలిగి పారిపోయి ఒక రాత్రి ఇంటికే రాలేదు. ఎక్కడికి వెళ్తాను? కోపంతోనే నాలుగు మైళ్ళు నడిచి హైస్కూలుకు వెళ్ళి, రాత్రి బెంచి మీదే పడుకున్నాను. తిండిలేక నిద్రపట్టలేదు. ఎలా వచ్చారో మరి లాంతరు పుచ్చుకుని వచ్చారు. లే ఇంటికి పద అని తీసుకు వెళ్ళారు.

హైస్కూలులో భోజన సమయంలో క్యారేజీలతో పంటచేను బోది ప్రక్కన కూర్చుండేవాళ్లం. అందరం కూరలు పంచుకునేవాళ్ళం. 'వీడికి రోజూ దోసకాయపప్పేరా' అని నన్ను వెక్కిరించేవారు. వీళ్ళలాగా నాకు అమ్మ వంటలేదని తెలీదుకదా!

చిన్న చిన్న నాయకులు వచ్చేవాళ్లు. మావూరు రండి అని. చిన్నారుల నుంచి విడిపూలే తప్ప దండలు వేయించుకోలేదు. ఎపుడో 'రోజులు మారాయి' సినిమా-బండి కట్టించుకుని వంటచేసుకుని రాత్రి ఆవూరు నాలుగు మైళ్ళు వెళ్ళాం, సినిమా నాలుగు ఇంటర్వెల్‌లో చూసి రాత్రి అక్కడే స్కూలులో నిద్రపోయి మర్నాడు ఉదయం బండిలో రావటం! ఇందతా ఎందుకు? తల్లి లేని నాకు ఏలోటూ రాకూడదనే. ఇపుడు తలుచుకుంటే హృదయం ద్రవించి పోతోంది.

బందరు కాలేజిలో చదువుతున్నప్పుడు నెలకు ఒకసారి బియ్యం-ఉప్పు-పప్పు అన్ని మూట గట్టి తెచ్చి మెస్సులో ఇచ్చేవారు.

బందరు కాలేజిలోకి రాక ముందు నువ్వు డాక్టరు చదవవా? అని నా మనసుతెలిసే అనుమానంగా అడిగారు. ఇప్పటి దాకా మందుల వాసనలోనే పెరిగాను. నీ అహోరాత్రుల సేవ చూస్తూనే వున్నాను. నేను కూడా ఇదే పని చేయాలా? పాపం ఆయన బలవంతం చేయలేదు.

ఎప్పుడైనా ఆయన రాక తెలియక క్రిష్ణకిషోర్ సినిమాకో వెళ్లితే, పాపం-వచ్చే వరకు అక్కడ అరుగు మీద మూటతో కూర్చునేవారు. జరిగింది తప్పో ఒప్పో తెలియక ఆయనను కళ్లెత్తి చూడటానికి జంకి, కళ్ళు దించుకునే వాళ్లం.

మద్రాసు మెడికల్ కాలేజీలో చదివిన ఈయన ఇలా అరుగుమీద కూర్చుని మాకు మూటలు మోయటం మేమిటి? ఎంత ముళ్ల దారి ఎంచుకున్నారు?

కాని ఆయన ఎప్పుడూ అలా అనుకున్నట్లు నా కన్పించలేదు. అదే వూళ్ళో- తుఫానులు చూశాము. ఉప్పెనలు చూశాం. వేసవి ఎండలు కనీసం గాలి కూడ లేని పగళ్లు. చిక్కని పొగ మంచులో మునిగిన ఊరు పదిగంటల దాకా నిద్ర లేవక పోవటం చూశాం. చిక్కని చీకటి రాత్రిలో చుక్కల

ముగ్గులు చూశాం. వసంత రాత్రుల వెన్నెల్లో తడిసిన ఇసకలో ఆటలూ ఆడాం. ప్రతి పండగ నిండుగా చూశాం. సంక్రాంతి నెల రోజులూ పండగే. అపుడు రోగుల తాకిడి తక్కువ. రోజూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఇద్దరం చదివే వాళ్ళం. అపుడే రీడర్స్ డైజష్టు-స్పాన్ కూడా వస్తుండేవి. ముందు అమెరికన్ రిపోర్టర్‌గా వుండేది. అది పోస్ట్‌మాన్ తెచ్చి ఇచ్చిన రోజు పండగే. ఎవరో అతిథి వచ్చినట్లు సందడి. తరువాత 'ముముక్షువు' తెప్పించారు.

రేడియో కూడ లేదు. అయినా అన్ని వార్తలు చేరేవి. నెహ్రూ గారు బెజవాడ వస్తున్నారు. అంతే ఇద్దరం ఇక్కడ బస్సెక్కి గుడివాడలో రైలెక్కి అంత జనసముద్రంలో ఆయన మాట్లాడటం వినివచ్చాం ! (అపుడు కమ్యూనిస్టులను బాగా తిట్టారు ఆయన.)

వేసవి శెలవలు వస్తే-బెజవాడ అమ్మమ్మ ఇంటికి వెళ్ళేవాడిని. నన్ను పంపే ముందు-ఎంత తతంగం నడిచేదో. ఉదయాన్నే క్రాపు చేసి తలంటేవాడు మంగలి. దాపుడు బట్టలు తీసుకుని సంచిలో సర్దుకుని వెళ్ళేప్పుడు హుషారుగా వుండేది. ఊళ్లో స్నేహితులు విచారంగా వుండేవారు. ఆయన ఒక్కడే వుండాలి. కాని నాకోసం ఆయన ఆ భావన కనపరిచేవారు కాదు. వయసు మీరినపుడే ఈ బాధ నాకు తెలిసింది. ఎంతగా ఏకాంతాన్ని ఒంటరి తనాన్ని అనుభవించారో. తోడులేక, మాట్లాడే వాడు (రాత్రిళ్లు) లేక ఎంత దిగులు పడ్డారో తలుచుకుంటే కన్నీళ్ళాగవు. ఆయన స్నేహానికి ప్రాణం ఇచ్చేవారు. అలా అని ఎంతో మంది స్నేహితులు లేరు. ఎక్కడో దారీ తెన్నూ లేని చెన్నూరులో విజయరామరాజు, ఆయన భార్య సరోజిని ఈయనకు ఆత్మీయులు. అక్కడ ఒక్క సంవత్సరం ఊళ్లో వున్నపుడే సరోజిని మా అక్కవయసే, అదిగో వాళ్లను చూడాలనిపించి చద్ది అన్నంతిని-బయలుదేరాం చేలకు అడ్డం పడి-చేలలో దారి ఉండదు. మోళ్ళుంటాయి. అలాగే ఎన్నిగంటలు నడిచామో? ఈయన దగ్గర ఏ GPS వుందో చివరికి ఆ వూరు చేరాం. వాళ్ళు మాకు ప్రాణం పెట్టారు. వూరంతా ఆయన్ను చూడటానికి వచ్చారు. ఇవేనా చిన్ని చిన్ని ఆనందాలంటే? సరోజిని అక్క అమ్మను తలుచుకొని కళ్ళు తడుపుకుంది.

అపుడపుడు బాబాయి ఊరు వెళ్లేవాళ్లం. అక్కడే మాకు కొంత పొలం ఉంది. ఆ గట్లన్ని తిరగి ఇది ఆవ, ఇది గరువు, ఇది చెరువుచేను అని చెప్తుండే వారు. చెరువులో చేపలు పట్టించేవాళ్ళం. అప్పుడు వాళ్ల నాన్నగారి కబుర్లు చెప్పేవారు. 'అరే మీ తాత ఈ ఊరికి పెద్దమనిషిరా- ఏ తగవు వచ్చినా ఆయనే తీర్చాలి. ఒకసారి ఇలాగే ఇద్దరికి పెద్ద చేప వలలో పడింది. ఇద్దరికీ వాటా కుదరలేదు. మీ తాత దగ్గరకు వస్తే 'ఏదీ చేపను పట్టుకు రండిరా' అని పట్టుకున్న తర్వాత కత్తితో ఒక్క వేటు వేశాడంట. ఎవరి చేతిలో వుంది వాళ్లకే పొండి. అని తగవు తీర్చాడని' గొప్ప చెప్పేవారు.

పెద్దపాలేరు కాపు నారాయణ ఏం బాబాయ్ బాగున్నారా అని ఆప్యాయంగా పలకరించేవాడు. కర్రి గిత్తను కాడికిందకి తేవాలి బాబాయ్ అని చెప్పేవాడు. చిన్న పాలేరు యేసు తాతయ్యా నా కాలికి దెబ్బ తగిలింది మందెయ్యవే! అని వచ్చేవాడు. మా పురోహితుడు- అన్నయ్యా ఎన్నాళ్ళయింది నిన్ను చూసి, పెద్దాడికి పెళ్ళి చెయ్యవా? ఉద్యోగం చేస్తున్నాడటగా అని కుశలం అడిగేవాడు.

నాతోపాటు ఆయనకు అక్కడున్న ఒక్కరోజు సెలవే! తమ్ముడుతో కష్ట సుఖాలు పంచుకునేవారు. 'అన్నయ్యా చిన్నవాడిని దత్తత చేసుకుంటాను' అన్నాడు బాబాయి. 'అది న్యాయంగా వుండదురా నీ వదిన కూతుర్ని కూడా పెంచుకో-నీ భార్య తరపున కూడా చుట్టరికం నిలబడుతుంది.' అని పిన్ని అక్కకూతుర్ని కూడ పెంచుకోవటానికి ఒప్పించారు. అప్పుడు తమ్ముణ్ణి దత్తత ఇచ్చారు. ఇదే తమ్ముడు తనవాడయినా ధర్మం చెప్పటమంటే.

బెజవాడలో ఈయనతో పాటు మద్రాసు మెడికల్ కాలేజీలో చదివిన వాళ్ళు నలుగురు డాక్టర్లు నాకు తెలుసు. వాళ్ళు చాల పెద్ద ఆసుపత్రులు కట్టారు. ఇక సంపదకు కొదవేముంది? అపుడప్పుడు నేను ఏదయినా ప్రయాణం చేసేప్పుడు మూడోక్లాసులో (అప్పుడు అదే) ఎక్కలేక! అరే ఈయనకూడా సంపాదించితే నేను ఫస్ట్‌క్లాస్‌లో వెళ్ళే వాడికికదా అనుకునేవాడిని. తన మేనమామకు నాగపూరు హైకోర్టులో ఏదో దావా వుంటే వాళ్లిద్దరితోపాటు నన్నూ ఆ వేసవి ఎండలో తీసుకు వెళ్లారు.

అపుడే నాగపూరులో ఎంతోమంది తెలుగు వాళ్లను చూశాను. నీళ్ళు వేడెక్కి పోతుండేవి. రైలు (బొగ్గు బండే) ప్రయాణంలో-సీసా చుట్టూ గుడ్డ కట్టి మధ్యలో తడుపుతూండే వారు. లోపలి నీళ్లు చల్లగా వుండేవి. ఎంతయినా సైన్సు స్టూడెంటుకదా ! చాలాకాలం పూజలు పునస్కారాలు వుండేవి కావు మా యింట్లో.

వయసు మీరిన కొలది నమ్మకాలు పెరుగుతాయి. వినాయకచవితికి కథ చదివించే వారు. దసరాకి అమ్మ బొమ్మకి నమస్కారం చేయించేవారు. అమ్మ దసరారోజునే పోయింది. చాలా మంది మళ్ళీ పెళ్ళి చేసుకోండి డాక్టరు గారు అనేవారు. ఆయన నవ్వి నన్ను చూసేవారు.

అపుడు నాకర్థం కాలేదు. ఆయన త్యాగం. అనుభవించ వలసిన వయసు అంతా హారతి ఇచ్చి–నాకు వెచ్చని జీవితాన్నిచ్చారు.

బందరులో డిగ్రీ అయిపోగానే– 'నీకు కూడా పట్టా వచ్చింది. నాబాధ్యత అయిపోయినట్లే, ఏదయినా ఉద్యోగం చేసుకో' అన్నారు. ఈ పల్లెటూళ్లో ఇరవయి ఏళ్ళు నీ నీడలో కష్టం (?) తెలియకుండా గడచి పోయాయి.

ఇపుడు ఎక్కడికి వెళ్ళాలి. నిన్ను వదిలి? ఏమి ఉద్యోగం చేయాలి? అంతా అయోమయమే. కాని ఆయన నన్ను అక్కడ ఉండనివ్వలేదు. ముందు బెజవాడ, తర్వాత మద్రాసు అయిదు వందలు ఇచ్చి (ఎక్కడో అప్పు చేసి) పంపారు.

9 రూపాయల టిక్కెట్టుతో మద్రాసు రైలెక్కాను. నేను మద్రాసులో ఉండగా ఒక్క ఉత్తరం రాశాను ఆయనకు. ఏదో ఉద్యోగం వచ్చింది మిలిటరీలో, మెడికల్ టెస్ట్‌కు వెళ్తున్నానని. నాకు వెంటనే సమాధానం వచ్చింది.

ఉద్యోగంలో చేరితే రావటానికి వీలుంటుందో లేదో ఒకసారి వచ్చి వెళ్లు అని. అలాగే బెజవాడ దిగి గుడివాడ రైలెక్కి అక్కడి నుంచి బస్సులో ఆవూరు రాత్రికి చేరాను.

అప్పటికీ గుడ్డి దీపాలే. చలిగానే వుంది ఆరాత్రి–ఆ గుడ్డి వెల్తురులో–ప్రక్కలో కూర్చొమన్నారు. నా చేయి పట్టుకుని నాకు ఏంజైనా పెక్టోరిస్, నైట్రో గ్లిసరిన్ టాబ్లెట్ వాడుతున్నాను.

నాకేదయినా జరిగితే పెద్దన్న దగ్గరకు వెళ్లు–బాబాయిని కలుస్తుండు అన్నారు. నీకు పెళ్ళి చెయ్యలేదు– మావయ్య కూతుర్ని చేసుకో అన్నారు. అపుడు ఆమాటల్లోని తీవ్రత నాకు తెలియలేదు.

మద్రాసులో సంపదల సంరంభాన్ని చూసిన నేను, 'నువ్వు డబ్బును ప్రేమించలేదా' అన్నాను. 'ఈ పరిసరాలు, ఈ పరిమితులలో ఈ అమాయకుల ముఖాల్లోని ఆనందమే నా సంపద' అన్నారు.

ఆరోజుల్లోనే ఆ వూళ్లో చిన్ని మండపం కట్టించి అందరితో సాయంత్రాలు భజనలు, ప్రార్థనలు చేయించారని పోస్టుమాస్టారు చెప్పారు. ఆ మర్నాడే బయలుదేరి మద్రాసు వెళ్లిపోయాను. ఒక నెలరోజులలోనే అన్నయ్య ఉత్తరం రాశాడు నాన్నను తన దగ్గరకు తీసుకు వస్తున్నా అని. (గుంటూరు–తెనాలి మధ్య)

ఆయన రాక మునుపే అక్కడకు చేరాను. తన ఆశయంతో సేవా జీవితాన్ని గడిపిన ఆ వూరు వదిలి చుట్టు ప్రక్కల వూళ్ళ జనాల వీడ్కోలు తీసుకుని, అన్నయ్యతో పాటు వచ్చారు. అప్పటికి అన్నయ్యకు కొడుకు – మనవడితో ఒక్కరోజే ఆడుకున్నారు.

ఆ రాత్రే–నాకళ్ళముందే–నా కళ్ళల్లోకి చూస్తూనే కన్నుమూశారు. ఎంతో మందికి జీవితమంతా సేవచేసిన ఈయన ఎవరితోనూ చేయించుకోకుండానే వెళ్లిపోయారు.

నాకు ఏడుపు రాలేదు–ఇలాంటి మనిషి ఎక్కడైనా ఉంటారా? నీ చుట్టూ ఉన్న సంఘం నుంచి ఏమీ ఆశించ కుండా–రోగుల మధ్యలోనే తన అవసరమున్న జనాల మధ్యలోనే జీవితాన్ని ఎంతో అర్థవంతంగా గడిపిన ఈయన ఏమి సాధించారు. సంపద వెనక వేశారా? కీర్తి గడించారా? సన్మానాలు చేయించుకున్నారా?

ఏ ప్రయాణంలోనో ఎవరో కలిసి అరే డాక్టరు గారబ్బాయి. బాబూ బాగున్నారా? ఇదిగో వీడు నాన్నగారు పురుడు పోసినవాడు, అని పరిచయంచేసి అంటుంటే అవాక్కయిపోతాను.

ఆవూళ్లో పోస్టుమాస్టరు, డ్రిల్లు మాస్టరు, మున్సబుగారు, ఏసోబు వాళ్ళేనా ఈయన ఆత్మీయులు? వాళ్ళందరి పిల్లల్నీ చదివించమని సలహాలిచ్చి సహాయం చేసేవారు.

ఎంత సింపుల్‌గా జీవించారు, ఎంత ప్రశాంతంగా వెళ్ళిపోయారు!

అక్కడనుంచి మా వూరు–వాళ్ల నాన్నగారు–మాతాతగారివూరే తీసుకువచ్చి ఆయన తమ్ముడి దు:ఖాన్ని ఆపలేక, మా పిన్ని ఏడుపుని చూడలేక,

ఈ వార్త తెలిసిన డాక్టరు గారి పేషెంట్ల బారులను ఆపలేక, నేను ఏడవలేక పోయాను. ఆ దు:ఖం నన్ను ఈ నాటికి వరదగుడిలా చుట్టివేస్తుంది.

## యాత్ర :

ఇంకా ఊరు నిద్రలేవలేదు
అంతా ప్రశాంతంగా ఉంది.
రాత్రి పేర్చిన చితి మంచుకు తడిసి –
చీకటి ముద్ద కట్టినట్లుంది
అక్కడే పడుకో బెట్టాం కాళ్ళు, చేతులు సర్దాం –
పంచ సవరించాం చల్లగా పరుచుకున్న
చావుని – పిడకలతో కప్పాం
బిగుసుకుపోయిన దేహం, అన్నిటికీ అతీతంగా.

ఎప్పుడో ఎక్కడో మొదలైన యాత్ర
ఎన్ని మలుపులు, ఎన్ని మజిలీలు తిరిగి, ఆగి,
ఎన్ని అనుభూతులు – ఎన్ని అనుబంధాలు
పెంచుకుని – తెంచుకుని,
తనను మోయటానికి అన్నట్లు
నలుగురిని కని పెంచి,
ఏమో ఏ ఒక్కడో దేశాంతరం పోతే?
అందుకే ఓ తమ్ముణ్ణి ఉండమని,
తన బ్రతుకు మలుపులే కాదు, చివరలూ తనకు
తెలిసినట్లు –
చిట్ట చివర – తన చితిని తనేపేర్చుకున్నట్లు –

"రండిరా రండి, సాయంపట్టండి,
ఈ కాస్త దూరం నన్ను మోయండిరా–
అన్ని ఇచ్చి – అన్ని వదిలి,
ఇప్పుడు ఈ చితిమీద...
ఆగండి. ఒక్కసారి నన్ను చూడండి –
తర్వాత ఉండనుకదా,
ఈ కట్టెలు అంత కఠినంగా లేవు,
ఇప్పుడు అంటించండిక, మండించండి –
ఏడవకండేడవకండి
ఈ యాత్ర ఇంతటితో చాలిస్తా
మీరు ఇళ్ళకు పొండి,
కాస్త ఎంగిలిపడండి...
ఏడవకండేడవకండి..."

కట్టెలు ఇష్టం లేకుండా అంటుకుంటున్నాయి.
ఎంతో కష్టం మీద మంటలు లేచాయి.
మంచు కరిగిపోయింది – చలి పారిపోయింది
మంటలు నాలుకలు చాస్తున్నాయి.
నిప్పు కణికలు – మిణుగురుల్లా ఎగురుతున్నాయి.
ఓ అరగంట నుంచున్నాం,
ఇంకో అరగంట కూచున్నాం,
కపాల మోక్షం అయిందన్నారు.
మంటలు తగ్గినాయి
దు:ఖం గూడు కట్టిన గుండెల్లోంచి, రక్తం చిందదే?
ఎర్రబారిన కన్నుల్లోంచి నీళ్ళు రాలవే?

నిశిరాత్రి చివర్లో – ఊరి పొలిమేరల్లో,
అప్పుడే అంటుకున్న చితిమంటల వేడికి
నిశ్చేతనంగా నిలుచున్నా –
నివ్వెరపోయి చూస్తున్నా –
ఏడుపురాదే ?
ఈ మంటలు గుండెల్ని కాలుస్తున్నాయి,
ఈ నివురు కణాలు కన్నుల్లో మండుతున్నాయి
శోకమా, గుండె గూడు తడుతున్నా –
నీ చీకటి గూటిలో కాస్సేపు సేద తీరనీయి –
దు:ఖమా – దయచూపు !



# కుప్పడు

– సీకల వేణుగోపాల రెడ్డి

ఆ రోజుల్లో అణాకు పన్నెండు దమ్మిడీలు. దమ్మిడీకి ఒక ఇడ్లీ. అణాకు కొంటే ఒక ఇడ్లీ కొసరు. 'కొసరు' అంటే అడిగితే అదనంగా ఇచ్చేదన్నమాట. అందులో ఆరిడ్లీలు నాకు. మా తమ్మునికి ఆరు. కొసరు ఇడ్లీ పక్కింట్లో ఉంటున్న ఎరుకల ఎంకటిగాడి పాపకు మా అమ్మ ఇచ్చేది. మొదట మా గురువు చెంగల్ రాయ పిళ్లె. తర్వాతేమో దైవశిఖామణి. ఉదయం ఆరు గంటలకే బడి. కంఠోపాఠం చేయవలసిన ఎక్కాలు, పద్యాలు అప్పుడే చదువుకొని ఇంటికెళ్ళాలి. మరల తొమ్మిదింటికి బడి, ఉదయమంతా తెలుగు పాఠాలు. చరిత్ర, భూగోళం, సైన్సు, ఇప్పటిలాగ పరిసరాల విజ్ఞానం ఉండేవి కావు. సాయంకాలం లెక్కలు మాత్రమే. ఇంగ్లీషు, హిందీ అసలు లేవు. ఇక సెలవు లందామా అన్ని పండుగలకూ ఉండేవి. ప్రతి అమావాస్యకూ ఆట విడుపు తప్పనిసరి.

అమావాస్య ఆటవిడుపు తెలివైన వారికి ఆనందాన్ని అక్కర లేనివారికి భయాన్ని కలిగించేది. అమావాస్యకు ముందు రోజు పలకల్లో మంచి పద్యాలు రాసిస్తారు గురువు. ఆమావాస్యకు మరునాడు ఆ పద్యం చూడకుండా రాయాలి. అప్ప చెప్పాలి. గురువు చండశాసనుడు. ఒప్పగించకపోతే ఉగ్రుడు అయిపోయేవాడు. పెద్ద పద్యం కావలిస్తే అర్థ అణా, చిన్న పద్యానికి కాలణా గురువుకు కానుకగా ఇవ్వాలి. అలాంటి వీధి బడిలో చదివి అయిదవ తరగతి దాటి ఆరు ఇడ్లీల టిఫిన్ కేరియర్, లేకుంటే మజ్జిగ అన్నం, అనుపానంగా ఊరగాయో, లేక శెనగగింజలో తీసుకొని మూడు మైళ్ళు నడిచి వెళ్ళి ఆరవ తరగతిలో చేరాను. అక్కడేమో చరిత్ర, భూగోళం చెప్పేవారు. ఇంగ్లీషు కూడా నేర్పించే వారు.

ఇంతకూ నేను ఆరో తరగతిలో చేరటానికి ముందు ఇంటి వద్ద పెద్ద ఆటంకం ఏర్పడింది. నాన్న ఒక్కడే కదా! ఎద్దులు పట్టుకొని, బాన, మోకు ఎత్తుకొని, బండిదిండ్లు మోసుకొని దేశమారెమ్మగుడి బావికి వెళ్ళి కపిలె కట్టి వరిమడి పారించాలి. మడవలు మార్చాలి. ఇది ఒకడి వల్ల అయ్యే పనికాదు. పెదబ్బను బడికి పంపనని కూర్చున్నాడు మానాన్న. ఆయనన్నది నిజం. కూలి ఇవ్వటానికి డబ్బేది? నా చదువు అంతటితో ఆగిపోయింది. వారం రోజులు జరిగిపోయాయి.

ఆ రోజు నా బతుకులో వెన్నెల విరబూచిన రోజు. తోలుతో తయారు చేసిన కపిలెబాన చినిగిపోతే కుట్టటానికి వచ్చాడు వెలివాడ నుండి కుప్పడు మా ఇంటికి. అతడు చదువు కోలేదు. బానలు కుట్టి, చెప్పులు కుట్టి బతుకుతాడు. తీరుబాటుంటే కూలి పనికి వెళ్ళి బతుకు బండినిలాగు తున్నాడు.

''పెదబ్బా! బడికి పోలేదా'' అన్నాడు కుప్పడు, నన్నుచూసి– "నాయన వద్దన్నాడు." – "ఎందుకూ, దూరమని పోనన్నావా?" – "లేదు" – "మరెందుకు పంపలేదు?"– "దేశమారెమ్మగుడి బావి దగ్గరికి ఎద్దులు పట్టుకెళ్ళాలట. కపిలె తోలాలట. మడవలు మార్చాలట. మనిషి సాయం కావాలట" అని అన్నాను. కుప్పడు బాన కుట్టుతూనే ఉన్నాడు. **పేదరికానికి గుర్తుగా దానికెన్ని మాసికలు!** కొత్త బాన కొనడానికి డబ్బుండేది కాదు.

ఇంతలో కిర్రు చెప్పుల శబ్దం వినిపించింది. నాన్న వస్తున్నారు. కుప్పడి కంటె నాన్న వయసులో ఎంతో చిన్నవాడు. నేను అక్కడనే ఉన్నాను. "గంగిరెడ్డీ! పెదబ్బను ఇస్కూలుకు పంపించు. నేను సేద్యం చేస్తాను" అన్నాడు కుప్పడు స్థిరంగా.

"నిన్ను నమ్మిన దేవుడు–గుళ్ళోకి చేరినట్లే" అన్నాడు నాన్న. "నువ్వు వెయ్యిళ్ల పూజారివి!" అనీ అన్నాడు. నాన్న వీలు కాదంటున్నాడు. కుప్పడు బడికి పంపాలంటున్నాడు. "నీకెందుకు పగలంతా కూలీనాలీ చేసినా దేశమారెమ్మగుడి నేలకు రాత్రుల్లోనే నీళ్ళు పారిస్తా" నన్నాడు. చివరికి నాన్న కాదనలేకపోయాడు. ఆ మరుసటి రోజే బడిలో చేరాను. రాత్రిళ్ళు కుప్పడు మడికి నీళ్లు పారిస్తూనే వున్నాడు. అన్ని పరీక్షలు పాసయ్యాను. కుప్పడు చెప్పులు కుడుతూనే ఉన్నాడు. నేను తెలుగు పండితుడిని అయ్యాను. కుప్పడు కపిలె బానలు కుట్టుకుంటూనే బతికాడు. చాల ఏళ్ళు ఉద్యోగం చేశాను. తర్వాత ఉద్యోగ విరమణ చేశాను. అక్షరాలు రాని కుప్పడు నాకు ఆనాడు పెట్టిన అక్షరభిక్ష నాయీ బతుకు. ఇప్పుడు కుప్పడు లేదు; నేనున్నాను, అతని త్యాగం ఉంది! కుప్పడు పెట్టిన భిక్షతో పుస్తకాలు చదువుకుంటున్నాను.



# అట్టమీది బొమ్మలు

**మిసిమి** నాలుగు అట్టలు నల దమయంతి కథకు సంబంధించినవి. పురాణపురుషుడైన నలుడు షట్చక్రవర్తులలో ఒకడు. నిషధ రాజు వీరసేనుని పుత్రుడు. దమయంతి విధర్భరాజైన భీముని కుమార్తె. నలుడు ఒక హంసను రక్షించగా ఆమె నల దమయంతుల మధ్య ప్రేమ రాయబారం నడిపి ఒకరిపై మరొకరికి అనురాగం కలిగేలా చేస్తుంది. దమయంతికి తండ్రి స్వయంవరం ప్రకటిస్తాడు. దమయంతి సౌందర్యం చూసి మోహపరవశులైన దిక్పాలకులు నలుని వద్దకు వచ్చి తమలో ఒకరిని వివాహానికి ఎంచుకోమని దమయంతికి చెప్పవలసినదిగా నలుని వేడుకొంటారు. నలుడు అదృశ్యునిగా వుండేలా వరం ప్రసాదిస్తారు.

దిక్పాలకుల మాటను గౌరవిస్తూ నలుడు తన నామధేయాన్ని గుప్తంగా ఉంచి, దమయంతి వద్దకు వచ్చి అష్టదిక్పాలకులలో ఒకరిని వివాహం చేసుకోమని చెబుతాడు **(ముఖచిత్రం)** ఆమె తాను నలుని తప్ప మరొకరిని వివాహ మాడనని చెప్పి నలుని ప్రతిపాదనను తిరస్కరిస్తుంది. ఈ విషయం దిక్పాలకులకు నలుడు అందస్తాడు. నలుని రూపంలో వారు స్వయంవరానికి వచ్చి దమయంతికి పరీక్ష పెడతారు. దైవకృపతో దమయంతి నలుని గుర్తించి, ఆ తరువాత స్వయంవరం ద్వారా నలుని వివాహ మాడుతుంది. **(2వ అట్ట)**

శృంగభంగం పొందిన కలి(శని) నలునిపై పగబూని, నలుడు జూదంలో పుష్కరునితో ఓడేట్టు చేస్తాడు. జూదంలో రాజ్యాన్ని, సంపదను కోల్పోయిన నలుడు భార్యతో అడవులు పట్టి పోతాడు. పక్షులను వేటాడటం కోసం తన మొల వద్దనున్న వస్త్రాన్ని తీసి వాటిపై పరచగా అవి ఆ వస్త్రంతో పాటు ఎగిరిపోతాయి. నగ్నంగా ఉన్న నలునికి తన చీరలో సగం చింపి ఇస్తుంది దమయంతి. **(3వ అట్ట)** అవమాన భారంతో నలుడు దమయంతిని ఆమె నిదుర పోతుండగా విడచిపోగా, దమయంతి తండ్రి వద్దకు చేరుతుంది. మంటలలో చిక్కుకున్న కర్కోటకుని రక్షించి అతని నుంచి వరప్రసాదంగా బాహుకునిగా రూపు మార్చుకుంటాడు. కోరినపుడు తిరిగి నలునిగా మారే వరంతో పాటు, అక్షహృదయం అనే వరం కూడా పొందుతాడు నలుడు. దానితోపాటుగా వాయువేగమనోవేగాలతో గుఱ్ఱాలను నడపగలిగిన అశ్వహృదయం అనే శక్తిని మరోవరంగా పొందుతాడు.

నలుని తిరిగి రప్పించటం కోసం – దమయంతి తండ్రి భీముడు ఆమెకు మళ్లీ స్వయంవరాన్ని ప్రకటిస్తాడు. ఇంతలో నలుడు బాహుకునిగా రూపాంతరం చెంది ఋతుపర్ణుని వద్ద వంటవానిగా చేరతాడు. దమయంతి స్వయంవర ఆహ్వానం అందుకున్న ఋతుపర్ణుడు, స్వయంవర నిర్ణీత సమయానికి తాను విదర్భ చేరలేనని మధనపడతాడు. కానీ అశ్వ హృదయం తనకు తెలుసునని వేయి యోజనాల్ని వాయువేగమనోవేగా లతో తాను రథం నడపగలనని తెల్పి నలుడు నిర్ణీత సమయంలో ఋతుపర్ణుణ్ని విదర్భ చేర్చుతాడు. **(4వ అట్ట)** బాహుకుడే నలుడని దమయంతి చెలికత్తె గుర్తిస్తుంది. నలుడు కర్కోటకుని వద్ద పొందిన వరంవల్ల నిజ రూపాన్ని పొంది దమయంతితోపాటు అక్షహృదయ వరంతో రాజ్యాన్ని తిరిగి జూదంలో గెలుపొందుతాడు. దీనితో నల దమయంతుల కథ సుఖాంతమవుతుంది.

ఈ కథను శ్రీనాథుడు శృంగారనైషధమన్న పేరుతో ప్రబంధపోకడలతో రచించాడు. ఇది సంస్కృతంలో హర్షుని నైషధానికి అనువాదమైనా స్వతంత్ర రచనలా సాగుతుంది.

# చరిత్ర గర్భంలోకి...

**గత సంచిక తరువాయి.....**

**– నండూరి పార్థసారథి**

విభిన్న నాగరకతలకు చెందిన దేశాల మధ్య సాంస్కృతిక వినిమయం (కల్చరల్ ఎక్స్‌ఛేంజ్) యుద్ధాల వల్ల కూడా జరుగుతుంది. వాణిజ్య, మైత్రీ సంబంధాల కంటే కూడా యిది ప్రధానమైన కారణం. ఇదొక విచిత్రమైన సంగతి; శత్రుదేశాల మధ్య సాంస్కృతిక మైత్రీబంధం! ఇందుకు ఒక ఉదాహరణ: గ్రీకు వీరుడు అలెగ్జాండర్ క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో మొత్తం ప్రపంచాన్ని జయించాలనే ఆశతో పెద్ద సైన్యంతో బయలుదేరాడు. ఈజిప్టు, మెసొపొటేమియా, యితర అరేబియన్ దేశాలను, పర్షియాను జయించి, ఆఫ్ఘనిస్తాన్‌ను కూడా దాటి ఇండియాలోని సింధు ప్రాంతం దాకా వచ్చాడు. నదులు, కొండలు, ఎడారులు దాటుకుంటూ, దారి పొడుగునా ఒక్కొక్క దేశంతో యుద్ధం చేస్తూ ఇండియాకు చేరడానికి ఎన్నో సంవత్సరాల కాలం పట్టింది.

అలెగ్జాండర్ జైత్రయాత్రాకాలం క్రీస్తుపూర్వం 334 నుంచి 323 వరకు – అంటే 11 సంవత్సరాలు. అన్ని సంవత్సరాలూ సైనికులు తమ కుటుంబాలకు దూరంగా వున్నారు. యాత్ర మార్గ మధ్యలో ఎండలకి, వానలకి, చలికి, ఆకలికి, రోగాలకి, ఎందరో సైనికులు మరణించారు. స్వదేశానికి దూరంగా చాలాకాలం వుండాల్సి వస్తుందని తెలిసే సైనికులు తమవెంట రకరకాల వాద్యాలను తీసుకువెళ్ళారు. యుద్ధానికీ యుద్ధానికీ మధ్య విరామ కాలంలో, ప్రయాణకాలంలో వారు శ్రమను మరచి పోవడం కోసం వాద్యాలను వాయిస్తూ, పాటలు పాడుకొంటూ వుండేవారు. ఎక్కడికక్కడ స్థానిక వాద్యాలను సేకరిస్తూ వుండేవారు. తమ వాద్యాలను స్థానికులకు యిస్తూ, వాటిని ఎలా వాయించాలో నేర్పుతూ, స్థానికుల వాద్యాలను తాము నేర్చుకుంటూ ఉండేవారు. కొందరు సైనికులు స్థానికులతో వివాహసంబంధాలు ఏర్పరచుకొనేవారు కూడా. అలెగ్జాండర్ తాను జయించిన దేశాలతో సుహృద్భావ సంబంధాలకోసం ప్రయత్నించే వాడు. తాను స్వయంగా ఇద్దరు పర్షియన్ స్త్రీలను వివాహం చేసుకున్నాడు. తన సైన్యంలోని 80 మంది ఉన్నతాధికారులకు 80 మంది పర్షియన్ ఉన్నత వర్గాల స్త్రీలతో వివాహాలు జరిపించాడు. గ్రీక్, పర్షియన్ ప్రజల మధ్య ఏమాత్రం శత్రుభావం లేకుండా చేశాడు. ఒకరి వాద్యాలను మరొకరు నేర్చుకోవడం ద్వారా, ఒకరి పాటలు మరొకరు పాడడం ద్వారా ఉభయదేశాల సంగీత పద్ధతులు కూడా పరస్పరం ప్రభావితమైనాయి.



**తంబూర (ఇండియా)**



**మెట్లుగల 5 తీగల తంబూర్ (ఇరాన్)**

అలెగ్జాండర్ తాను జయించిన ప్రతిదేశంలోనూ తన విజయచిహ్నంగా ఒక్కొక్క అలెగ్జాంఢ్రియా నగరాన్ని నిర్మింపచేశాడు. అలా నిర్మించిన 16 అలెగ్జాంఢ్రియా నగరాలలో మొదటిది ఈజిప్టులో యిప్పటికీ వుంది. పర్షియా తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌ను కూడా జయించి ముందుకు సాగిన అలెగ్జాండర్‌కు సింధురాజు పోరస్ (పురుషోత్తముడు)తో యుద్ధంలో తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. అతి కష్టంమీద ఎలాగో గెలిచాడు గాని ఆ ప్రాంతంలో తన అధికారాన్ని ఆట్టేకాలం నిలబెట్టుకోలేక పోయాడు. అతడి సైనికులు పూర్తిగా అలసి పోయారు. ఇక ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేమని మొరాయించారు.

నండూరి పార్థసారథి, ఫోన్: 9959734534

వారికి యింటి బెంగ ఎక్కువైపోయింది. అలెగ్జాండర్ వారి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అతడికి కూడా ఆరోగ్యం క్షీణించింది. జయించిన ప్రాంతంపై ఆధిపత్యాన్ని తన సైన్యాధిపతి సెల్యూకస్‌కు అప్పగించి తాను తిరుగుప్రయాణం సాగించాడు. స్వదేశానికి చేరకుండానే క్రీస్తుపూర్వం 323 సంవత్సరంలో బాబిలన్ వద్ద మరణించాడు. అప్పటికి అతని వయస్సు 33 సంవత్సరాలలోపు. తర్వాత సెల్యూకస్ చంద్రగుప్తుని చేతిలో ఓడిపోయి సంధిచేసుకుని, తన కూతురు హెలెన్‌ను చంద్రగుప్తునికిచ్చి వివాహం చేశాడు.

అలెగ్జాండర్ జైత్రయాత్ర ఫలితంగా గ్రీస్, ఈజిప్టు, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య సంగీతంలోనే కాక శిల్ప, వాస్తు కళలలో కూడా సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ కాలంలోనే ఆ దేశాలకు ఇండియాకు మధ్య కూడా సంగీత సంబంధాలు ఏర్పడే వుంటాయి. అశోకుడి కాలంలో భారత దేశానికి చైనాతో, ఆగ్నే యాసియా దేశాలతో సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయ సంగీత వాద్యాలు ఆ దేశాలలోకి ప్రవేశించాయి; వాద్యాలతో పాటు భారతీయ సంగీతం కూడా వ్యాప్తి చెందింది. ఆ విధంగా క్రీస్తు శకారంభానికి పూర్వమే యురేషియా అంతటా ఒక సంగీత సామ్రాజ్యం విస్తరించిందని చెప్ప వచ్చు. యురేషియా అంతటా వాద్యాల రూపాలలో, పేర్లలో పోలికలకు కారణం యిదే.



సితార్
(ఇండియా)



సితార్
(ఇరాన్)

ఇస్లాం మతం అవతరించింది క్రీస్తు శకం ఏడవ శతాబ్దిలో మాత్రమే. తర్వాత సుమారు మూడు శతాబ్దాలకల్లా ఆ మతం అరబ్ ప్రపంచమంతటా, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్‌ల మీదుగా ఇండియా దాకా వ్యాపించింది. అంత మాత్రాన ఆ దేశాలలోని సంగీతాన్ని ఇస్లామిక్ సంగీతమనడం అవివేకం. ఈజిప్టు, మెసొపొటేమియా (ఇరాక్), పర్షియా (ఇరాన్), ఇండియాలలో కొన్ని వేల సంవత్సరాల నాగరకతలున్నాయి. గొప్ప సంగీత వ్యవస్థలున్నాయి. వాటిని ఈజిప్షియన్, అరేబియన్, పర్షియన్, భారతీయ సంగీతాలని అంటారు, అనాలి; కాని 'ఇస్లామిక్' అనే మత పరమైన లేబుల్ తగిలించడంలో అర్థంలేదు. మతవ్యాప్తికోసం యుద్ధాలు జరగడం ఇస్లాంతోనే ప్రారంభమయింది. అంతకు ముందు జరిగినవన్నీ సామ్రాజ్యవిస్తరణకోసం జరిగినవే.

మరొక విషయం– యూరప్ అంతటా వున్నది క్రిస్టియన్ మతం. అయినా, యూరోపియన్ శాస్త్రీయ సంగీతాన్ని 'వెస్టర్న్‌క్లాసికల్ మ్యూజిక్' (పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం) అనే అంటున్నారు గాని 'క్రిస్టియన్ సంగీతం' అనడంలేదు. అలాగే, ప్రపంచంలోని యితర సంగీత పద్ధతులు కూడా ఆయాదేశాల పేర్లతోనే వ్యవహరింపబడుతున్నాయి– మతాలపేర్లతో కాదు.

'హిందుస్థానీ' సంగీతం అనే పేరు కూడా దేశాన్ని బట్టి వచ్చిందే– మతాన్ని బట్టి కాదు. తజకిస్థాన్, కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్కెమెనిస్థాన్, కిర్గిస్థాన్‌ల లాగా హిందుస్థాన్ అనే పేరుకూడా చాలా శతాబ్దాలుగా వాడుకలో ఉంది.

ఉత్తర భారత సంగీతాన్ని 'హిందూస్థానీ సంగీతం' అనడం అమీర్ ఖుస్రో కాలం నుంచే మొదలయింది. ఆ తర్వాత కొద్దికాలానికే దక్షిణ భారత శాస్త్రీయ సంగీతాన్ని 'కర్ణాటక సంగీతం', అనడం మొదల యింది.

అయినా, ఉత్తర దక్షిణ సంగీత పద్ధతులు రెండింటికీ నూటికి 99 వంతులు శాస్త్రం ఒక్కటే. రెండింటికీ నాట్యశాస్త్రం, బృహద్దేశి, సంగీత రత్నాకరం గ్రంథాలు శిరోధార్యాలు. రిషభం, గాంధారం, ధైవతం, నిషాదం స్వరాల తాలూకు రెండేసి రూపాలలో కర్ణాటక సంగీతంలో మొదటిదాన్ని శుద్ధస్వరంగానూ, రెండోదాన్ని వికృత స్వరంగానూ పరిగణిస్తారు. హిందుస్థానీ సంగీతంలో మొదటిదాన్ని వికృతస్వరంగానూ, రెండోదాన్ని శుద్ధస్వరంగానూ పరిగణిస్తారు.

గమకాల వినియోగ శైలిలో రెండు పద్ధతుల మధ్య కొంత తేడా ఉంది. అంతకు మించి ఉత్తర దక్షిణ పద్ధతుల మధ్య వైరుధ్యం ఏమీలేదు.

భారతీయ శాస్త్రీయ సంగీతం రెండు పద్ధతులుగా విడిపోయినా ఆ తర్వాత హిందూస్థానీ పద్ధతికి సంబంధించిన లక్షణగ్రంథాలు రచించిన వారంతా హిందూ పండితులేగాని ముస్లిములు కారు. ఆ రచనలన్నీ సంస్కృతంలోనో, హిందీలోనో వున్నాయి గాని ఉర్దూలో కాదు. అంతేకాదు– ధ్రుపద్, ఖయాల్, ఠుమ్రీ వంటి హిందుస్థానీ సంగీత రచనలు కూడా సంస్కృతంలో, హిందీలోనే ఉన్నాయి– ఉర్దూలో కాదు, పార్శీలోకాదు. సుప్రసిద్ధ హిందూస్థానీ గాయకులు అయితే హిందూ బ్రాహ్మణ పండితులు, కాకుంటే రాజకీయ కారణాల వల్ల ఇస్లాం మతం పుచ్చుకున్న హిందూ పండితులు– ఎక్కువ మంది బ్రాహ్మణులు– మధ్య ప్రాచ్యం నుంచి వచ్చిన ముస్లిములు కారు.

సంగీత సమ్రాట్ తాన్‌సేన్ జన్మతః హిందూ బ్రాహ్మణుడు. జైపూర్ ఘరానా ఆచార్యుడు, కేసర్‌బాయ్ కేర్కర్, మొగుబాయ్ కుర్డీకర్ వంటి గొప్ప గాయికల గురువు అయిన ఉస్తాద్ అల్లాదియా ఖాన్ గారు జందెం వేసుకొనేవారట – ఎందుకంటే ఆయన పూర్వీకులు హిందూ బ్రాహ్మణులట. ధ్రుపద్ సంగీత సంప్రదాయాన్ని ఇరవై తరాలుగా పరిరక్షిస్తూ వస్తున్న డాగర్ కుటుంబం వారు 16వ శతాబ్దం వరకు హిందూ బ్రాహ్మణులు. ఆ తరానికి చెందిన బాబా గోపాల్‌దాస్ పాండే అనే ఆయన అప్పటి పరిస్థితులకు తలవొగ్గి ఇస్లాంను స్వీకరించ వలసి వచ్చింది. అప్పటి నుంచి ఆయన పేరు బాబా ఇమాం ఖాన్ డాగర్‌గా మారిపోయింది. 'డాగర్' అనేది వారి ధ్రుపద్ బాణి (ఘరానా) పేరు. ఈ తరం ధ్రుపద్ విద్వాంసుడు పద్మశ్రీ ఉస్తాద్ వాసిఫుద్దీన్ డాగర్ చెప్పిన సంగతి యిది. డాగర్ గాయకులు పాడే సంస్కృత ధ్రుపద్ రచనలన్నీ హిందూ దేవుళ్ళను గురించినవే. వారు యిప్పటికీ హిందూ సంప్ర దాయాలను పాటిస్తున్నారు. మైహార్ ఘరానా ఆచార్యుడు ఉస్తాద్ అల్లా ఉద్దీన్ ఖాన్ పూర్వీకులు బెంగాలీ బ్రాహ్మణులు. ఆయన కూతురు సుర్‌బహార్ విద్వాంసురాలు అన్నపూర్ణాదేవి. ఆయన మనవళ్లు (అలీఅక్బర్ ఖాన్ కుమారులు) ఆశీష్ ఖాన్,





సరోద్ (ఇండియా) దుతార్ (తుర్క్‌మెనిస్థాన్)

ధ్యానేశ్ ఖాన్, ప్రాణేశ్ ఖాన్. సితార్ విద్వాంసుడు ఉస్తాద్ విలాయత్ ఖాన్ పూర్వీకులు హిందూ రాజ పుత్రులు. ఇలా ఎందరో!





8 తీగల సాజ్ (అజర్‌బైజాన్) కమాన్‌జ (ఇరాన్)

ఇండియలో అత్యధిక ప్రాంతం దాదాపు ఏడు శతాబ్దాల కాలం ముస్లిముల పాలనలో, ఇంకో రెండు శతాబ్దాలు క్రైస్తవుల పాలనలో ఉంది. అందుచేత తప్పని సరిగా భారతీయ కళలపై విదేశీ కళారూపాల ప్రభావం వుంటుంది. అయితే దాని వల్ల మన సంగీతానికి జరిగిన నష్టమేమీలేదు. పైగా కాస్తో కూస్తో లాభమే జరిగిందనే చెప్పాలి. వీణ, సితార్, షెహనాయ్, సన్నాయి, సంతూర్, సారంగి వంటి వాద్యాలన్నీ పర్షియా నుంచి దిగుమతి అయ్యాయనుకున్నా, వైలిన్, క్లారినెట్, గిటార్, మాండలిన్, శాక్సోఫోన్ పాశ్చాత్యవాద్యాలే అయినా వాటిపై మనం వాయించేవి మన రాగాలే, మన శాస్త్రీయ సంగీతమే. విదేశీయుల వల్ల మన శాస్త్రీయ సంగీతం మారలేదు. ఇక ముందు కూడా మారే అవశాశం లేదు. మన రాగాలను, మన గమకాలను పలికించగలిగే విదేశీ వాద్యాలను మాత్రమే మన కళాకారులు ఎంచుకుంటున్నారు. అవసరమైన చిన్న మార్పులు చేసుకుంటున్నారు. వైలిన్ పాశ్చాత్య వాద్యం. పాశ్చాత్య శాస్త్రీయ సంగీతంలో అదొక ప్రముఖ వాద్యం. అది యిప్పుడు మన కర్ణాటక సంగీతంలో అతి ప్రముఖ వాద్యమయింది. వైలిన్ ప్రక్క వాద్యం లేకుండా కర్ణాటక సంగీత కచేరీ జరగదు. దానిపై కర్ణాటక సంగీతం వాయించిన తొలి విద్వాంసుడు ముద్దుస్వామి దీక్షితుల తమ్ముడు బాలుస్వామి దీక్షితులు. కర్ణాటక సంగీత శాస్త్రీయతకు భంగం కలగకుండానే మాండలిన్ పై శ్రీనివాస్, శాక్సోఫోన్‌పై కద్రి గోపాలనాథ్ వాయిస్తున్నారు.

వైచిత్రి కోసం రాగా జాజ్‌స్టైల్, కర్ణాటక జాజ్ వంటి పేర్లతో ఎవరెన్ని ప్రయోగాలు చేసినా మన రాగం మారదు. మనది ఇస్లామిక్ మ్యూజిక్ కాదు, క్రిస్టియన్ మ్యూజిక్ కాదు– ఇది భారతీయ శాస్త్రీయ సంగీతం.

మిగతా వచ్చేసంచికలో...

# అను రాగం

ఏకాంతంలో ధ్యానస్థితిలో రాగాన్ని గానం చేస్తుంటే ..అది.. ఆ రాగం.. ఎంతో ఆత్మీయంగా, ప్రేమగా..ఏవో రహస్యాలు చెబుతున్నట్లు, గుసగుసలాడుతున్నట్లు, ఆక్రమించుకుంటున్నట్లు, లాలిస్తున్నట్లు అనుభూతి.

ఇదేమిటి? తనే కదా దానిని ఆవాహన చేస్తున్నది! తనే కదా దానిని ఆవిష్కరిస్తున్నది! తనే కదా దానిని సృష్టిస్తున్నది! తను గానం ఆపేస్తే అది వుండదుకదా! తను లేకుండా అది లేదుకదా!

ఏమో! ఇప్పుడు అది లేకుండా తనే లేదేమోననిపిస్తున్నది. తను పాడడం ఆపేసినా, వాద్యంపై వాయించడం ఆపేసినా.. ధ్యానంలో కూర్చున్నా, పడుకున్నా, నిద్రిస్తున్నా అది.. రాగం.. తనని ఆవహిస్తూనే ఉంది. తనలో...లోలో... రవళిస్తూనే వుంది. పరవళిస్తూనే వుంది. అసలు అదే తనని ఆవాహన చేసుకుంటున్నదా? కర్త.. ఎవరు? తనా, రాగమా? రాగంలో ఏదో అద్భుతమైన, అనిర్వచనీయమైన సమ్మోహక శక్తి వుంది. అది వట్టి స్వరాల ఆరోహణ, అవరోహణ కాదు; వాది, సంవాది, క్రమ సంచారం, వక్ర సంచారం కాదు. అది వట్టి



ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి



శాస్త్ర నిర్మితం కాదు. అంతకు మించినదేదో యిందులో వుంది. రాగం అచేతన వస్తువు కాదు. దానికి రూప, స్పర్శ, రస, గంధాలు లేవు. కాని, అది ప్రాణవంతమైనది. దానికి హృదయం వుంది. వ్యక్తిత్వం వుంది. అది ప్రేమిస్తోంది, ప్రేమింపజేసుకుంటోంది. పరవశిస్తోంది, పరవశింపజేస్తోంది.

ఇదంతా.. ఈ అనురాగకలాపమంతా.. శుద్ధ ఆలాపంలో, జోడ్‌లో, ఝాలాలో జరుగుతోంది. ఇది అనిబద్ధగానం. నిబద్ధగానంలో–ధ్రుపద్, ఖయాల్, ఠుమ్రీ, రచనలు, కృతి, కీర్తన, పల్లవి రచనలు గానం చేస్తున్నపుడు, వాద్యంపై వాయిస్తున్నపుడు – తబ్లా, పఖావజ్, మృదంగం వంటి లయ వాద్యం ఏదో వచ్చి జోక్యం చేసుకుంటుంది. రాగానికి, గాయకునికి మధ్య ఏకాంతానికి భంగం కలుగుతుంది. వారి ప్రేమ కలాపానికి అంతరాయం కలుగుతుంది. అందుకే అనురాగాలాపన ఆలాపనలోనే సాధ్యం. రాగానికీ, దాని ఆవిష్కర్తకీ మధ్య ఈ 'మధురానుబంధం', ఈ 'యోగం' ఆలాపనలో సాధ్యమైనట్లుగా యితర దశలలో సాధ్యంకాదు. బోల్ ఆలాప్, సర్గమ్ ఆలాప్ కాదు – శుద్ధ ఆలాప్‌లోనే సాధ్యం.

తాను లీనమై, తనలో లీనం చేసుకొనేదే నిసర్గరాగం .. అను రాగం.

*– నం.పా.సా.*

## చలనచిత్రం కళా?... కాదు వ్యాపారం

31వ పుట తరువాయి ...

వుంచుకుని పెద్ద పెద్ద సంగీత విద్వాంసులను ఆహ్వానించ సాగాను. వారిచేత త్యాగరాజు కీర్తనలు పాడించుకుంటూ, వింటూ, వారి సలహాలు తీసుకుంటూ, నేను పాడుతూ వుండేవాడిని. అప్పుడు మా రేణుకా ఆఫీసు పెద్ద 'సంగీతసభ' లాగా 'దేవాలయం'లాగా వుండేది. శ్రీయుతులు మహా రాజపురం విశ్వనాథయ్యర్, ద్వారం వెంకటస్వామి నాయుడు, పారుపల్లి రామకృష్ణయ్య, చౌడయ్య, మణి అయ్యర్, అరియక్కుడి రామానుజయ్యంగార్, బెంగుళూరు నాగరత్నమ్మ మొదలైన వారెందరో వచ్చి ఆఫీసులో నిత్యం పాడుతూ వుండేవారు. మా కార్యాలయంలో ఎందరో ఉండేవారు. అందరికీ భోజన వసతి సదుపాయాలు అక్కడే. ఐదుగురు వంటవాళ్ళు ఎప్పుడు చూసినా వంటలు చేస్తూనే ఉండేవారు. మా ఆఫీసు హడావుడి చూసి చాలమంది 'నాగయ్యగారి సత్రం' అనేవారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు అలా జరిగింది. ఆ రెండేళ్ళూ మా కార్యాలయం ఓంకారనాదంతో ప్రతిధ్వనించేది. ఎప్పుడూ సరస్వతీదేవి తాండవించేది. మహా విద్వాంసులందరి చేతా పాడించు కుంటూ, నేను పాడే విధానం వినిపిస్తూ వారి సలహాలు తీసుకుంటూ వుండేవాడిని. నా చిత్రానికి దర్శకత్వం వహించేవారికి సంగీత జ్ఞానం క్షుణ్ణంగా తెలిసి వుండాలని నేను భావించాను. బి.యన్.రెడ్డి, కె.వి.రెడ్డి వాహినీ చిత్రంతో బిజీగా వున్నారు. కనీసం సంగీతంతో పరిచయం వున్న వ్యక్తులచేతనైనా డైరెక్టు చేయించాలని అనుకుంటూ వుండగా నాకు 'అసిస్ట్' చేస్తూ వస్తున్న చంగయ్య నన్నే దర్శకత్వం వహించమని ప్రోత్సహించాడు. అలాగే పలువురు శ్రేయోభిలాషులూ సలహా ఇచ్చారు. నాకూ కొంత ధైర్యం వచ్చింది. ఎంచేతంటే మొదట్నించీ చిత్రం కథ గురించి నేనే ఎక్కువగా కృషిచేశాను; స్క్రీన్‌ప్లే రాశాను. నాకు ఆ కథమీద దాన్ని చిత్రంగా చెప్పే విధానంమీద పలుకుబడి ఉన్నది. పెద్ద దర్శకుల దగ్గర పనిచెయ్యడంతో సినిమా టెక్నిక్ బాగా అర్థమైంది. అవగతమైంది. ఆ విశ్వాసంతో నేనే చిత్రం డైరెక్టు చేయాలని నిర్ణయించుకుని, ప్రారంభించాను. సంగీత దర్శకత్వం నాదే. అప్పుడే ఎడిటింగ్ కూడా బాగా నేర్చుకున్నాను.

**చిత్తూరు వి.నాగయ్య** (స్వీయచరిత్ర నుంచి)

---

**సవరణ:** ***మిసిమి*–** ఫిబ్రవరి సంచికలో *తెలుగులో గ్రంథమాలలు* – వ్యాస రచయితగా వెలగా వెంకటప్పయ్య అని అచ్చయింది. ఆ వ్యాస రచయిత బిరుదురాజు రామరాజు – అని గమనించ గలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

**– సంపాదకుడు.**

---



## బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక

ఎప్పటిలాగానే 'మే' సంచిక "బుద్ధపూర్ణిమ" ప్రత్యేకం.

***మిసిమి*కి సహకారం అందిస్తున్న రచయితలకు ప్రత్యేక మనవి...**

బౌద్ధధర్మం, బౌద్ధ సిద్ధాంతం, బౌద్ధ చరిత్రతో పాటు విపశ్యన, పునర్భవం మొదలగు బౌద్ధ సంబంధమైన పరిశీలనా వ్యాసాలను ***మిసిమి*** కి పంపగోరుతున్నాము. బౌద్ధధర్మానికి, సమకాలీన జీవితానికి మధ్యనున్న సమన్వయతను విశ్లేషిస్తూ ఈ నాటి సామాజిక పరిస్థితుల్లో బౌద్ధం ప్రాముఖ్యతను తెలియజెప్పే వ్యాసాలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నాము. మీ వ్యాసాలు ***మిసిమి*** కార్యాలయానికి ఏప్రిల్ 2 లోపు చేరు విధంగా పంపించండి. ఈ విషయంలో రచయితల పూర్తి సహకారాన్ని ఆశిస్తున్నాము.

**బౌద్ధ చారిత్రక, విశేషాలతో కూడిన చిత్రాలు కూడా పంపించండి.**

**– సంపాదకులు**

## రెడ్డి రాజుల పాలనలో

# వసంతోత్సవము

- వేదుల రాజేశ్వరి దేవి

ప్రతియేట ఫాల్గుణమాసపు పౌర్ణమి రోజున భారతీయులందరూ 'హోళీ' పండుగ జరుపుకుంటారు. రజస్తమోగుణాలపై విజయకేతనం ఈ వసంతోత్సవం. ఋతువులన్నిటిలోనూ ఆహ్లాదకరమైనది, అందమైనది, సంఖ్యా (రోజుల) పరంగా అల్పమైనది, వసంతకాలం. రాత్రి చలి తగ్గుముఖం పట్టడం, పగలు ఎండ పలుచగా పరుచుకోగా, లేత ఆకుపచ్చ రంగులో కొత్తగా చిగుళ్ళు వేస్తున్న చెట్టు, కొమ్మలు, ఆకాసమంతా పందిరి వేసినట్లు నేత్రానందం కలగజేస్తుంటే, మరొక పక్క కోకిల కుహూ, కుహూ రవళులతో శ్రవణానందంగా ప్రకృతి దర్శనమిస్తుంది.

తెల్లటి పువ్వులతో, ఘాటైన వాసనలతో ఆరోగ్య ప్రదాయనియైన వేపచెట్టు విరబూసే రోజులవి. ఎక్కడ చూసినా ఒక నూతన యౌవనోత్సాహం వెల్లివిరిసేలా ఉండే వసంతకాలంలో, జరుపుకునే పండుగ వసంతోత్సవం. దీనినే కాముని పున్నమి అని, (శివ, పార్వతుల మధ్య ప్రేమ చిగురింప చేయడానికి ప్రయత్నం చేసి శివుని మూడవ కన్ను తెరవటంతో భస్మమయిన వాడు మన్మథుడు. ఆ సంఘటనకు గుర్తుగా) హోళీ అని (హిరణ్యాక్షుని సోదరి యైన హోళిగ నిప్పులలో కాలకుండా బ్రహ్మనుండి వరం పొందుతుంది. ప్రహ్లాదుడిని విష్ణుభక్తి నుంచి మరలించడానికి హిరణ్యాక్షుడు తన సోదరి హోళిగ ఒళ్లో ప్రహ్లాదునిని కూర్చుండ బెట్టి చుట్టూ నిప్పుపేరుస్తారు. ఈ నిప్పులలోకాలి హోళిగ మరణిస్తుంది. ప్రహ్లాదుడుని భద్రంగా నిప్పుల గుండం నుంచి బయటకు వస్తాడు.) పిలుస్తారు.

బృందావనం మధుర ప్రాంతాలలోని వారు దీనిని రాధాకృష్ణుల అమరప్రేమకు చిహ్నంగా ఒక వేడుకలా దీనిని జరుపుకుంటారు. బాల కృష్ణుడు తాను నల్లగా ఉన్నానని, రాధ యెందుకు తెల్లగా ఉందని తల్లి యశోదను ప్రశ్నించి విసిగించేవాడట. దానికి ఆమె రాధ ముఖానికి నల్లరంగు పూసి వుంచు, అప్పుడు ఆమె శరీర వర్ణం తెలుపు నుంచి నలుపవుతుందని సలహాయిస్తే, కొంటె కృష్ణుడు రాధతో పాటు గోపికలందరిపైనా రంగులు జల్లి హోళీ ఆడేవాడని జనశృతి.

ఇది ఒక ప్రాచీనమైన పండుగ. చరిత్రపరంగా ఎప్పుడు మొదలైందో సరిగ్గా అంచనా వేయలేము. ప్రేమకు చిహ్నంగా ఈ పండుగను జరుపుకుంటారు. ఉత్తరాదిన పిల్లలు, తొలి యౌవన శోభతో తుళ్ళిపడే యువతీ, యువకులు ఎంతో ఉత్సాహంతో జరుపుకునేది ఈ పండుగ. నిజానికిది ఒక కేళి. ఈ కేళి ఆటలో అందరూ తమను తాము మర్చిపోయి నిస్సిగ్గుగా ముచ్చటలాడుతారు. బహుశ ఒక్కరోజైనా నీవు నీ అస్తిత్వాన్ని, గుర్తింపుని పక్కన పెట్టి వ్యవహరించమనే తాత్వికత దానిలో ఇమిడి వుందేమో! పండుగ నాడయినా పాతమొగుడేనా! అనే సామెత నొక సారి గుర్తుకు తెచ్చుకుందాం. ఇదే నెలలో ప్రపంచ వ్యాప్తంగా యువతీ యువకులు వాలంటైన్స్‌డే అనే ప్రేమికుల దినం జరుపుకుంటారు. ఈ రెంటికీ చాల సామ్యం వుంది. అది కేవలం యాదృచ్ఛికమేనా?

జైమినీ వ్రాసిన పూర్వమీమాంసలోనూ, కథకుని గృహ్యాసూత్రాలలోనూ దీని ప్రస్తావన ఉంది. తెలుగు నాట ఇది తెలంగాణా ప్రాంతాలలో అనాదిగా వస్తూంది. ఇప్పటికీ కొనసాగుతుంది. ఆంధ్ర ప్రాంతంలో దీని ఉనికి కనబడదు. కానీ ఈ రంగుల వేడుక ఒకప్పుడు రెడ్డిరాజులకాలంలో ఉండేదనడానికి చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. చరిత్రపరంగా 1323వ సంవత్సరంలో వరంగల్లు రాజధానిగా ఏర్పడిన కాకతీయ రాజ్యం నాలుగు వందల సంవత్సరాల తరువాత ప్రతాపరుద్రుని మరణంతో పతనావస్థకు చేరుకుంటే ఆమరుసటి సంవత్సరమే కొండవీడు కేంద్రంగా (కృష్ణా జిల్లా) రెడ్డిరాజ్యం అవతరించింది. ప్రోలయ వేమారెడ్డి దీని స్థాపకుడు. అతని తదనంతరం అనపోతారెడ్డి, కుమారరెడ్డి నిడదవోలు, విజయనగర రాజ్యాల నుంచి శ్రీకాకుళం వరకూ తన రాజ్యాన్ని విస్తరించాడు (1386-1402). ఆ తరువాత పెద కోమటిరెడ్డి పాలించాడు. అతను మరణించిన నాలుగు సంవత్సరాలకే రెడ్డిరాజ్యం విచ్ఛిన్నం అయింది. (మొత్తం 100 సం॥ పాలన అనంతరం) ఈ రచనలో పొందుపరచబడిన వసంతోత్సవ వివరాలు రెడ్డి రాజులకాలం నాటివి.

- ఎన్నార్కె

---

**డాక్టరు వేదుల రాజేశ్వరీదేవి అర్థశతాబ్దం క్రితం వ్రాసిన రచన సులభగ్రాహ్యం కావడం కోసం యథాతథంగా ప్రచురిస్తున్నాము. రచయిత్రి ప్రస్తుతము విశాఖపట్నంలో ఉంటున్నారు.**

హిందూదేశమున అనుశ్రుతముగ వచ్చు ఋతు సంబంధమగు పండుగలలో ఇది ఒకటి. ఇది వసంత కాలమున మన్మథునిగూర్చి జరుపబడు పండుగ. కథా సరిత్సాగరములోను, వాత్స్యాయనుని కామసూత్రములలోను దీని ప్రసక్తి కలదు. వాత్స్యాయనుడు దీనిని 'సువసంతక' మనినాడు. కామసూత్ర వ్యాఖ్యానకర్త యగు జయమంగళు డు వినోదకరమగు నీ శృంగారక్రీడనే మదన మహోత్సవమని పేర్కొనినాడు.

గీర్వాణభాషయందున్న హర్షుని రత్నావళి నాటకము నందును, కాళిదాసుని మాళవికాగ్నిమిత్ర నాటకము నందునుగూడ దీనిని ప్రస్తావన కలదు. అందులో రత్నావళీ నాటకరచన వసంతోత్సవముతోనే ఆరంభమగును.



హేమాద్రి తన, వ్రత ఖండమున ఈ మహోత్సవము నొక వ్రతముగ జెప్పి తదాచరణ విధానమును వర్ణించినాడు. దాని ప్రకారము శుక్లపక్ష త్రయోదశినాడు ఈ వ్రతమును ఆచరింపవలయును. స్నానము చేసి శుచియై పిదప అశోక వృక్షాకృతిని తయారుచేసి పూజాప్రదేశమును రంగవల్లులతో నలంకరింపవలయును.

కామదేవ, విఘ్నేశ్వర, శివ, వసంత ప్రతిమలను, అప్సరాంగన ప్రతిమలను బంగారు మొదలగు లోహములతో గాని, ఇతర పదార్థములతోగాని తయారుచేసి వానిని మధ్యాహ్న కాలమునందు పుష్ప చందన ధూప దీపాది షోడశోపచార విధులతో రాణీ సమేతుడైన రాజు, సతీసమేతులైన అతని మంత్రులతోను, తదితరులతోను పూజ గావించి, తదనంతరము వివిధములైన భక్ష్యములను చేసి, బ్రాహ్మణ దంపతులకు వాయనములిచ్చి, దక్షిణతో కర్పూర తాంబూలాదుల నీయవలెను. ఆ దినమున భార్యలు తమ భర్తలను పూజించి పుష్పములతో వారికి నూతన వస్త్రాభరణములను సమర్పించవలెననియు, ఈ వ్రత మాచరించువారు నాటి రాత్రి జాగరముచేసి రాస మహోత్సవము సలుపవలెననియు, ఆయా ప్రదేశము లన్నియు దీపాలంకృతములు గావింపవలెననియు, కుంకుమ కర్పూర చందనాది పరిమళ ద్రవ్యములను పంచిపెట్టవలె ననియుకూడ వ్రతఖండమున చెప్పబడినది. తన నిమిత్తము దహింపబడిన మన్మథుని మరల బ్రతికింపుమని గౌరి శివుని వేడుకొనగా వసంతకాలమున శుక్లపక్ష త్రయోదశి నాడు అతడు దేహి యగునని చెప్పి ఆ దేవదేవుడు కైలాసమున కేగెననియు, అందువలన ఆ నాడీ వ్రత మాచరించవలె ననియు వ్రతఖండమున గలదు.

తెలుగుదేశమున ఈ మదనమహోత్సవము నకు 'వసంత మహోత్సవ' మనియు, కాముని పండుగ యనియు, తద్వ్రతాచరణ కాలమున వచ్చు ఫాల్గుణ శుద్ధ పూర్ణిమకు పూర్వ మీ పండుగ తెలుగుదేశమున జరుపబడుచుండెనో లేదో తెలిసికొనుట కాధారములు లేవు; కాని ఆ శతాబ్దమున ఆంధ్రులు స్వతంత్ర రాజ్యమును మరల స్థాపించిన తరువాత ఈ యుత్సవము ఎక్కువ వైభవముతో జరుగుచు వచ్చినది. అప్పటి నుండియు ఆంధ్ర దేశమున అది సాధారణ వ్రతములవలెను, షోడశ మహాదానములవలెను మిగుల ప్రాముఖ్యము వహించినది. కొండవీటి రెడ్డిరాజులు దీని నత్యంత వైభవముతో జరుపు చుండిరి.

ఈ యుత్సవమపుడంత వైభవముతో జరుగుటకు నాడు సుగంధ ద్రవ్యములకు ప్రసిద్ధి కెక్కిన ప్రాగ్ద్వీపములతోను, దేశములతోను తెలుగుదేశము జరుపుచు వచ్చిన సముద్ర వర్తకమే కారణము.

ఆనాడు ప్రసిద్ధమైన రేవుపట్టణమగు మోటుపల్లికి వచ్చెడి సముద్ర వర్తక వ్యాపారులకు అనపోతారెడ్డి ఇచ్చిన సౌకర్యములు, ఆయా సరకులమీద విధింప బడుచుండిన సుంకముల విషయమున అతడు చేసిన సంస్కరణములు తూర్పుదీవులతోను, దేశములతోను ఈ వర్తక మెక్కువగా సాగించుటకు తోడ్పడినవి.

కొండవీటి రెడ్డిరాజుల కాలముననను, అటు తరువాతను ఈ మహోత్సవమెట్లు జరుపబడుచుండెనో తెలిసికొనుటకు శ్రీనాథుని భీమేశ్వర పురాణము, కొరవి గోపరాజకృత సింహాసన ద్వాత్రింశిక పరమాధారములు. ఈ రెండు గ్రంథములలోను ఈ యుత్సవము విపులముగ వర్ణింపబడినది. వాని యాధారమున వసంతోత్సవ మా కాలమున ఈ క్రింది విధముగ జరుగుచుండినట్లు చెప్పవచ్చును.

ఆ కాలమున వసంత మహోత్సవమునకు రంగము పురబాహ్యోద్యానవనము. అది ఉత్సవమునకు ముందు మనోహరముగ అలంకరింపబడును. ఆ యుద్యానవనమున నొక పూజామండపమును, అందు వేరు వేరు దేవతలకు వేర్వేరు పూజావేదికలను నిర్మించి వేదికలపై కస్తూరి కలయంపిచల్లి పూజామండపమందును, వేదికలమీదను కర్పూర రజముతో రకరకములైన రంగవల్లులు తీర్చిదిద్ది వేదికల మీద దేవతా విగ్రహముల నుంచి పూర్ణకుంభముల నమర్చెదరు. కదళీ వృక్షములతోను, చూతపల్లవ తోరణములతోను, వివిధవర్ణ కేతనముల తోను, పూలదండల తోను పూజ మండపము నలంకరింతురు.

ఆ యుత్సవావసరమునకై వేయబడు చలువ పందిళ్లు ఆరామశోభను ద్విగుణీకృతము చేయును. లక్ష్మీ నారాయణులు, ఉమామహేశ్వరులు, రతీమన్మథులు, శచీసురేంద్రులు, వసంతుడు, విఘ్నేశ్వరుడు– వీరి విగ్రహములు వేదికలపై నుంచ బడును.

> కొండవీటి రెడ్డిరాజుల కాలముననను, అటు తరువాతను ఈ మహోత్సవ మెట్లు జరుపబడుచుండెనో తెలిసి కొనుటకు శ్రీనాథుని భీమేశ్వర పురాణము, కొరవి గోపరాజకృత సింహాసన ద్వాత్రింశిక పరమాధారములు. ఈ రెండు గ్రంథములలోను ఈ యుత్సవము విపులముగ వర్ణింప బడినది.

రాజు రాణులతోను, అమాత్య దండనాయక నాయిక పురోహిత విదూషకాంతఃపురజనముతోను సర్వసేనా పరివృతముగ ఉత్తమాశ్వారూఢుడై ఘనమైన యుత్సవముతో మంగళ వాద్యములు నెలగ పూజార్థమై పురబాహ్యో ద్యానమునకు బయలు చేరును.

భూపాలుని వెనువెంటనే సర్వాలంకార భూషితలై వసంతోత్సవమునకు అలంకార ప్రాయులగు పడుచులు బయలుదేరును. ఉత్సవసందర్భమున తమ తమ విద్యలను ప్రదర్శించి బహుమానములనందుటకు కవి పండిత గాయినీ గాయకులు, శిల్పులు, నటులు మొదలగు కళాకారులెందరో విచ్చేయుదురు. అట్టి వసంతోత్సవమును తిలకించుటకు రాజ్యము నలుమూలలనుండి జనము ఆబాలగోపాలము వచ్చెడివారు. కావుననే నాడు వసంతోత్సవము తోటలోని రాజునకును, పేటలోని పౌరునకును వంతెనవంటిదైనది. పయిరీతిని ఉత్సవముతో రాజు ఆరామము చేరి సాంద్ర సహకారవృక్షచ్ఛాయ నమర్చబడిన ఆసనముపై ఆసీనుడగును.

అప్పుడు సామంతులు, మండలేశ్వరులు రాజునకు కట్నములు కానుకలు కప్పములు చెల్లింప ప్రధాని రాజునకు వారి నందరిని వేర్వేర నిరూపించి చెప్పును. అంతట రాజు విదూషకాది జనముతో కొంత తడవు వినోదగోష్ఠి సలుపును.

ఈ సమయమున ఉత్సవముతో వచ్చిన సుందరీమణులు ఉద్యానవనశోభను తిలకించి పుష్పాపచయమొనర్చి పూదీగెలతో నిర్మింపబడిన ఊయల లూగుచు ఏలలు, జాజరలు పాడుచు క్రీడింతురు.

రాజంతట సామంతరాజుల యోగ క్షేమముల నరసి రాణులతోను, మంత్రుల తోను, పురోహితవర్గముతోను పూజా మండపము చేరుకొనును. శృంగారపతులు పూవులు పూలమాలలు తెచ్చి వేదికలకడ నుంతురు.

రాజు స్నానానంతరము రాణులతో కలసి మన్మథుని, తదితర దేవతలను షోడ శోపచార విధుల పూజించి తదనంతరము బ్రాహ్మణ దంపతులకు దక్షిణసహితముగ కర్పూర తాంబూలాదులను సమర్పించును.

తరువాత రాజు హిమాంబ, మృగమద, ఘనసార, చందనాది సుగంధ ద్రవ్యములు తదనంతరము జరుగు వినోద కేళికి అనుమతి చిహ్నముగా అచ్చటి జన సమూహముపై చల్లును. అంతట జనులు సంతోషముతో ఒండొరులపై పరిమళ ద్రవ్యాదులను, వసంతమును, బగ్గుండి మొదలగు వానిని చల్లుకొని వినోదింతురు.

ఆ వినోద క్రీడానంతరము రాజు రాణులతో చేరువనున్న పద్మాకరమున జలక్రీడలాడి కొంతతడవు వినోదించును.



రెడ్డిరాజన్యులలో ఈ యుత్సవమును మొదట ప్రారంభించినవాడు అనవేమారెడ్డి. నాటినుండి వసంతోత్సవము రెడ్డిరాజ్యమున వైభవోపేతముగ జరుగుచుండెడిది. ఈ యుత్సవములను జరుపుటచేతను, ఆ మహోత్సవ సమయములలో కర్పూరాది పరిమళ ద్రవ్యములు వెదచల్లుటచేతను అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి మొదలైన రెడ్డిరాజులకు వసంతరాయ, కర్పూర వసంతరాయ బిరుదములు కలిగినవి.

రెడ్డిరాజుల కాలమునుండి ఈ వసంతమహోత్సవము ఆంధ్రదేశమున జాతీయోత్సవమైనది. విజయనగరాధీశ్వరుల కాలమునగూడ ఇది మహావైభవమున జరుగుచుండెననుటకు

**'ప్రతివర్ష వసంతోత్సవ**
**రుతురాగత సుకవినికర గుంఫితకావ్య**
**స్మృతి రోమాంచ విళంకిత**
**చతురాంతఃపురవధూప్రసాధనరసిరా'**

అను పద్యమే తార్కాణము.

హిందూప్రభుత్వమంతరించి దేశము పరాధీనమైన వెనుక ఈ మహోత్సవము ఆంధ్రప్రాంతమునంతరించినట్లు తోచుచున్నది.

పిదప రాజు నిండుకొలువు దీరును. అపుడు గాయకులు నటులు, శిల్పులు తమ తమ విద్యలను, కవులు తమ కవితా నైపుణిని, పండితులు తమ శాస్త్రపాండిత్య ప్రకర్షను ప్రదర్శించి యథోచితరీతిని రాజుచే గౌరవ సమ్మానములనందుదురు. దీపావళీశోభిత నగరా రామమున నాటి రాత్రి జాగరము. రేయంతయు నాటక ప్రదర్శనములతోను, నృత్య సంగీత వినోదములతోను గడచిపోవును.

వసంత మహోత్సవము ఉల్లేఖాలంకారమై ఒక్కొక్కరి కొక్కొక్క విధముగ భాసించును. అది కవుల కొక ప్రత్యేకమైన పండుగ; గాయకుల కొక పర్వదినము; కళాకారులకొక సుప్రభాతము; రసిక బృందమున కొక శృంగార వాహిని. కాగా రాజున కది లలిత కళాంశములతో రూపొందిన కీర్తికాంత తన్ను బహూకరింపవచ్చిన, సందర్భము.

## సర్వం నాస్తి

మీకు కూడా యిటువంటి బుద్ధే పుట్టిందండీ? ఇది కలియుగం. యెవ్వరేమి చేస్తారు? యిఖ శాస్త్రాలు చేసిన పూర్వపు వాళ్లంతా వట్టి బుద్ధిహీనులు! అనాదిగా జరుగుతూ వున్న ఆచారాన్ని మాన్పడానికి నాలుగు వచ్చీరాని యింగిలీషు ముక్కలు చదువుకోవడం తోటే మనము మహా బుద్ధిమంతులము! యథారాజా తథాప్రజా అన్నాడండి. గోవు మాంసం తినేవారు ప్రభుత్వానికి వచ్చిన తరువాత యిఖ యెలా అవుతుందండీ? అమ్మవారిని ఆలోచించకుండా గోదావరిని కట్టివేసినారు గదాండి? దేవతలనే యిలా చేస్తే వాళ్లకు మనుష్యులంటే లక్ష్యమేలేదు. బ్రాహ్మణుల మాన్యాలకు పన్నులు కట్టినారు. 'కతాపంచసహస్రాణి జాయంతే వర్ణ సంకరాః' అన్న మాట నిజం అయినది. అందఱి కంటే బ్రాహ్మల యెక్కువేమంటారు. గుళ్లో దేవుళ్లను రాళ్లంటారు. దయ్యాలు లేవంటారు. పురాణాలలో చెప్పిన కల్లు సముద్రాలూ, నేతి సముద్రాలూ అబద్ధమంటారు! సూర్యుడూ చంద్రుడూ అచేతనములంటారు. వకటేమిటీ, యింగ్లీషు చదువుకొన్న వాళ్లకు సర్వం నాస్తి అటువంటి నాస్తికులను పట్టుకొని శిక్షించేవారు లేరు. పూర్వం వలె రాతి గానుగలలో పెట్టి ఆడించే రాజులుంటే వీళ్లు యిట్లా అంటారండీ?"

– వెంకన్న, (కౌతుక వర్ధని – కందుకూరి వీరేశలింగం)

# తొలితరం రంగస్థల నటులు

- పురాణం సూరిశాస్త్రి

## ఈవెన లక్ష్మణస్వామి

నవీనాంధ్ర నాటకరంగమున భావప్రకటనయందు ఈవెన లక్ష్మణస్వామిని మించిన వారు లేరు. రసపుత్ర గాంభీర్యమును దెలుపు రాజకళలొప్పు విశాల గాత్రము-భావతరంగ ప్రవాహమున పవనసంచలితమైన సాగరముఖ మేరీతి నాడుచు దుముకుచు నుండునో, అటులనే పలు వికాసముల జూపగల ముఖారవిందము- క్రోధాగ్నికణముల నగ్నిపర్వతములవలె రాల్చి తరువాతి వాక్యాభినయములో శరచ్చంద్రికలబోలు చల్లని కరుణా కటాక్ష దీపికల నొలికించు నేత్రయుగ్మము-ఔదార్య వీరరసముల నైజవాహకమనదగు హిందీభాష యందసమాన వాగ్ధోరణి-నాటక పాత్రముల దేశాభిమానభరితోపన్యాసముల నాట్యయోగమున రసవంతముగ బ్రకటించు నాట్య కౌశలమే గాక భారతాభ్యుదయ మెల్లవేళల నుపాసించు దేశారాధన జీవనవ్రతము-రంగవిరచనమందును, భూమికా నిర్ణయ మందును, నాటకాభినయ మర్యాదలందును నానాదేశ నాటక నియమముల బరికించిన విద్యాధికుల కందరాని నైజమనీషయు-పలువుర నాదర్శోత్సాహపూరితుల జేయగల దీక్షాపరత్వమును-వీరి గుణ శతకములోని ముఖ్యాంశములై యొప్పు లక్ష్మణస్వామి బందరులోని నాటకాభినయమునకే కాక జాతీయ జీవనముకు కూడ వన్నె తెచ్చిరని చెప్పుటొక వింత కానేరదు.

లక్ష్మణస్వామికి సంగీతములో ప్రవేశములేనందున, పద్యగీతములున్న నాటకములందు భక్తి శృంగారరసము లొప్పుపట్లను వీరవలంబించకుండిరి. విక్రమార్కునితో నొకకాంత, పంతమూని గెలిచిన నాటకములో రాజవేషము ధరించి గద్యములో శృంగారాభినయముజేసిరి. ఈ వేషము రాచఠీవులలో రాజమర్యాదానువర్తనములో బెంగుళూరిలోని నాగేశ్వరరావు కొక్కనికే పోల్చదగినదని చెప్పవచ్చును. లక్ష్మణస్వామి గద్య నాటకముల తొల్లిటి యుపాసకులలో నొకడు. భావికాలపు భావాభినయముల సూత్రధారుడు. నాటకాభినయ సూత్రములలో వీరికలవడిన నైజప్రబోధములు పరాసు, ఇటాలియా నటుల దీర్ఘశిక్షణను సమీపించుచుండెను. పద్యములు, మట్టుకు వీరికలవిగాకున్నను సభ్యులెల్లరు వీరి హిందీ ప్రవచనంబుల నాకర్ణింపు వేడుకతో వీరి సంగీత లోపమును బాటింపకుండిరి.

షుమేరుసింగు నిజోద్యోగ ధర్మనిర్వహణమున రఘునాథరావు దస్కతుతో నాసందీభాయి యందిచ్చిన శాసన మనుసరించి, పీష్వానారాయణరావును వధించెను. షుమేరుసింగు రసపుత్రుడు. "హర!హర! మహాదేవు" అను మంత్ర మహర్నిశముల పాలించు శివభక్తుడు. దయాళువు. మొగలాయి సామ్రాజ్య సంక్షోభమును జల్లార్చి, యాసేతు హిమాచలము హైందవ రాజ్యలక్ష్మీ స్వరూపమును ముద్రించిన మహారాష్ట్ర పౌరుషమునకుప్పొంగు ధీరుడు. నారాయణరావు సద్గుణ, సౌశీల్య, సౌకుమార్యముల దలపోసి రాగల మహోన్నతిని దివాస్వప్నముల నవలోకించి సంతసించు దేశభక్తుడు. నారాయణరావు వధ వలన మహారాష్ట్ర శిబిరములో గలుగనోపెడి పోరాటములను వానిచే భరతపర్వమున కేర్పడగల విపత్పరంపరలను గుర్తించు నీతివివేకి. తన శక్తి కొలది యానందీభాయిని నివారింపజూచెను. కాని రాచకొలువుకు మనోదేహముల నర్పించిన సేవకుడవశ్యము ప్రభుచిత్త మనుసరింప వలయునను సేవాధర్మ నిర్వాహు డగుటచే నారాయణరావును వధింప నియ్యకొనెను. వధా నంతరము నిర్దోషియు, గుణరాశియు, బాలకుడును, మీదుమిక్కిలి మహారాష్ట్ర సామ్రాజ్య మకుటమునునగు నారాయణరావును, విష్ణుతుల్యుడగు ప్రభుని వధించిన పాపానలమాతని మానస ముడికించసాగెను. దేశమునకు,

తొలితరం నాటక రంగ నటులను అభినయకౌశలాన్ని ఎంతో విమర్శనాత్మకంగా పరిచయం చేసిన వారు పురాణం సూరిశాస్త్రి. అప్పటి తెలుగు పలుకు ఇంపును, గుబాళింపును పాఠకులకందించాలని అదే పాఠం ముద్రిస్తున్నాము.

తన కులమునకు, తన యుత్తరగతులకు, తానొనగూర్చిన ఘోర విపత్తునకు బలుతెరంగుల బలవరించుచు జేయునదిలేక యాత్మహత్య గావించుకొనెను. నారాయణరావు వధ నవీన చారిత్రాంశము గాక పురాణగాథయైనచో నేశివుడో, యేసిద్ధుడో వీరిరువుర కడ్డుపడి బ్రతికించి యానందీబాయికి తగు ప్రాయశ్చిత్త మొనర్చియుండును. కాని యిది నవీన విషాద నాటకము. ఈ నాటకములో కరుణ, ప్రభుభక్తి, దైవచింత, రోషావేశము, ధీరత్వము, కోపము, భీభత్సము, భయానకము కుప్పలుతిప్పలుగ మందులకొట్లు తగులబడినట్లు, తోకచుక్కలు రాలినట్లు, సుడిగాలి త్రిప్పులకు తాటియాకులు రేగినట్లు, నిమిసమునకొక యూహగా అడుగున కొక భావముతో నుదయించి, ప్రజ్వలించి, జల్లారి, నటమానసమును, ప్రేక్షక ప్రవృత్తులను, రసభావ విపరీత పరివర్తనములతో నూగించుచు, జెండాడుచు, కలవరించుచు, తల్లడించుచు, ముంచుచు, దేల్చుచు బరిపరివిధంబుల నాయాస పెట్టుచుండును.

ఈ భావపరంపరను, విపరీత రసోద్రేకమును, మాటల బలిమిచేగాక యభినయ కౌశలముచే ముఖలక్షణంబుల ముద్రించి నయనప్రకారమున బ్రకటించి నట సార్వభౌమసత్కీర్తి గణియించి యభినయించిన లక్ష్మణ స్వామిగారి నాట్యకౌశలము భారత నటులెవ్వరును పొందలేరు. ఫ్రెంచి గవర్నమెంటు వారాడించిన విక్టరుహ్యూగో మహాకవి కృతమైన ''దురదృష్టవంతుల''లో కథానాయక పాత్రమభినయించిన "యిటాలియను" మహానటుడొకడు మాత్రము లక్ష్మణస్వామి యభినయరీతి నతిక్రమించి యున్నాడని చెప్పవచ్చును. చెన్నపురి సుగుణవిలాసన సభలో పి. సంబంధం మొదలియారు ఆయా గోపాత్రపు నీచవృత్తుల నింతటి సౌకర్యమున ముఖముద్రలచే జూపగలిగెను. కాని సంబంధ మొదలియారు ఉత్తమగుణ వివేచనమందిట్టి సౌకర్య మనుభవింపకున్నారు.

లక్ష్మణస్వామి తామభినయించు నాటక కథల, నుచితరీతుల బరిష్కరించి కథారసభావముల యౌచితి చెడకుండ మానస నైజమనుసరించి యాడించుచుండెను. దుస్తుల నమర్చుటయందును, రంగప్రవర్తనము లెస్సగ నేర్పించుటయందును వీరు నాటక విమర్శకులనందర మెప్పించుచుండిరి. పఠాను వేషమునకు భావభంగ మేర్పడకుండ లక్ష్మణస్వామి అవలంబించిన కథాక్రమము "ముగ్గురు పఠాను"లను వ్యాసములో విశదీకరించియున్నాను.

దివాను రామశాస్త్రి వేషమును స్వీకరించి వీరు చూపిన కొలువు నడతలు మైసూరు, బరోడా మున్నగు రాజ సంస్థానముల మర్యాదలలవడిన నటులకే సాధ్యమగు రీతుల నుండెను. లక్ష్మణస్వామి పెద్ద చదువుల దారు లెరుగక పోయినను, నిజప్రతిభచే నుత్తమ నాట్యకళా లక్షణంబుల నెరింగిన మేటి మనీషి. గద్య నాటకముల చివర నటులలోని వాడయ్యును రాగల రంగరీతులనూహింపగల నాట్యయోగి, బందరు కావ్యకళాచతురులగు మహామేధావులచే నలంకరింపబడి, నఖిలాంధ్రావనీ నాయకమణియై వెలింగిన కాలములో, ఈవెన లక్ష్మణస్వామి ఆంధ్రులదేగాక భారతీయుల యొక్క నాట్యసామర్థ్యమును ప్రకటించు కళాపతాకమై దేలుచుండెను.

## నెల్లూరు నాగరాజరావు

1916వ సంవత్సరపు గ్రంథాలయ మహాసభ నెల్లూరులో గూడెను. అప్పుడు నాకీ మహానటుని ప్రథమ పరిచయమేర్పడినది. ఆనాడీతడెట్టి ముఖవిలాసహాసముల నొప్పుచుండెనో ఈనాటికవియే వారిముఖమున గోచరించు చున్నవి. నటులలో ముఖ కవళికను, ఆరోగ్యమును చిర కాలము నిలుపుకొన గలవారరుదు. ఈ సందర్భములో యడవల్లి సూర్యనారాయణగారిని, నాగరాజరావుగారిని ప్రశంసింపక తప్పదు. పాదుకా పట్టాభిషేకమందు దశరథ వేషమును, చిత్రనళినీయములో నలపాత్రమును ధరియింప జూచితిని. ఆవల ఆంధ్రనాటక పరిషత్తువారి నెల్లూరి పరీక్షలలో నీతడే నలాభినయమునకు మెప్పుబడసెను. 1923లో ముత్తరాజు సుబ్బరాయనిధి గూర్చుట కాడబడిన నాటకములలో వీరు "పఠాను" గను, దశరథుడుగను, ఆవల హిరణ్యకశిపుడుగను నటించి బందరు రసజ్ఞులకమితానంద మొసంగుటయేగాక, బందరులో కనీవినని ద్రవ్య సంపాదనకు కారణమైరి.

కొంచెము బొజ్జయున్నను చామనఛాయ, చిన్ని కన్నులు, ముఖసౌందర్య మొకింత కొరవెట్టినను నాగరాజరావుగారి విగ్రహమందమైనదనియే చెప్పవచ్చును. పఠాను ప్రవేశమైన వెనుక నిద్దరు చివరి తరగతి ప్రేక్షకుల సంభాషణ మాకర్ణించితిని. "ఆయనకు సంగీతమే కొరతగాని అదికూడా ఉంటే ఈ జిల్లాలో కాదు, ఈ దేశములో యిటువంటి కారెక్టరు లేదు." ఇది బందరు పామరుల యభిప్రాయము. విద్యాధికులు వీని నామోదించక మానరు. వేషము వేయువరకు నాగరాజరావు ఆనాడు నాటకమున్న సంభ్రమముగాని దానిలో

ప్రధానభారము వహింపవలసిన భావాందోళనముగాని, పార్టు చింతనము జేయు పరీక్షాభిముఖ బాల్యలక్షణముగాని యావంత యేనియు జూపక మంద హాసముతో, మాటముచ్చటలతో కలకలలాడుచుందురు. వీరి సామాన్య ప్రవర్తనము యెడవల్లి సూర్యనారాయణ వంటి యాత్మగౌరవ మొప్పుచు దంభరహితముగ తనకున్నదానిలో సంపూర్ణముగ సంతసించు నుదారమార్గము లంటియుండును.

పాత్రభూమికా లక్షణమును సంపూర్ణముగ నెరింగి, సత్వరముగ ధరించి, మిన్నకొకమూల గూర్చుండి పాత్ర స్వభావమును తనలో తాను చింతించుకొనుచుండును. వీరభినయించవలసిన నాటక స్వరూపమును, అందలి రసభావ కథాప్రసంగమును జిరకాలమూహించి గద్దెనెక్కెడి యలవాటు గలవారు. నాటకము జరుగునున్నపుడొకరితో సంభాషణాదుల జిత్తవిభ్రమ మేర్పరచుకొనక విశ్రాంతి సమయములలో పైపట్టు రసావేశ మనుభవించు చుందురు. వేష వ్యవహార మంతమొందినంతనే చివాలున నాట్యయోగ ముపసంహరించి సామాన్య లలితహాసములతో మిత్రుల నెదుర్కొనుచుందురు.

పఠాను భీకర భీభత్స మభినయించిన యుగ్రావస్థ యొక నిమేషములో సామాన్య వైఖరి దాల్చుచుండును. లక్ష్మణస్వామి గారిని 'వేషావేశకాలమందు మిమ్ముల నెదుర్కొనిన మీరెట్లు వర్తింతు'రని నేను ప్రశ్నింపగా నా సమయములో నెవరినైన పొడిచివైతునని జవాబిడిరి. లక్ష్మణస్వామిని రసభావముల తన్మయత్వ మొందుచుండెను.

నాగరాజరావు రసభావముల శాసించు నాట్యయోగి. పాత్రముల ప్రత్యేకగుణ మర్యాదల నెరింగి వాని నభినయించుటలో సర్వాంగ సౌందర్య మొప్పుదారుల నడువగల ప్రోఢ. ముఖమునందలి కండగుంపులన్నియు వశ్యలై భావతరంగములు జిత్రించుచుండ నవయవములు వయోరసానుకూలమగు భంగములవ్రాల వెల్లగ, నవిచారితముగ, నైజముగ, స్వతంత్రముగ పాత్ర మర్యాదల గమనించి నాటక కథా వ్యాఖ్యాన వైఖరుల విస్తరించుచున్నవి. నాగరాజరావుగారికి సంగీత పరిజ్ఞానమున్నది కాని గాత్ర మాధురి క్రీగంట నాదరించని లోపమొక్కటే వీరి నాట్యసామ్రాజ్య మూర్ధాభిషేకము నడ్డగించుచున్నది. వారి నెల్లూరియాస యిచ్చటి జనుల కొకింత వింతగా దోచక మానదు. కాని నాటకములందు రసాభినయమే, పాత్రౌచిత్యమే ప్రధానాంశముగ నెంచు సభ్యులకును, నానా ప్రాంతముల ఆంధ్రబాషోచ్ఛారణ వికారముల గుర్తెరిగిన వారికిని, ఈ లోపములు పరిగణింపదగినవిగ నగుపడవు.

నల నాటకపు మొదటిభాగము కొన్ని చిక్కులతో గూడి యున్నను దమయంతీ స్వయంవరపు కళ్యాణదీధితులపట్ల సంతోషపూరితముగ జేయుచున్నవి. రెండవ భాగము శుభాంతమైనను బాహుక శోకపటలితో మలినమైయున్నది. "ఈ పురవైభవమెన్న నద్భుతము" అనుచు నలుడు ప్రవేశించుపట్టున, ప్రసాదరావుగారి యడుగులపోకడ నాగరాజున కందలేదు.

సూర్యనారాయణ రాచపోకడలు వీరియందగుపడవు. శృంగార రసపు వెకిలిచూపుల, వంకరనగవుల, రాజవేషపు కోరమీసముల సాధనచే సులభముగ ప్రకటింపదగినది కాదు. శృంగారాభినయము సులభమని, కన్నుకొట్టి కాంతను దొంగిలింపవచ్చునని, భీభత్సరస మన్నిటిలో కష్టమని, కొంద రభిప్రాయపడుచున్నారు. వీరి శృంగారచేష్టలు, ప్రణయభావ ప్రకటనము ఉత్తమ పాత్రముల కర్హమైనదిగాక, శకారుని నైజరీతుల ననుసరించును.

దుష్యంతుడు– సమస్తాశాంత రాజ్య రమానాథుడు– వలచునది శాపానుగ్రహ శక్తియుక్తుడగు కణ్వ మహర్షిపుత్రిక. నలసార్వభౌముడు "నిర్మల నిజకథా నిమిషకల్లోలినీ, క్షాలితాఖలజగత్కల్మషుండు; వితత నవద్వయ ద్వీపనానాజయ శ్రీవధూటీసమాశ్లిష్టభుజుడు." దమయంతి శుద్ధాంతకాంత! ఇట్టివారలకు గలుగు ప్రణయ సంభాషణము ప్రథమ సమావేశమున వ్యంగ్య మర్యాదల ననుసరించి జాగరూకతతో నడువ వలసియున్నది. మాటనుచ్చరించు కాకుధ్వనులచే నేత్ర వికాసముకన్నా, నేత్రోన్మీలనము భావప్రకటనముచే కన్న భావగోప్యముచే నాయికా నాయకుల ప్రణయానుభవము సూచింపదగును.

"ఆడు కలకల నవ్వాడు, కన్నెత్తి చూచాడు" అనే యాలపాట విలసనములుత్తమ నాయకుల శృంగారానుభవ నివేదనమందుపయోగింప గూడదు. నాయికానాయకు లెంతవరకు తమ భావముల దాచి యెదుటివారి యభిప్రాయముల గుర్తింపనెంచుదురు. నాగరాజరావుగారు నలసార్వభౌముని యుదారమహీధర గుణజాలమును లెస్సగ ప్రకటించినను చిరునగవు తళుకు లాసమున ప్రణయదీప్తుల బరచుచుండినను శృంగారరసో పన్యాసముల గూఢ వైఖరులందు వీరు ప్రసాదరావునకు, సూర్యనారాయణకు

వెనుకటివారేయని చెప్పవచ్చును. సింగారమున ముద్దులొలుకు తేటతెలుగులో శృంగార రసాభినయ మవలీల జేయగల యాధునిక నటులలో ప్రసాదరావు, సూర్యనారాయణ, "శెట్టి మాస్టరు," రాఘవాచారి మిన్నలని చెప్పవచ్చును. నాగరాజరావు బాహుక భాగమును, అందులో సుదేవుడరు దెంచు నపుడుదయించు చిత్త విభ్రాంతిని, యసమాన నైపుణ్యమున జూపుచున్నాడు.

ముగ్గురు పఠానులను వ్యాసములో రాఘవాచారి, లక్ష్మణస్వామి, దేవరకొండ సుబ్బారావు పఠాను పాత్ర నభినయించిన తెరవుల విమర్శించి యున్నాను. అప్పటికి నాగరాజరావుగారి పఠాను ప్రయోగ వైదుష్య మెరుగకుంటిని. మధ్వబ్రాహ్మణుని చల్లని చూపులొక అరగడియ కాలములో హిమాలయ ప్రాంతముల నివసించు పఠాను తైక్ష్మమును జెందినవి. విద్యానగర రాజవీధులలో బిచ్చగాండ్రు రామరాజప్రతాపము నుగ్గడింప వినినప్పుడీతని భావ వికాసము అపూర్వముగ నుండెను.

మొదట కొంతదూరము నడచివచ్చి విశ్రాంతికై విశ్రమించిన పాంథునివలె దిక్కులు చూచుచు, నిర్వ్యాపార మానస విశ్రాంతి నభినయించెను. ఆవల, క్రమముగా కథ వినుచున్న పౌరులతో గలసి హిందూ ప్రతాపము నాలకించి ఈర్ష్యానుభూతి నొందెను.

ఈ పట్టున సుబ్బారావు అదివరకెన్నడో విజయనగరము వచ్చి అచ్చటి వారినెవరినో ద్వేషించి వెదకుచున్న చందమున నొకమారు సర్పచాలనక్రమమున రంగస్థల మవతరించిరి. లక్ష్మణస్వామిగారు యింగువసాహేబురీతి నగుపడెను. రాఘవాచారి నడత కొంతవరకు నాగరాజరావు అభినయ మందు గోచరించుచుండెను.

ఆషాబీకి సభా పరాభవము జరిగినప్పుడు నాగరాజరావు స్త్రీవంచన మెదుర్కొనజాలక యొరవోమిడ పఠాను రక్తముప్పొంగి నైజస్వభావమును వెల్లడించునట్లుగా సంకల్పరహితముగ నాతనికరము కరవాలమున వ్రాలి యొకింత దూసి మరల పరిస్థితుల వెలుగునంది వొరలో నాకత్తిని త్రోసివైచెను. ఈపట్టున నాగరాజరావు ప్రకటించిన యవ్యక్తమానస నిస్సంకల్ప వ్యాపారములు రసజ్ఞుల నెంతయు మెప్పించినవి. ఆషాబీతో నుద్యానవనమున జరిగిన సమర వివాహ సమయములను, అప్పుడుదయించు భావ పరివర్తనములను మూఖా వలోకనముల సత్వర విపర్య యములతో జక్కగ బ్రకటించి యుండిరి. రాఘవాచారి శాంత శృంగార రసముల మేటినటుడు. రామదాసు భూమికను ధరించి యభినయించునపుడు రాఘవాచారి పొందిన పాత్ర స్వభావ సారూప్యము పఠానుభూమికలో నగుపడలేదు.

సుగుణవిలాస సభవారి సరసాలంకృత రంగ పరిసరంబుల రామచంద్రుని సుకుమార సౌందర్యమూర్తి కెదురుగా శృంగారాభినయ మొనర్చునపుడు రాఘవాచారి మిక్కిలి చక్కగా దోచెగాని యాతని బ్రాహ్మణవర్చస్సు పఠాను భూమికలో మరుగునపడి యుండలేదు. రామరాజ్య వినాశనము తొల్లిటి నుండియు ఘోర సంకల్పములతో నీర్ష్యలతో మాయా ప్రవృత్తులతో నిండియుండిన కథాంశము.

విషాదము, వైరము, సమరము, సాహసము జూపు చారిత్రక నాటకము, వేణీసంహారమందు శిబిరవ్రాతముల నుండి సమరభేరీ శంఖారవము లాకాశమాక్రమింప మదాంధుడగు దుర్యోధనుడు భానుమతీ సదనమందొనర్చిన ముద్దుచేతలెంత పరిహాసంపబడినవో రామరాజ్య వినాశపు విషాదగాథా గర్భమున నొక జంట సరససల్లాపము లాడుకొనుటయు నంత లక్షణవిహీనముగనే యున్నది.

మాలినీ పరిసరాశ్రమంబుల ప్రశాంతోద్యాన నికుంజములందు శకుంతలాదుష్యంతుల కొప్పునట్టి సింగారంపు తలపులు విద్యానగర శిబిరాంగణంబున మొలకెత్తనేరవు. రాఘవాచారి వసంత సుమాలంకృతమైన పరిస్థితులలో కాంతను వరించిన రీతి నభినయించెను. లక్ష్మణస్వామి ఈ పట్టున మహమ్మదీయ శుద్ధాంతమొందిన పరాభవ మాషాబీతో ముచ్చటించి సమరదీక్షను బలపరచుకొనెను.

నాగరాజరావు విజయనగరము ప్రవేశించినది మొదలు పఠానునకేర్పడిన హిందూరాజ్య వినాశ సంకల్పము కాంతాసమాగమమున విడువలేదు. రామరాజు తన తండ్రియనుమాట నప్పటి కెరుగకుండినను తిన్నయింటి వాసముల లెక్కించు నైచ్యము మహమ్మదీయ మతా భిమానముతో మార్కొనుచు శక్తిలేమికి చేష్టారాహిత్య మేర్పరచి యొకవిధమగు పరాకు నేర్పరచినది. ఈ పరాకును నాటకమంతయు వ్యాపించియున్న విషాద తత్త్వమును మరువక నీ ప్రధాన రసముల చాటున మబ్బుకమ్మిన దీపకళిక

వలె, తెరచాటు బొమ్మలాటవలె, స్వప్న వ్యాపారములవలె నాషాబీతోడి శృంగార మెంతయో నయంబుగ నభినయించెను. నాగరాజరావుగారి నాటక కథానుభవము, ఔచితీపరిజ్ఞానము నవీన నటులందరిలో ప్రసిద్ధమని జూపరులభిప్రాయపడుటలో వింతలేదు. పఠానుని వీరభీభత్సముల నభినయించుటలో వీరు లక్ష్మణస్వామికి తీసిపోలేదు. కండ్లు చిన్నవైనను గ్రావలోకన జ్వాలలంకురింపజేయుచు ముఖముద్రలెంతయు రసావహమై దోచుచుండెను. తలలేని తండ్రి మొండెమాతని భావోన్మత్త మానస వీథియందమరినపుడు శ్రీనివాసరావు.

> "Is this a dagger that I see before me?
> Come, let me clultch thee, I see thee not
> A dagger of the mind, a false creation,"
> "Out you bloody spots!"

అను షేక్స్పియరు వాక్యములు ననువదింపబూనినపుడు జూపరుల కదృశ్యమై పఠాను మతిభ్రమణమొనర్చు రామరాజ పిశాచము నాగరాజరావు పిశాచవైఖరులందు స్పష్టమగు చుండెను. లక్ష్మణస్వామి ధీరోదారగుణములు తప్ప నీచస్వార్థమును ప్రకటింపలేకుండిరి. రాఘవాచారి యాత్మవధా సంకల్పమును లెస్సగ నందుకొనినను వీరు భీభత్సముల బాగుగ ప్రదర్శింపలేదు. నాగరాజరావు పఠాను వేషము కథాపరిమితులలో జక్కగ నిర్వహింపబడినదనియే చెప్పవచ్చును.

కృష్ణమాచార్యులగారి పాదుకాపట్టాభిషేకమును నెల్లూరులో గ్రంథాలయసభ జరిగినపుడు నాగరాజరావు మున్నగువారభినయించిరి. ఈ మధ్య బందరులో నద్దాని మరల జూచితిని. కొన్ని సందర్భములనుకూలింపనిచే బందరు ప్రదర్శనమందు నాగరాజరావుగారి యభినయ సౌష్ఠవము నెల్లూరులో ఒప్పించిన రసభావమును వహింపకుండెను. అసలు ఈ నాటకము ప్రదర్శనార్హమైనది కాదు.

రాముని పితృవాక్యానువర్తనమందు ఆనాటి సాకేతవాసులకుగాని ఈనాటి ప్రేక్షకులకుగాని యెట్టి సందేహములేదు. రాముడు తన మాట నంగీకరించునని దశరథుడెరుగును. రాముడు తిరుగబడి పితృశాసన ముల్లంఘించి కోసల రాజ్యాధిపత్య మాక్రమించునను భీతి మంథరకుగాని, కైకకుగాని యెన్నడు కలిగియుండలేదు. దశరథుడు పెద్దకొడుకు మీది మోహమున వార్ధక్య దౌర్బల్యమున తానిచ్చిన వరములుపసంహరించడని కైక యెరుంగును. నాటకమందలి ప్రధాన పాత్రములు యేవిధమైన భావపరివర్తనముగాని యాదర్శ సంక్షోభముగాని పొందలేదు. కథలో యేవిధమైన భంగపాటు, భావచేష్టా వైపరీత్యము, అచింతత్రప్రవర్తనము జూపలేదు. అందుచేత సీతారామ దశరథులలోనేరును నాటకనాయకులు కానేరరు. వలపులకుప్పయగు చక్కదనాలచిక్కమగు కైకకు దుశ్చింత లేర్పడుట దశరథునికెట్టులో ప్రేక్షకులకు కొందరి కట్టులే యచింతిత భావప్రకాశముగ నగుపడవచ్చును. కాని స్త్రీ బుద్ధి యందలి యాశాక్రౌర్యముల నెరుగని వారు లేరు. సవతితల్లి, యీడేరిన కొడుకు గలది, వలపులచే మగని యొప్పింతునను నమ్మకము గలది, కైక యిట్లు ప్రవర్తించుటయందెట్టి యలౌకిక సందర్భము కనుపడదు. అట్లు చేయకుండుటయే సామాన్య స్త్రీ స్వభావమునకు విరుద్ధమగును.

విషచింతగల కైక గర్భమున నుదారభావభరితుడగు భరతుడుదయించుటయు హస్తగతమైన రాజ్యలక్ష్మిని భ్రాతృవాత్సల్యమున విడనాడి రామపాదుక పూజాని బద్ధమానసుడై, జడధారియై రాముని పేర రాజ్యమేలుటయు నీనాటకములోని రెండవ యుచితాంశముగ నెంచవచ్చును.

భరతుని ప్రవర్తన మలౌకికమనుట నిజమే. కాని భరతుడు కైకయందు జనించినను యిక్ష్వాకు వంశములోని నిర్మలోదారగుణముల వారసుడై యున్నాడు. ''యమవతామవతాంచ ధురిస్థితః'' అని పేరొందిన దశరథేశుని పుత్రుడు. పుత్రకామేష్ఠియాగ ప్రసాదాంశమున రామునివలెనే జనించినవాడు.

ఇట్టి జనన సాంప్రదాయము లొప్పు భరతుడు యింకొక విధముగా ప్రవర్తించుటయే నైజ స్వభావ విరుద్ధముగా నుండును. మంథర కుబ్జ. దాసీ. తన యజమాని యక్కరకు వస్తే తానుకూడ బాగుపడుదునని యాశపెట్టు కొనినది. అదీ కాక యాడుది. మంథరకు భరతునిపై మోహముండినట్లు కథలో సూచింపబడినది.

స్త్రీ చిత్తమ గాఢమైనను మోహవల్లరి యుభయుల చేష్టాపరం పరలచే నల్లన వికసించునదై యొకరియందెక్కువగ నుండినను రెండవ పక్షపు మనోవాక్కర్మల పోషణపై నాధారపడి యుండును. భరతుడు మంథర కిట్టి మోహభావ మంకురింపజేయు నాశాబంధముల గల్పించెనని నమ్మజాలము.

మరియు కైక దాసియై చిన్ననాటినుండియు భరతుని యాదరించుచుండిన మంథర కాతనిపై మాతృభావమునకు బదులు మోహావేశమేర్పడుట దుస్సహముగను విపరీతముగను దోచకమానదు. ఇందుచేత నీనాటకములోని యందరు నిజగుణానుకూలముగ కథాక్రమమున భావవిపర్యయ మేదియు నొందక ప్రవర్తించిరి.

దశరథుడు కైకకు వరమిచ్చుటలో నేర్పడిన నాటకబీజము రాముని వనవాస దీక్షావలంబనములో ఫలసిద్ధినొందెను. ఆవలికథ యంతయు వ్యర్థము. గంటలో నాడదగిన కథాంశము నైదుగంటల గ్రంథవిస్తరణ మొసంగుటయే కృష్ణమాచార్యులు గారీ పట్టున నొనర్చిన పెద్ద తప్పు.

అనుచిత కావ్య విస్తారమునను, భావ విపర్యయము లేనందునను అచింతితావస్థలేర్పడియు నీనాటకము లక్షణ విరుద్ధమై ప్రదర్శనార్థమై యున్నది. కలికాలపు మూఢ మానసులే వయసు చెల్లిన వెనుక చిన్నపెండ్లాము జేర్చు కొనుటకు సందేహించుచుండ త్రేతాయుగ ధర్మ ప్రవర్తకుడు, 'వార్తకేమానివృత్తీనాం' సంతతిలోని వాడు దశరథుడు చిన్న పెండ్లాము నొకదాని గ్రహించునని నమ్మజాలము. భార్యలు ముగ్గురు దశరథుని చిన్నతనములో స్వీకరింపబడినవారలే. వీరి పాణిగ్రహణ కాలములలో ముందు వెనుకలుండినను రాముని జనన కాలమునకు అరువదివేల యేండ్ల దశరథ జాతకము నడచినట్లగు పడుచున్నది.

''షష్ఠివర్ష సహస్రాంతేజాతోయం మమకౌశిక దుఃఖేనోత్పాదిత శ్చాహంనరామం నేతుమర్హసి.'' వర్షమనగా దినమని ప్రొఫెసరు రంగాచారిగారి నిర్వచన మంగీకరించినను రామావతారో దయమునకు 170 సంవత్సరముల యీడు దశరథునకు జెల్లియుండును. ఇట్టి వయసులో చిన్న పెండ్లాముండుట యసంభవము. ''అనిన మాటను దప్పుటనుచితంబనిగదా దశరథేశుడు కాలధర్మమొందె'' నను వాక్యమే నిజముగ కనుపించుచున్నది.

నాగరాజరావు పఠాను వేషమును ధరించినపుడు వయోరుచుల నీనెడు తరుణయువకుడై గనుపించెను. దశరథ భూమికను దాల్చినపుడీతని ముఖాంగములు తురీయావస్థకు నైజమగు శైథిల్య మొందియుండెను. అంగవార్ధక్యమునకు సహజపరిణామమగు మతిభ్రంశము, దీక్షాదౌర్బల్యము, చీదర, ఉపాయ శూన్యత, ప్రేమాతిశయము, తొందర మొదలగు మానసిక లక్షణములన్నియు నాగరాజరావుగారి యభినయములో పొలుపొందియుండెను.

వయోవృద్ధుని యంగశైథిల్యమేగాక చింతాక్రాంత ముఖలక్షణములేగాక, మానసిక గుణ వినాశము కూడా వీరియభినయములో జక్కగ ముద్రింపబడియుండెను. రామునిపై ప్రేమ, వియోగమందలి కష్టము, వాగ్దాన పరిపాలనాపేక్ష కలవర పెట్టుచుండుట, దారిగానని వృద్ధాలాపములు నాగరాజరావు గారిచే నైజరీతుల నభినయింప బడినవి. రాముడు వెళ్ళిన వెనుక దశరథు డొందిన మనస్తాపము, శోకభారము, దుఃఖతరంగ పరంపరలలో నాతని శేషజీవము మెల్లగ మునిగి కొట్టుకొని మత్తుమందు పీల్చుచున్న శస్త్రరోగివలె క్రమముగ వాక్య శూన్యుడై, చేష్టారహితుడై, నిర్జీవుడై చల్లబడుటయు పుత్రోదయమునకెట్లు పరితపించెనో పుత్రవియోగమున నట్టులే పలవరించి యసువుల నూదివైచుటయు నిరుపమానముగ నభినయింప బడినది.

పాదుకాపట్టాభిషేకమందు నాట్యవైఖరుల కవకాశమెక్కువ లేకున్నను, హరికథ కుపయోగించు విషయము రూపకరూపమున దుర్వ్యాప్తినొందినను బలశీల సమన్వితుడగు దశరథుడు ముక్కాళ్ళముదిమిలో అనుభవించిన రసభావ విప్లవము జక్కగ జూపించి పాత్రస్వభావముతో నైక్యమొంది, నాగరాజరావు కొంత రసవైభవ మీనాటకమున కేర్పరచియున్నారు.

ప్రహ్లాద చరిత్ర భారతీయుల భక్తిగాథలలో నెల్ల ప్రసిద్ధమై భారతీయ ధర్మమగు నహింసావ్రతమును "పొడచిన, దిట్టిన, కొట్టిన, పడుచుందురు పరమభాగవతులు... తా రొడబడరు మారు సేయగ" నను సాధనక్రమమును భౌతిక పారమార్థిక విభూతుల భేదమును జూపు నుత్తమకావ్యమై యున్నది.

ప్రహ్లాదుడు హరిపూజా నిబద్ధమానుడై "లభ్యంబైన సురాధిరాజపదమున్ లక్షింపడశ్రాంతమున్." నిఖిలభూతము లందు నొకభంగి సమహితత్వంబున బరగువాడు, విష్ణుసేవా దోషమును వారించ దండ్రి దుర్భరశిక్షల నుభవింపజేయ "పారడు లేచి దిక్కులకు, బాహువు లొడ్డడు, బంధురాజిలో దూరడు, ఘోరకృత్యమనిదూరడు తండ్రిని, మిత్రవర్గ ముంజీరడు... కావరే యనడు, భయకంపన సమేతుడు

కాడు." ఇట్టి నిశ్చల నారాయణపాద భక్తి నుద్దీపించు మానసమాప్రహ్లాదునిది. హిరణ్యకశిపుడు వేల్పుపెద్దను కొలుచునపుడు "అదిరెన్ కుంభిని సాద్రియై, కలిగె వేదంభోనిధుల్." తపః ఫలితముగ "లోకములన్నియున్ క్షణములోన జయించినవాడు." ఇంద్రియ నిగ్రహము, బలపరాక్రమములు కలవాడు. విపులమైన త్రిలోక సామ్రాజ్యమును సంపాదించి ద్వంద్వ భావములతో గదలుచుండెను. ప్రహ్లాదజనకుడు చక్కని సంస్కారి. విద్వాంసుడు. ఐశ్వర్యవంతుడు. తన తెలివితేటలతో జగమునంతను నింపగల మహాసమర్థుడు.

ఇట్టి రాచపట్టికి నైజముగ లలిత సద్గుణములమరి యుండును. రాజులకు, అందులో నిజరీతిప్రభావమున భువనైక చక్రవర్తులగువారికి, నవరసములు సంస్కార సాధుత్వముతో నొప్పియుండును. చక్రవర్తులు కోపగించు, శోకించు, ప్రేమించు, ముద్దాడు దారులు నీతిమర్యాదలనంటి వీరప్రభు లక్షణంబుల జాటుచు సామాన్యమానవుల చర్యలకు భేదముగా నుండును.

అహంకార మప్పుడప్పుడుప్పొంగినను రాచపోకడలు వ్యంగ్యముగను లలితభావాలంకృతముగను కనుపించును. సామాన్యముగా హిరణ్యకశిపుని గుణాభినయ మవలంబించు వారు వీని నొక క్రూరరక్కసిగ నెంచుచుందురు.

ప్రహ్లాదచరిత్ర కంసుని వంటి దుర్మార్గుని పాప పరిణామమును తెలుపు నాటకముగ నెంచదగదు. ఇవి లౌకిక వైభవములు, పరమార్థచింతకు విరుద్ధములనియు, భౌతికైశ్వర్య విభూతి పరతత్వజిజ్ఞాసకు సరిరాదనియు, శీలమర్యాదలు భక్తికి తోడుగావనియు, యెన్ని శక్తులున్నను పరమేశ్వరుని యాన దాటి నడుపనేరవనియు, ధర్మ స్వరూపమగు కాల చక్రమును లక్షింపక నహంకారప్రమత్తుడై దిరుగువాడధోగతి జెందుననియు బోధించు నాటకము కాని బొబ్బలిడు జడలరక్కసులు, పద్మలోచను బోరాడు సమరవర్ణనముకాదు. నాటకములో లౌకిక బలైశ్వర్యశీల మర్యాదలకును, భక్తి జ్ఞాన వైరాగ్యములకును పొసగు పోరాటముద్దేశింపబడినది.

హిరణ్యకశిపుడు మర్యాదలెరింగిన చక్రవర్తిగా నాగరాజరావు గుర్తించి యభినయించి యున్నాడు. వీరి గాథా వ్యాఖ్యానము నేను చూచినవాటిలోనెల్ల ముద్దుగ నున్నది. భాగవతములో హాలావనావిర్ధమాన మదరోషాయత్త తామ్రాక్షుడై కేళిందేలె" నని నారదుడు చెప్పుకొనినను హిరణ్యకశిపునొక బలమదమత్త దుష్టదైత్యునిగ నెంచక పుత్రునితో నభిప్రాయభేదము గలిగి ప్రేమించుచు వారింపబూనెడి సామాన్య మానవునిగ జిత్రించి ప్రహ్లాదగాథను దేవదానవ విరోధ కాలమునుండి కలి కాలమును నిత్యజీవనములోనికి దింపియున్నాడు.

బహుమంది నటులు హిరణ్యకశిపుని దొల్లిటినుండియు ద్వేషపూరితునిగ నూహింతురు. కాని రక్కసి మేటియు నరులవలెనే ఆశాబంధములతో 'యేమో యేనాటికైనా బాగుపడకపోతాడా? వాడికేం తెలుసులే. చిన్నపాడెగట్టు! ఆ స్నేహాలు! స్నేహాల వల్ల చెడిపోతాడు" అని ఊహించు తండ్రిగా సంకల్ప రహితముగ పుత్రగాత్రపరిష్వంగ సుఖంబులందుచు తప్పనిసరిగ పుత్రుని మేలుకోరి బైరాగివృత్తిని మాన్పించి శూరాధిరాజపదవీ సమర్థునిగ జేయువేడుకతో మెలంగినట్లును, పుత్రుని దుర్నివార్య వాసుదేవానురక్తి కలిగినట్లును, పుత్ర ద్వేషము క్రమముగా విషతుల్యమైనను పుత్రవాత్సల్యభావ ప్రబోధములామానసము వీడనట్లును చక్కగా నిర్దుష్టముగ భావగర్భితముగ నభినయించిరి.

తుదకు స్తంభనిర్భేద సమయమున హిరణ్యకశిపుడు మహోగ్ర ప్రతాపమున బరిఢవిల్లినట్లు నాగరాజ రావభినయింప లేదని కొంద రాక్షేపించిరి. కాని శిక్షలన్నియు నిష్ఫలములై తన త్రిలోకాధికారి శాసనాలు హుళక్కియై ప్రహ్లాదభక్తియే విజయ మొందినపుడు–

"ముంచితి వార్ధులన్... ధిక్కరించితి, శపించితి, ఘోరదవాగ్నులందు ద్రోయించితి, పెక్కుపాట్ల నలయించితి జావడిదేమి చిత్రమో" అను శంక హిరణ్యకశిపుని డెందమాక్రమించి నిస్పృహ గలిగించు చుండెను.

రక్కసి రాజెంతటి విష్ణువిరోధి యయ్యును లౌక్యుడు, నీతికోవిదుడు. స్వబల పరబల విజ్ఞాత. తన ప్రయత్నము లన్నియు నిష్ఫలమై విరోధి సంకల్పమభ్యుదయ మొంద నీవిపరీతస్థితికి గల కారణమరయు వివేకి. స్వకీయ మేధాబలైశ్వర్య మాయా ప్రభావమున నహంకార మాయుల్లము నెల్ల వశపరచు కొనియుండెను. ఇవియన్నియు భక్తి ప్రభావమునకోడి నిష్ఫలమని తోచినంతనే హిరణ్యకశిపుని యహంకార మంతరించెనని చెప్పవచ్చును. అహంకార పటలము శంకా తరంగముల తాకిడికి జిక్కి చెదరినపుడు

ఆత్మ ప్రబోధములు మానసవీధి నుద్దీపింప దొడగును. ఇప్పట్టున హిరణ్యకశిపునకు పూర్వదేవతా సంస్మరణ మంకురించెను. అట్టి సందర్భములలో నటుడు నిర్విణ్ణుడై నిస్సహాయుడై భావసంక్షోభమున ముగ్ధుడై యహంకార రాహిత్యమున చేష్టారహితుడై నిలచుటయే నైజమగు అవస్థ. దీనినిక్కమెరిగి నాగరాజరావు సందర్భానుకూలమగు రీతి నభినయించెను. మరియు నృసింహావతార ఘట్టమునందు భౌతిక శక్తులన్నియు పరశక్తిచే నిర్మూలింపబడినవి.

పరతత్త్వ ప్రభావమును భౌతికైశ్వర్య దౌర్బల్యమును చాటు సందర్భమొక విశ్వవిలయముగా నుండనోపును. జగద్విలయములు కలుగబోవునపుడు కొన్ని విద్యుచ్ఛక్తులు ధృవించి జనుల మూర్ఛిల్లజేయుననియు గ్రహసంఘట్టనాది మహావిలయ సంక్షోభమును భూజను లనుభవింప నేరరనియు నొకమారు ప్రకృతి శాస్త్రముల యాధారమున జెప్పియుంటిని.

నృసింహావతార సందర్భములో విశ్వరూప ప్రదర్శనము జరిగినప్పుడెల్లను మహాతపస్సులగువారు తక్క దక్కిన జనంబులావిలయ మెరుగకుండిరని భారతాదులలో నున్నది. ప్రహ్లాదుడు మూర్తి నారాధించెను. హిరణ్యకశిపుడు మూర్ఛ నొంది మడిసెను. భక్తి సాధనకు భౌతికాహంకారము లోబడి మృగ్యమైనది. ఇచ్చట నాగరాజరావు ఉచితముగ నభినయించెను.

వీరి వేషములన్నిటిలో గాథా సంప్రదాయములు, సందర్భములు నిర్దుష్టముగ బరికించి మానసవ్యాపార వైఖరుల గుర్తించి పాత్ర సారూప్యమొంది రసవిచక్షణతో, నాత్మ నిగ్రహముతో, ముద్రానైపుణ్యముతో నభినయించెడి నటరాజరీతులేర్పడి యున్నవి. సంగీతమొకటి లేకున్న మన్నింప వచ్చును. "ఏకోమిదోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః."




# మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

## బహుమతి
పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**



ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 6. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 7. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



## స్వాతంత్ర్య వీరుడు

# రామప్రసాద్ 'బిస్మిల్'

**ఈ రోజు 1927 డిసెంబరు 16వ తేదీన, ఈ పంక్తులు రాస్తున్నాను.**

**19** డిసెంబరు, సోమవారం (పుష్యమాసం, కృష్ణపక్షం ఏకాదశినాడు) ఉదయం 6.30కి ఈ శరీరాన్ని ఉరికంబం పైన వేలాడదీయాలనే నిర్ణయం జరిగిపోయింది. అందువల్ల నిర్ధారించిన సమయంలో ఈ జీవనలీలను పరిసమాప్తం చేసి తీరవలసిందే. ఇదంతా సర్వశక్తిమంతుడు భగవంతుని లీల. అన్ని పనులు ఆయన కోరిక ప్రకారమే జరుగుతాయి. ఎవరు, ఏ విధంగా శరీరత్యాగం చేయాలి, అనేది ఆ పరమాత్ముని నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. కాబట్టి మృత్యుహేతువులన్నీ కూడా నిమిత్త మాత్రాలే. కర్మక్షయం జరిగే వరకు ఆత్మ జన్మ-మరణాల బంధంలో పడుతూ ఉండ వలసిందేనని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఏ కర్మల కారణంగా ఈ ఆత్మ శరీరం ధరించ వలసి ఉంటుంది, అనేది ఆ పరమాత్మునికి మాత్రమే తెలిసి ఉన్నా, నేను మాత్రం అతి త్వరలో ఉత్తమమైన మరో శరీరం పొంది, కొత్త శక్తులతో మళ్ళీ భారతదేశంలోనే ఎవరో దగ్గరి బంధువుల, లేక మిత్రుల ఇంట్లో జన్మిస్తానని దృఢంగా నమ్ముతున్నాను. ఎందుచేతనంటే, ప్రతి జన్మలోనూ నా ఉద్దేశ్యం సమస్త ప్రాకృతిక సంపదల పైన మానవులందరికీ సమానమైన అధికారం లభించాలనేదే, ప్రపంచమంతటా ప్రజాస్వామ్యం నెలకొని ఉండాలనేదే, ఎవరూ ఎవరిపైనా అధికారం చెలాయించ కూడ దనేదే అయి ఉంటుంది కాబట్టి. ప్రస్తుతం భారతదేశ పరిస్థితి చాలా శోచనీయంగా ఉంది. అందువల్ల పలుమార్లు ఈ దేశంలోనే నేను జన్మించవలసి ఉంటుంది. ఆ పరమాత్మణ్ణి నేను ప్రార్థించేదొక్కటే, భారతదేశంలోని స్త్రీ-పురుషులందరు అన్ని విధాలా స్వతంత్రులు అయ్యేవరకు ఈ దేశంలోని పవిత్రమైన, నిరుపమానమైన వేదఘోషను ప్రపంచంలోని ప్రతి ఒక్క మానవుని చెవుల దాకా చేర్చగలిగేందుకుగాను, నేనీ దేశంలోనే జన్మిస్తూ ఉండేట్లు చేయమని. ఇందుకు తగిన దారిని నిర్ధారించుకోడంలో నాతో పొరపాటు జరగవచ్చు. అలా జరిగితే అది నా తప్పుకాదు. ఎందుచేతనంటే నేను కూడా అల్పబుద్ధిగల ఒక ప్రాణినే కదా! ఏ పొరపాటూ చేయకుండా ఉండడం సర్వజ్ఞులకు మాత్రమే వీలవుతుంది. ఉన్న పరిస్థితుల ననుసరించే మేము అన్ని పనులు చేయవలసి వచ్చింది, మున్ముందు కూడా చేయవలసి ఉంటుంది. వచ్చే జన్మలో నేనవలంబించే మార్గం దోషరహితంగా ఉండేందుకు భగవంతుడు నాకు సుబుద్ధి ప్రసాదించు గాక!

ఇప్పుడు నేను కాకోరీ (రైలుదోపిడీ) కేసులోని నిందితుల విషయంలో సెషన్స్ జడ్జి తీర్పు ఇచ్చిన తర్వాత జరిగిన సంఘటనల గురించి కూడా కొంత చెప్పాలనుకుంటున్నాను. 1927, ఏప్రిల్ 16వ తేదీన సెషన్స్ జడ్జి తీర్పు ఇచ్చాడు. 1927, జూలై 18వ తేదీన అవధ ప్రాంత ప్రధాన న్యాయాలయంలో దాని పైన అప్పీలు చేయడం జరిగింది. అప్పుడు కొందరి శిక్ష పెరిగింది. ఒకరిద్దరిది తగ్గింది కూడా.

అప్పీలు చేయడం జరిగిన తేదీకి ముందు నేను "ఇక ముందు విప్లవ దళంతో నేనెలాంటి సంబంధం ఉంచుకోనని" వాగ్దానం చేస్తూ యునైటెడ్ ప్రావిన్స్ గవర్నరుకు ఒక విన్నపం పంపాను. ప్రధాన న్యాయాలయంలోని జడ్జీలకు నేనిచ్చిన నా చివరి క్షమాప్రార్థనా పత్రంలో ఈ విన్నపాన్ని గురించి ప్రస్తావించాను కూడా. అయితే ఆ జడ్జీలు నా ఈ ప్రార్థనను ఎంత మాత్రం ఖాతరు చేయలేదు. జైలు నుంచి నేనే స్వయంగా నా కేసుకు సంబంధించి నా వాదనలు రాసి పంపాను. అది

తెలుగు అనువాదం - డాక్టరు జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

అచ్చయింది కూడా. ఈ వాదనలు విన్నప్పుడు ప్రధాన న్యాయాలయ జడ్జీలకు ఈ వాదనలు నేను రాసినవి కావనే గట్టి అనుమానం కలిగింది. ఈ విధంగా జరిగిన విషయాల పరిణామంగా అవధ ప్రాంత ప్రధాన న్యాయాలయం నాకు 'మహా భయంకరమైన కుట్రదారు'ని పదవినిచ్చింది. నా పశ్చాత్తాపం పైన జడ్జీలకు నమ్మకం కలగలేదు. వాళ్ళు 'ఈ రామ ప్రసాద్‌ను విడిచి పెడితే మళ్ళీ తన మునుపటి పనే చేస్తాడు,' అనే తమ అభిప్రాయం వెలిబుచ్చారు. నా బుద్ధి తీక్షణతను, అవగాహనా శక్తిని ప్రస్తావిస్తూ వాళ్ళు నన్ను 'క్రూరుడైన హంతకుడు' అనే బిరుదుతో కూడా సత్కరించారు. కలం వాళ్ళ చేతుల్లో ఉంది కాబట్టి ఏది కావాలంటే అది రాయగలిగారు!

అయితే కాకోరీ కాండకు సంబంధించి ప్రధాన న్యాయాలయం ఇచ్చిన తీర్పును మొదటి నుంచి చివరదాకా చదివినప్పుడు నాకు మరణ దండన ఏ ఉద్దేశ్యంతో ఇవ్వడం జరిగిందో స్పష్టంగా తెలుస్తుంది. సెషన్స్ జడ్జికి విరుద్ధంగా మాట్లాడాడు కాబట్టి రామప్రసాద్ అందరికంటే ఉద్దండుడైన అపరాధి, అని నిర్ణయించడం జరిగింది. ఇక అతడు ఏ విధంగా క్షమాపణ కోరినా కూడా ఇవ్వడానికి వీల్లేదు!

ప్రధాన న్యాయాలయం క్షమా అప్పీలు రద్దు చేసిన తర్వాత నియమానుసారం ప్రాంత గవర్నరు వద్దకు, ఆ తర్వాత వైస్రాయ్ వద్దకు మా క్షమాప్రార్థనను పంపడం జరిగింది. రామప్రసాద్ 'బిస్మిల్', రాజేంద్రనాథ్ లాహిడీ, రోశన్ సింగ్, అశఫాక్ ఉల్లా ఖాన్, వీరికి ఇచ్చిన ఉరిశిక్షను మార్చి మరేదైనా శిక్ష ఇవ్వాలని సిఫారసు చేస్తూ సంయుక్త ప్రాంత కౌన్సిల్ లోని దాదాపు అందరు నామినేటెడ్ సభ్యులు సంతకం చేసి ఒక అభ్యర్థన పంపారు. ఉన్నత శ్రేణి వ్యక్తులు, ఆనరరీ మెజిస్ట్రేట్‌లు, జమీందారులు మొత్తం రెండు వందల యాభై మంది సంతకాలతో మా నాన్న మరో ప్రార్థనా పత్రం కూడా పంపాడు. అయినా మహారాజశ్రీ సర్ విలియమ్ మేరిస్ ప్రభుత్వం అన్నింటినీ పెడచెవిని పెట్టింది.

అదే సమయంలోనే లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లలోని 78 మంది సభ్యులు కూడా సంతకం చేసి, కాకోరీ కాండలో ఉరిశిక్ష పొందిన వారు పశ్చాత్తాపం వెలిబుచ్చిన పక్షంలో ప్రభుత్వం వీరి శిక్ష తగ్గించాలని దౌరాజడ్జి సిఫారసు చేసి ఉన్నాడు కాబట్టి వారికి ఆ శిక్ష తప్పించి మరో శిక్ష ఏదైనా ఇవ్వమని కోరుతూ ప్రార్థనా పత్రం పంపారు. నిందితులము మేము నలుగురమూ మా పశ్చాత్తాపం వెలిబుచ్చాం. అయినా వైస్రాయ్ మహాశయుడు కూడా దాన్ని ఎంతమాత్రం పట్టించుకో లేదు.

ఈ విషయంలో మాననీయులు పండిత్ మదన మోహన్ మాలవీయ, మరి కొందరు అసెంబ్లీ సభ్యులు కూడా వైస్రాయ్‌ని కలుసుకొని మాకు మరణదండన తప్పించేందుకు ప్రయత్నించారు. ఇంత ప్రయత్నం జరిగిన తర్వాత వైస్రాయ్ మహాశయుడు మా మరణదండన ఆదేశాన్ని రద్దు చేస్తాడని అందరూ ఆశించారు. ఇలాంటి పరిస్థితిలోనే విజయదశమికి రెండు రోజులు ముందుగా మా శిక్ష తగ్గించడం జరగదని గప్‌చిప్‌గా జైళ్ళకు టెలిగ్రామ్ పంపారు. అందరి ఉరిశిక్షకు తేదీ నిర్ణయించడం కూడా జరిగి పోయింది.

జైలు సూపరింటెండెంటు నాకు టెలిగ్రామ్ చదివి వినిపించినప్పుడు నేను "సరే, ఇక మీ పని మీరు చేయండి" అని అన్నాను. అయితే జైలు సూపరింటెండెంటు "ఉరిశిక్షపడిన ఏ ఖైదీ క్షమాప్రార్థన వైస్రాయ్ ద్వారా తిరస్కరించడం జరుగుతుందో, వాళ్ళంతా చక్రవర్తి పేరుతో ప్రాంత ప్రభుత్వానికి అప్పీలు చేస్తూ ఒక టెలిగ్రామ్ తప్పక పంపుతారనే నియమం ఉంది కాబట్టి, నీవు కూడా చక్రవర్తి పేరున క్షమాప్రార్థనతో ఒక టెలిగ్రామ్ పంపు" అని చాలా చెప్పాడు. మరో జైలు సూపరింటెండెంటు అయితే అలా చేసే వాడు కాదు. పై విధంగా టెలిగ్రామ్ రాసేటప్పుడు నాకు ఇంగ్లాండులోని ప్రీవీ కౌన్సిల్‌లో అప్పీలు చేయాలనే ఆలోచన వచ్చింది.

అప్పుడు నేను లక్నోలో ఉండే వకీలు శ్రీ మోహన్‌లాల్ సక్సేనాకు ఈ విషయం చెప్పాను. బయట ఎవరికి గానీ వైస్రాయి మా అప్పీలు తిరస్కరించాడనే విషయం పైన నమ్మకం కలగలేదు. అతి కష్టంపైన శ్రీ మోహన్‌లాల్ ద్వారా ప్రీవీ కౌన్సిల్‌లో అప్పీలు చేయించడం జరిగింది. దాని ఫలితం ముందుగా ఊహించిందే! అక్కడ కూడా అప్పీలు రద్దయింది. ఇంగ్లీషు ప్రభుత్వం మా ఏమాటా వినదనే విషయం తెలిసి కూడా నేనెందుకు ప్రభుత్వానికి వాగ్దాన పత్రం రాశాను? ఎందుకు అప్పీలు తర్వాత అప్పీలు, క్షమాప్రార్థనలు, పంపాను? ఇలాంటి ప్రశ్నలు నా మెదడులో తలెత్తు తూంటాయి. నా మనసుకు ఎల్లప్పుడు తోచేదేమంటే,

రాజకీయాలు చదరంగంతో సమానమని. చదరంగం ఆడేవాళ్ళకు చాలా బాగా తెలుసు అవసరమైనప్పుడు తమ పావులనైనా ఎలా చంపించ వలసి ఉంటుంది, అనే విషయం.

మరో వైపు బెంగాల్ ఆర్డినన్స్ కేసు ఖైదీలను వదలిపెట్టాలి, లేదా వాళ్ళపైన బహిరంగంగా విచారణ జరపాలి, అనే ప్రతిపాదనను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రభుత్వం వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, బహిరంగంగా విచారణ జరిపితే సాక్షులకు అపాయం జరగవచ్చుని, ఆర్డినెన్స్ కేసు ఖైదీలు గనక భవిష్యత్తులో విప్లవ కార్యకలాపాలకు దూరంగా ఉంటామని లిఖిత పూర్వకమైన హామీ ఇస్తే ప్రభుత్వం వాళ్ళను విడుదల చేసే విషయం గురించి ఆలోచిస్తుందని ప్రభుత్వం తరఫునుంచి చాలా బలంగా చెప్పడం జరిగింది.

బెంగాల్‌లో దక్షిణేశ్వర్, సోనాబజారు బాంబు కేసులు ఆర్డినెన్స్ కేసు తర్వాతనే జరిగాయి. గూఢచారి శాఖకు చెందిన డిప్యూటీ సూపరింటెండెంటు హత్య కేసులోకూడా బహిరంగ విచారణ జరిగింది. ఆయుధాలకు సంబంధించిన మరికొన్ని కేసుల విచారణ కూడా బహిరంగంగానే జరిగింది. అయినా (సాక్షులకు సంబంధించి) ఒక్క దుస్సంఘటన జరిగినట్లుగానీ, హింస జరిగినట్లు గానీ పోలీసులు చూపలేక పోయారు. కాకోరీ కుట్రకేసు పూర్తి ఒకటిన్నర సంవత్సరం దాకా బహిరంగ న్యాయాలయాల్లో జరుగుతూ వచ్చింది. నేరానికి రుజువుగా దాదాపు మూడు వందల సాక్షులను ఎదుటికి తీసుకొచ్చారు. ఎందరో అప్రూవర్లు, అపరాధం స్వీకరించిన వారు బహిరంగంగా తిరుగుతూ ఉండినారు. అయినా ఎక్కడా ఎలాంటి దుస్సంఘటన జరిగిందని గానీ, ఎవరినైనా బెదిరించడం జరిగిందని గానీ, పోలీసులు చూపలేక పోయారు. ప్రభుత్వం చెప్పే మాటల్లోని ఈ డొల్లతనాన్ని బట్టబయలు చేయాలనే ఉద్దేశ్యంతోనే నేను ప్రభుత్వానికి నా వాగ్దానం రాసి ఇచ్చాను.

ప్రభుత్వం బెంగాల్ ఆర్డినెన్స్ ఖైదీలకు సంబంధించి వారి వద్ద పూర్తి సాక్ష్యాధారాలు ఉన్నాయని, వాళ్ళల్లో అనేకులను అది కుట్రదారుల భయంకరమైన దళంలోని సభ్యులుగా భావిస్తుందని, వాళ్ళను తాను అలానే పిలుస్తుందని, ఇకముందు వాళ్ళు విప్లవ కార్యకలాపాలకు దూరంగా ఉంటామని లిఖితపూర్వకమైన హామీ ఇస్తే వాళ్ళను విడుదల చేసే విషయం గురించి ప్రభుత్వం ఆలోచిస్తుందని ప్రకటించిన తర్వాత కాకోరీ కాండ ఖైదీల విషయంలో అలా ఎందుకు జరగలేదు? వాళ్ళు అలానే ఇచ్చిన లిఖిత పూర్వకమైన వాగ్దానాలను ఎందుకు తిరస్కరించడం జరిగింది? ఇది 'బలవంతుడు కొట్టనూ కొడతాడు, ఏడ్వనుకూడా ఏడవనివ్వడు' అనే సామెతలాగా ఉంది. సంయుక్త ప్రాంతంలో నడిచే రాజకీయ కేసులన్నింటిలో తీర్పులన్నీ పోలీసు గూఢచారి విభాగం కోరినట్లే రాయడం జరుగుతూందని నాకు బాగా తెలుసు. బరేలీ కానిస్టేబుళ్ళ హత్యకేసులో సర్వదా నిర్దోషులైన నవయువకులను ఇరికించిన తర్వాత సి.ఐ.డి వాళ్ళు తమ డైరీ చూపించి తీర్పు రాయించారు. కాకోరీ కాండలో కూడా చాలావరకు అలాగే జరిగింది.

ప్రభుత్వం పన్నే అన్ని ఎత్తుగడలు తెలిసి కూడా అది మాట్లాడే పెద్దపెద్ద మాటల్లోని డొల్లతనాన్ని బయటపెట్టేందుకే నేను ఈ పనులన్నీ చేశాను. కాకోరీ సంఘటనలో మరణదండన పొందిన వారి క్షమాప్రార్థనను తిరస్కరించడానికి ప్రభుత్వం వద్ద పెద్ద కారణమంటూ ఏదీ లేదు. బెంగాల్ ఆర్డినెన్సు ఖైదీల విషయంలో ప్రభుత్వం ఏమేమి చేయమని చెప్పిందో, అదంతా కాకోరీ వాళ్ళు చేశారు. వారి మరణ శిక్షను రద్దు చేయడం వల్ల దేశంలో ఎలాంటి అరాచక పరిస్థితులు నెలకొనే అవకాశం గానీ, విప్లవం జరిగే అవకాశంగానీ లేదు. ముఖ్యంగా దేశంలోని హిందూ-ముస్లిం అసెంబ్లీ సభ్యులు అలాంటి అప్పీలు చేశారు కాబట్టి.

విప్లవకారులకు అనుకూలంగా ఇంత బలంగా సిఫారసు చేయడం మునుపెన్నడూ జరగలేదు. అయినా ప్రభుత్వం తన పట్టుదలను ఏమాత్రం సడలించదలుచుకోలేదు. దానికి తన శక్తి పైన నమ్మకం ఉంది. సర్ విలియమ్ మేరిసే స్వయంగా షాజహాన్‌పూర్‌లోనూ, అలహాబాదులోనూ జరిగిన హిందూ-ముస్లిం మత కలహాల్లో శిక్షితుల మరణదండనను రద్దు చేశాడు.

అలహాబాదు హైకోర్టు ఈ శిక్షితులకు మరణదండనే తగిన శిక్ష అని నిర్ణయించి ఉండింది. వీళ్ళపైన పట్టపగలు హత్య చేసినట్లు స్పష్టమైన సాక్ష్యాధారాలున్నాయి. పైగా ఈ శిక్షలు ఎలాంటి సమయంలో రద్దు చేశాడు? రోజూ హిందూ-ముస్లిం మత కలహాలు పెరిగిపోతున్న సమయంలో! కాకోరీ ఖైదీల మరణదండనను రద్దు చేసి వాళ్ళకు మరో

శిక్ష ఇస్తే ఇతరుల ఉత్సాహం పెరిగిపోతుందని వాదిస్తే మరి మతకలహాల విషయంలో కూడా అలా జరిగే వీల్లేక పోయిందా? అయితే అక్కడి సంగతి వేరు! భారతదేశాన్ని దాస్యశృంఖలాల్లో బంధించి ఉంచేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయో, అది నాకు బాగా తెలుస్తూ ఉంది.

ప్రాణత్యాగం చేసేప్పుడు 'మా త్యాగాలు వృథా అయ్యాయే!' అని నేను నిరాశ పడవలసిన అవసరం లేదు. నా నమ్మకం ఏమిటంటే మాలో అణిగి ఉన్న నిట్టూర్పుల పరిణామంగానే భగవంతుడు లార్డ్ వర్కన్ హెడ్ తలలో భారతదేశంలోని హిందూ-ముస్లింల తగాదాలను ఆసరాగా తీసుకొని దేశ సంకెళ్ళు మరింత బిగించాలనే ఆలోచన పుట్టించాడు. కానీ, వారికి 'లాభానికి పోతే ఉన్నది పోయింద'న్నట్లయింది. భారతదేశంలోని అన్ని పెద్ద రాజకీయ పార్టీలు, దాదాపు హిందూ నాయకులందరు, కొందరు ముస్లిం నాయకులు, ఏకగ్రీవంగా రాయల్ కమిషను నియామకాన్ని, అందులోని సభ్యులను తీవ్రంగా ప్రతిఘటించారు.

రానున్న కాంగ్రెస్ (మద్రాసు) సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, హిందువులు-ముస్లిములు అందరూ ఒకటి కాబోతున్నారు. కాకోరీ విషయంలో మరణదండన పొంది ఉన్న మా క్షమాప్రార్థనను వైస్రాయి తిరస్కరించినప్పుడు నేను మోహన్‌లాల్ సక్సేనా గారికి భారతదేశ నాయకులు, హిందూ-ముస్లింలు, అందరూ రానున్న కాంగ్రెస్ సమావేశాల్లో ఒకటై మా గురించి ఆలోచించాలని చెప్పాను.

ప్రభుత్వం ఆశఫాక్ ఉల్లా ఖాన్‌ను రామ ప్రసాద్ 'బిస్మిల్'కు కుడి భుజమని నిర్ధారించింది. అశఫాక్ ఉల్లా తన ఇస్లాం మతం పైన అచంచల విశ్వాసం కలవాడైనా ఆర్యసమాజ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే రామ ప్రసాద్ 'బిస్మిల్' కు చెందిన విప్లవ దళం విషయంలో అతని కుడిభుజం కాగలిగినప్పుడు భారతదేశ స్వాతంత్ర్యం కోసం హిందువులు-ముస్లింలు తమ చిన్న-చిన్న స్వార్థాలను వదలిపెట్టి పరస్పరం ఒకటి కాలేరా?

భగవంతుడు నా ఈ మొర ఆలకించాడు. నా కోరిక తీరుతున్నట్లు కనిపిస్తూంది. నా పని నేను చేసేశాను. ముస్లింల నుంచి అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణుడైన ఒక నవయువకుణ్ణి వెలికి తీసి నేను భారతదేశ వాసులకు చూపించాను. ఇక 'ముస్లింలను నమ్మరాదు' అనే సాహసం ఎవరూ చేయకూడదు. ఇది నా మొదటి అనుభవం. పూర్తిగా సఫలమైంది.

ఇక దేశవాసులతో నేను ప్రార్థించేది ఒకటే- మేము ఉరికంబం ఎక్కడం వల్ల వాళ్లకు గనక ఏ మాత్రమైనా విచారం కలిగి ఉంటే, వాళ్ళంతా, హిందువులు-ముస్లిములు, అన్ని రాజకీయ పార్టీలు ఒకటై కాంగ్రెసును తమ ప్రతినిధిగా భావించాలనే గుణపాఠం నేర్చుకోవాలి. కాంగ్రెసు నిర్ణయించిందాన్ని అందరూ పూర్తిగా అంగీకరించాలి. దాని పైన అమలు చేయాలి. అలా చేసినప్పుడు భారతవాసుల తీవ్ర ఆకాంక్ష ఎదుట బ్రిటిష్ ప్రభుత్వం తల వంచే రోజు త్వరలోనే వస్తుంది. స్వరాజ్యం రావడంలో ఎంతో కాలం పట్టదు.

ఎంత కష్టసాధ్యమైనా సరే, హిందు - ముస్లింల ఐకమత్యమే, మా చివరి కోరిక, మా స్మారక చిహ్నం. నా అభిప్రాయమే అశఫాకుల్లా ఖాన్ అభిప్రాయం కూడా. ఎందుచేతనంటే, అప్పీలు చేసినప్పుడు మేమిద్దరము లక్నో జైల్లో ఉరి శిక్ష పడిన వారిని ఉంచే చిన్న-చిన్న గదుల్లో ఎదురెదురుగా కొన్ని రోజులు ఉన్నాం. ఇద్దరము కలిసి చాలా విషయాలు మాట్లాడుకున్నాం. అరెస్టు అయిన తర్వాత మాకు శిక్షపడే వరకు అశఫాక్ ఉల్లా ఖాన్‌కు నాతో కనీసం ఒక సారైనా కలుసు కోవాలనే బలమైన కోరిక ఉండేది. భగవంతుడు ఆ కోరిక తీర్చాడు.

అశఫాక్ ఉల్లా ఖాన్‌కు బ్రిటిష్ ప్రభుత్వంతో క్షమాపణ కోరడం బొత్తిగా ఇష్టం లేదు. దీనదయాళువు ఆ భగవంతుణ్ణి తప్ప మరెవరినీ దయాభిక్ష అడగ కూడదనేదే ఆయన దృఢ విశ్వాసం. అయినా కూడా నా బలవంతం పైనే ఆయన ప్రభుత్వంతో క్షమాపణ కోరాడు. ఈ అపరాధం నాదే. నేనే ప్రేమకున్న పవిత్ర అధికారాలన్ని ఉపయోగించి ఆయన తన దృఢ నిశ్చయాన్ని సడలించుకొనేట్లు చేశాను.

నా పొరపాటును అంగీకరిస్తూ గోరఖ్‌పూర్ నుంచి ఒక ఉత్తరం రాసి నేను ఆయనతో క్షమాపణ కోరాను. ఆ ఉత్తరం ఆయనకు అందిందో లేదో, ఆ పరమాత్మునికే తెలియాలి! సరే ! మాకు ఉరిశిక్ష పడాలి, భారతదేశ వాసుల హృదయాల పుండ్ల పైన కారం చల్లడం జరగాలి, వాళ్ళు విలవిలలాడాలి, మా పట్ల వాళ్ళ భావనను చూసి మా ఆత్మలకు సంతృప్తి

కలగాలి అనేదే భగవంతుని కోరికలాగుంది. మేము కొత్త శరీరాలతో వచ్చి దేశసేవలో పాలుపంచుకోడానికి మళ్ళీ ఉద్యమించినప్పటికి భారతదేశ పరిస్థితి పూర్తిగా బాగుపడిపోయి ఉండాలని, సాధారణ ప్రజల్లో చాలా భాగం విద్యావంతులై ఉండాలని, గ్రామీణ ప్రజలు కూడా తమ కర్తవ్యాన్ని తెలుసుకోగలిగి ఉండాలని కోరుకుంటున్నాను.

ప్రీవీ కౌన్సిల్‌లో అప్పీలు చేసి నేను చేసిన వృథా ప్రయాసకు కూడా ఒక అర్థం ఉంది. అన్ని అప్పీళ్ళకు అర్థం మరణదండన సమంజసమైందికాదు అనే. ఎందుకంటే, ఎవరి పిస్తోలు గుండుతో మనిషి చనిపోయాడో తెలియదు. ఒకవేళ దోపిడీకి బాధ్యతననుసరించి మరణదండన విధించి ఉంటే, ప్రధాన న్యాయాలయం తీర్పు ప్రకారం కూడా జరిగిన దోపిడీలకు బాధ్యుణ్ణి, నాయకుణ్ణి, నేనే కాబట్టి మరణదండన నాకు మాత్రమే విధించవలసి ఉండింది. మిగిలిన ముగ్గురికి ఉరిశిక్ష ఇచ్చి ఉండకూడదు.

ఉరిశిక్ష కాక వేరే ఏ శిక్ష విధించినా అంగీకరించేవాళ్ళం. కానీ, అలా ఎందుకు జరుగుతుంది? ఇంగ్లాండులోని న్యాయాలయాన్ని కూడా ఒకసారి పరీక్షించి, ఏదైనా రాజకీయ అభియోగం నడిచినప్పుడు పొరపాటున కూడా ఎవరూ ఇంగ్లీషువారి ఏ న్యాయాలయాన్నీ విశ్వసించవద్దని చెప్పడానికి దేశవాసులకొక ఉదాహరణ చూపించాలనుకున్నాను. కావాలంటే ఎవరైనా బలమైన వాజ్మూలం ఇవ్వవచ్చు. నా అభిప్రాయం మాత్రం ఇంగ్లీషు వాళ్ళ కోర్టుల్లో ఎవరు కూడా ఎప్పుడే గానీ వాజ్మూలం కానీ, సంజాయిషీ గానీ ఇవ్వకూడదనేదే. కాకోరీ కాండకు సంబంధించిన అభియోగం నుంచి గుణపాఠం నేర్చు కోవాలనేదే.

ఈ అభియోగంలో అన్ని రకాల ఉదాహరణలు ఉన్నాయి. ప్రీవీ కౌన్సిల్‌కు అప్పీలు పంపడానికి మరో కారణం కూడా ఉంది. కొంతకాలం దాకా ఉరిశిక్ష అమలును వాయిదా వేయించి నేను మన నవయువకుల్లో ఎంత మనోబలం ఉంది, దేశవాసులు ఎంత సహాయం చేయగలుగుతారు, అనే దాన్ని పరీక్షించి చూడాలనుకున్నాను. ఇందులో నాకు చాలా నిరాశతో కూడిన అనుభవం ఎదురైంది.

చివరకు నేను వీలైతే జైలు నుంచి పారిపోవాలని నిశ్చయించుకున్నాను. అలా జరిగినప్పుడు ప్రభుత్వం ఉరిశిక్ష పడిన మిగాతా ముగ్గురి ఉరిశిక్షను మాపు చేయవలసి వచ్చేది. అలా చేయని పక్షంలో నేను చేయించుకొనే వాణ్ణి. జైలు నుంచి పారిపోడానికి నేను చాలా ప్రయత్నాలు చేశాను. కానీ బయటి నుంచి నాకు ఏ సహాయమూ అందలేదు. ఆలోచిస్తే మనసు క్షోభపడుతుంది.

ఏ దేశంలో అయితే నేను ఇంత పెద్ద విప్లవోద్యమాన్నీ, సాహసచర్యలు చేయగలిగిన దళాన్నీ నిర్మించానో, అక్కడి నుంచి నా ప్రాణాలను రక్షించుకునేందుకు నాకొక రివాల్వర్ కూడా అందలేదు. ఒక్క నవయువకుడు కూడా సహాయం చేయడానికి రాలేదు. చివరకు ఉరిశిక్ష పాలవుతున్నాను. ఉరిశిక్ష పడినందుకు నాకు దు:ఖం లేదు. ఎందు చేతనంటే ఇదే భగవదేచ్ఛ అనే నిర్ణయానికి వచ్చాను కాబట్టి.

**అయితే నవయువకులతో వినయపూర్వకంగా నేనొక మాట నివేదించుకోవాలను కుంటున్నాను. ఎంత వరకైతే భారతదేశ వాసుల్లోని అధిక సంఖ్యాకులు విద్యావంతులు కారో, ఎంత వరకైతే వారికి కర్తవ్యాకర్తవ్యాల ఎరుక కలగదో, అంతవరకు వాళ్ళు పొరపాటున కూడా ఎలాంటి విప్లవ చర్యల్లోనూ పాల్గొన వద్దనేదే నా నివేదన. దేశసేవ చేయాలనే కోరిక ఉంటే, బహిరంగ ఉద్యమాల ద్వారా తమ శక్తి కొద్దీ పనిచేయవచ్చు. అలా కానప్పుడు వాళ్ళ త్యాగం వృథా అయిపోతుంది. బహిరంగ ఉద్యమంలో ఇంతకు మించిన దేశసేవ చేయడం వీలవుతుంది.**

**అదే ఎక్కువ ఉపయోగకరంగా కూడా ఉంటుంది. పరిస్థితులు అనుకూలంగా లేనందువల్ల మా ఉద్యమాల్లాంటి వాటికోసం చేసిన శ్రమ చాలా వరకు వృథాయే అయి పోతుంది. ఎవరి మేలు కోసం అంతా చేస్తామో, వాళ్ళే నానా మాటలంటారు. చివరకు లోలోపలే కుములుకుంటూ ప్రాణాలు వదల వలసి ఉంటుంది.**

దేశవాసులతో నా చివరి నివేదన ఏమంటే, ఏమి చేసినా, అందరూ కలిసి చేయండి. అందరి మేలు కోసం చేయండి. దీనివల్లనే అందరికీ మేలు జరుగుతుంది. అంతే!

'బిస్మిల్', 'రోశన్', 'లహరీ',
'అశఫాక్', ప్రాణత్యాగం చేస్తారు,
జన్మిస్తారు అలాంటి వాళ్ళు వందలమంది,
వాళ్ళ రక్త ధారల నుంచి."

**రామ ప్రసాద్ బిస్మిల్** ఉత్తర ప్రదేశ్ లోని షాజహాన్‌పూర్‌లో 1897, జూన్ 11వ తేదీన జన్మించాడు.

ఆయన భారత స్వాతంత్ర్యోద్యమంలో 'హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్' అనే విప్లవదళాన్ని స్థాపించిన వారిలో ఒకడు. తీవ్రవాద దేశభక్తుడే కాక ఆయన హిందీ, ఉర్దూ భాషల్లో మంచి దేశభక్తి కవితలు రాసిన కవిగా కూడా ప్రసిద్ధుడు. 'బిస్మిల్' ఆయన కలం పేరు. ఇంగ్లీషు నుంచి, బెంగాల్ నుంచి హిందీలోకి అనువాదం కూడా చేశాడు. 'సర్‌ఫరోశీ కీ తమన్నా' (శిరసును అమ్మాలనే పిచ్చకోరిక నా మనసులో ఉంది.) అనే ప్రసిద్ధ దేశభక్తి గీతం ఈయనే రాశాడు.

ఇది నేటికీ ప్రజల్లో చాలా ప్రచారం పొంది ఉన్న గీతం. 'బిస్మిల్' శత జయంతి సందర్భంగా 1997లో నాలుగు ఖండాలుగా 'సర్‌ఫరోశీ కీ తమన్నా' అనే గ్రంథం ప్రచురించ బడింది.

స్వామి దయానంద్ రచించిన 'సత్యార్థ ప్రకాశ్' నుంచి ప్రేరణ పొందిన 'బిస్మిల్' షాజహాన్ పూర్‌లోని ఆర్యసమాజ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు.

తన సాహసోపేతమైన విప్లవ కార్యకలాపాల కారణంగా ప్రసిద్ధి పొందిన 'బిస్మిల్' బ్రిటిష్ ప్రభుత్వానికి విరుద్ధంగా 1918లో మైన్‌పురి కుట్ర (Mainpuri Couspiray) లోనూ, 1925లో కాకోరీ రైలు దోపిడి కాండ (Kakori Conspircy) లోను పాల్గొన్నాడు. ఈ దోపిడీలో పాల్గొన్నందుకే బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ఉరిశిక్ష విధించింది.

1927, డిసెంబరు 19వ తేదీన గోరఖ్‌పూర్ జైల్లో ఉరిశిక్ష అమలు జరిగిన రోజు ఉరికంబానికి వెళ్ళే దారిలో ఉన్నవాళ్ళ కందరికి చివరి వీడ్కోలు చెప్తూ, చిరునవ్వు నవ్వుతూ ముందుకు వైపు నడిచాడు. ఉరి తీసే వేదిక పైన నిలబడి ఉరితాడు ఉచ్చును ముద్దు పెట్టుకొని, తన చివరి కోరికను గట్టిగా ఇలా ప్రకటించాడు– "బ్రిటిష్ సామ్రాజ్యం పతనం కావాలనేదే నా కోరిక!" తర్వాత వైదిక ప్రార్థన– "ఓం విశ్వాని దేవ సవితుర్ దురితాని పరాసువ, యద్ భద్రం తన్న ఆసువ!" (సర్వజీవుల సృష్టికర్తా! మా ఆత్మల నుంచి చెడు తొలగిపోయేట్లు, వాటిలో మంచి వ్యాపించి ఉండేట్లు చేయి!) అని పలికి, ఉరి తాటి ఉచ్చును పూలమాలలాగా మెడలో వేసుకున్నాడు.

ఉరితీసేవాడు ఉరికంబం లివరును లాగాడు. 'బిస్మిల్' శరీరం గాలిలో వేలాడింది. ఆయన చనిపోయినట్లు నిర్ధారణ చేసుకోడానికి అర్ధగంట సేపు ఆయన శరీరాన్ని అలాగే వేలాడుతూ ఉండనిచ్చారు. ఈ విధంగా భయమెరుగని ఒక భారతమాత సుపుత్రుడు ప్రతి భారతీయుని స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసి అంతరించి పోయాడు!

జైలు ముఖద్వారం దగ్గరికి చేరిన విశాల జనసమూహాన్ని చూసి జైలు అధికారులు ఉరికంబానికి ఎదురుగా ఉన్న గోడను కూల్చివేశారు. బిస్మిల్ భౌతిక కాయాన్ని బయటికి తెచ్చి ఆయన తల్లి దండ్రులకు (మురలీధర్, మూలమతి) అప్పగించారు. దేశం నలుమూలల నుంచి దాదాపు ఒకటిన్నర లక్ష ప్రజలు అక్కడికి చేరారు.

ప్రజలు కడసారిగా చూడగలిగేందుకు గోరఖ్‌పూర్‌లోని ఘంటాఘర్ (TOWER CLOCK) లో ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. తర్వాత అక్కడి నుంచి వారందరు దివంగతుడైన తమ ప్రియ సోదరున్ని పెద్ద ఊరేగింపుగా రాప్తీ నది ఒడ్డుకు చేర్చారు. అక్కడే వైదిక పద్ధతిలో ఆ అమరజీవి అంత్యక్రియలు జరిగాయి. ఆయన అంత్యక్రియలు జరిగిన చోటుకు ప్రజలు 'రాజఘాట్' అని పేరు పెట్టారు. ఈ చారిత్రక సంఘటనకు గుర్తుగా రాజ్‌ఘాట్ పోలీసుస్టేషను అనే పేరుతో ఒక పోలీసుస్టేషను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేసులో రామప్రసాద్ 'బిస్మిల్'తో పాటు రాజేంద్రనాథ్ లాహిడీ, రోశన్ సింగ్, అశ్‌ఫాకుల్లా ఖాన్ అనే మరో ముగ్గురికి కూడా ఉరిశిక్ష విధించడం జరిగింది.)

- జె.యల్. రెడ్డి

# రావిచెట్టు రంగారావు

– కుర్రా జితేంద్రబాబు

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ స్థాపకులలో ఒకరైన రావిచెట్టు రంగారావు ఇరవైయవ శతాబ్ది ఆరంభంలోనే ప్రారంభించిన గ్రంథాలయోద్యమం, విజ్ఞాన చంద్రికా ఉద్యమం తెలంగాణ ప్రజలలో సాంస్కృతిక పునరుజ్జీవనం కలిగించడానికి, ఆ తదనంతరం అనేక సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలకు మూలకారణమైనది. అతి స్వల్పకాలమే రావిచెట్టు రంగారావు జీవించినప్పటికీ అతడు స్థాపించిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిజాం రాజ్య కాలంనాడు, నేడు అనేక సాహిత్య, రాజకీయ, తాత్త్విక భావజాలాల వ్యక్తీకరణకు కేంద్రమై ఈనాటికీ సేవ లందిస్తున్నది. రావిచెట్టు రంగారావు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో రావిచెట్టు నరసింహారావు, వెంకటమ్మ గార్లకు క్రీ.శ. 1877 ఈశ్వరనామ సంవత్సర, మార్గశీర్ష, శుద్ధ షష్ఠి, సోమవారం ఉదయం పదిన్నర గంటలకు, తాతగారైన అక్కినేపల్లి రంగారావు గారింట్లో జన్మించారు.



రావిచెట్టు రంగారావు

హైదరాబాదు నగరంలో పేరు ప్రఖ్యాతులు గలిగిన రావిచెట్టు నరసింహారావు 'మున్సబు'గా నిజాం నవాబు దివాన్ చేత నియమింపబడి రంగారావు జన్మించేనాటికి రూ.100- వేతనం పొందుతూ ఉన్నారు. రంగారావుగారి బాల్యంలోనే నరసింహారావు, వెంకటమ్మలు మరణించారు. రంగారావు మేనమామ కొమరిగిరి అప్పారావు ఇతనికి విద్యభ్యాసాన్ని జెప్పించి 13వ యేట ఊటుకూరు వెంకటప్పయ్య కుమార్తె లక్ష్మీనరసమాంబ నిచ్చి వివాహం గావించారు. యౌవన దశ రాగానే ఆస్తి తనకు స్వాధీనము అవటంతోపాటు తండ్రి చేస్తూ వుండిన మున్సబు వృత్తిని స్వీకరించారు. అందువలన రావిచెట్టు రంగారావును 'మున్సబుదారు రంగారావు' అని పిలిచేవారు.

ఇరవైయవ శతాబ్ది ప్రారంభం కాకమునుపే హైదరాబాదు నగరంలో మహారాష్ట్ర స్నేహితుల సహాయంతో "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్నమంజూష" అను పేరున ఒక సంస్కృత గ్రంథాలయాన్ని హైదరాబాదులో ప్రారంభించారు. వేద, ఉపనిషత్, పురాణ, కావ్య గ్రంథాలను సంస్కృతభాషలో ప్రచురించబడిన వాటిని సేకరించి సొంత భవనంలో గ్రంథాలయాన్ని నిర్వహించారు. ఈ గ్రంథాలయానికి సుమారు రెండువేల రూపాయల మూలధనాన్ని సేకరించి దానిపై వచ్చే వడ్డీతో ప్రచురించబడే గ్రంథాలను, పత్రికలను తెప్పించేవారు.

నిజాం రాష్ట్రంలో తెలుగు భాషా సంస్కృతులకు ఆదరణ లేని కాలంలో రావిచెట్టు రంగారావు తెలుగువారి కొరకై ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయాలనే ఆలోచనలో ఉన్న సమయంలోనే ఇదే భావన కలిగియున్న రాజా నాయని వెంకట రంగారావు, కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు, ఆదిపూడి సోమనాథరావుల పరిచయం రావిచెట్టు రంగారావుకు కలిగింది.

ఆ కాలంలో నాయని వెంకట రంగారావు మైనరుగా ఉండటం వల్ల, మునగాల సంస్థానం Court of Wards ఆధ్వర్యంలో వుండడంవల్ల అతనికి బందరునందు విద్యాబుద్ధులు చెప్పించారు. నాగపూరునందు బి.ఏ. పూర్తి చేసిన లక్ష్మణరావు, నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావులతో 1897నుండి పరిచయం పెంచుకొని తరచుగా కలుస్తూ సంఘసంస్కరణకు సంబంధించిన విషయాలపై చర్చిస్తూ ఉండేవారు. అదేకాలంలో రాబర్ట్ సూవెల్ రచించిన 'విస్మృత సామ్రాజ్యం' (Forgotten Empire) చదివిన తరువాత శ్రీ కృష్ణదేవరాయల పేరున ఏదైనా సత్కార్యం తలపెట్టాలనే భావన వారిలో

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

కలిగింది. ఈ లోగా క్రీ.శ. 1900లో మైనారిటీ తీరినందువల్ల మునగాల సంస్థానం నాయని వెంకట రంగారావుకు స్వాధీనం అయిన వెంటనే కొమఱ్ఱాజు లక్ష్మణరావును దివానుగా నియమించుకొన్నారు. తెలంగాణాలో తెలుగు ప్రజలు అనుభవించుచున్న వెనుకబాటు తనాన్ని గమనించి వీరు రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథ రావుతో కలిసి 1-9-1901న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం పేరున గ్రంథాలయాన్ని రావిచెట్టు రంగారావు యింటిలో ప్రారంభించారు.

పాల్వంచ, భద్రాచలం సంస్థానాధిపతియైన 'మహబూబ్ సరఫ్ రాజ్ వంతురాజా పార్థసారథి అప్పారావు' అధ్యక్షతన ఈ ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ మిత్రుల కలయిక 'ఈ గ్రంథాలయ ప్రారంభోత్సవము' తెలంగాణా ప్రజల అభ్యున్నతికి, పురోగతికి బీజం వేసి తెలుగు ప్రజల మధ్య భావసమైక్యతకుగాను పునాదిగా ఏర్పడింది. ఈ గ్రంథాలయం తెలంగాణాలో సాహిత్య, సాంస్కృతికోద్యమాలకు కేంద్ర స్థానంగా నిలవటమే గాకుండా తెలుగు వారి విజ్ఞాన తృష్ణను తీర్చి మహోద్యమాలకు దారిచూపింది. ఈ గ్రంథాలయ ప్రారంభాన్ని గూర్చి మైలవరపు నరసింహశాస్త్రి పద్యరూపాన వెలిబుచ్చిన అభిప్రాయం:

**చ॥ "అతులుఁడు రావిచెట్టుకలశాంబుధిచంద్రుఁడు రంగారావు ధీ**
**చతురుఁడు సత్యసంధుఁడువిచారుఁడు ధీరుఁడుసాహసాత్ముఁడు౯**
**హితుఁ డతఁ డొక్కఁడే తనకు (శ్రీ మునగాలరాజాగారికి)**
**నెంత యుఁ గార్యసుసాధనంబు స**
**మ్మతిఁ బరికించువాఁ డని సమానసగౌరవవృత్తి వానితోన్.**

**క॥ హితుఁడ వని నిన్ను బిలిచిన**
**కతమున నాలించి పూర్ణకరుణాదృష్టి౯**
**హితమతితో నీబాలనుఁ**
**జతురతఁ బోషింపు మనుచుఁ జనువునఁ బల్కె౯**

**చ॥ పలుకఁగఁ గార్యనిర్వహణభారమునంతయు రంగారావు తాఁ**
**దలపయిఁ బూని కష్ట మయిన౯ వెనుదీయఁగ లేక దీనికై**
**నెల వొక టేర్పతింపఁ దన నేర్పున భాగ్యపురాధివాసులం**
**గలియఁగఁ జేరఁబిల్చెఁ దగుకాలమున న్నిజసూక్ష్మబుద్ధిచే౯.**

ఈ గ్రంథాలయ స్థాపనగురించి నాయని వెంకట రంగారావు 1955లో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్వర్ణోత్సవ సభలో ఆహ్వానసంఘ అధ్యక్షులుగా స్వాగతోపన్యాసం చేస్తూ "ఈ సంస్థ 1901 సంవత్సరము సెప్టెంబరు మొదటి తేది ఆదివారమునాడు జనించినది. అప్పుడు స్వాగతమిచ్చు భాగ్యము నాకే లభించినది. ఈ భాషా నిలయమునకు 25 ఏండ్లు నిండుటచేత 1926 సంవత్సరం ఫిబ్రవరి 16, 17,18 తేదీల యందు రజతోత్సవము జరిపియున్నాము. అప్పుడు కూడ నేనే ఆహ్వాన సంఘాధ్యక్షుడ నైయుంటిని! ఇప్పుడు ఈ నిలయమునకు 50 సంవత్సరములు నిండినవి. ఈ స్వర్ణోత్సవ సదస్యులకు కూడ స్వాగతమిచ్చెడి భాగ్యము నాకే లభించినందుకు ఉప్పొంగి యానందభరితుడ నగుచున్నాను.

1901 సంవత్సరములో శ్రీయుతులు కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, నేనును అప్పుడు ప్రకటితమయిన Robert Sewell దొరవారి "Forgotten Empire" అనుగ్రంథరాజమును పఠించుచుంటిమి.

ఆ గ్రంథమువలన శ్రీకృష్ణదేవరాయల వారి శౌర్యపరాక్రమములు, రాజనీతి దురంధరత్వము మేము తెలిసికొనగలిగితిమి. రాయలవారి సంస్కృత- ఆంధ్రభాషలలో పాండిత్యము వారి ఆస్థానములో నుండిన అష్ట దిగ్గజములని ప్రఖ్యాతిగాంచిన పండితుల ప్రతిభ మున్నగు విషయములు వీరేశలింగ కవిగారి ఆంధ్రకవుల చరిత్రాదులవలన అవగతమై మేము ఆనంద తన్మయులమగుచుంటిమి. ఆహా! అటువంటి రాజేంద్రుని, ఆ యాంధ్రభోజుని మరచిపోతిమిగదాయని విచారించితిమి. ఆంధ్రభాషామతల్లికి ఆనాడు కలిగిన గౌరవాదరములు తలచుకొని యానందభాష్పములు విడచితిమి.

ఆ సందర్భములో నిజాంరాష్ట్రపు ఆంధ్రభాషాస్థితిని తలచుకొని వేదనపడితిమి. అయ్యో! అచ్చతెనుగు కావ్యనిర్మాణమునకు ప్రథమస్థానము వహించిన ఈ తెలంగాణములో ఆంధ్రభాషకు దుర్గతిపట్టెను గదాయని వాపోయితిమి. "శ్రీకృష్ణదేవరాయల పవిత్రనామమును చిరస్మరణీయము చేయవలెను. ఆంధ్రభాషకు తొల్లిటి వికాసము సాధించవలెను." అనునవి యాదర్శములుగా చర్చించితిమి. ఈ చర్చా ఫలితముగా శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయమునకు 1901 సంవత్సరము సెప్టెంబర్ మొదటి తేది ఆదివారంనాడు సాయంకాలము 5 గంటలకు శ్రీపాల్వంచ సంస్థానాధీశులగు శ్రీరాజా పార్థసారథి అప్పారావు బహద్దరుగారి యాధిపత్యమున రాంకోఠిలోని రావిచెట్టు రంగారావు బంగళాలో ప్రారంభోత్సవము జరిపితిమి. ఆనాడు రఘుపతి వెంకటరత్నం నాయుడు, డాక్టరు ఎం.జి. నాయుడు,

శ్రీనివాసాచారి, ఆదిపూడి సోమనాథరావు మున్నగు ఆంధ్ర ప్రముఖులు సభ నలంకరించిరి. ఆనాడు సమావేశమయిన సభ్యులలో శ్రీ ఆదిరాజు వీరభద్ర రావుకిని, నాకును ఈ స్వర్ణోత్సవమును జూచు భాగ్యము లభించి సర్వేశ్వరుని కృపకు పాత్రులమై ధన్యులమైతిమి.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయాన్ని స్థాపించిన తరువాత అయిదు సంవత్సరాల వరకు రావిచెట్టు రంగారావే కార్యదర్శిత్వం వహించాడు. ఈ అయిదు సంవత్సరాలలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ అభివృద్ధి కొరకు దాదాపు రూ.600/- మూలధనాన్ని కూడా సేకరించారు. ఈ మూలధనానికి హైదరాబాదు నందు మామూలు వడ్డీ మాత్రమే వస్తుందని, ఎక్కువ వడ్డీ వచ్చిన యెడల గ్రంథాలయానికి లాభదాయకంగా ఉంటుందని భావించి కార్యనిర్వాహక సభ్యుల అంగీకారంతో మద్రాసులోని "అర్బుత్తునాట్" కంపెనీలో డిపాజిట్ చేయగా వారు దివాళా తీసి పూర్తిగా ఆ నిలువ ధనాన్ని కోల్పోయినారు.

ఈ గ్రంథాలయానికి పత్రికలు, గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృభాషాభివృద్ధి జరుగదని భావించి దీనికి అనుబంధంగా ఒక పాఠశాలను ప్రారంభించి నూతన పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం, సామాన్య శాస్త్రములను తెలుగులోనే బోధించాలని భావించి ప్రారంభించారు. కాని, కార్యనిర్వహణాభారం అధిక మవుతుందనే భయంతో కార్యవర్గ సభ్యులు జంకుతుండగా, కార్యనిర్వాహక సభలో ఈ విషయాన్ని గురించి రావిచెట్టు రంగారావు ప్రసంగించి కొంత చర్చానంతరం వారిని ఒప్పించారు.

దాదాపు పది, పన్నెండు మంది విద్యార్థులతో పాఠశాల ప్రారంభించబడింది. ఇతర కార్యవర్గసభ్యులు చేసిన వాగ్దానాలను విరాళాలు ఇవ్వక పోవడంతో రావిచెట్టు రంగారావు స్వయంగా పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులను వారి స్వగృహంలో ఉంచుకొని విద్య చెప్పిస్తుండేవారు . అలా వారి దగ్గర ఉండి విద్యాభ్యాసం చేసినవారే ఆదిరాజు వీరభద్రరావు. వీరే తొలిదశలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ లైబ్రేరియన్‌గా వ్యవహరించారు. గతంలో ఏర్పాటుచేసిన సంస్కృత గ్రంథాలయ నిర్వహణ భారమగుటతో ఆ గ్రంథాలయాన్ని దాని మూలనిధియైన రూ. 2000లను శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో కలిపివేసినారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ఏర్పాటైన కొంతకాలానికి ఒకటి రెండు సార్లు హనుమకొండకు వెళ్ళినప్పుడు అక్కడ గల భాషాభిమానులతో మాటల సందర్భంలో త్రిలింగ దేశానికి ఒకప్పుడు రాజధానిగా ఉన్న హనుమకొండలో ఆంధ్రభాషానిలయం లేకపోవుట విచారకరమని తెలిపి, స్థానికులు సహకరించి, నిర్వహించ ఉత్సాహం చూపించినచో ఒక మాతృభాషానిలయాన్ని నెలకొల్పటానికి సాయంచేస్తామని ప్రకటించారు.

ఆ తరువాత హైదరాబాదులో ఉద్యోగస్తులైన కొందరు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ సభ్యులు ఉద్యోగరీత్యా హనుమకొండకు వెళ్ళి వారు ఈ గ్రంథాలయములోని కొన్ని గ్రంథాలను కొందరు యువకులకు చూపించి గ్రంథాలయమునకై ప్రోత్సహించిరి. రావిచెట్టు రంగారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరుగు వార్షికోత్సవ విశేషాలను, సభల సందర్భంగా చదివిన పద్యాలను పుస్తకరూపంలో హనుమకొండకు పంపి అక్కడి యువకులలో మాతృభాష ఎడల ఉత్సాహాన్ని కలుగజేశారు. వీరి ప్రయత్నంతో ఉత్సాహవంతులైన కొందరు యువకులు 1901- 02 సంవత్సరాలో హనుమకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెట్రిక్యులేషన్ పరీక్షకు గుంటూరును సెంటరుగా కోరుకున్నారు.

వారివెంట టి. నారాయణాచార్యులు వెళ్ళటం జరిగింది. వీరు ఆ సమయంలో ఆ ప్రాంతంలోని పరిస్థితులు గమనించి హనుమకొండనందు ఒక ఆంధ్రభాషానిలయం స్థాపించదలిచి, హనుమకొండకు వచ్చిన తరువాత వారి మిత్రులు కొమరగిరి సీతారామారావుతోను శ్రీయుత కె.తిరుమలరావుతోను సంప్రదించి గ్రంథాలయ స్థాపనకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ సమయంలోనే శ్రీశ్రీశ్రీ హంపీవిరూపాక్ష శంకరస్వాములవారు హనుమకొండకు వచ్చియుండిరి. వారిని నారాయణాచార్యులు, కొమరగిరి సీతారామారావు, కె. తిరుమలరావులు కలిసి గ్రంథాలయ స్థాపన గురించి తెలియజేయగా వారు సంతోషించి నూరు రూపాయలు వర్షాసనముగ ఇవ్వటానికి వాగ్దానం చేశారు. హంపీవిరుపాక్ష శంకరస్వాములవారి శిష్యగణంలో ఒకరు ఈ సందర్భంగా గ్రంథాలయ స్థాపన సంకల్పానికి ఇష్టపడక స్వాములవారితో లేనిపోనివి కల్పించి చెప్పటం వల్ల స్వాములవారు తమ వాగ్దానమును వాపసు తీసుకొనిరి. ఈ విషయం తెలిసి నిరుత్సాహపడక హైస్కూలు విద్యార్థులలో

కొందరు స్వాములవారిని మరలా దర్శించి 'తమకార్యంబు పరిత్యజించియు', 'ఆరంభింపరు నీచమానవులు', అను రెండు పద్యములు వినిపించి తిరిగి వారి ఆశీర్వాదం పొంది వాగ్దానమును సాఫల్యం చేసుకొని వచ్చారు. ఆ తర్వాత ఖమ్మంమెట్టునందును, హనుమకొండ నందును హైస్కూలు విద్యార్థులు కొన్ని నాటకములను ప్రదర్శించి, వచ్చిన ద్రవ్యముతో కొన్ని గ్రంథాలు సేకరించారు. రాయ్ మురళీధర్ సుబేదార్ బహద్దరుని ఆశ్రయించి వారి సహాయ సహకారాలు పొందారు.

ఆ కాలంలోనే జనవరి 1904 ఆరంభంలో రాజా నాయని వెంకట రంగారావుగారు ఏదో కార్యార్థమై హనుమకొండ విచ్చేసి, అక్కడి వారిలో మొలకెత్తిన మాతృభాషాభిమానాన్ని గుర్తించి హైదరాబాదుకు వచ్చిన వెంటనే రావిచెట్టు రంగారావును సంప్రదించి వారి పోషకత్వంలో రాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయ స్థాపనకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభ దినాన్ని నిర్ణయించి నాయని వెంకట రంగారావు, మైలవరపు నరసింహశాస్త్రి, రావిచెట్టు రంగారావు మొదలగు వారు గ్రంథాలయాన్ని ప్రారంభించ టానికి ముందే 25 జనవరి 1904 రాత్రి హనుమకొండకు ఈ గ్రంథాలయం కొరకు తెప్పించిన కొన్ని గ్రంథాలతో విచ్చేసినారు. అచ్చుటి ప్రముఖులను ద్రవ్యరూపక సహాయాన్ని కోరి తాము ఆర్థికసహాయమందిస్తూ అనేక ముద్రణా లయాలకు, గ్రంథ విక్రయశాలలకు ఉత్తరాలు వ్రాసి గ్రంథాలను సగం ధరకు, పావు ధరకు తెప్పించే ఏర్పాట్లు చేశారు. హనుమకొండలో బ్రిటీష్ తరహా పోస్టాఫీసు లేనందున రావిచెట్టు రంగారావుగారు హైదరాబాదు నందలి తమ అడ్రసుకే పుస్తకాలను తెప్పిస్తూ వాటిని హనుమకొండకు



**ఆచంట లక్ష్మీపతి, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగారావు, కొమఱ్ఱాజు లక్ష్మణరావు.**

తరలించేవారు. 6 సెప్టెంబరు 1904నాడు వారి అధ్యక్షతన సభ జరిపి రాజరాజ నరేంద్ర ఆంధ్రభాషానిలయాన్ని రావిచెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు, కొమఱ్ఱాజు లక్ష్మణరావులు ప్రారంభించారు. ఆ రోజు సభకు విచ్చేసిన పెద్దలందరు తమకు తోచిన విరాళాలు వొసగి సహాయపడి నారు. శ్రీయుత పింగళి వెంకటరామారెడ్డి దేశ్‌ముఖ్ తన విరాళంతో పాటు హనుమకొండలో రాగన్న దర్వాజ దగ్గరవున్న తమ భవనాన్ని బాడుగ లేకుండా గ్రంథాలయ నిర్వహణకు ఇచ్చారు. ఈ గ్రంథాలయం తెలంగాణాలోని సాహిత్య, సాంస్కృతికోద్యమాలకు కేంద్రస్థానంగా పనిచేసింది.

రావిచెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు, కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావులు చేసిన కృషి గురించి ఆదిరాజు వీరభద్రరావు మాటల్లో "ఈ త్రిమూర్తులు తెలంగాణములోని ఆంధ్రభాషాస్థితిని బాగుపరచుటకు మంతనములు సలిపిరి. తత్ఫలితముగా శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము స్థాపితమయ్యెను. అఖిలాంధ్ర దేశములో అధునాతన పద్ధతులమీద స్థాపితమైన మొట్టమొదటి ప్రజాగ్రంథాలయ మిదియే. ఈ గ్రంథాలయ స్థాపనకు స్ఫూర్తినిచ్చినవారు లక్ష్మణరావుగారు.... లక్ష్మణరావుగారు ఆంధ్రదేశమునందు అడుగిడగనే మొట్టమొదట చేసిన మహాకార్య మీ ఆంధ్ర భాషానిలయ స్థాపనమే... ఇది తెలంగాణమునందలి ఆంధ్రులకు కనువిప్పు కలిగించి, విజ్ఞాన భిక్షపెట్టి మహోద్యమాలకు దారితీసినది." *(సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము– మూడవ సంపుటము. పేజి 68.)*

సాంస్కృతిక, సాహిత్యోద్యమాలకు బలమైన వేదికలు ఎలాగైతే అవసరమో అలానే రాజకీయోద్యమానికి కూడా పటిష్టమైన నేపథ్యం అవసరమవుతుంది. ఈ అవసరార్థం స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎన్నో సాహితీ సంస్థలు ఏర్పాటుకాబడి జాతీయ భావాలకు, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు స్వీకారం చుట్టారు. తెలుగునాట చైతన్యానికి స్వీకారం చుట్టిన సంస్థ 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి.' ఈ సంస్థ ఆవిర్భావానికి ముందు 1820లో "The Madras School Text Book and Vernacular Society" అనే పేరుతో ఒక సంస్థ తెలుగు గ్రంథాల ప్రచురణను చేపట్టింది. అయితే ఈ సంస్థ ఉద్దేశ్యం పాశ్చాత్య విజ్ఞాన సంస్కృతులను దేశీయ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు మాత్రమే తెలియచెప్పాలని ప్రారంభమైంది. దీనికి ఆంగ్ల ప్రభుత్వం



కూర్చున్నవారు: కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు, నాయిని వేంకటరంగారావు, రావిచెట్టు రంగారావు
నిల్చున్నవారు: అయ్యదేవర కాళేశ్వరరావు, ఆచంట లక్ష్మీపతి.

కూడా సహకారం అందించింది. పెద్దబాలశిక్ష మొదలుకొని ఆంగ్లదేశచరిత్ర, భూగోళశాస్త్రంలాంటి విషయాలను విద్యార్థులను దృష్టిలోపెట్టుకొని మాత్రమే రచించబడినాయి.

కొమఱ్ఱాజు లక్ష్మణరావు, మునగాలరాజా నాయని వెంకట రంగారావు సంస్థానానికి చెందిన కోర్టు వివాదాల్లో వకీళ్లకు సహకరించటానికి మద్రాసులో మకాం పెట్టారు. ఆ సమయంలో ఒక సాహితీ సంస్థను స్థాపించాలనే సంకల్పం ఆయనకు కలిగింది. అయ్యదేవర కాళేశ్వరరావు మద్రాసులో న్యాయవిద్య నభ్యసిస్తూ కపాలేశ్వర అగ్రహారంలో ఉంటుండేవారు. తరచుగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, కొమఱ్ఱాజు లక్ష్మణరావులు, సి.బి రామారావనే వైద్యుని ఇంట్లో కలుస్తూ సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితులను గూర్చి చర్చించేవారు.

సి.బి. రామారావు అభ్యుదయ భావాలు కలిగిన సంఘసంస్కరణ ప్రియుడు. ఈ నలుగురు సంఘసంస్కరణ ఉద్యమాన్ని కందుకూరి వీరేశలింగం నిర్వహిస్తున్నారు కనుక మనం విజ్ఞాన చంద్రికా ఉద్యమాన్ని ప్రారంభిద్దామని సంకల్పించి దానికనుబంధంగా వంద పేజీల పత్రికను ప్రారంభిచాలని తొలుత నిర్ణయించుకున్నారు. ఆ విషయాలగూర్చి గాడిచర్ల హరిసర్వోత్తమరావు మాటల్లో: "శ్రీ లక్ష్మణరావు 100 పేజీల పత్రిక ఆరంభించి విజ్ఞాన ప్రచారం చేయవలెనని అన్నాడు. అచ్చుకాగితం, చిత్రాలు ఫస్టురేటువి కావలెనన్నాడు. నేను పుస్తక రూపంలో వెలువరిస్తాం అన్నా. విమర్శించుకొన్నాం. ఆరంభంలో పుస్తకాలు వేయడమే మేలనుకొన్నాం. మా ఉద్యమానికి పేరేమి పెడ్దాం అన్నాం. ఎన్ని పేర్లో ఆలోచించాం. లక్ష్మణరావు చేసిన సలహాయే అనుకుంటా 'విజ్ఞాన చంద్రిక' అనేది స్థిరపరచాం. ఈ మాటలు మాట్లాడుతూనే సహాయకులను నిర్ణయించు కొన్నాం. మునగాల జమీందారు, రావిచెట్టు రంగారావులు 1905 సెప్టెంబరులోనే లక్ష్మణరావు అరఠావు కాగితం అప్పీలు అచ్చు వేయించాడు. ప్రపంచం మీద విసిరివేసినాం." *(తెలుగు తల్లి- లక్ష్మణరాయ వర్ధంతి సంచిక 1945 పుట- 7)*

ఈ అప్పీలు ప్రచురించిన తరువాత 1906 మేలో మద్రాసులోని నాయని వెంకట రంగారావు ఇంట్లో లక్ష్మణరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రావిచెట్టు రంగారావులు సమావేశమై 'విజ్ఞాన చంద్రిక'కు పూర్తి రూపురేఖలు దిద్దారు. ఆ సందర్భంగా వారు చేసిన తీర్మానంలోని ముఖ్యభాగం: "స్వరాజ్యము కొరకు ఆంధ్రదేశములోను, యావద్భారత దేశములోను కూడ గాఢవాంఛ ప్రబలియున్నది. కుల మత భేదములు లేక యుక్తవయసు వచ్చిన ప్రతి పురుషునికి, స్త్రీకిని ఓటు కలిగిన స్వరాజ్యమే మన గమ్యస్థానము, భారతదేశములో ఆరుకోట్ల జన సంఖ్యగల పంచముల అస్పృశ్యత రూపుమాపనిది స్వరాజ్యము రానేరాదు. వచ్చినను నిలువనేరదు... నవీన ప్రపంచములో భారతదేశమున ఒక స్వతంత్ర ప్రజారాజ్యముగా నిర్మాణ మగుటకు యావద్భారత ప్రజలకు, ఆంధ్ర ప్రజలకు నవీన ప్రపంచములో అత్యంతముగ వృద్ధియైన ప్రకృతిశాస్త్ర, చారిత్రక, రాజకీయార్థిక విజ్ఞానము నిచ్చుట యావశ్యకము... ఆంధ్రభాషలో కవిత్వ వాఙ్మయము, ప్రబంధ సముదాయము గొప్పగా నున్నవి. ఇవి ఆధ్యాత్మిక, నైతిక విషయములకు ఉపయోగమే కాని, ఆంధ్ర జాతిని నవీన పద్ధతుల మీద నడిపించుటకు ఉపయుక్తము కావు. పురాణ యుగము నుంచి ప్రకృతి శాస్త్ర, రాజకీయ, ఆర్థిక యుగమునకు మన ప్రజలను తీసుకపోవలసి యున్నది." *(నా జీవిత కథ- నవ్యాంధ్రము. అయ్యదేవర కాళేశ్వరరావు. పుట -139)*

సామాన్య ప్రజలు అర్థం చేసుకొనే రీతిలో సామాజిక, వైజ్ఞానిక, రాజకీయ, అర్ధశాస్త్ర గ్రంథాలతో పాటు మహాపురుషుల జీవితాలు, చారిత్రక నవలలు ప్రచురించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కొమఱ్ఱాజు లక్ష్మణరావు సంపాదకుడిగా వ్యవహరించాలని, హరి సర్వోత్తమరావు కార్యదర్శిగా, నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, అయ్యదేవర కాళేశ్వరరావులు కార్యవర్గ సభ్యులుగా కార్యవర్గం ఏర్పాటైంది.

విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి తుది రూపం ఏర్పడిన తర్వాత దాని కార్యస్థానం మద్రాసులోనా లేక హైదరాబాదులోనా అన్న తర్జనభర్జనలు జరిగిన తర్వాత మద్రాసులో ఆంగ్ల ప్రభుత్వ నిఘా ఎక్కువ ఉంటుందని, కాబట్టి కార్యకలాపాలకు అంతరాయం కలుగవచ్చుని భావించి హైదరాబాదులోనే బాగుంటుందని అలాగే ఏర్పాటు చేశారు. రావిచెట్టు రంగారావు కార్యనిర్వహణా బాధ్యతను స్వీకరించి తన ఇంటినే కార్యాలయంగా మార్చారు. వీరికి ఆదిరాజు వీరభద్రరావు సహకరించారు.

సామాన్య ప్రజలు అర్థం చేసుకొనే రీతిలో సామాజిక, వైజ్ఞానిక, రాజకీయ, అర్ధశాస్త్ర గ్రంథాలతో పాటు మహాపురుషుల జీవితాలు, చారిత్రక నవలలు ప్రచురించాలని ఈ సమావేశం లో నిర్ణయం తీసుకున్నారు. కొమఱ్ఱాజు లక్ష్మణరావు సంపాదకుడిగా వ్యవహరించాలని, హరి సర్వోత్తమరావు కార్యదర్శిగా, నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, అయ్యదేవర కాళేశ్వరరావులు కార్యవర్గ సభ్యులుగా కార్యవర్గం ఏర్పాటైంది.

ఈ విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి స్థాపన గూర్చి ఆచంట లక్ష్మీపతి మాటల్లో: ‘‘హైదరాబాదులో మున్సబు దారు రావిచెట్టు రంగారావు అనే యువకుడును, మునగాలరాజా వారి దివాన్ కొమఱ్ఱాజు లక్ష్మణరావున్ను, అయ్యదేవర కాళేశ్వర రావున్ను మునగాల రాజావారిని అధ్యక్షులుగా పెట్టుకొని దేశచరిత్రలు, చరిత్రాత్మక నవలలు, నవీన శాస్త్రీయ గ్రంథములు, ప్రసిద్ధ పురుషుల జీవిత చరిత్రములు అను నీ నాలుగు విషయములలో సులభమైన తెలుగుభాషలో వచన కావ్యములను రచియించి ప్రచురించు నుద్దేశముతో ‘విజ్ఞాన చంద్రికా గ్రంథమాల’ యను పేరుతో నొక సంస్థను స్థాపించుటకు నిశ్చయించిరి. మొట్టమొదట లక్ష్మణరావుగారు హిందూమహాయుగము అను గ్రంథమును వ్రాయుటకు ప్రారంభించిరి. *(ఆచంట లక్ష్మీపతి స్వీయచరిత్ర- పుట-86-87)*

స్థాపించిన రెండేళ్ళలోనే దాదాపు 1200 మంది శాశ్వత చందాదారులను సమకూర్చుకోగలిగారు. వీరు ఈ గ్రంథమండలి తరఫున తొలి గ్రంథంగా ‘అబ్రహాం లింకన్ జీవిత చరిత్ర’ను ప్రచురించారు. దీనిని గాడిచర్ల హరిసర్వోత్తమరావు రచించారు. ఈ రచన విడుదల నాటికి గాడిచర్ల హరిసర్వోత్తమరావును 1907 జులైలో రాజద్రోహ నేరం క్రింద నిర్భంధించింది ఆంగ్ల ప్రభుత్వం. దీనితో నిజాం ప్రభుత్వం కళ్ళు రావిచెట్టు రంగారావు ఇంట్లో నిర్వహిస్తున్న విజ్ఞాన చంద్రిక గ్రంథమాలపై పడ్డాయి. నిజాం పోలీసు వీరి కార్యకలాపాలపై నిఘా ఉంచింది.

స్వేచ్ఛాయుత వాతావరణంలో గ్రంథమండలి కార్యకలాపాలను నిర్వహించటం అసాధ్యమయింది. విజ్ఞాన చంద్రిక గ్రంథమండలిని 1909 డిసెంబరు నెలలో ఈ హైదరాబాదు నుంచి కార్యస్థానాన్ని తిరిగి మద్రాసుకు తరలించి చింతాద్రిపేటలోని ఆచంట లక్ష్మీపతి ఇంట్లో తిరిగి ప్రారంభించారు. రావిచెట్టు రంగారావు కూడా భార్యతో మద్రాసుకు వచ్చి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి కార్యకలాపాల్లో పాల్గొంటూ ఆరు నెలల కాలం అచ్చటే ఉండి లక్ష్మణరావు రచించిన ‘మహమ్మదీయ మహాయుగం’ గ్రంథాన్ని చందా దారులకు అందించారు. ఈ సంస్థ కార్యస్థాన శాఖను రావిచెట్టు రంగారావు హైదరాబాదులోని తన ఇంటిలో ఏర్పాటు చేసి, మద్రాసు నుంచి వచ్చిన గ్రంథాలను నిజాం రాజ్యంలోని చందా దారులకు స్వయంగా అందే ఏర్పాటు చేశారు.

రావిచెట్టు రంగారావు భార్య శ్రీమతి లక్ష్మీనరసమాంబ స్త్రీలను చైతన్యవంతులను చేయాలన్న ఉద్దేశ్యంతో తమ ఇంటిలో ప్రతి శుక్రవారం సభలు నిర్వహిస్తూ స్త్రీ విద్య, శిశు పోషణ, గృహనిర్వహణము, పాతివ్రత్యము, ఐకమత్యము, మొదలైన విషయాలపై ఉపన్యాసాలు యిప్పించేవారు.

1908 సం॥లో మూసీనది పొంగి హైదరాబాదులో జలప్రళయముతో నిరాశ్రయులైన వారికి రావిచెట్టు రంగారావు తమ యింట్లో ఆశ్రయమివ్వటమే గాక, ‘కష్ట నివారణ సంఘం’ అను దాని నేర్పరచి సహకరించారు. 1909వ సంవత్సరములో హనుమకొండకు వెళ్ళి అక్కడి రాజరాజ నరేంద్ర భాషానిలయాన్ని దర్శించి ఆ గ్రంథాలయానికి ఒక శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని శతవిధాల

ప్రయత్నించారు. అయితే స్థానికంగా కొందరు వ్యక్తులు అనేక విధాల అంతరాయం కలిగించటంతో ఆ కల నిజం కాలేదు. ఒకనాడు టి. నారాయణాచార్యులు, పింగళి వెంటరామారెడ్డి దేశ్‌ముఖ్‌ను కలిసి మీరు భవనము స్వాధీనము చేసి చాలా సంవత్సరాలు అయింది, ఇక అది గ్రంథాలయం సొత్తే అని పలుకగా, ఆయన అందుకు సంతోషించి ఈ భవనము గ్రంథాలయానికిచ్చుటకు నాకెలాంటి అభ్యంతరము లేదు. కాని, స్థలము కొంచెమే ఉన్నది. ముందు ముందు ఈ గ్రంథాలయం అభివృద్ధికి రాదగివున్నది. అందువల్ల ఇది తగినది కాదు. మీరుగనుక నూతన భవనం కొరకు చందాలు వసూలు చేసి నా వద్ద జమకట్టి, రెట్టింపు రొక్కమును తీసుకొనండి అని నారాయణాచార్యులను ప్రోత్సహించినాడు. దానితో నారాయణాచార్యులు, మాడపాటి హనుమంతరావులు కలిసి తవుటిరెడ్డి గోపాలరెడ్డి (మడికొండ) ని కలిసి గ్రంథాలయ నిర్మాణమునకై సహాయము కోరగా అక్కడకూడా శ్రీ శంకరస్వాములవారి సన్నిధిలో జరిగినట్లే సంభవించినది.

అంతటితో నిరుత్సాహపడక మరోసారి వారిని దర్శించగా భవన నిర్మాణమునకు కావల్సిన రాతిని సప్లై చేయుటకు అంగీకరించారు. మునగాలరాజా నాయని వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు మరికొందరు భవన నిర్మాణానికి పెద్ద మొత్తములో విరాళాలు ఇచ్చారు.

జీవితకాలమంతా సమాజోద్ధరణకు తన శక్తిని, సంపదను వినియోగించిన రావిచెట్టు రంగారావు ఆకస్మాత్తుగా అనారోగ్యంపాలై 3 జులై 1910 తారణ సంవత్సర జ్యేష్ఠ బహుళ ద్వాదశి ఆదివారం సాయంత్రం 4 గంటలకు దివంగతులైనారు.

మైలవరపు నరసింహ శాస్త్రి గారు వీరి మరణానికి శోకిస్తూ –

**సీ॥ దేశభాషను తన, దేశంబులోపల**
**వృద్ధి చేయఁగ నేర్చు, బుద్ధిశాలి**
**శాంత్యాదిగుణముల సన్నుతి గాంచిన**
**నిర్మలకర్మాబ్ధి, ధర్మశాలి**
**విద్యార్థికోటికి, వివిధవిధంబుల**
**సాహాయ్యమొనరించు, శక్తిశాలి**
**మా టాడి తప్పని, మానవేశునిహరి**
**శ్చంద్రునిఁ బోలిన, సత్యశాలి**

**గీ॥ పిన్న పెద్దల నొకతీఱు, నెన్ను రావి**
**చెట్టు వంశాంబురాశికి, శీతకరుఁడు**
**రంగరాయుండు కడు చిన్న, ప్రాయముననె**
**భువిని విడనాడి కటకటా! దినముఁ జేరె!**

**సీ॥ ముప్పదిరెండేండ్లు, మున్నూరుయేడులా!**
**ముసలివాఁడై తాను, విసుకుఁ జెంద**
**ధనము లేకుండెనా! తనివార సుఖపడ**
**బలము లేకుండెనా! బ్రతికియుండ**
**లోక బాంధవ్యంబు, లోపమై యుండెనా!**
**సిగ్గాయె నంచు యోచించుటకును**
**ఎవరైనఁ దనకేమి, యెగ్గు చేసెదునంత**
**పరుషంబు లాడెనా! విరసమతిని**

**గీ॥ వయసువాఁ డయ్యు బహుధన వంతుఁ డయ్యు**
**బలము గలవాఁడు నయి లోక బంధుఁ డయ్యు**
**పరుషవాక్యంబు లాడని, పురుషుఁ డయ్యు**
**మనల విడనాడఁ దా నెట్లు, మనసుపడెను!**

అని విలపిస్తూ పద్యాలు చెప్పినారు.

మాడపాటి హనుమంతరావు కూడా వీరి మరణాన్ని గూర్చి –

**చ॥ నయగుణభూషణుండు; పర నారులకెల్లను సోదరుండు; ని**
**త్యయశుడుఁ దనన్యలభ్యసము, దారచరిత్రుడు; సాహసాత్ముఁడుర్భ**
**దయకును సౌహృదంబున కు, దాత్తనిదానుఁడు; సర్వసజ్జన**
**ప్రియుఁ డగువాని నిట్లు విపరీతపుకాలమ ! మ్రింగివైచితే?**

అని విలపించారు. రావిచెట్టు రంగారావు మరణానంతరం వారి సతీమణి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ భవన నిర్మాణానికి మూడువేల రూపాయలు విరాళ మందించి, ఆ సంస్థ ఈనాటికీ నిలిచి ఉండటానికి దోహదపడినారు. రావిచెట్టు రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకట రంగారావులు ప్రారంభించిన గ్రంథాలయాల స్థాపన ఒక ఉద్యమంగా ఎదిగి 1927 నాటికి తెలంగాణాలో దాదాపు 110 గ్రంథాలయాల ఏర్పాటుకు దారి తీసింది. వీరు ప్రారంభించిన గ్రంథాలయోద్యమం, విజ్ఞాన చంద్రికా ఉద్యమం, తెలంగాణా ప్రజలను రాజకీయంగా చైతన్యం చేసి, నిజాం నియంతృత్వ పాలన నుండి, ఫ్యూడల్ వ్యవస్థనుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకు దోహదపడి అనేక ఉద్యమాలకు ప్రేరణఅయ్యింది. పై వారి జీవితం, సహచర్యం, ఆచరణ తెలంగాణా ప్రజలకు వెలుగును ప్రసాదించింది.

మి

# తెలుగులో స్త్రీ వాద రచనలు

*గత సంచిక తరువాయి...*

- వి. త్రివేణి

**అస్తిత్వ వాదం:**

'నేను ఎవరిని?' అనే ప్రశ్నతో ప్రారంభించి స్త్రీ తనకు తాను తెలుసుకోవడం కోసం చేసే బహుముఖ అన్వేషణ, తనను తాను ఎక్కడో ఒక చోట నెలబెట్టి నిర్వచించుకొనే ఆక్షేపణ అస్తిత్వవాదం. 1980వ దశకం నుంచే లింగ వివక్షారూపాలను, వ్యవస్థలను, భావజాలాలను గుర్తించే చైతన్యం సాహిత్య రంగంలోకి ప్రవేశించింది.

1975-85 వరకు కొనసాగిన ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాల ఫలితంగా స్త్రీ అస్మిత, అస్తిత్వానికి అనువైన చర్యలు చేపట్టడం జరిగింది. స్త్రీ తనకు తాను వెతుక్కోవటానికి సంబంధించిన ఆలోచనలు, తన ఉనికికి మొదటి గుర్తు అయిన శరీరం ద్వారా తనను తాను తెలుసుకోవటానికి, పునర్నిర్వచించుకోవడానికి చేసే ఆలోచనే అస్తిత్వ వాదం.

ఇక కుటుంబ సంబంధాలలో 'నేను ఎవరినీ?' అనే ప్రశ్నతో వాస్తవానుభవం మీద చేసిన ఆలోచన రెండో ధోరణికి చెందినది. కుటుంబం నుంచి సమాజంలోకి వస్తే 'నేను ఎవరిని?' అనే ప్రశ్నతో సామాజిక పద్ధతులు, ఆచరణకు సంబంధించిన ఆలోచనలతో సమాజంలో తన స్థానాన్ని పునర్ముద్రించుకోవడానికి చేసే చర్య మూడో ధోరణికి చెందుతుంది. ఈ ఆలోచనల ధోరణుల నుంచి వచ్చిందే అస్తిత్వ వాదం.

స్త్రీలు తమ అనుభవ దృష్టికోణం నుంచి సూక్ష్మమైన జీవిత మూలాలను, అనుభవ రహస్యాలను 1960 నుంచే కథా సాహిత్యం ద్వారా ఆవిష్కరిస్తూ వచ్చారు. స్త్రీ అస్తిత్వ వాద ఆలోచనలకు పునాదిగా నిలిచిన వారు-

శివరాజు సుబ్బలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, రంగనాయకమ్మలు. శివరాజు సుబ్బలక్ష్మి, స్త్రీ కేంద్ర కథాభివృద్ధి ప్రేరణతో మిగతా ఇద్దరు రచయిత్రులు అస్తిత్వవాద సాహిత్య, సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసేంతగా తొలిరచనలు చేశారు.

ఆడవాళ్ళు జీవితంలోని ఒంటరి తనాన్ని తన కథలకు వస్తువుగా చేసుకొని భార్యాభర్తల సంబంధాలలో ఉన్న కనిపించని హింసా స్వభావాన్ని కథా రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మి ప్రదర్శించారు.

స్త్రీలనే ప్రధాన పాత్రలుగా, వాళ్ళ జీవితమే కేంద్ర బిందువుగా కథను విస్తరించడం, రచయిత వ్యాఖ్యానంతో పెద్దగా పని లేకుండానే ఆ స్త్రీల అంతరంగ పుటల్లోంచి పాఠకుల ముందు ఆవిష్కృతం కావటమనేది సుబ్బలక్ష్మి తన కథలు సాధించిన సామాజిక ప్రయోజనం.

*ముక్తి-విముక్తి* కథలో తమకంటూ ప్రత్యేకమైన సామాజిక అస్తిత్వం కోసం, స్నేహ పూరితమైన సమస్థాయి సహజీవన సౌభాగ్యం భర్తల వల్ల పొందడం కోసం స్త్రీలు ప్రయత్నించడం చివరికి అవి లభించకపోతే చీరెలతో, నగలతో ఆ వెలితిని పూడ్చుకోవడం వంటివి చూపించారు భర్తల అధికార స్వభావం.

పర స్త్రీ వ్యామోహం అన్నీ స్త్రీలను పీడించేవే అయినా, ఆ పీడనను భరించటమే ధర్మంగానో, అనవసరంగానో, చెప్పే పితృస్వామిక కుటుంబ సంస్కృతి స్త్రీని మనోవేదనలు విప్పి చెప్పుకొనే ఆత్మీయులే లేని ఒంటరి ప్రపంచంలోకి నెట్టివేస్తున్న స్థితిని తన కథల్లో స్పష్ట పరిచారు. *వికసించని ఆత్మీయులు* కథలో అరుంధతి ఆవేదన, *మంచీ-చెడు* కథలో సుశీల అంతరంగ మథనం పై ఇతివృత్తాన్నే నిర్దేశిస్తాయి.

అబ్బూరి ఛాయాదేవి *ఉపగ్రహం, శ్రీమతి-ఉద్యోగిని* వంటి కథలు రచించి స్త్రీల అసంతృప్తికి కుటుంబ సంబంధాలు ఏవిధంగా ఆలవాలమైనాయో తెలిపారు. భర్త తన అందాన్ని,

డాక్టరు వి. త్రివేణి, ఫోను : 9951444803

పనినేర్పును, ప్రేమను గుర్తించకపోవడం నుంచి మొదలై దాంపత్య శృంగారానుభవాలిచ్చిన అనుభూతిని కదిపి మనసున నిలుపుకోగలిగిన భావైక్యత లోపించడం వంటి సన్నివేశాలను *ఉపగ్రహం,* కథ తెలుపుతుంది. అనేక స్థాయిలలో, సందర్భాలలో స్త్రీల అనుభవంలోకి వచ్చే అసంతృప్తి స్వరూపాన్ని *ఉపగ్రహం,* కథ చిత్రిస్తుంది.

*శ్రీమతి–ఉద్యోగిని* కథలో భార్యాభర్తల మధ్య సంభాషణలు గానీ, కష్ట సుఖాలుగానీ, అంతరంగిక విషయాలు గానీ ఏ స్థాయిలో ఉంటాయి, భార్యల నుంచి భర్తల మనసుకు ఎటువంటి కష్టం కలగనంతవరకు సంసారం సాఫీగా సాగుతుంది. సంసారంలో ఎటువంటి కలతలు ఏర్పడనంత వరకు భార్య షరతులకు లోబడి ఉండాలనే నియమం ఈ కథలో కనిపిస్తుంది.

స్త్రీలు ఉద్యోగాలు సాధించి సామాజిక వ్యక్తులుగా ఎదిగినా ఇంటి పనంతా స్త్రీలదే అన్న పితృస్వామిక భావం స్త్రీల సహనానికి అవరోధంగా నిలుస్తుంది. పరిస్థితుల పట్ల కోపాన్ని గానీ, ఆవేదనను గానీ, దుఃఖాన్ని గానీ ప్రదర్శించకుండా కేవలం స్త్రీ ఉనికిని చాటి చెప్పే కథలు రచించి కథన శిల్పాన్ని ప్రయోగించారు.

రంగనాయకమ్మ స్త్రీల అభిరుచులకు, ఇష్టాలకు తావు లేని; అవేదనలతో, అసంతృప్తులతో పస లేని నిస్సారమైన దాంపత్య జీవితాలను స్త్రీల దృష్టి కోణం నుంచి వ్రాసారు. స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మగౌరవ అస్తిత్వానికి అవకాశమిచ్చే పద్ధతిలో భార్యాభర్తల సంబంధాలు ఉండాలని రచయిత్రి తన కథల ద్వారా అభిలషించింది.

*అమ్మ* కథలో పురుష కోణం నుంచి కథ నడిపారు. మాతృత్వాన్ని గొప్ప వరమని కీర్తించే సంస్కృతిలోనే ఆ మాతృత్వ శక్తిని హీనంగా, పాపంగా తలిచే వైరుధ్యాలను ఈ కథలో స్పష్టంగా తెలిపారు. *అమ్మ* కథలో అల్లుండ్లు, కోడళ్ళు వచ్చిన తర్వాత మనుమలు, మనుమరాళ్ళు కలిగిన తర్వాత అమ్మ మళ్ళీ గర్భవతి అవుతుంది.

మాతృత్వం స్త్రీ అనుభవానికి సంబంధించిందే అయినా ప్రాణభయానికి మించి సామాజిక అవసరాలకు, ఆందోళనలకు గురిచేస్తుంది. కాని ఆమె కూతుళ్ళు, కోడళ్ళు, బంధువులు (స్త్రీలు), పక్కింటి స్త్రీలు కలిసి అమ్మకు మనస్థయిర్యాన్నిచ్చి పురుడు పోస్తారు.

స్త్రీలకు మాత్రమే తెలిసిన మాతృత్వానుభవాన్ని ఎటువంటి భ్రమలకు లోను కాకుండా అర్థం చేసుకోవడానికి, సహానుభూతిని అందించడానికి ఈ కథ ఎంతగానో సహకరిస్తుంది.

**స్త్రీ వాదం:**

ఒక కుటుంబానికి గృహిణిగానో, పిల్లలకు తల్లిగానో, ఒక భర్తకు భార్యగానో (ఒక కుటుంబంలో గృహిణి, తల్లి, భార్యగానో) ఉండటమేగానీ, స్త్రీలకు స్వంత ఉనికి మీద, స్వీయ స్పృహ మీద అవకాశం లేకుండా పోయామే అన్న ఆలోచన, ఆందోళన కలగడమే స్త్రీవాద సాహిత్యోద్యమం. ప్రపంచాన్ని సమాజాన్ని, జీవితాన్ని, స్త్రీల నోటినుంచి వ్యాఖ్యానించే ఒక విశ్లేషణా పద్ధతి స్త్రీవాదం. స్త్రీవాద సాహిత్యం అంటే స్త్రీ స్వేచ్ఛ మాత్రమే కాదు. స్త్రీ పురుషులిద్దరూ ఒక ప్రజాస్వామిక వాతావరణంలో సమానమైన బాధ్యతా యుతమైన స్వేచ్ఛతో సహజీవనం చేయడం.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నట్లు– "సమాజంలోని సర్వ అసమానతలను పోగొట్టే స్వేచ్ఛా, సమానత్వం, న్యాయం వీటితో కూడిన సమాజం కోసం సాంస్కృతిక పోరాటం చేయడమే స్త్రీవాద సాహిత్య గమ్యం.

స్త్రీవాద సాహిత్యం స్త్రీల అనుభవం నుంచి పుట్టినవి. కాని అది వైయుక్తిక అనుభవం కాదు. సామాజికమైంది. అణచివేతకు, అత్యాచారానికి, పీడనకు, దౌర్భాగ్యానికి గురైన ఏ జీవి అయినా పడే ఆవేదనే అది. వారందరికీ స్త్రీవాద సాహిత్యం ప్రాతినిధ్యం వహించింది. ఆధిపత్య సంస్కృతిని ధిక్కరించే వర్గాలన్నిటికీ ఇది ప్రతిధ్వనిగా నిలిచింది. ఇది స్త్రీలను జాగృతం చేస్తుంది. స్త్రీలు ఈ స్థితికి రావడానికి గల కారణాలను, అటువంటి పరిస్థితిని ఎదుర్కోవడం, అవసరమైతే తిరగబడటం నేర్పుతుంది. స్త్రీలలో ఐక్యతను, పరస్పర సహకారాన్ని ఉద్బోధిస్తుంది.

కొత్త పుస్తకాలు, ఆలోచనలు, సిద్ధాంతాలు, సంస్కరణలు ప్రవేశపెట్టడం, స్త్రీవాద కథా సాహిత్యం సాధించిన సామాజిక ప్రయోజనం. సమాంతరంగా, ఒక సామాజిక చైతన్యంగా కొత్త పరిణామాలను, ఫలితాలను సాధించింది. కొత్త కొలమానాలు, ప్రమాణాలు, సిద్ధాంతాలు స్త్రీవాద భావజాలాన్ని ప్రేరణగా రూపొందింది. స్త్రీ అణచివేత స్వరూపాన్ని గుర్తించడం, అస్తిత్వంపై విశ్వాసాన్ని పెంపొందించడం,

అన్యాయాలను ప్రతిఘటించడం, ప్రాపంచిక పరిణామాలను నిశితంగా గమనించడం, సంఘటితంగా పోరాడటం వంటి స్ఫూర్తిని అందించింది.

స్త్రీవాదానికి ప్రాతినిధ్యం వహించే కథలు పి. సత్యవతి రచించిన *ఇల్లలకగానే పండుగౌనా!* తో ప్రారంభం అవుతాయి. స్త్రీల ఆలోచనలకు, ఆచరణకు ముందడుగుగా నిలుస్తుంది. ఇంటి చాకిరిలో పడి తన పేరే తాను మరచిపోయిన ఇల్లాలితో తనపేరేమిటో తెలుసుకోవాలన్న తపన మొదలు కావడాన్ని ఈ కథ తెలుపుతుంది. ప్రశ్నల పరంపరలో స్త్రీ తన అస్తిత్వాన్ని వెతుక్కొని చివరకు ఆమె ఒక ప్రత్యేకమైన పేరు, ఒక ప్రత్యేకమైన జీవితం, ఒక ప్రత్యేకమైన అభిరుచి ఉన్న మానవ వ్యక్తి అని చైతన్యాన్ని పొందుతుంది.

పి.సత్యవతి, ఆలూరి విజయలక్ష్మి వంటి కథా రచయిత్రులు స్త్రీల జీవితాల్లో సొంత అస్తితను పెంపొందించు కోడానికి ప్రయత్నించగా, ఓల్గా, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని, మొక్కపాటి సుమతి, ఎస్.జయ– వాళ్ళతోపాటు సి.సుజాత, పాల్కురికి సత్య, నాగేంద్ర జ్యోతి, మృణాళిని, అదే పద్ధతిలో పితృస్వామిక సామాజిక జీవన సంస్కృతికి విమర్శకు అనువైన కథాంశాలను, నిరసనలు, ప్రతిఘటనలు వంటి మార్గాలను తమ కథల్లో ప్రవేశపెట్టారు.

స్త్రీల శరీరం ద్వారా ఆ శరీరం చుట్టూ కల్పించిన కల్పనల ద్వారా, భయాల ద్వారా వారి జీవితాన్ని అదుపు చేసే అధికార వ్యవస్థా స్వభావాన్ని ఓల్గా తన *రాజకీయ కథలు*లో సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్లేషించారు. స్త్రీల జుట్టు, కళ్ళు, ముక్కు, నోరు పితృస్వామ్య సమాజం నియంత్రణకు ఏ విధంగా గురి చేస్తుందో, పురుషుల కోరికలకు, అవసరాలకు, ఆనందాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా స్త్రీ శరీరం, వారి అవయవాలు, వారి ధర్మాలు ఎలా నిర్దేశించబడ్డాయో ఈ కథల ద్వారా ప్రతిఘటించారు. ఈ స్థితినంతా *సీత జడ, కళ్ళు, ముక్కుపుడక, నోర్ముయ్, రాతిగుండెలు* వంటి కథల్లో నిరూపించారు.

పితృస్వామిక సామాజిక సంస్కృతి మీద తిరుగుబాటు ధోరణిలో అత్తింటికి చేరే ప్రస్థానంలోనే సార్థకమౌతుందని నిర్దేశిస్తుంది. ఆడపిల్లల అందం, చదువు, తెలివి అన్నీ ఆ పరమార్థాన్ని చేరటానికే అయితే, ఆ మార్గంలో స్త్రీలు *పెళ్ళిచూపులు* వంటి వైతరుణుల నెన్నింటినో దాటుతారు. ఆ క్రమంలో వాళ్ళు పడే హింసను వస్తువుగా చేసుకొని *ఉచ్చుపక్షి* కథ రచించారు. *మాఘ సూర్యకాంత*లో కమల, *అగ్నికిరణం*లో కరుణ, *ఎద్దుపుండు*లో శ్యామల వంటి పాత్రలు వివాహ వ్యవస్థకే ప్రశ్నార్థకంగా నిలుస్తాయి.

డాక్టర్ పి. శ్రీదేవి, సరళాదేవి, వంటి కథా రచయిత్రులు స్త్రీవాద అస్తిత్వ ధోరణిలో కథలు రచించారు. అదే కోవలో ముదిగంటి సుజాతారెడ్డి, పాకాల యశోదారెడ్డి, బొమ్మ హేమాదేవి వంటి వారు ప్రజాస్వామిక భావజాలంలో స్త్రీవాదాన్ని తెలిపారు. ముదిగంటి సుజాతారెడ్డి *విసుర్రాయి* కథలో–సక్కుబాయిది విసుర్రాయి లాంటి బతుకుగా చిత్రించారు. ఒక గృహిణిగా ఇంటి చాకిరి, కుటుంబ బాధ్యతలతో సతమతమవటం, ఆర్థిక స్వాతంత్ర్యం లేక పోవడం వంటి ఆమె జీవితాన్ని *విసుర్రాయి*కి ప్రతీకగా నిలిపారు. *కబ్జా, ధర్మపత్ని* వంటి కథల్లో స్త్రీలకు రాజకీయాధికారం వచ్చినా గాని పురుషాహంకారం నుంచి తప్పించుకోలేక పోతున్న స్థితిని తెలియజేశారు. ఈ కథల ద్వారా స్త్రీ చైతన్యం పట్ల స్త్రీ పురుష భావజాలంలో స్నేహపూరిత వాతావరణం, ప్రజాస్వామ్య మానవతా విలువలు పెంపొందించాలని భావించారు.

**దళిత స్త్రీ వాదం:**

స్త్రీవాదం జండర్ వర్గంతో పోరాడితే, దళిత స్త్రీవాదం జండర్ వర్గంతో పాటు కుల వర్ణాలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. సాంఘిక ఆర్థిక సామాజికాంశాలను జండర్ దృక్పథంతో దళిత స్త్రీవాద ఉద్యమానికి అనుసరణగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే దళిత స్త్రీవాదం ఒక సాహిత్యంగా బయలుపడింది. దళిత రచయిత్రుల జండర్ స్పృహకు శతాబ్దాల పోరాటాలతో చాలా దగ్గరి సంబంధం వున్నది. సామాజిక ఉద్యమాలు దళిత పోరాట ఉద్యమం నుంచి నేటి ఆత్మగౌరవ ఉద్యమాలు, దళిత మానవ హక్కుల ఉద్యమాలు వాటి లక్ష్యాలు, లక్ష్యసాధనకు అది అవలంబించిన విధానాలు, వాటి భావజాలాలన్నీ కూడా దళిత రచయిత్రులు తమ భావాలను వ్యక్తీకరించడానికి నేపథ్యాన్ని అందించాయి.

జాజుల గౌరి, నంబూరి పరిపూర్ణ, గోగు శ్యామల, వి.నాగమణి, జూపాక సుభద్ర దళిత స్త్రీల అనుభవాల్ని కథల్లో చెప్పారు. గోగు శ్యామల దళిత స్త్రీల రచనలను సేకరించి *నల్లపొద్దు* (2008) సంకలనం చేశారు. ఇందులో దళిత

స్త్రీల చారిత్రక నేపథ్యం 1921-2002 మధ్య కాలంలోని దళిత స్త్రీల రచనలను పరిచయం చేశారు. నంబూరి పరిపూర్ణ *ఆదర్శాలు- అన్వయాలు* కథలో ప్రగతి శీల ఉద్యమాల్లో పని చేసే ఆధిపత్య కులపు పురుషుణ్ణి కులాంతర వివాహం చేసుకొన్న దళిత స్త్రీ జీవితం చిత్రించబడింది. "తనూహించుకొన్న ప్రేమైక జీవితం కొద్దికాలంలోనే" వట్టిపోయిన బావి అయ్యింది. ''నిమ్నజాతి పిల్లను చేసుకున్నందుకు ప్రసాదును తల్లిదండ్రులు పూర్తిగా వదిలేశారు.

ఉద్యమాలే లోకమైన ప్రసాదు ఇంటి బాధ్యతలను శకుంతల మీదికి నెట్టివేశాడు. పిల్లల్ని బ్రతికించుకునేందుకు రకరకాల టెంపరరీ జాబులు చేస్తూ సంసారం నడిపింది శకుంతల. ఒక శుభముహూర్తంలో శకుంతలను, పిల్లలను ఒదిలేశాడు. తర్వాత అమ్మానాన్నలు ఇష్టపడిన కులమింటి పిల్లను చేసుకొని ఆమె తెచ్చిన భారీ కట్నంతో తన రాజకీయ జీవితాన్ని నిర్విఘ్నంగా సాగించుకున్నాడు." అని కులలైంగిక రాజకీయాలను తన కథలో రచయిత్రి ఇనుమడించారు.

జాజుల గౌరి *కంచె* కథలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రాథమిక చదువు చదువుతున్న దళిత బాలికలు సెలవుల్లో పోవడం, ఇంటి దగ్గర తల్లికి ఇంటి పనుల్లో ఆసరా కావడం కోసం అడవికి కట్టెలు ఏరుక రావడానికి పోవడం, అక్కడ ఆధిపత్య కులాల పురుషులు దళిత బాలికను అత్యాచారం చేయడం వంటి సంఘటనలను చూపారు. పర్యవసానంగా ఆ బాలిక గర్భం దాలుస్తుంది. తత్ఫలితంగా రెండు తరాలకు చెందిన స్త్రీలు బలికావడం వంటి అమానుష చర్యలను ఎత్తి చూపారు. బాధిత బాలికకు తల్లి పరిష్కార మార్గాన్ని ఆలోచించి అమలు చేయడంలో కొత్త సందేశాన్ని కథలో సూచించారు. "నీ జిందగి నీకు ఎక్వ బిడ్డా. పానం ఉన్నదంటే మీద పడ్డ బురదను కడ్గుకొని మంచి బతుకు బతుకొచ్చు. కానీ ఎదల కోపంతో నీ జిందగిని యిడ్సుకోకు. యింకనన్నా లోకం తెల్సుకొని మసలుకో. రేపే డాక్టరమ్మతోటి మాట్లాడి ఈ పాపం పిండాన్ని ఖండం చేయిస్తా. అంటూ బిడ్డను గుండెల్లో దాచుకున్నది'' అంటూ ఆధిపత్య కులపు పురుష దురహంకారాన్ని దుయ్యబట్టారు.

వినోదిని *మరియ* కథలో "పొద్దునే పేపర్లో ఎక్కడో వో మూల నాలుగు లైన్లలో వచ్చిన ఆ వార్తను చూసినప్పటి నుంచి, వెంకటేశ్వర్రావు గారి తెల్లటి వీపు మీద మురికి జందెమూ, మల్లిగాడి పడగలాంటి చేతులూ నా కళ్ళముందుకొచ్చి యెగతాళిగా నవ్వు తున్నాయి. బావిలో ఉబ్బిపోయి నల్లగా పైకి తేలిన మరియ ఇంకా వెక్కి వెక్కి యేడుస్తూనే ఉంది" అని ఆధిపత్యకుల సంస్కృతిని, దానికి వంత పలికే కోర్టు తీర్పును విమర్శించారు.

అత్యాచారాలు చేయడంలో అస్పృశ్యతను పాటించని వారు ఆ కులాల మనుషులను, వారి పరిశ్రమను అంటరానిదిగా చూసే దుర్మార్గపు ద్వంద్వ నీతిని తెలుపుతుంది.

జూపాక సుభద్ర తన *శుద్ధి చెయ్యాలె* కథలో దళితుల పట్ల ఆధిపత్య కులపు ఈసడింపును కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. ఉన్నత చదువులు చదువుకొని ఉన్నతోద్యోగాలు చేస్తున్న దళితులను కులం పేరుతో అవమానించే అమానుష చర్యలను క్రింది ఉదాహరణలో గమనించవచ్చు.

కాలేజీ లెక్చరర్లుగా పని కోసం వచ్చిన ఇద్దరు దళిత మహిళలకు ఒక బ్రాహ్మణ కుటుంబం ఇంటిలో అద్దెకు దొరకడం, తర్వాత వారి కులం వివరాలు తెలుసుకొని వారిని అవమానించడం ఈ కథలో కనిపిస్తుంది. కాలేజీ చప్రాసీతో బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఈ విధంగా అన్న విషయాన్ని చూడవచ్చు.

"వాళ్ళు కడ జాతోల్లంట గదరా, మొకాలు జూసిచ్చినం కులమడగకుండ. ముందు ఆ సామాను తీసికెళ్లమని చెప్పు. యిల్లు శుద్ధి చేయించాలన్నారు." అని చెప్రాసీ కాలేజీకొచ్చి జరిగిన విషయం చెప్పాడు నొచ్చుకుంటూ. తాతల తరాలున్నట్లు మేము లేము.

ఎన్నో ఉద్యమాలు చేసి చదువుకొని యీ స్థితికొచ్చినంక గూడ మా నుదుటి మీద అంటరాని గీతలు చెరిగిపోవడం లేదు. వాళ్ళు చేసిన అవమానం తిరిగి చెవుల్లో సీసం నింపుతున్నట్లు, నాలిక చీరుతున్నట్లు, వేళ్ళు నరుకుతున్నట్లుగానే వుంది.

ఎప్పుడో ఎన్నో పోరాటాలు చేసి మేం పగలకొట్టిన ముంత మళ్ళీ మూతికి కదుతున్నట్లుగా, జారి పోయిన తాటాకు మళ్ళీ మొలకు ముడేస్తున్నట్లే అన్పించింది" అని ఆవేదన వ్యక్తం చేసింది.

వర్తమాన దళిత స్త్రీ వాదాన్ని తమ సాహిత్యం ద్వారా చాల బలంగా వినిపిస్తున్న గోగు శ్యామల, జూపాక సుభద్ర, జాజుల గౌరి ముగ్గురమ్మలుగా అభివర్ణింప బడుతున్నారు.

## మైనారిటీ స్త్రీ వాదం:

దళిత స్త్రీల తిరుగుబాటు విధంగానే ముస్లిం మైనారిటీ స్త్రీలు తిరుగుబాటు నిరసనలు ప్రకటించారు. ముస్లిం రచయిత్రులు తమ సంస్కృతిలో ఉన్న స్త్రీ అవిద్య. బుర్ఖా, తలాఖ్, గృహహింస వంటి సమస్యలకు స్పందించి కథా సాహిత్యాన్ని వెలువరించారు. మత శక్తుల దాడులను స్త్రీల మీద జరిపే అత్యాచారాలను నిరసించారు. షహనాజ్ ఫాతిమా, షాజహాన్, షంషాద్, యాస్మిన్ బేగం, ఎం.ఎస్. బేగం, జాకెరా మొదలైన రచయిత్రులు కథలు వ్రాస్తున్నారు. ముస్లిం స్త్రీలే గాక వారి జీవితాలను కథల్లో డాక్టరు ముదిగంటి సుజాతారెడ్డి, గీతాంజలి, రాజ్యలక్ష్మి వంటి రచయిత్రులు ప్రవేశ పెట్టారు. షహనాజ్ ఫాతిమా కథ *చోటీ బహు తప్పేంటిలో* ముస్లిం కుటుంబాల్లో స్త్రీ పురుష వివక్షతను ఎత్తి చూపుతుంది. ముస్లిం ఆచార వ్యవహారాలు, స్త్రీల సంఘర్షణ కథాంశాలుగా పేర్కొనబడినది. ఉమ్మడి ముస్లిం కుటుంబాల్లో చిన్న కోడలు మీద పని భారాన్ని మోపడం వంటి విషయాలను, ఆమెను చులకనగా చూడటం వంటివి ఈ కథలో కనిపిస్తాయి.

స్పష్టమైన నిబద్ధతతో ముస్లిం జీవితాలను భాష్యా లనదగిన అద్భుతమైన కథలు రాస్తున్న రచయిత్రి షాజహాన్. మైనారిటీ స్త్రీవాద కథోద్యమ నాయకురాలిగా పేర్గాంచారు. ఆమె రచించిన *సిల్‌సిలా* కథలో దూదేకుల ముస్లింల జీవితాల్ని అనేక కోణాల నుంచి చిత్రీకరించారు. బ్యాండ్ వాయించే కుల వృత్తి ఏడాదంతా తిండి పెట్టక పోవడం వల్ల స్త్రీలు కూలీలపై ఆధారపడుతున్న తీరును, పురుషుల వల్ల స్త్రీలు పడుతున్న బాధలను, ముస్లింల, దూదేకుల మధ్య గల తేడాను చిత్రించారు. *సిల్‌సిలా* అంటే *వారసత్వం* అని అర్థం. తండ్రి వారసత్వంలో కొడుకు కూడా అదే జీవితాన్ని గడపడం హృదయ విదారకంగా వర్ణించారు.

ముదిగంటి సుజాతారెడ్డి *షబానా దుఃఖం, జహంగీరు బీ, మున్నీబాయి* వంటి కథలు రచించారు. షబానా, ఖాసింల జీవనాధారమైన సైకిల్ దుకాణాన్ని హిందువులు కబ్జా చేయడానికి ప్రయత్నించడం, షబానాను తప్పనిసరిగా బుర్ఖా ధరించాలని ముస్లిం మతపెద్దలు ఆజ్ఞలు పెట్టడం వంటివి *షబానా దుఃఖంలో* కనిపిస్తుంది. *జహంగీరు బీ* కథలో తల్లిని, జహంగీరును వదిలి తండ్రి పాకిస్తాన్‌కు పారిపోవడం, చివరకు జహంగీర్ బీ కొడుకును ఆటంకవాదిగా పోలీసులు జైల్లో పెట్టడం కనిపిస్తుంది. రాజ్యలక్ష్మి రచించిన, *తలాఖ్* కథలో గంపెడు పిల్లలను కని గల్ఫ్ దేశాలకు వెళ్ళి పోయే ముస్లిం పురుషులు అనుక్షణం స్త్రీలను అవమానించడం, డబ్బులు పంపకపోవడం వంటి అత్యంత విషాదకర సన్నివేశాలను, అగాధంగా మారిన ముస్లిం స్త్రీల జీవితాలను చూడవచ్చు.

## బహుజన స్త్రీవాదం:

1980లో మొదలైన సామాజిక పరివర్తన దక్షిణ భారతదేశంలో వేగంగా పుంజుకొంది. సాహిత్యంలో తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకొంది. జ్యోతిరావుఫూలే, సావిత్రిబాయిల సంఘసంస్కరణ ఉద్యమాలు బహుజన వాదాన్ని పటిష్టపరిచాయి. కుల సమస్య, అంటరానితనం సమస్య, ఉత్పత్తి, కులాల జీవితాలు, కుల వృత్తులు, సిద్ధాంత దృక్పథాలు చర్చించ బడ్డాయి. ఆ క్రమంలోనే బిసి కులాల జీవితాలు, సమస్యలు, సిద్ధాంత దృక్పథాలు చర్చించ బడ్డాయి. 1990లో బిసి సాహిత్య ఉద్యమం వేగం పుంజుకొన్న తర్వాత వీటన్నింటినీ తిరిగి కొత్త చూపుతో అధ్యయనం చేయడం జరిగింది. 1992లో ఆవిర్భవించిన ఐక్య వేదిక అందించిన సిద్ధాంత భూమిక నుంచి సామాజికోద్యమాలు, బిసి, ఎస్సీ, ఎస్టీ ఉద్యమాలు, సాహిత్య ఉద్యమాలు తెలుగు నేల చరిత్రను మలుపు తిప్పగలిగాయి.

ముఖ్యంగా బిసి కథారచయిత్రులు తమ తమ కులవృత్తులకు సంబంధించిన కథలను రచించారు. అందులో బొమ్మ హేమాదేవి, పి.సరళాదేవి, కె.వరలక్ష్మి, శీలా సుభద్రాదేవి, అనిశెట్టి రజిత, తాయమ్మ కరుణ, పి.రాజ్యలక్ష్మి, కొమ్మల పద్మావతి, వద్యాల సూర్య, జ్వలిత, పద్మజ, లలిత, డాక్టరు వి. త్రివేణి పేరెన్నికగన్నవారు. వస్తువులో, భాషలో, శైలిలో ఒక నూతనమైన వ్యత్యాసం వీరి కథల్లో కనిపిస్తుంది. వీరేగాక చాలామంది కథా రచయిత్రులు బిసి కులాలకు, కులవృత్తులకు చెందిన జీవితాలను, స్త్రీల బాధలను చిత్రించారు. అందులో ముదిగంటి సుజాతారెడ్డిని పేర్కొనవచ్చు.

పి.సరళాదేవి కథలో బిసి కులాలకు చెందిన మహిళలు ఉద్యోగాలు చేస్తూ కేవలం తమ జీవితం, జీతం వారి వారి కుటుంబాలకే వెచ్చించడం, వ్యక్తిగతంగా తనకేమీ గుర్తింపు లేకపోవడం వంటి అంశాలను ప్రవేశ పెట్టబడ్డాయి. ఒకవిధంగా బిసి స్త్రీ తన అస్తిత్వాన్ని వెతుక్కొనే ప్రయత్నం

ఆమె కథల్లో కన్పిస్తుంది. కె.వరలక్ష్మి *మట్టి బంగారం* అనే కథలో గొల్లల జీవితాలను అద్భుతంగా చిత్రించారు. బిసిలు కులవృత్తులను మాని పెట్టుబడులుగా మారుతున్న క్రమంలో సంస్కృతిని విస్తృతంగా తెలిపి, అందులోని ఆచార వ్యవహారాలను, స్త్రీల బాధలను, శ్రమను కుల గౌరవాన్ని, కుల వృత్తులను కాపాడే దిశలో స్త్రీలు పడే కష్టాలను వర్ణించారు. మేకల పెంపకం, మేక పాలు, మేక మాంసం, మేక బొచ్చు వంటి విషయాలను చాలా నిశితంగా పరిశీలించి కథలో ప్రవేశపెట్టారు. తప్పెట గుళ్ళోళ్ళ కళా ప్రదర్శనలు, కళాకారుల వేషధారణ, సిమ్మాద్రి అప్పన్న పాటలు, గ్రామ దేవతల (రాములమ్మ)కు పూజలు, కొండరాజు పండుగలు వంటి సన్నివేశాలను ఈ కథలో అడుగడుగున ప్రదర్శింప జేశారు. అయితే ఈ కథలో అంతర్లీనంగా పెంకులు, సిరామిక్కు, సగ్గుబియ్యం మిల్లుల గూర్చిన ప్రస్తావన ఉంది.

గ్రామాల్లో కులవృత్తులు వదిలి పెట్టుబడి దారులుగా, వ్యాపారంలో భాగస్వాములుగా మారి చివరకు ఆ పనుల్లో అనుభవం లేక నష్టం వాటిల్లడం వంటి అంశాలను ఈ కథలో సూచించారు. కుల వాతావరణాన్ని ప్రతిబింబించే దిశలో– "ఎక్కడైనా పేణం ఉన్న జీవాలమ్ముకుని, పేణం లేని మిల్లు కొన్నుకుంటాడంట్రా?" – అని కథానాయకుడి నానమ్మ మాటల్లో జీవిత సత్యాన్ని ప్రతిఫలింప చేశారు.

కుల వృత్తులను వదిలి వివిధ వ్యాపారులు చేసే పురుషుల అస్తవ్యస్థ ఆలోచనా ధోరణికి ఆ కుటుంబాల స్త్రీలు పడే బాధలు వర్ణనాతీతం. స్త్రీలు బిసి కులాల్లో కులవృత్తుల అనుబంధాలతో ఏ విధంగా విడివడలేక పోతున్నారో వరలక్ష్మి తన కథల ద్వారా తెలియజేశారు. కథా రచయిత్రుల్లో మొదటి బిసి వాదాన్ని బలపరిచిన రచయిత్రిగా వరలక్ష్మిని పేర్కొనవచ్చు.

అనిశెట్టి రజిత తన *మట్టి బంధం* కథలో పూర్తిగా గ్రామీణ వాతావరణానికి సబంధించిన సన్నివేశాలను ప్రవేశపెట్టారు. గ్రామాల్లో కుల వృత్తులు అంతరించడం, బిసీలు కూలీలుగా వలస బతుకు సాగదీయడం వంటి అంశాలను అభివర్ణించారు. గ్రామాల్లో ఆధిపత్య కులాలకు, బిసి కులాలకు ఉన్న సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వ్యత్యాసాలను వివరించారు. బిసి కులాల్లో దారిద్ర్యం, రోగాలు, కష్టాలు, బాధలు, కన్నీళ్ళు వంటివి వారి జీవితాలతో విడదీయరాని అనుబంధాలను ఏర్పరచుకొన్న విధానాన్ని ఈ కథలో ప్రతిబింబించారు. బిసి కులాల ఆడపిల్లలు పడే బాధలు, ఇండ్లల్లో చేసే పనులు, ఇంటా–బయటా, చేలల్లో చేసే పనులు, అడవుల్లోకి పోయి కట్టెలు, తుమ్మకంపలు, గంపల కొద్ది పిడకలు ఏరుకొని రావడం వంటి హృదయవిదారక సన్నివేశాలను ప్రదర్శించారు. మి

అయిపోయింది.

## బ్రహ్మరాత

'ఈ వెర్రి బాగులది చిన్నదాన్ని తన మేనల్లుడి కిమ్మని నన్ను చంపుతూ వుంటుంది. చదువా? సంధ్యా? మాన్యాలా? సొమ్మా? సమ్మంధమా? వాడికేమున్నది! మనం కొంచెమయినా చిన్నదాని సుఖం చూసుకోనక్కరలేదా? పిల్లదాని యోగం బాగావుండి నేను చెప్పిన సమ్మంధం దొరికితే పిల్లది చాలా సుఖపడుతుంది. వంటినిండా పెట్టుకొన్నన్ని నగలు, కట్టుకున్నన్ని కోకలు, సుఖంగా తానింత తిని వకరి కింత పెట్టవచ్చును. పయిని వేరే ఆజ్ఞ పెట్టడానికి అత్తా ఆడబిడ్డా ఎవరూ లేరు. పెళ్ళికొడుకు జాతకం చూశాను. రమారమి నలభైయేళ్ళు వుంటవి. వాత శరీరం గనుక ముసలివాడులాగు కనబడతాడు. వక వేళ ముసలివాడే అయినప్పటికీ లోపం ఏమిటి? ముసలివాళ్ళను చేసుకుని మాత్రం సుఖపడ్డవాళ్ళు లేరా? వేగిరం కడుపు ఫలించి దాని కడుపున నాలుగు కాయలు కాస్తే దానంత అదృష్టవంతురాలు యెవరు? దేముడిచ్చిన కొర్రగింజంత ఆయువూ తిన్నగా వుంటే, అదే యెల్లకాలమూ కాపురం చేస్తుందేమో! దాని అదృష్టానికి యెవరు కర్తలు? దాని మంగళసూత్రబలం యెలాగుంటదో మనం యెవరమయినా చూచినామా? చూడండి, కన్నమ్మ గారి పిచ్చమ్మ అరవై యేళ్ళ వాణ్ణి కట్టుకొని కడివెడు బిడ్డల తల్లి అయినది. చిన్నవాళ్ళను చేసుకున్న వాళ్ళందరూ అయిదోతనము చేస్తున్నారా? మామగారి గౌరమ్మకు మోచేతి పద్దం నోముతోనే మొగుడి దినవారాలు వచ్చినవి. ఇలాగు మూడేళ్ళవాడిని చేసుకున్న దాని బ్రతుకు కూడా ముక్కలైపోయింది గదా? ఇంతకూ నొసట వ్రాసి వున్న వ్రాలు ప్రదానం, యిప్పుడు పెద్దవాళ్ళను కట్టుకున్నవాళ్ళే తరచుగా సుఖపడుచు వున్నారు."

– ధనాల కామయ్య,

(బ్రహ్మ వివాహం– కందుకూరి వీరేశలింగం)
















# చదవండి...

**ముక్తవరం పార్థసారథి రచనలు**

❖ **కథల వాచకం, 14 దేశాలు, 20 కథలు :** ఇంగ్లండ్, రష్యా, పోలిష్, చైనా, ఇటలీ, బ్రెజిల్, యు.ఎస్.ఎ లాంటి పధ్నాలుగు దేశాల నుండి సేకరించబడిన ఎన్నిక చేయబడ్డ 20 కథల సంపుటి. ప్రపంచ సాహిత్యాన్ని కాసి ఒడబోసిన వారిగా ముక్తవరం వారు ప్రసిద్ధులు. వారు ఎంపిక చేసిన ఈ కథలు ప్రపంచ సాహిత్యానికి గవాక్షం లాంటివి. ముఖ్యంగా యువ రచయితలు తప్పక చదవ వలసిన పుస్తకం. *పేజీలు 150, వెల : ₹ 100/-*

❖ **మనసులోని చలి :** రచయిత ముక్తవరం పార్థసారథి. ప్రపంచంలోని ప్రతివాడూ జీవిత సత్యాన్ని స్వానుభవంతో తెలుసుకోవలసిందే, మనం చదువుకున్న పుస్తకాలనుంచి ఎంత నిజాయితీతో మనం ఆ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టగల మన్నది ముఖ్యం అంటాడు ఈ నవలలోని కథానాయకుడు మూర్తి. మధ్య తరగతికి చెందిన సగటు జీవి యొక్క జీవన సంఘర్షణ ఈ నవల. *పేజీలు 100, వెల : ₹ 60/-*

❖ **కించిద్విషాదం :** రచయిత ముక్తవరం పార్థసారథి. ఇది ఆదాయ వనరుగా మారిన ఒక ఆడపిల్ల కథ. ఆదర్శాలు ఆచరణలో ఎంత నీరుగారి పోతాయో చెప్పక చెబుతుందీ నవల. *పేజీలు 100, వెల : ₹ 60/-.*

*ముక్తవరం పార్థసారథి వ్రాసిన పై పుస్తకాలు ప్రజాశక్తి, నవోదయ, విశాలాంధ్ర) బుక్‌హౌజ్‌లలో లభించును.*

❖ **అధికరక్తపోటు :** రచయిత డాక్టరు పి. దక్షిణామూర్తి. డబ్బుతో మనం ఆరోగ్యాన్ని కొనలేము. కాని డబ్బు పుష్కలంగా ఉంటే రత్నాలు పొదిగిన చక్రాల కుర్చీని కొనుక్కోగలము- ఇవి అమెరికన్ కవయిత్రి డొరతీ పార్కర్ మాటలు- ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యంలేదు. రక్తపోటనే నిశ్శబ్దశత్రువును నిర్లక్ష్యం వహిస్తే మనల్ని అధః పాతాళానికి తొక్కగలదు అంటారు తెనాలి వాకర్స్ క్లబ్‌కి కర్త, కర్మ, క్రియ అయిన రచయిత దక్షిణామూర్తిగారు. రక్తపోటుని నియంత్రిస్తే హృదయం పదిలం అంటారు రచయిత. *పేజీలు 150, వెల : ₹ 60/-, విశాలాంధ్ర బుక్ హౌజ్‌లలో లభ్యం.*

❖ **భార్య :** కవితా సంకలనం సంపాదకులు మాల్యశ్రీ. ప్రేమ లేకుండా పురుషుడు పరిపూర్ణుడు కాలేడు. ప్రేమించటం అనే ప్రక్రియ జీవితంలో చాలా ముఖ్యం అంటూ దానిని 'భార్య' చుట్టూ తిప్పిన కవితలివి. ఈ కవితలు సహధర్మచారిణిని ప్రేమించటం కంటే మించిన జీవన చైతన్యం లేదని తెలియజేస్తుంది. *పేజీలు 75, వెల : ₹ 100/-, విశాలాంధ్ర బుక్ హౌజ్‌లలో లభ్యం.*

❖ **శ్రీరామ చంద్రుడు :** సీతారాముల చరిత్ర రచించిన వారు శ్రీ ముసునూరి చంద్రశేఖరరావు. *పేజీలు 242, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు జయలక్ష్మి పబ్లికేషన్స్, ఫోన్: 040-23050986 లో సంప్రదించండి.*




❖ **బుద్ధుని ధమ్మం :** ఆచరణ సంకలనం ధమ్మాచార్య డా॥ వామనానంద. బౌద్ధం అంటే ఏమిటి? గౌతమబుద్ధుడు ఎవరు? ఆంధ్రదేశంలో బౌద్ధం లాంటి 15 విషయాలపై వ్రాయబద్ధ పరిశీలనాత్మక వ్యాసాలు. బౌద్ధమతం శీలంపై ఆధారపడి ఒక క్రమశిక్షణకు కట్టుబడిన మతంగా ఈ వ్యాసాలు వివరణ నిచ్చాయి. *పేజీలు 60, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు బౌద్ధ దమ్మ ప్రచార ట్రస్ట్, ఏలూరు ఫోన్: 94440520493 లో సంప్రదించండి.*



❖ **తెలంగాణ కథకులు :** కథన రీతులు రెండవ సంపుటి రచయిత బి.ఎస్. రాములు. ప్రత్యేక చరిత్ర కలిగిన తెలంగాణా రచయితల కథల రీతుల విశ్లేషణ. రెండవ కథలలో రాజకీయ భావాలు కలిసి వున్నాయి. *పేజీలు 160, వెల : ₹ 60/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9391533339 / 9704708980 లో సంప్రదించండి.*

❖ **భావజాల పరిణామం :** బి.ఎస్.రాముల రచన. నాది భావజాల పరిణామం. సంపాదకులు డాక్టర్ మొయిలి శ్రీరాములు. దళిత బహుజన, స్త్రీవాద, మైనార్టీవాద, ప్రాంతీయ అస్తిత్వవాద, తెలంగాణావాద సిద్ధాంత చర్చలు, కార్యక్రమాల నిర్వహణ గురించి వెలువరించిన భావజాల రచనలివి. *పేజీలు 160, వెల : ₹ 90/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9391036987 లో సంప్రదించండి.*




❖ **పొద్దుపొడుపు :** అన్నవరం దేవేందర్. ఈ కవిత్వంలో మూడు రకాలైన వస్తువులపై సాగిన రచన యిది. తన ప్రపంచీకరణ ధిక్కారం, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వనినాదం - దళిత వాదం, అన్నవరం శ్రీనివాస్ వేసిన ముఖచిత్రం ఆకట్టుకుంటుంది. *పేజీలు 75, వెల : ₹ 65/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9440763479లో సంప్రదించండి.*

❖ **ఆత్మారామం :** జ్ఞాన వాసిష్ఠ సుధ. సంకలనం మూల్పూరి రామస్వామి ఆధ్యాత్మికత భావజాలం కలిగిన రామస్వామిగారు స్వహస్తాలతో వ్రాసుకున్న ఒక పుస్తకం వారు కీర్తిశేషులయిన తరువాత వారి పిల్లలకు లభ్యం కావటం. దీనిలోని పావనత, సార్వజనీనతను దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని ప్రచురించటం జరిగింది. పేరుకు తగ్గ విషయాలే ఇందులో ఉన్నాయి. *పేజీలు 120, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




❖ **వందే వాల్మీకి కోకిలమ్ :** రచయిత ఉప్పులూరి కామేశ్వరరావు. రామాయణాన్ని విభిన్న దృష్టితో ఒక నవలగా వ్రాస్తూ పాత్రల మధ్య వచ్చే సంభాషణల ద్వారా రాముని విశిష్టతను వివరిస్తారు. *పేజీలు 140, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు జయలక్ష్మి పబ్లికేషన్స్, ఫోన్: 040-23050986 లో సంప్రదించండి.*

❖ **పుల్లెల వారి ప్రస్తావనలు :** సంస్కృత భాషా ప్రచార సమితి స్థాపకులలో ప్రముఖులై సమితి కులపతిగా చేయూత నిచ్చిన ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు అలంకార శాస్త్రం, వేదాంతం, అర్థశాస్త్రం, ఆధ్యాత్మిక రామాయణం లాంటి వివిధ విషయాలపై చేసిన ప్రవచనాలు. *పేజీలు 180, వెల : ₹ 200/-, ప్రతులు కావలసినవారు సంస్కృత భాషా ప్రచార సమితి, ఫోన్: 24615481లో సంప్రదించండి.*




❖ **కలికాలమ్ :** రచయిత సుధామ. ఇది 2007 నుంచి 2009 వరకూ జరిగిన సంఘటనల స్పందనాత్మక కవిత్వం. ఇవన్నీ ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చిన కవితాకాలమ్‌లో ప్రచురించ బడ్డ సామాజిక సమకాలీన వ్యవస్థపై సాగిన రచన ఇది. *పేజీలు 160, వెల : ₹ 90/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*

నేనొక రైలు టిక్కెట్టు కొన్నాను.



చిత్రకారుడు: **తలిశెట్టి రామారావు**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియజేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

| | | | ₹ |
|---|---|---|---|
| **I.** | **మిసిమి ప్రచురణలు** | | |
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 14. | కథాంజలి-2 | " " | 110.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | *డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |
| **II.** | **వేమన ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ - మహ్మద్ ఖదీర్ బాబు | | |
| **III.** | **ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | | 75.00 |
| 5. | మిళిందప్రశ్నలు - *బోధ చైతన్య* | | 150.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థ లేక మరణ వ్యవస్థ *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | | 150.00 |
| **IV.** | **ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు** | | |
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం: గజ్జెల మల్లారెడ్డి) | | 50.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................

వీధి ..............................

పేట ..............................

ఊరు ..............................

పిన్ ..............................

సెల్ ..............................

**3. సంతకం :** ..............................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు మిసిమి పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



దమయంతి దుఃఖం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



అశ్వహృదయం – అక్షహృదయం